భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

మార్చి 1965

★

సంపుటము 42 : : సంచిక 3

విడిప్రతి వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

మార్చి 1965

విశ్వవైణికుడు

శ్రీ బెఝ్వారి శ్రీనివాసమూర్తి

పులకించె భూనభో
వలయంబు వలయంబె
ఏ విశ్వవైణికుడో
యీ మూర్ఛనలు నించె—

వినవచ్చు నొకసారి
భిన్న తంత్రీస్వనము
ప్రతి తంత్రి యుద్భూత
ప్రతిభ తానై మ్రోగు—

ఏకమై - ఒకసారి
యెల్లతంత్రులు గలియు
ఏ విశ్వవైణికుని
భావ సమ్మేళనము !

★

తెరలు తెరలై దెసల
బారలి వీణారవము,
పరిణతానంద ది
వ్యప్రభాతము దోయ—

ప్రకృతి భావాతీత
భంగిమలు ప్రకటించి
నవరస స్పందనము
నందికొను నీ వీణ—

విశ్వమే వీణగా
వించి మార్మ్రోగించు
వైణికుని శక్తి కు
వ్వరనమస్సులు గూర్చు—

హంసదౌత్యము భిన్నహస్త కౌశలము

శ్రీ నూతలపాటి గంగాధరం

కల్పనా చమత్కారము, నాటకీయత, వర్ణనా వైచిత్రి, ఔచితీ మండితము, రససంపాదనము—మున్నగు అమూల్య గుణ రత్నములకు ప్రబంధ సాహిత్యము రత్నాకరమే !

అట్టి సాహిత్యమును చెవులు ముక్కులు తెగ కోసినట్లు కట్టమంచివారు తీవ్రముగా విమర్శించినారు. వారు పాశ్చాత్య సాహితీకన్య నే సులోచనముల నుండి తిలకించినారో, ఆ సులోచనములతోనే ఆంధ్రభాషయొక్క అనుంగు ఆడుబిడ్డయైన ప్రబంధ కన్యను గూడ పరికించి నిర్దాక్షిణ్యముగా నిరసించినారు. పాశ్చాత్య కన్య వేషము వేరు. చెయిదము వేరు. తెనుగు బిడ్డ రూపురేఖలు వేరు. చూపుచేష్టలు వేరు. ఇరువురిని ఒకే కాపురము చేయుమన్న నెట్లు చేయుదురు ?

కట్టమంచివారి దృష్టి ఈ విషయమున నెట్లున్నదనగా, బ్రాహ్మణుల విందుభోజనమున కరిగి మాంసభక్ష్యములు లేవని అలిగి వచ్చినట్లున్నది. ఒక సాహిత్య మొక లక్ష్యము నాధారముగా జేసికొని జీవించును. వేరొక సాహిత్యము వేరొక లక్ష్యము దృష్టి నిడుకొని పురోగమించును. ఈ లక్ష్యము లన్నియు నే సాహిత్యమున కైనను—ఆయా దేశ కాల పరిస్థితుల ప్రభావముల మీదనే ఆధారపడి యుండును. మరియు ఒకే యితివృత్తము భిన్న కవుల చేతిలో బడి భిన్న మార్గములుగా రూపు దాల్చుచున్నది. ఇందులకు కవుల మనస్తత్వమే గదా కారణము ! వీటి నన్నిటి నొకే దృష్టితో పరిశీలించిన నానంద మెట్లబ్బును ? సత్య మెట్లు బోధ్య మగును ? ఈ ఇబ్బందు లన్నియు దృష్టిలో నుంచుకొనియే తాత్త్విక సంపన్నులైన అరవిందులు ఒక సందర్భమున, ఏ సాహిత్య మైనను— అది ఉద్దేశించని సౌందర్య కళాసంపదలను దాని నుండి ఆశించుట అవివేక మగునే గాని, అది సహృదయ విమర్శన మనిపించుకొన—దన్నారు. కట్టమంచివారు ప్రబంధ మండలి దెస విస్తు లుమిసినను, కళాపూర్ణోదయ విషయమున వారు చేసిన కృషియు, విమర్శనము, నిరుపమానము అనితర సాధ్యము, ఆంధ్రలోకమునకు చిరస్మరణీయము !

ఈ ప్రబంధ ప్రక్రియ యే కాలమునుండి ప్రారంభమైన దనునదే ప్రశ్న ! ఆంధ్ర కవితా పితామహుని నుండియే సంపూర్ణమైన ప్రబంధము వెలువడినదని కొందరు, కాదు—శ్రీనాథుని నుండియే యని కొందరు, శ్రీనాథు నంగీకరించు పక్షమున ఎఱ్ఱాప్రెగ్గడలో ప్రబంధ బీజము లింకను బలముగా నున్నవి, కావున యెఱ్ఱాప్రెగ్గడ నుండియే ప్రబంధ ప్రక్రియ ప్రారంభమైనదని మరికొందరు ! ఇట్లు అనేక పక్షములు పెనగులాడుచుండగా హఠాత్తుగా నన్నెచోడుడు 'వీరి కందరకు పూర్వుడ' నని మధ్యలో వూడిపడినాడు. ఈ పక్షమున మరికొందరు వెలసిరి. తక్కిన పక్షములవారి నోళ్ళన్నియు మూయించగల శక్తి తమ కున్నదని ఈ పక్షము వారు అందరిమీదను దాడి తీసినారు. ఇట్లే సమస్య నానాటికీ పెరిగిపోవుచున్నదే కాని, ఒక పట్టున తేలునట్లు తోచదు. ఇప్పుడా గొడవ మన కనవసరము.

కానీ శ్రీనాథుని శృంగారనైషధము ప్రబంధమా ? కావ్యమా ?—అనునదే సమస్య ! పరిశీలించిన—నైషధమును ప్రబంధముగా లెక్కించుటకు 'అనువాద' మను నాటంక మొక్కటియే అడ్డుపడుచున్నది. తక్కిన దంతయు ప్రబంధ స్వరూపమే ! ఒక చేయి లోపించినంతనే వానిని మనిషియే కాదందుమా ? 'ఏకోహి దోషోగుణ సన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః' అన్నట్లు ఆంధ్ర నైషధము ప్రబంధముగానే లెక్కింపబడినది.

పింగళి సూరన్న ప్రతిభ అఖండము. అది మిక్కిలి స్వేచ్ఛాపదము వాంఛించినది. దాని మార్గమే పదిమందికి మార్గదర్శిగా నిలచినది. అచ్చమైన ప్రతిభ నూతనత్వము నన్వేషించును, లోకోత్తరతను వాంఛించును. అంతవరకు సంప్రదాయబద్ధముగా వచ్చుచున్న కావ్య లాక్షణిక సూత్రములు పింగళి సూరన్నకు మొగము మొత్తినట్లయినవి. వెంటనే తన కవితా రథమును మరొక వైపునకు మరలించినాడు. నూతన సృష్టిచేసి ఒక క్రొత్త ప్రపంచమును భూమికి దింపినాడు. దానిని గాంచి పండితలోకము దిమ్మెరపోయినది. కబురుచేయక గడపలో వడుగిడిన లోకోత్తర నవ్యతను గాంచి సంతసించి ఆహ్వానించుటకు బదులు నిప్పులుద్రొక్కి నృత్య మొనర్చుట లోకమునకు సహజమే కదా!

ద్వ్యర్థి కావ్యమైన రాఘవ పాండవీయమునకు పిమ్మటి రచన కళాపూర్ణోదయము. ద్వ్యర్థి కావ్య స్వరూప మాంధ్ర సారస్వతమున నప్పటికి క్రొత్తదైనను పండితలోకముచే నాదరింపబడి, అనేకులచేత అనుసరింపబడినది. ఇందుకు కారణమేమిటి? వేములవాడ భీమకవి ఒక 'రాఘవ పాండవీయము' ను అంతకుమునుపే వ్రాసియుండెననియు, అది కాలగర్భమున విశ్రమించుటవలన—'భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాటలు'—విని అది యెట్లుండునో యని తహతహ లాడుచున్న లోకమునకు—అద నెరింగి తన ప్రతిభను, పాండిత్యమును 'రాఘవ పాండవీయ' రూపమున సమపాళ్లలో ప్రదర్శించినాడు, పింగళి సూరన్న. ఆ కావ్యము ఎండిన బీట బన్నీటి జల్లయినది.

కాని, కళాపూర్ణోదయ కావ్యముయొక్క పోకడ ఆంధ్ర లోకముచే నంతకుముందు పూహింపబడనిది. దీని ఇతివృత్తపు ధోరణి వేరు. నాయిక ఎన్నిక పద్ధతి వేరు. 'తత్పట్టణమున నున్న యట్టి ప్రజలే జాతిం బుట్టిన వారలు, వంద్యులు తద్విమతి' చేతనని నూత్న లక్షణమును సృష్టించినాడు. ప్రాచీన లాక్షణికులయొక్క 'ఉన్నతాభిజాత్యము' 'కులీనత' మున్నగు లక్షణములన్నియు మంటగలసిపోయినవి. కళాపూర్ణోదయము లోకముచే మొదట అనాదరింపబడుటకు అదియే హేతువైనది. కాని, అందు కవి ప్రతిభ పరిధులను దాటినది.

పండితలోకమునుండి అనాదరముతో తిరిగి వచ్చి తన ముంగిట నిలచిన కావ్యమునుగాంచి, పింగళి సూరన్న తన క్రొత్త పోకడలకు స్వస్తి చెప్పి—ప్రాచీనుల మార్గమునే అనుసరించినాడు. ఆ యనుసరణా ఫలితమే 'ప్రభావతీ ప్రద్యుమ్నము'. ఎంత ప్రాచీనుల మార్గము ననుసరించినను కవి తన నైసర్గిక ప్రతిభను కప్పిపుచ్చలేకపోయినాడు. కావ్యము 'క్రొత్త పాతల మేలు కలయిక' గా తయారైనది. 'తలపెల్ల నక్లిష్టతను ప్రదీపితముగా పునరుక్తి దోషంబు పొంతపోక'—కథావస్తువు కమ్మెచ్చులాగిన మాదిరి చదునుగా, సరసముగా సాగినది. ఇతివృత్తాభావ నింద ప్రబంధ సాహిత్యమునకు గలదు. ఆ నిందాభావము చేయగలిగినంత కథాసమృద్ధి గలిగినది 'ప్రభావతీ ప్రద్యుమ్నము.'

సృష్టియందు నేడు మనకు కనరాని కొన్ని జీవ వస్తుజాల విశేషములు, కావ్యలోకమునందు కనిపించుచున్నవి. చరాచరములకెల్ల సర్వవిధముల చక్రవర్తి యనందగినవాడు, మానవుడు. సృష్టి రహస్య భేదము, సర్వ కళాభిజ్ఞత, సహృదయ గత వైశిష్ట్యము, ప్రతిభా వైదుష్యము—మున్నగు విశేషముల భారమునెల్ల మోయవలసినది, మానవుడే! అట్టి మానవునికే అసాధ్య మనిపించు కార్యసంధాన విధాన తత్పరత, వాక్చమత్కార నిపుణత మున్నగునవి వాఙ్మయ ప్రపంచమున తిర్యగ్జాలమునందును, జంతుజాలమునందును వ్యక్తమగుచున్నవి. ముఖ్యము, మరాళమునందు.

మరాళము—పవిత్రమైనదనియు, ప్రత్యేక స్వభావ విలసితమనియు, నడకలయందు బెడగు కలిగినదనియు వాఙ్మయము వలన మనకు గోచరమగుచున్నది. ఈ హంస దివ్య తిర్యగ్జాతి దనియు, దేవతల వలెనే సారస్వతమున నిది గూడ కవి మేధా విశేష ప్రాభవమున కొక ప్రతీక యనియు తెలియుచున్నది.

నైషధ కావ్య వస్తువునకు నాంది హంసమూలముననే జరుగుచున్నది. ప్రభావతీ ప్రద్యుమ్నమందున్ననో కావ్య వస్తువునకు ఆద్యంతము హంసియే సూత్రధారిగా కానబడుచున్నది. ఇట్లేల జరిగినదని ఆలోచింపగా, అంచ విరించి వాహనమ్ము గావున, ఆసృష్టికర్త యొక్క అండదండల మెలగుటవలన ఆ వాసన ఇంచుకయైనను దీనికిని సోకియుండునని కాబోలు—మానవ ప్రజ్ఞా విశేషములకు మించిన పాత్రలుగా తీర్చిదిద్దుటలో దోష ముండదని కవు లెంచిరేమో, యనిపించుచున్నది. మరియు 'వెఱగుదల కొలిపెడు' అద్భుత ప్రమోద చిత్రణ, రసమునం దొక తెగయే కావున, ఆ యద్భుతరసము ఇట్టి సామాన్యముచేత అసామాన్య సంఘటనల వలన కావ్యమునకు గలుగునని గుర్తించుట రెండవ కారణమై యుండనోపు.

నైషధ మరాళము పురుషజాతికి చెందినది. నామధేయ మేమిటో కవి చెప్పుటకు మరచినాడు సూరన్న మరాళము స్త్రీజాతికి చెందినది. నామధేయము—'శుచిముఖి'.

నైషధహంస—విరించివదన కమల వినిర్గత వివిధాస్త్ర వాసనా పూర్ణ కర్ణుండు. తన శరీరము పరోపకారార్థమని

తలంచునది—సరసత్వంబు గలది. నిగూఢ కార్యఘటనా చాతుర్య సంపత్తి కలిగినది. పురుషార్థయుక్త పరాయణత, కృతజ్ఞత, వాత్సల్యము, సద్భావము మొదలైన గుణములతో నిండుకొన్నది.

ప్రద్యుమ్నహంసి—పద్మజుని తేరుదివుచు సారంగధరాఖ్య దగు మరాళవిభుని బిడ్డ. వాణి సెనపంగ జేరి తద్విమల శిక్ష విద్యలెల్ల గనినది. వచోనిపుణత; సరస కథాకథన ప్రవీణ; నీతిధురీణత; బహుశ్రుతవాఽవలోకనత.

కాళిదాసు శాకుంతల నాటకమునందలి అనసూయా ప్రియంవదలు నాయికయొక్క చెలికత్తెలు. అనసూయ యందు అనుభవ మున్నది. ప్రియంవదలో ఆలోచన మున్నది. అట్లే నైషధమునందలి హంసలో అనుభవమున్నది. సూరన్న హంసిలో ఆలోచన మున్నది. పై రెండు పాత్రలు ఏకహస్త నిర్మితములు. ఈ మరాళద్వయము భిన్న హస్త పోషితము !

'అల్పబుద్ధికి లేవ గమ్యములు' అన్నట్లు నైషధహంస కన్నను సూరన్నహంసిలో రాజకీయ కార్య ధౌరంధర్యము మిక్కుటమై యున్నది. తన బుద్ధి బల నైశిత్యముతో హంసి ఎట్టి కార్యము నైనను నిపుణముగా సఫలీకృత మొనరించగలదు.

హంసయొక్క స్వభావము సంధ్యాకాలపు మలయమారుత మైనచో, హంసియొక్క స్వభావము మధ్యాహ్నపు మంద పవన మగును. దాని పలుకులు ద్రాక్షాఫలములు. దీని మాటలు పువ్వుదూపులు. దానిని చూచినతోడనే కరుణ గలుగును. (నలునిచే పట్టుబడినపుడు తాను విన్నవించుకొన్న గత చరిత్రవలన) దీనిని చూచినతోడనే ఉత్సాహము కలుగును. (చిలుకను వెంబడించి పట్టుకొనుట మున్నగు ఘట్టముల వలన) దానిపై మన కాత్మీయత పొడముసు. దీనిపై మన కనురాగ ముబుకును.

ఇరువురి హృదయము లేకముచేసి రెండు రాజ్యముల నడుమ బంధుత్వము చేకూర్చగల శాంతిదూత—హంస ! నాయికా నాయకులను పరస్పరానురక్తులను జేసి లోక కల్యాణమునకై రెండు రాజ్యముల మధ్య యుద్ధము సంభవింప జేయగల రాజకీయ సూత్రధారి—హంసి ! హంస కలిపినది కేవలము మానవ దాంపత్యమునే ! కాని, హంసి కలిపినది మానవ—దానవ దాంపత్యమును.

ముఖ్యముగా, మరాళద్వయము నిర్వహించినది దూత్యమే కావున ఇరువురి దౌత్యభేదముల నరయుదము. దౌత్యకర్త మిక్కిలి మెలకువ కలిగినవాడై యుండవలయును. గోరువాసి ఏమరుపాటు కలిగినను కొండంత చేటు వాటిల్లును. దౌత్య మనగా అసిధారావ్రతమే !

దౌత్యకర్త ఉభయ పక్షములకు హితుడై, వాక్చాతుర్యము, సమయస్ఫూర్తి, ఆత్మశ్లాఘోల్లంఘనమ్ము, స్వార్థ త్యాగము, సకలశాస్త్ర పాండిత్యము, సర్వలోక శాంతి కాముకత్వము కలిగినవాడై యుండవలయును. ఈ గుణము లన్నియు దాదాపు హంసద్వయమునందు సంపూర్ణముగా నున్నవనియే చెప్పవలయును.

నాయికా నాయకుల ప్రణయావిర్భావము కావ్యలోకమున రెండు విధములుగా జరుగుచున్నది. (1) కనుకలి (2) వినుకలి, యని. ఈ ద్వైతమునందు 'కనుకలి' బలవత్తరమైనది. ఈ 'కనుకలి' ని మరల రెండు విధములుగా విభజింపవచ్చును. (1) ప్రత్యక్షము, (2) పరోక్షము, అని. ప్రత్యక్షమనగా, నాయికా నాయకు లిరువురును విధి సంకల్పబలమున నేదే నొక సందర్భమున తటస్థపడినపుడు చూపులు కలసి, భావము లేక మగుట. పరోక్షమనగా, నాయికా నాయకులలో ఎవరో నొకరు మరియొకరి చిత్రమునుగాని, శిల్పమునుగాని చూచి మోహించుట.

ఇందులో దమయంతీ ప్రణయావిర్భావము 'వినుకలి'చే జరిగినది. 'జనకుం గొల్వఁగ వచ్చినపుడు తదాస్థానంబులోఁ బాఠకుల్, వినుత ప్రౌఢి వసుంధరాధిపతులన్ వేర్వేఱ కీర్తించుచూ .... వీరసేను తనయున్ వర్ణింపఁగా' ని ఆ వనితారత్నము 'పంచల్లీల రోమాంచ' యైనది.

ప్రభావతీ ప్రణయావిర్భావము పరోక్షమైన 'కనుకలి' చేత జరిగినది. ప్రభావతి కొక్కనాడు పరమేశ్వరి ప్రత్యక్షమై—'అత్యాశ్చర్యతర రూపలావణ్య గాంభీర్య శౌర్యాది శుంభ దఖిల గుణములఁ గొమరొందు కొమరుఁ బ్రాయపువాని' నొకని చిత్రఫలకమున వ్రాసి 'ఇతండవీ వల్లభుండు ప్రద్యుమ్నుఁ డని యదు ప్రభు కుమారుఁ' డని చెప్పి ఆ చిత్ర ఫలకము నొసంగి అంతర్గత మైనది.

ఇప్పటినుండియే మరాళద్వయ దౌత్యము ప్రారంభ మగును.

నల డొకనాడు ఉద్యానవన విహార పరవశుడై యున్నాఁడు. తటాకమున 'వరుణరాజున కిడిన చామరము వోలె .... నిబిడ నిద్రాభి ముద్రితమై' యున్న రాజహంసను గాంచి, వంచించి పట్టుకొనినాడు. అది తన దీన వృత్తాంతము నతి కరుణముగా విన్నవించి విలపించినది. రాజు మనసు నీరై హంసను వదలి పుచ్చినాడు. 'చచ్చి క్రమ్మఱఁ బుట్టిన చందమున' హంసమ్ము తటాకమున కొంత తడవు క్రీడించి, మరల పరుగుదెంచి నిషధాధిపతి హస్తమునకు చేరినది. "పట్టుపడిన నన్ను విడచి పెట్టి ప్రాణము రక్షించితివి. నిఖిల నాయకుడవైన నీకొ మము బోంట్లు సేయు నుపకార మపేక్షణీయము గాకుండుట యెరుంగుదును. అయినను కృతజ్ఞతా గుణ లేశము క్లేశపరచు

చున్నది. నన్నము దొడ్డయును విశేషము విచారింపక నా చేయు ప్రయోజన మంగీకరింపు" మని దమయంతి వర్ణనకు పూను కొన్నది. ఇట్లు నైషధ మరాళము దౌత్యమునకు గడంగినది.

ఇక ప్రద్యుమ్నునందు : ఇంద్రుడు, వజ్రనాభదైత్యుని వలన దేవతలకైన దుస్థితిని గూర్చి ద్వారకలో నున్న శ్రీకృష్ణ పరమాత్మ కెరుకచేసినాడు. అందులకు శ్రీకృష్ణుడు, తా నిప్పుడు తన తండ్రిచే సంకల్పింపబడిన యాగ నిర్వహణా నిమగ్నుడై యున్నాడనియు, అది సమాప్తమగు నందాక కొంత యోపిక పట్టుము, అనిమ్మట దైత్య సంహార విషయమై ఆలోచింత మని చెప్పి—ఊరడించి, ఇంద్రుని పంపివేసినాడు. ఇంద్రు డట్లు తిరిగివచ్చి దేవశైవలినియందు విహరించుచున్న చక్రాంగ ముల రావించి సగౌరవముగా నిట్లనినాడు. "ఖగవరులారా ! వజ్రనాభుడు మము నలచిన యీ పట్లు సమస్తము మీ రెరుం గుదురు. వాని మర్దించు యత్నము మా కిపుడు కలిగి యున్నది. ఈ రహస్యము ప్రకాశమైన నెగ్గు పుట్టును గాన మీ మనములయందె దాచుకొనవలయును. మాకంటె వాడు మునుపుగ నే కార్యము చేయగలడో యెరుగము. మీరు తత్పురి మెలగుచు మాకు వేగు నడుపవలయు" నని. అందు లకు మరాళ తల్లజమైన శుచిముఖి వల్లభుడు తన జాయను ఆ కార్యమునకై నియమించెను. అప్పుడు శుచిముఖి పతి యాజ్ఞ చొప్పున తా నెరిగిన వజ్రపురిలోని వృత్తాంతమును ఇంద్రునకు విన్నవించినది.

ఇట్లు మరాళద్వయ దౌత్యమునకు నాంది జరుగును. నైషధహంస నాయకునకు మేలుజేయ నీ కార్యమునకు గడంగి నది. మరియు కృతజ్ఞతా గుణ లేశము క్లేశపరచుట మరి యొక కారణము. హంస తనకు తానై ఈ కార్యమునకు పూనుకొనుటవలన దౌత్య నిర్వహణలో దీని కాత్మానందము కలదని యెంచవలయును. ఇందుల కక్కరయైన ఉత్సా హము తన హృదయమున సహజముగనే జనించినది.

శుచిముఖి తనకు తానై దౌత్యమునకు గడంగలేదు. ఇంద్రునిచే నాహ్వానింపబడినది. అంతియేకాదు, పతి వలనను అనుమతి వడసినది. మరాళము లెన్నియున్నను—శుచిముఖియే ఈ కార్యనిర్వహణమునకు నియమింపబడుటవలన దాని ప్రతిభ, ప్రాభవము లెంతటివో అనుక్తముగానే వ్యక్తమగుచున్నవి. ఇతరులచే నియమింపబడినందువలన శుచిముఖికి ఈ కార్యమునం దుత్సాహము శూన్య మనలేము. కార్యము, ముల్లోక క్షేమ దాయకము. మరియు, అది సురలోకాధిపతిచే కాంక్షితము. సర్వ లోక శాంతి కాముకత్వమే కదా మహాత్ముల జీవిత లక్ష్యము! హంసికి ఇంతకన్నను ఆనందము వేరొం డేమైన నుండునా ?

నైషధమరాళము, తానై కార్యము నెత్తిన పూనుకొనుటవలన ఆత్మాభిమానమునకు భంగము వాటిల్లలేదా?— యనవచ్చును. నలు డెవరు ?—షట్చక్రవర్తులలో ఒకడు. విష్ణువు కానివాడు పృథివీపతి కాలేడని సూక్తి. నలుడు పృథివీ పతి. మరియు 'నిర్మల నిజ కథా నిమిష కల్లోలినీక్షాళితాఖిల జగత్కల్మషుండు'. అట్టి లోకోత్తర పురుషున కొక మేలు చేసిన సర్వ దేవతాబృందము తృప్తిగా త్రేన్పకుండునా ? అంత కన్నను హంస కింకేమి కావలయును. జగత్కల్యాణ కార్య క్రమమునకు హంస తానై పూనుకొనుటలో ఆత్మాభిమాన భంగమునకు బదులు దాని హృదయవైశాల్య మెంతటిదో వ్యక్తమగుచున్నది.

హంస, నలుని దగ్గరనుండి దమయంతి చెంత కేగినది. హంసి, ఇంద్రుని దగ్గరనుండి శ్రీకృష్ణుని కడకు చని, ఆశీ స్సులు గొని ద్వారకానగర బాహ్య ప్రదేశమున 'వాహ్యాళి విహార సారస్యము' న దగిలియున్న ప్రద్యుమ్నుని చేరుకొన్నది.

ఇక్కడ ఒక విషయము : దమయంతి వినుకలివలన నెట్లు నలుని ప్రేమించినదో, అట్లే నలుడును దమయంతిని విను కలిచేతనే ప్రేమించియున్నాడు. కాని, వీ రిరువురిలో నే యొక్క రికిని ఒకరిని మరియొకరు ప్రేమించినట్లు తెలియదు. అభి ప్రాయములు పరస్పరము వ్యక్తమై ఇరువురి హృదయము లేకమవు టెట్లు ? రెండు పూవు లున్నవి. విడివిడిగా నున్నవి. అవి రెండును ఒకటై గుత్తుగా నేర్పడినచో గదా అంద గించును ! అట్లు వాని నొకటిగా కూర్చుటకు ఒక దార మును పుచ్చుకొని వనమాలియే అందుకు సిద్ధము కావల యును. అట్లే—నలదమయంతుల హృదయకుసుమముల నైక్యముచేసెడి వనమాలి, హంస ! కుసుమములు విడిపోక బంధించెడి సూత్రము, దాని వాక్సరళి !

ప్రభావతీప్రద్యుమ్నులం దట్లు గాదు. ప్రభావతికి పరోక్షమైన కనుకలి వలన ప్రద్యుమ్నునిపై ప్రేమ జనించి యున్నది. కాని, ప్రద్యుమ్నుడు ప్రభావతి నామమును గూడ అంతవరకు విని యెరుగడు. నైషధమునందలి హంసకు సింహ ద్వారము తీయవలసిన అగత్యము లేకపోయినది. ఆ సింహ ద్వారము అదివరకే తనకు తానై తెరచుకొని యున్నది. కాని, శుచిముఖికి సింహద్వారము గూడ తానే నిపుణముగ తెరచుకొని, ఆ పిమ్మటే గర్భగుడియొక్క తెర తొలగించవలసినంత అగత్య మేర్పడియున్నది. హంస ప్రయాస కన్నను హంసి ప్రయాస మిక్కడ ఇనుమడించినది.

ఆ సింహద్వారము, తన శక్తి మాత్రమునకే తెరవ కొనునో, తెరచుకొనదో—యను సందేహము శుచిముఖికి

కలుగకపోయినది. అట్లే వాయికా వాయకుల హృదయ కుసుమముల నేకము చేయగలనో, చేయలేనో యను సందేహము హంసకును కలుగకపోయినది. దీనికి కారణమేమి ? ఈ మరాళద్వయమునకు కార్యము నిర్వహింపగలమను నొక ధైర్యము ప్రచ్ఛన్నముగా నున్నది. ఆ ధైర్యమునకు కారణమ్ము—బ్రహ్మవాక్కు !

నైషధహంస బ్రహ్మరథమునకు వాహనము.

“అడిగితి నొక్కనాఁడు కమలాసను తేరికి వారువంబనై
నడుచుచు ‘మర్త్యలో నిషధనాథుని కెవ్వతె యొక్కొ భార్య య
య్యెడు ?’ నని చక్రఘోషమున నించుక యించుక గాని యంత యే
ర్పడ వినఁ, గాని నీ వనుచుఁ బల్కిన చందము దోఁచె మానినీ !”

అని విధి వాక్కును మరాళము సందిగ్ధముగా దమయంతితో నుడివినది.

ప్రద్యుమ్నమునం దీ బ్రహ్మవాక్కున కొక ఉపాఖ్యానమున్నది. అది ఇది : మును పొక్కనాడు సరస్వతీ చతుర్ముఖులకు ప్రణయకలహము సంభవించినది. అప్పు డబ్జభవుడు తద్విరహపీడ సైరింప తరముగాక “ఏలరా మన్మథుఁడ ! నన్ను నింత యేచు, టేమి మేలు ? రానున్నది యిట్టి పాట్లు, నీకు నిక్క ప్రభావతి యను వెలఁతపై విరాళి కారణముగ—వేగిరంబ వలదు.” అని మన్మథు నుద్దేశించి పలికినాడు. ప్రక్కనే యున్న శుచిముఖి ఆ మాటలు విని— “అతిలోక సౌందర్యవతియైన రతీదేవి యుండగా మన్మథుని విరహమున క్రాఁగింప గల ఈ ప్రభావతి యెవర్తుక ? ఆ రతి కన్నను సౌందర్యవతియా ?” అని ప్రశ్నింపగా—“రతి రూప మెక్కడ ? ప్రభావతి రూపెక్కడ? విమర్శవంతులు దెలియన్, రతి సొబగు కంటెను ప్రభావతి పస ముమ్మడి నలుమడిపాసి మరాళి,” అని బ్రహ్మ సమాధాన మిచ్చినాడు. మరియు ప్రభావతి అంత రూపవతి యగుటకు కారణము—ఆమె తన సృష్టి గాక పార్వతీ ప్రసాదజనిత యగుటయే—యని విరించి తత్కారణమును గూడ వివరించినాడు.

హంసద్వయము ఈ కీలకముల నాధారముగా గొనియే నాయికల ప్రణయ ప్రవృత్తిని గూడ పరీక్షించినవి. ఈ పరీక్ష రెండు కావ్యములందును రెండు విధములుగా సాగినది.

నైషధహంస ‘చక్రఘోషమున .... వినఁ, గాని నీ వనుచుఁ బల్కిన చందము దోఁచె మానినీ !’ యని బ్రహ్మ వాగ్నిలను మొట్టమొదటి సంభాషణాక్రమములో దమయంతికడ చెప్పివేయును. పిమ్మట నలుని మనస్సు నెరుకపరచగా దమయంతి సమ్మతించును. ఆమె సమ్మతమును హంస ఒక పట్టున నమ్మదు. “ఇప్పుడు నీ తలం పీట్లే యుండవచ్చును. ఎప్పుడే విధముగా మారునో ఎరుగము. ఎందుల కనగా, ‘బాలికల చిత్తము లంబుతరంగ లోలముల్, తప్పునొ తాకునో కుసుమధన్వుని యేటులు దైవికంబుగాన్ ?’ ” అని సందేహింపగా అందులకు దమయంతి “అనల సంబంధ వాంఛ నా కగునయేని, నసల సంబంధవాంఛ నా కగుట జూవె !” అని శపథము సేయును. మరియు, “తండ్రి—నిషధాధిపతి కీక తక్కొరున, కీఁ దలంచిన నే విహగేంద్ర ! వినుము, దేహ మనలంబునకు నాహుతిగ నొసర్తు, యతనిఁ బొందంగఁ గందు జన్మాంతరమున” అని జన్మాంతరమున గూడ నలచక్రవర్తినే పతిగా బొందుదునని తన దృఢచిత్తమును వ్యక్తపరచినది.

శుచిముఖి తన శక్తి నంతయు నుపయోగించి ప్రద్యుమ్నుని కడ ప్రభావతి రూపమును వర్ణింపగా, అందుల కతడు ‘ఔను కా’ దనక అచలస్థితి నుండెననియు, అట్టి సందిగ్ధ ఫలంబయిన ప్రద్యుమ్నవాంఛ విడచి దేవ దైత్య సిద్ధ విద్యాధర గంధర్వాదులందు నెవ్వనినైన వరింపుము, వెంటనే వానిని దెచ్చి నీకు కింకరుని గావించెదనని చెప్పగా, అందులకు ప్రభావతి— “విను ! ప్రద్యుమ్నునిఁ దక్కన్, మనమున నే నొరు వరించుమాట విడువు మా, ఘనము డొల్లకున్నఁ జెందుదు, మనసిజ శిఖిఁ దనువు ప్రేల్చి మరునటి మేనన్” అని ప్రతిజ్ఞ చేసినది. అప్పుడు హంసి ఆమెయొక్క దృఢ చిత్తవృత్తి గ్రహించినదై, ప్రద్యుమ్ను నందలి విరాళితో నేయఘాయిత్యమున కొడిగట్టునో యని తలంచి, ఆమె నా యకార్యమునుండి మరలించుటకు మీది బ్రహ్మవాగ్విధము నెరింగించును.

నైషధహంస బ్రహ్మవాక్కును, దమయంతి మనసును నలునివైపు మరలించుటకే ఉపయోగించుకొనినది. దమయంతి మనసును మరలించుట కింత ప్రయాస అక్కరలేదు. ఎందు కనగా, ఇంతవరకే వినుకలిచే దమయంతి నలునియం దనురక్తయై యున్నది కావున ! మరియు దమయంతి ప్రణయ చిత్తప్రవృత్తిని హంస పరీక్షించు విధాన మంత సారస్యముగా లేదు. హంస దమయంతిని మాటిగా “నీ ప్రేమను నేను నమ్మలే” నని పచ్చిగా అడిగివేసినట్లయినది. మరియు, నామెచేత నెన్నియో శపథములు చేయించుకొని గాని వదలిపెట్టలేదు.

కాని, శుచిముఖి ప్రభావతియొక్క ప్రణయచిత్త ప్రవృత్తిని పరీక్షించుటలో నెంతో నైపుణ్యము, ఉదాత్తతయు నున్నవి. అట్లు పరీక్షించిన పిమ్మట ఆమె నా విరాళాకూపమునుండి

పై కెత్తుటకు బ్రహ్మవాక్కు నందించినది. నైషధము నందలి బ్రహ్మవాక్కు తామరాకుమీద పడిన స్వాతి చినుకైనది. ప్రద్యుమ్నమునందలి బ్రహ్మవాక్కు శుక్తిలోబడి ముత్యమైనది.

కేవలము మరాళ దౌత్యమును గురించియే మాట్లాడు చుంటిమి గాన, సామాన్యుల దృష్టికి—ఆ పాత్రలకు దోషము లనిపించెడు ఆత్మస్తుత్యాది సంఘటనలను గూర్చియు కొంత పరికింతము.

నైషధహంస దమయంతి కడకు వచ్చి తన ప్రతిష్ఠ నన్నియు నేకరువు పెట్టినది. 'మధురాక్షరములైన మామాటలు వినంగ నమృతాంధసులు యోగ్యు' లనియు, 'భారతీదేవి ముంజేతిచిలుకుం జిలుక ...... స్త్రబహ్మచారి మా' కనియు, 'వేద శాస్త్ర పురాణాది విద్యలెల్ల ఘంటాపథం' బనియు తమ వంశ గౌరవమును ప్రస్తుతించుచు, గత స్వీయచరిత్ర ఘనత నొక దానిని గూడ వెల్లడించుచున్నది.

ఒకనాడు విధాత, వినోదార్థము వాహ్యాళి వెడలి మరల వచ్చునప్పుడు తన కులస్వాములైన అతని రథరథ్యములు శ్రమ వలన డీలుపడి యుండినవి. అప్పుడు మన హంస విమాన దండము కంఠమున ధరించి విరించి చేత పారితోషికము వడసి నది. (హంసనామ మెట్లు గుప్తమో, దాని పారితోషికము గూడ అట్లే గుప్తమైనది) ఆ వృత్తాంతమును హంస తానై దమయంతితో చెప్పుకొన్నది.

ఇక శుచిముఖి ఆత్మస్తుతి యెట్టిదో పరికింతము. ప్రద్యుమ్నుని దగ్గర ప్రభావతి సౌందర్యమును వర్ణించినది. ఎంత వర్ణించినను ఆమె శరీర లావణ్యమును 'శృంగ గ్రాహిక' మాత్రమే చెప్పగలిగినది. అందుకు కారణ మేమిటి? హంసి వాఙ్మహిమాఢ్య కాకపోవుటయా? లేక ప్రభావతి లావణ్యము వాక్కుల కందకపోవుటయా? ఈ ప్రశ్నలకు సమాధానముగా తన గత చరిత్ర నేకరువుపెట్టుచున్నది.

హంసివాణిచేత పెంపబడినది. ఆమె యనుగ్రహమున సకల విద్యలు కరతలా మలకములైనవి. హంసిముఖము శబ్ద సంస్కారపూరితమై నందువలన అదేవియే శుచిముఖియని నామ మిడినది. ఒకనాడు శారద తన చెలిప్రోది రాచిలుకకు, హంసకిని కవిత్వమున వాదు పెట్టినది. ఆ వాదులో శుచిముఖి జయించగా 'ఉపమాతిశయోక్తి కామధేను' వను బిరుదమును చెక్కిన నూపురమును సరస్వతియే స్వయముగా తనపాదమునకు తొడిగి హంసిని సన్మానించినది.

ప్రద్యుమ్నునికి ఈ కథయంతయు చెప్పి, అనవాలు చూపి ఉక్తి శక్తిలో తన్నుమించినవారు లేరని సాక్షాత్సర స్వతీదేవిచేతనే కొనియాడబడినట్టిదానను, ప్రభావతి సౌంద ర్యము నిరూపింప నాకే చేతగాకపోయిన దనగా, ఆమె రూప మెంతటి లోకోత్తరమైనదో వూహించుకొమ్మని ప్రద్యుమ్నుని మనస్సునకు పని గల్పించినది.

దూతకు ఆత్మస్తుతి ఔచిత్యదోషమే. ఇచ్చట నైతే ఆత్మస్తుతిగా భాసించునది కార్యదోహదకారియగుచున్నది. ప్రభావతి రూపము ముందు తన వాఙ్మహిమాఢ్యత యేపాటిదని, తాను క్రిందికి దిగ్గి ప్రభావతి సౌందర్యము నాకాశమునకు విసిరివేసినది. ఎంత చమత్కారము? ఇది కదా వాఙ్మహిమాఢ్యత!

నేననుకొందును : ప్రభావతిని వర్ణించు ఘట్టము వలననే కవి సరస్వతిచేత హంసికి 'ఉపమాతిశయోక్తి కామధేను' బిరుదమును ఇప్పించియుండునని. మఱియు కవి వేరొక చోట హంసి 'సరస కథా కథన ప్రవీణ' యని ప్రస్తుతించినాడు. ఆ ప్రస్తుతిపై ఉపాఖ్యానములవంటివి వచించుట వలననే జరిగియుండును. ఇవియన్నియు ప్రచ్ఛన్నముగా కవి తన ప్రతిభను నిర్వచించుకొనుచున్నాడను విషయమును మరచి పోరాదు.

ఇంతటి చమత్కారము, ఇంతటి సందర్భశుద్ధి, నైషధ హంస ఆత్మస్తుతిలో కానరాదు. హంస, తన పారితోషిక గాథ నెందుకు చెప్పుకొనెనో నైషధమున కారణము కానరాదు. దాని మాటలన్నియు గుండ్రాళ్ల బాటలో బండి తోలినట్లు ఒక విషయమై వివరింప ప్రారంభించిన పిమ్మట ముందు వెనుక లాలోచింపదు. విషయాంతరములెన్నియో అప్రయత్న ముగా మధ్య మధ్య దొరలిపోవుచుండును. ఇట్లు దొరలినవి దాని సంభాషణాక్రమములో ననేకములున్నవి. కాని, దాని ఆత్మ స్తుతియందు గూడ కొంత ఔచిత్యము లేకపోలేదు.

ఇప్పుడు మనము అన్ని విధముల క్రొత్తయైన ఒక వ్యక్తితో ఒక విషయమై మాట్లాడవలసి యుండును. మొట్ట మొదట మన గత చరిత్ర కొంత చెప్పి పరిచయము చేసి కొనవలసియుండునుగదా! అట్లే ఈ హంసయు దమయం తితో తన వంశ చరిత్రలు, గత స్వీయ చరిత్రను చెప్పు కొన్నది.

ఈ హంసద్వయముయొక్క గత చరిత్ర తిరగవేయుట వలన నొక రహస్యము బయట పడినది. నైషధహంస బ్రహ్మ కడ పారితోషము వడసినది తన భుజ బలమునకు మాత్రమే. శుచిముఖి సరస్వతిచేత బిరుదము వడసినది, తన బుద్ధిబలము నకు! బుద్ధి బలముముందు భుజబలమేమాత్రము? ఇక్కడే నైషధ కవి వ్యక్తిత్వము, ప్రద్యుమ్న కవి వ్యక్తిత్వము ప్రద ర్శితమగుచున్నది. కాని, సూక్ష్మముగా పరిశీలించినచో, కవుల కాలము, వ్యక్తిత్వము భిన్నమైనను సర్వకాలీన సత్య మొక

దానిని వెల్లడించుచున్నారను రహస్యము గూడ అంతుపట్టగలదు. ఆ రహస్య మేమిటన, పురుషశక్తి—స్త్రీ శక్తి ఎంత భిన్నములో యనునది. నైషధహంస దమయంతినట్లు పిచ్చెపరచి, అపటినుండి నలుని కడకేగి, అతని దగ్గర సెలవు పుచ్చుకొని సత్యలోకమున కేగినది. అనగా మర్త్యలోకమున తన పని ముగిసిన దన్నమాట!

కాని, శుచిముఖినని, నాయికా నాయకుల మనసులను గలుపుటతోనే ముగియలేదు. తన ప్రతిభను వజ్రనాభుని కడ ప్రదర్శించి, అతని యభిమానమును చూరగొని నటుడైన భద్రుని విషయమును తెలిపి, ప్రద్యుమ్నుని భద్రుని వేషములో వజ్రపురములోనికి ప్రవేశింపజేయుట ఇత్యాద్భుతమైన కార్యములు చేయించినది. భారతమునందు శ్రీకృష్ణుని పాత్ర ఎట్టిదో ఈ కావ్యమున శుచిముఖి పాత్ర అంత చతురమైనది.

నైషధ మరాళము 'సరసిజాసను ప్రసాదంబున సకల భూతాంతర్వర్తనంబులు దెలిసి పడియుండుటవలన నలుడు దుఃఖములో నున్నప్పుడు—వచ్చి ఊరడించి వెళ్ళ చాలెడిది. ఇట్టి దైవ దత్తమైన శక్తులు శుచిముఖియందే యొక్కటియునులేవు. తన అసమాన బుద్ధి కుశలతవలన స్వీయ ప్రతిభా సంపత్తివలన సరస్వత్యాదులను సైతము మెప్పించగలిగినది. ఫలితముగా బిరుదములను పొందినదేగాని, వరము లేమియు పొందలేదు. ఇక్కడే మనకు పింగళి సూరన్న దర్శన మిచ్చుచున్నాడు. కవి ప్రతిభ సముద్ర కెరటమువలె పాఠకుని మొగముమీద విరిగి పడుచున్నది.

నైషధహంసకు దైవదత్తమైన కొన్ని దివ్య శక్తులుండుటవలన దాని నేర్పంతయు బూడిదలో బోసిన పన్నీరైనది. శుచిముఖిని అట్లుగాక కవిసామాన్యమైన తిర్యగ్జాతి పక్షిగానే ఉంచివేసినాడు. ఆ పక్షిలో ఉన్నత గుణములను, లోకోత్తర ప్రతిభను చూపించి ఇంద్రోపేంద్రులకే అతీతమైన కార్యఘటనా సంధానము దానివలన చేకూర్చినాడు. సామాన్య తిర్యక్కును అసామాన్య గుణములచేత—భువినుండి దివికి పయనింపజేసినాడు. ఇదీ ప్రతిభ! ఇదీ పాత్ర పోషణ!! భట్టుమూర్తిదైననేమి? 'అభిప్రాయంబు గురించియు, రసంబు పోషించియు, ఔచిత్యం బాదరించియు' అనువదించిన శ్రీనాథుడైననేమి? వారిరువురును ఇక్కడే పింగళి సూరన్న ఎదుటినుండి తప్పుకొనవలసి యున్నది.

అట్లే ఈ కావ్యమునందే మరియొక పాత్ర మున్నది. అదియే శ్రీకృష్ణ పరమాత్మ పాత్రము! శ్రీకృష్ణు డీ కావ్యమున అదిదేవుడుగాడు. అవతారపురుషుడుగాడు. పుణ్యము సంపాదింప దేవేంద్రుడికై యజ్ఞ మొనరించు—కర్మయోగి! కొంచె పటువులయుల్లరి మూకనుండి దైత్య సంహారమున కుపాయము గ్రహించినట్టి సునిశిత బుద్ధిశాలి! కేవలము మర్త్యుడు. కానీ లోకోత్తరమైన మానవతా శక్తి సంపద అతనిలో దివ్యతేజః స్వరూపమై ప్రకాశించుచున్నది. అతనిలోని ఆ శక్తి సంపదయే అమర్త్యమును మర్త్యమునకు దించినది. దివ్యశక్తినప్పి అప్పమైన మానవశక్తి నాశ్రయించినది.

వాల్మీకి గూడ శ్రీరామచంద్రుని అవతార పురుషునిగానో, అతీంద్రియ లీలా స్వరూపునిగానో చిత్రించలేదు. కేవలము మానవునిగానే రూపొందించి, మానవత్వమునందలి దైవత్వమును ప్రదర్శించినాడు. కావుననే అది మహా కావ్యమైనది. అందరిచేతను పూజింపబడుచున్నది లేకున్నచో అష్టాదశ పురాణములలో నేదియో నొక పురాణమై మూలబడి యుండెడిది.

నైషధమున మానవ పవిత్రప్రేమ ముందు దిక్పాలకుల దివ్య శక్తు లెట్లు మంట గలసి పోయినవో కవి శక్తివంతముగా ప్రదర్శించినాడు. మను చరిత్రమునందు మానవ ధర్మ సంకల్పమును భంగింపనెంచి దివ్య సౌందర్య మెట్లు పరాజయమందినదో మన కన్నులకు కట్టినట్లు చూపినాడు. కళా పూర్ణోదయమునందు దివ్య సౌందర్యమును నిత్యమైన కృత్రిమ ప్రసూనమువలెను, మర్త్య సౌందర్యమును క్షణికమైనను సహజ మృదుల మకరంద సౌరభ భరితముగాను నిరూపించి, దివ్య సౌందర్యముపై మర్త్య సౌందర్య మెట్లు కాలు చివ్వినదో—కవి దానిని సహజ మనోహరముగా చిత్రించి కృతకృత్యుడైనాడు. ఇట్లు ప్రబంధ సాహిత్యమంతయు నొక మహోత్తర సందేశము నందించుచున్నది.

సాహిత్యముయొక్క ప్రయోజనము ఆనంద మొకటియే కాదు, సందేశ మంతకన్నను ముఖ్యమైన దనువారికి—ఇంతకన్నను సాహిత్యమందించవలసిన దివ్య సందేశ మేమి యున్నది?

అచ్చతెలుఁగు కూర్పు-
తెలగన్న నేర్పు

శ్రీ 'అనంతం'

"గతానుగతికో లోకః, నలోకః పారమార్థికః". నిజమే. లోకము గతాను గతికము. దానికి పరమార్థ మక్కఱలేదు.

కాని, ఏ రంగమునందైనను గతానుగతి కత్వము చెల్ల వచ్చును గాని, నియతి కృత నియమ రహితము, అనన్య పరతంత్రము కావలసిన కవితా రంగమున మాత్రము చెల్లదు.

దేశమును, కాలమును, పాత్రమును బట్టి, స్వతంత్రత సాగిరాక పోవచ్చును. పరతంత్రత పైఁబడక తప్పనిసరి కావచ్చును.

అట్టియెడ, భారతీ దయాసుధావారిధిలోని సుధ, కవి రాజుల మానస ఘటములు ఎంత స్వతంత్రతాయుతములో అంత వఱకే లభించును.

ఆంధ్రవాఙ్మయములో, విజయనగర సామ్రాజ్య పతనముతో, పిల్ల వసుచరిత్రల పుట్టుకతో పరతంత్రత ప్రబలినది. అట్టి వర్ణనలే, అట్టి కావ్యములే కవిత్వమను భ్రాంతి ప్రబలి పోయినది. అట్లు వ్రాయనివాఁడు కవియే కాకుండఁబోవు పరిస్థితి తటస్థమైనది.

ఇట్టి దేశ కాలములలో ఒకఁడు "నేను అదృష్టపూర్వపథీనుఁడ" నను విశ్వాసము వహించుటకుఁ గాని, దానిని ప్రకటించుటకుఁగాని, అవకాశ మెక్కడ ?

ఎంత పొడుగు సమాసములు వేయఁగలిగిన అంత గొప్ప కవి యని, ఎన్ని శ్లేషలు, అనుప్రాసలు రువ్వఁగలిగిన అంత మహారథికుఁడని యెంచఁబడుచుండిన వస్తాదుల బజారులో భావనా సుకుమారి పద మెటు లుంచఁగలదు ?

తాతలు గడించిన మాన్య క్షేత్రములును లేక, పోతన గారి వంటి విరాగులును కాక, కవితలో, సార్థమును తీర్థమును కలిసి వచ్చునట్లు, తాను బ్రదికి, బాగనుపించుకొని, పది కాలాల పాటు నిలువఁద్రొక్కుకొని యుండుట యెట్లు ?

అసలీ ఆలోచనయే ఎవరికిని కలుగలేదు. ఒక పొన్నిగంటి తెలగన్నకు కలిగినది. భావ విషయమై తానై త్రొక్కఁదగిన క్రొత్త మార్గమున కాలూఁ డెట్లును చోటులేదు. భాషలోనైన స్వాతంత్ర్యము చూపరాదా ?

సంస్కృత పద బహుళ రచనయే శ్రేష్ఠ మనునది ఒక దృక్పథమునకు అవలి కొనయైనచో, సహజముగా, సంస్కృత సమ రహితమైన, తద్భవ దేశ్యమయమయిన, అచ్చతెనుగే ఉత్తమమన్నది ఈవలి కొన కాక తప్పదు.

నాఁటి కవితకు అబ్బురపాటు గొలుపుటతోడనే చరితార్థత. ఈ ప్రక్రియ నవలంబించినచో అక్కఱలేనంత అబ్బురపాటుతో అందఱి నయనాంబుజములు వికసింపక మానవు.

ఈ వూహకు ఫలమే యయాతి చరిత్ర.

ఒక ఆంగ్ల రచయిత "ఒక గ్రంథకర్త సామర్థ్యము అతని గ్రంథమునందలి ప్రథమాధ్యాయములో, ప్రథమ పరిచ్ఛేదము (Para) లో, ప్రథమ వాక్యమును బట్టియే తెలియఁగల దన్నాఁడు.

ఈ కావ్యములోని ప్రథమాశ్వాసము నంతను నా పరిధిగా నిర్ణయించుకొని, అచ్చతెనుఁగు కూర్పులోని తెలగన్న నేర్పును పరిశీలింతును.

తెలగన్న కేవలము అచ్చతెలుగు కూర్పులోనే కాక, అనేక విషయములందు నేర్పరియని తోచును. అట్టి నేర్పులలో మొదటిది, ఆ కాలములో ఒక మహమ్మదీయుని కృతిపతిని చేయుట. రెండవది, అట్లు చేసినను తన మత విశ్వాస స్వాతంత్ర్యమును కోల్పోవకుండుట. మూఁడవది సత్యమైన స్తుతినే చేయుట. వీనిని, మఱికొన్నిటిని స్థలాంతరమున వివరించియుంటిని గావున ప్రాసంగికముగా, చూపి వదలుట తప్ప వీనిని ప్రధానముగా వివరింపను. కవితా చాతుర్యమునే పేర్కొందును.

ధ్వని వ్యంగ్యాదుల ధ్వనులు శాస్త్ర చర్చలలో గట్టిగనే వినిపించుచున్నను వర్ణనా నిపుణుఁడే కవి అన్నది యెక్కువగా

ఆచరణరూపమున అద్భుతమైన సిద్ధాంతము వాఁడు. ఈ దృష్టితో చూడనివాఁడు మనోజ్ఞ వర్ణనా కీర్ణములైన బహు ప్రబంధములు నిరర్థకములై పోవును. ఇది ముందుగా గమనింప వలెను.

వెన్నుఁడమీనుఖానుని బ్రోచుఁ గావుతమని ఆశీః పురస్సరముగా కావ్యమున కుపక్రమణ మైనది.

అంతే. ఇతర దేవతా ప్రార్థనములు గాని, సుకవి వినుతులుగాని, కుకవి నిరాకృతులు గాని లేకుండ సూటిగ ఒక సీసములో గోలకొండను, మఱి మూడు పద్యాలలో తత్పరిపాలకుఁడైన మల్కిభరామునిని వర్ణించెను. అందును, మూడవది యైన సీసములో ఎత్తుగీతి వఱకే పాదుషా వర్ణనము. ఎత్తుగీతిలో అతఁడు "గొలిచి మనుమఁ, గలనఁ దన చెయ్యి మీఁదుగాఁ గడిమి మెఱసి, మేలు సిరులందు నట్టి అమీనుఖానుఁ" డని అతని విషయము నందుకొన్నాఁడు.

ఆ అమీనుఖాను తన్ను ఆహ్వానించి, సత్కరించి, మరింగంటి అప్పన్నగారను మహనీయుని ద్వారమున కృతి యిమ్మని కోరినాఁడని చెప్పును ఆయన మాటలలో తా నదృష్ట ధ్యవ ధికుఁడ ననియు, తన కృతికి వాఙ్మయములో ప్రత్యేక స్థానము ఉండుననియు, అందఱు అబ్బురపడి, మెచ్చి, ప్రశంసింతురనియు గడుసుగా ఇట్లు చెప్పికొనినాఁడు.

"మున్నెవ్వరు నొడువని యీ
తెన్నిడి, కడు మీఱి, యచ్చ తెనుఁగుం గబ్బం
బెన్నిక మీఱఁగ జెప్పిన
విన్నం బొగడంగఁ గలఁడె నెల తాల్పయినన్!"

"అచ్చతెనుంగుఁ బద్దె మొక
టైనను గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుందు రది
యెన్నుచుఁ బెద్దలు : పొత్త మెల్లని
ట్లచ్చతెనుంగున న్నొడువ
నందుల చంద మెఱుంగువారు నిన్
మెచ్చరొ, యబ్బురం బవరొ,
మే లనరో, కొనియాడరో కడున్."

1—11, 12.

పేర్లకును బిరుదులకును సంస్కృత పదములనే వాడక తప్పదని ఇట్లు విన్నవించుకొనినాఁడు.

"తెనుఁగునను మాఱుపేళ్లిడి
పెనఁచిన వినఁగూడ దనుచు బిరుదులఁ బేర్లన్
మునువేల్పు బాస వెంబడి
నునిచెదఁగా దనకుఁ దయ్య యుల్లములందున్."

1—14.

తదనుగుణముగనే మల్కిభరాం పాదుషా బిరుదులను పేర్కొనినాఁడు. కాని, యిందు "లాలనరీ గజాంకుశుఁడు," "నతకా సింహాసనాధీశ్వరుఁడు" అను వానిలోని ఆది పదముల కర్థమేమో ? తెలిసినవారు తెలుపఁ బ్రార్థితులు.

తరువాత సంప్రదాయము ననుసరించి కృతిపతి వంశ వర్ణనమును, షష్ఠ్యంతములను వ్రాసినాఁడు. యయాతి మహారాజు నగరమైన ప్రతిష్ఠానపురమును, కోటను, అగడ్తను, పుష్పవాటికలను చాతుర్వర్ణ్య సమాజమును వర్ణించి యయాతి కడకు చెంచులువచ్చి కానుకలిచ్చి అడవిలో దుష్ట మృగ బాధ పెరిగినది కావున దయచేసి వేటాడి కావుమని ప్రార్థించినట్లును, యయాతి వేట సన్నాహము చేసి వెడలినట్లును ఆయా విశేషములను చూచుచు పోయి ఒకచోట వేట కనుమతిచ్చినట్లును చెప్పును. ఇది ప్రథమాశ్వాసము యొక్క స్థూల రూపము. దీని కూర్పులో తెలగన్న ఎన్నో విశేషములు ప్రదర్శించెను.

సామాన్యముగా పఠితలు కృతిపతి వంశ వర్ణనాదికము లున్న పుటలు త్రిప్పి వైచెదరు. ఇతని పీఠిక మాత్రము అట్లుపేక్షింపఁ దగినదికాదు. ఇం దెన్నియో గడుసు పోకడలు పోయినాఁడు.

వంశ వర్ణన కాదిని

"మున్నీటి రాణియౌ విన్నది యేవేల్పు
నడుగుఁ గెందామర నలరుతేనె" ఇత్యాదిగా సీసము నాల్గు పాదములందును నారాయణుని మహిమ వర్ణించి "అతఁడు తానైన కర్తారుఁడు" అని అల్లా నారాయణు లభిన్నులని చెప్పి ఆత్మ స్వాతంత్ర్య ప్రకటనముతోపాటు సమదృష్టిని, మత సామరస్య మార్గమును నిర్దేశించినాఁడు.

ఇంతకంటె ఇతఁ డీ పద్యములో చేసిన [illegible] చమత్కార మున్నది.

నారాయణుఁడు శేషశయనుఁడని మన మందఱము నెఱుఁగుదుము. కాని, సామాన్యులకుఁ గూడ హంసతూలికా తల్పములు లభించుచుండ అంతటి దైవమునకు లేకుండుటా ?

"కమ్మఁ దెమ్మెరపూఁ బదిమ్ము దానేవేల్పు
మంచు మించులపాను నంచదూది" ఆయన పఱుపు చిలువకాదు మంచు మించుల పానుపు, అంత తెల్లనిది. దానిలోఁ గూరినది అంచ దూదియే కాదు. అంచదూదికిఁ గూడ ఏ కొంచె

మైన కలకుఁదన ముండునేమో ఇందఱి దూది యేమని ? కమ్మఁ దెమ్మెరపూఁ పదిమ్ము, అంచదూదికి లేని సౌరభమున్న పిల్ల గాలులు. (1—16)

తెలగన్న తలఁచుకొనునో లేదో, అందాల అచ్చతెలుఁగు పదాలు వచ్చి మమ్ము స్వీకరింపు మనఁగా మమ్మని నర్తించును. ఈ నడుల సొయగమే దీనికి నిదర్శనము. అమీనుఖాను ధాతృత్వ మిందు వర్ణితము.

"మించి యమీనుఖానుఁ డెల
మింగల బట్టకు వెల్ల నిచ్చెఁ బ
ట్టంచుల పచ్చడాలు, పర
పాలు, పరాలు, గుఱ్ఱాలు, పల్లకీల్,
కుంచెల యందలాలు, గొడు
గుల్, పడగల్ గడుఁ దోర హత్తుగా
వెంచఁగ నెవ్వరీ డతని
కీగి పనం బరికించి చూచినన్." 1—28.

అమీనుఖానుఁడు ఔదార్యములో కల్పవృక్షమును, పయోద దమును, కర్ణుని సముద్రమును గూడఁ మించినవాఁడు. ఈ మాట చెప్పుటకువారిలో నిజమునకు లేని లోపములను తన ఉక్తి వైచిత్రిచే ఉన్నట్లు చెప్పవలెను. ఇట్టి పట్టుల సంస్కృతపదము లున్నచో శ్లేషకు చెప్పినట్లు వంగి ఎంతేని వన్నెతెచ్చును. ఆ శక్తి అచ్చతెలుఁగు నుడికారమునకును కల దని ఉన్నత భావ హర్మ్యమున నెక్కుటకు మెత్తని పలుకుల నిచ్చెన వంటి క్రమాలంకారమును వైచి మనకు రమణీయ దృశ్యములు చూఱ విచ్చినాఁ డీ సీసములో :

"పలపలనై, క్రమానుపడి, పండ్ల చూపెడు
పుడుకుఁ జెట్లను వేడఁ బోవ నేల ?
మించు చూపుచునె వమ్మించి నిల్కడ యేది
విప మొసంగెడి మబ్బుఁ గొనరనేల ?
యొరిపోయి యూ లేక యొకపూట వెట్టెడు
తామర చెవి పట్టెఁ దడవనేల ?
పొరలంగఁ బడుచుఁ దాఁ దెర మఱుంగున నుండి
కనరెడు మున్నీటఁ బొనఁగనేల ?
తెలివి, గురికొల్పి, నిచ్చలు, పలుకుఁ దియ్యఁ
దనము గాన్పింప—వొనఁగెడు దారిచేత
మిగులఁ బొలుపొందునట్టి యమీనుఖాన
యొడయఁ డొప్పుల కుప్పయై యొనరుచుండ.
(1—29)

ఇతఁడు నుకవిస్తుతి చేయులే దంటిని. బహుశః తన మార్గమునకు తానే తొలివాఁడగుట యందులకు కారణము కావచ్చును. కాని అమీను పురమును వర్ణించుచు,

"పుట్టఁ బుట్టిన ప్రోడ పొల్పును జెప్పఁగా
గలుగు జాణల మొత్తములకు నెలవు" (1—30)

అని చెప్పినాఁడు. వాల్మీకియందే కవికి భక్తి యుండదు ? కాని, కవితామార్గమునకే కర్త యగుటచే వాల్మీకి ఇతనిచే ప్రత్యేకముగా స్మరింపఁబడినాఁ డనుకొందును.

అమీనుఖాను సప్త సంతాన ప్రతిష్ఠాపకుఁడని కవి చెప్పఁ దలచినాఁడు. సప్త సంతానములలో దేవాలయ మొకటి. అట్లని కట్టని దేవాలయము కట్టినట్లు చెప్ప నిష్టములేదు. అతఁడు మసీదు కట్టించినాడు మఱి సత్యచింతామణి పొట్లచెఱువులో. హైందవ సంప్రదాయోక్తమైన దేవాలయము మసీదగునా ? కాకపోవచ్చు. కాని, అల్లా నారాయణు లభిన్నులని నమ్మినా డీమాత్రము పొసగింపలేఁడా ? "ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్" "శివాయ విష్ణురూపాయ శివ రూపాయ విష్ణవే." కనుక మసీదులోను, దేవాలయములోను నుండు దైవ మొక్కడే. ఒక కవి యన్నట్లు—

"సర్వ మతములు శాంత్యహింసలనె కోరు,
సత్యవర్తనమే బోధ సలుపు, బాహ్య
వేషములె భేద, మంతియే, వేఱు వేఱు
పాత్రముల నింపఁబడి నట్టి పాయసమటు."

అనునది సత్యము కదా. ఇన్నియు తన విశాల దృష్టికి గోచరించినవి కావలయును. మసీదు నందము నిట్లు వర్ణించినాఁడు.

"తామర తంపరై పిరులఁ
దార్కొను కొనలనాట సత్య చిం
తామణి పొట్లచెర్లను ప
తం బగుచుండ నమీనుఖానుఁ డిం
పొమతిలంగ నిల్పఁ బొడ
వై బెడఁగైన మసీదుఁ గాంచి, యుం
డేమను వెండి కొండనయి
కేఁడలంచక బేసికంటియున్." (1—31)

పై పద్యములో "మసీదు పొడవై బెడఁగైనదని చెప్పి నాఁడు. ఆ పద్యము పాఠకుని కనులముందు దాని పొడవున కంటె బెడఁగునే విశదముగా చూపుచున్నది. కావున దాని పొడవును ప్రత్యేకముగా చెప్పవలయును. అట్లని పట్టి పొడవైన దను టతో చరితార్థము కారాదు. వెలుఁగులకు పై వెలుఁగు పరమాత్మ. ఆత్మస్వరూప మున్నతోన్నతము. మనోదర్శనీయము,

శత్రుప్తికి దేవాలయము నిచ్చిన వంటిది. అను సకల వత సారభూత విషయమును సంపాదించి మత సమన్వయము సద్భుతముగా వివరించుచు నీ పద్యము చెప్పినాడు.

"పాదవుల కెల్లనుం బోదవు,
　　ప్రోదలు నెమ్మదిలోను గాంచు ని
ల్కడ, కడలేని తేజన బ
　　గంబున కన్యలయ్యె న వెల్గు నె
య్యెడలను బొందు వారలకు
　　నెక్కుడు నిచ్చినయా మసీదు విం
పడర నమీనుభాన యొడ
　　యుండు తిరంబుగ నిల్చెఁ బొల్పుచున్. (1—32)

ఆంధ్రదేశములో ఆంజనేయుని భక్తు లనేకులు ఉన్నారు. వారిలో నొక్కరికి అతఁడు అరణ్యములో ఏల వసించుచు చున్నాఁడో, తపస్సు ఎందులకయినాఁడో తెలియదు. ఏమో చెప్పుదురు. అసలు కీలకము తెలగన్నకే తెలిసినది.

"కడక నమీనుభానుఁడు బ
　　గంబు తనుం బొగడంగ వేడ్కతో
విడువక ఎప్పుడుం బుడమ
　　వేల్పుల బిడ్డల పెండ్లి చేయఁగా
నడరెడు దీతు లోఁబొడవు
　　నందు కతంబును గాదె దూఱుఁ బే
రడవులలోపలన్ దలిసి
　　య్యె కనుపట్టెడు గాలి చూలియున్." (1-33)

అమీనుభానుఁడు ఒక్కరినైన వదలక, పని గట్టుకొని బ్రాహ్మణుల బిడ్డలకు వివాహములు చేయించి కీర్తిఁ గాంచె వాఁడు. అది చూచి తనకును చేయించునేమో అని భయపడి ఆంజనేయుఁడు—కాదు గాలిచూలి కనుకనే—కాఱడవులు జొచ్చి తపస్సు చేసికొన్నాఁడు.

అమీనుఖాను వేయించిన ఆరామము రామణీయకమును వర్ణించు పద్యము అలంతి అలంతి తెలుఁగు మాటలతో 'ఆహా' అనిపించవచ్చు ననుటకు చాలు.

"ఏచి, ననిచి, పూచి, కాచి, పండిన యమీ
మ్పరము మేలితోట అరసి కాంచు
మునలివారికైనఁ బసి బిడ్డలకు నైన,
బండ్లువచ్చు నలరుప్రాయ మొదవి." 1—37.

మాటల అర్థముతో నెంతగా వర్ణనీయ దృశ్యమును కనులముం దుంచవచ్చునో కేవలము మాటల పొందికతోనే యంతగా ఉంచవచ్చునన్న రహస్య మీ కవికి తెలియును. ఇతనికి ఆముందున్న పెద్దన్నకు తెలియును.

అమీన్ఖాను కీర్తి చంద్రకాంత శిలలను, హంసలను, అరన్నెఘములను, కలువలను గూడ అపహసించునంతటి ధావళ్యము గలది అని చెప్పుటకీ పద్యము రచించినాఁడు.

'నిగనిగమను నెలకలు బలు
　　దెగలను, నెలి పులుఁగుఁ బదువుఁ, దెలి మొగిలి గమిన్,
　　దొగలన్ వగలన్ దగులన్
　　మిగులన్ వడి నవ్వు నసవు మినుముల గమికిన్."
(1—70)

ఇందలి తొలి రెండు పాదములందలి సర్వ లఘుమయ పదములు చంద్రకాంతాదుల దైన్యమును" "తొగలన్, వగలన్, దగులన్, మిగులన్" అను గకారము మధ్యఁ గల సగణములు ఆగి ఆగి ఆక్షేపణపూర్వకముగా నవ్వుటను—అర్థ నిరపేక్షముగనే చూపుచున్నవి.

ప్రతిష్ఠాన నగరపు టగడ్తలో కెందామర లున్నవని చెప్ప వలయును. అట్లే చెప్పినది కవిత్వ మగునా ?

"అగడితలోఁ గెందామర
　　మొగడలు గనుపట్టెఁ జాలమూఁకై చూడం
　　దగి మున్నీటం దేలుచు
　　బెగడని వార్యంపు టగ్గిపిల్లలు వోలెన్." (1—80)

పరిఖలో ఎర్ర తామరల మొగ్గలు కనుపట్టినవి. ఒకటి రెండు కాదు. మూఁకగా నున్నవి. దర్శనీయములై యున్నవి. ఏరీతిని ? అగాధ మహా సాగరములో ఆడుకొనుచు పైకి తేలి భయ మెఱుఁగని బడబాగ్ని శిశువులవలె నున్నవి.

వోహా ! ఎంత నేర్పరి తెలగన్న ! ఒక్క దెబ్బకు, రెండు కాదు, ఎన్నో పిట్టలు ! ఈ పోలికవలన ధ్వనించునవి. (1) అగడ్త కడలివలె అగాధము. (2) బడబాగ్నినే కడలి భయంకర మైనట్లే అగాధత్వముచే నగడ్తయు (3) అగడ్తలో మూఁకగా కెందామర లున్నవనఁగా శత్రువన్నవాఁ డెవడును తత్పురాధీశ్వరుని వోడించుట మాట యటుంచి, ఆ పురము నెన్నఁడును ముట్టడింపనైన లేదు. ముట్టడించి యుండినచో వాని యేనుగులు అగడ్తలోనికి దిగియుండెడివి. దిగియున్నచో కెందామరల కునికియే లేదు. (4) భయములేని బడబాగ్ని పిల్లల వంటివి అనుటచే ఇకముందు ముట్టడి వంటి దుండు నన్న శంకయు లేదు.

తెలుఁగు ప్రబంధములలో వెలయాండ్ర తళుకు బెళుకు లను వర్ణింపనివారు లేరుగదా ! వర్ణింప కేమిచేయుదురు ? నాఁ డట్టివా రుండిరయ్యె ! అందఱును వర్ణించినట్లే అతఁ

డును వర్ణించినాఁడు. వీరు తమ సామర్థ్యమువలన త్రినేత్ర మన్మథ భీమ హనుమంతులను గూడ అవలీలగా లొంగదీయ గలరని అందఱి వలెనే అనినాఁడు. అప్పటికి సినిమాలో నాలుగా పాదములు నలుగురకు నైపోయినవి. ఎత్తుగీతి నెత్తుకొనునరికి వేమ తెలగన్న నన్నాఁడు.

"అంటఁ గలిగిన నవ్వైన కయ్యమైన
గోఁచి విడిపించి వలపులు గొల్పి విప్ప
వెంటఁ దిరుగాడు బేయు న వ్విటలోనఁ
గలుగు వెలయాంధ్రగమి పొల్పు వలకుఁ దిగిచి."
(1—85)

ఇది తళుక్కుమను క్రొక్కాఱు కొన మెఱుపే.

హనుమంతుఁడు అరణ్యములో నుండుటకుఁ గారణము చెప్పినట్లే, అంతకుముందు నుండియు నమరులు కన్నవు గొండపైఁ గాపుర ముండుటకును హేతువును యయాతి భూసురులకు భూరి దక్షిణ లిచ్చుటగా నిట్లు వెల్లడించినాడు.

"అవికి నెదుర్పఁ జాలు దొర
వారసి, కానక, య్యయ్యయాతి దాఁ
బెనకువ మేటి జన్నములు
పెక్కులు చేసి పసిండిఁబాఱులం
దనుపఁగ దాని నిచ్చునని
దయ్యవు మూఁకలు పైడి కొండపై
ననయము గాఁపురంబులుగ
నన్నియు గాచుచు నుండు నెంతయున్."
(1—93)

చిన్నమెత్తు కస్తూరి వచ్చి బాలెంతరాలి కిచ్చునప్పటికి మన పనియగుచున్నది. రవ్వంత పునుగో, జవ్వాదియో పులుము కొనఁగలమా ? కలలోని మాట ! ముత్తియములు మ్యూజియములలో చూడవలసినవే. చామరములను సినిమాలలోనే చూడ వలయును, దేవాలయములకు పోము గనుక. విచార మెందులకు ? యయాతి మహారాజు వేటాడ వేగిన అడవిలోని ఎఱుకుల వస్తు సంపత్తి ఆ మహారాజు డెందమునే వెలిగందించిన దుట, మనమును చూచి ఆనందింతము.

"అలరు కస్తురిఁ దీనె లరికి వాకిళ్ల చెం
తల నైచి పోయిన యట్టి తట్టుపునుగు,
గోడలు పూయంగఁ గ్రమ్మి గందంబున
మేదించినట్టి జవ్వాది యడును,
వాడాడ సరిబేసు లాడి పో విడిచిన
ముదురు వెదుళ్లలో ముత్తియములు,
బలుపుటేనిక కొమ్ములలు వలపైఁ ద్రోవఁ
దవిలించి కట్టిన్ నవరములును,
వంట కట్టెల కని తెచ్చి వాము లిడిన
యగరు మ్రాఁకులపై నింద వాఱఁబెట్టు
కప్పురంపుట నంటులు గలిగి మెఱయు
నెఱుకు పల్లియ లొక కొన్ని యెదుటఁ గాంచి."
(1—119)

యయాతిని చూచి ఎఱుకు దొరలు అనుకొనిన ముగుద మాటలు విన సొంపుగా నుండును.

"చెవులకీ తెల్ల యుచ్చితకాయ లెంతేసి
పొరుటాకులది కుప్పసమి దప్ప !
అయ్యకుఁ గట్టనెం తరుటాకు గల్లరా !
యీ పచ్చ తాడి బిళ్లేడ దొక్కె !
వ్రేళ్లఁ జుట్టిన నెట్టి వేళ్లకో ! చేతులఁ
బండుఁదీఁ సెలవి గొప్పలు కడేలు !
తలకు వేసికలో తార్పిరి యులాగు !
నీ యచ్చ గురిజ పే రెందు గలిగె !
రాజు కాఁడన్న కంబమురాయఁ డితని
వేసమును మేలు, బాగెము సేసియుంట
నిపుడు గనుఁగొంటి" మని పల్కు నెఱుకు దొరల
ముగుద మాటలు విని చాల నగుచు నలరి. 1—120

హస్తినా నగరమునకు నపరివారముగ నరుగుచున్న శ్రీకృష్ణునిఁ జూడవచ్చిన గొల్లలు కొందఱు తమ చుట్టముగా గావున అతనిచేఁ గౌఁగిలింపఁబడి యిట్లు చనవుతో పలికిరని జైమిని భారతములో పిల్లలమఱ్ఱి పినవీరన యొక్క పద్యము వ్రాసెను. అది యిది :

"కొరగించెదు కొండ గోఁగు బువ్వుల చాయ
దివ్వ్ని గొర్పడం బెట్లు గలిగె ?
మెఱుఁగుఁ జక్కల చాయ మించునీ తెల్లని
గురువింద పే రెందుఁ గూర్చుకొంటి ?
నిగురు గప్పని చంద్ర నిప్పుకైవడి నున్న
దీ కొడ్డిపూస నీ కెవ్వఁడిచ్చెఁ ?
బొలసిన గబ్బు కంపులు సోడు ముట్టెడు
నీ నల్ల తిరునామ మెచట దొరకె ?
జడలు మెడమీఁదఁ వ్రేలెడు జల్లి తోఁక
వేడ నవరించు కొంటివి బోడకోడె ?"
యనుచు నాడెడు మూఢ వాక్యములకలరి
శ్రీధరుండు వారిఁ గృప నాదరించె నపుడు.". 3—74

తెలగన్న యొజుకుల మాటలీ పీరన్న గొల్లల పలుకులకు సొంపైన ప్రతిధ్వనులు.

ఒక రన్నట్లు, అంతగాఁ బరిశీలింప నక్కర లేకుండనే ఇందలి ఎన్నో పద్యములకు పోలిక కల పద్యము లెన్నో ఇతనికి పూర్వమున్న కవుల గ్రంథాలలో కానవగును.

అట్లని, అంతమాత్రమునకు, అతఁడు చిన్నచూపు చూడఁదగినవాఁడు కాఁడు. అసలు మన కవులలో పూర్వుల పద్యములవంటి పద్యములు వ్రాయనివా రెందరున్నారు ? పరతంత్రత దోషముకాని పరులలోని మేలి గుణము గుర్తించి దానిని సొంతముచేసికొనరాదను నియమ మెక్కడను లేదు కదా !

ఇవి యన్నియు నిటుంచి, కమ్మని అచ్చతెలుగు పలుకుబళ్ళు, నా నుడులు, సామెతలు మొదలగు భాషకు జీవమును, జవమును గలిగింపఁ గలవాని నెన్నిటినో యీతఁడు గాదెలకెత్తి నిలువయుంచినాఁడు.

అమీనుఖాను పెద్దభార్య బడేబీబీ "కొడుకుల కోట" (1—42) అట ! అతని పెద్ద కొడుకు కతాతఖానుఁడు. "ఆల చిన్ని ప్రాయమునందు రాజులచేతఁ దగు నిమ్మపండు" (1—47) అట !


శబ్దాలంకారములు వాడినను అవి "కొమఱు మీఱఁ హొమామియరా కొమరుఁ దగుచు" (1—19) "పచ్చడాలు, పరహేలు, పరాలు, గుణాలు" "గొడుగుల్ పడగల్ గడుఁ దోరహత్తుగా" (1—28) వంటి వాని వలె సహజ సుందరములుగా గావలసినదే.

అచ్చతెనుఁగు కావ్యమును నిర్మించిన ఆదిమ కవిగా అతని స్థానము కాదనరానిది. ఆంధ్రములో నిప్పుడున్న అచ్చతెనుఁగు పదములలో ముప్పాతిక మువ్వీసము అతని వలననే నిలిచియున్న వనుట నిజము.

శబ్దరత్నాకర కారుఁ డితనిని నాలుగవ తరగతిలోఁ గూర్చుండబెట్టినను ఎన్నో తెనుఁగు పదములకు ప్రయోగములనితని యీ గ్రంథము నుండియే చూపెను.

ఇత డుపయోగించిన నెన్నో శబ్దములు నేఁడు వాడుకలో లేవు. కాని, వాడుకలోనికి వచ్చినచో అల్పమాత్రాకములయి సుఖము నిచ్చునవి చాలఁ గలవు. ఒలి—దోపుడు, తలి—సమయము, రవము—వెల్లబడి, ఇవి అట్టి వానిలో కొన్ని.

కొంచెము తీజీక, ఇంచుక జిజ్ఞాస, రవంత ఓపిక, కావంత క్రొత్తమీఁది వలపు, ఆవగింజంత రసికత—కలిగి యయాతి చరిత్ర చదువుచో తెలగన్న ఆసించినట్లు అతనికై తను, అచ్చ తెనుఁగు అందచందములను మెచ్చుట, అబ్బుర మనుట, మేలమట, కొనియాడుట—తప్పదు.



పగిలిన అద్దం

శ్రీ వాకాటి పాండురంగరావ్

21 వ నెంబరు బస్సుకు గర్వం ఎక్కువ.

తనకు విద్యాగంధం ఉందని కాబోలు.

పువ్వుతోబాటు నారకు వాసన వస్తుందన్న సామెతనా బస్సు ఎక్కడో విని ఉంటుంది !

యూనివర్సిటీనుండి కరోల్బాగు వైపుకూ, కరోల్బాగు మీదుగా యూనివర్సిటీకి వెళ్తుంది 21 వ నెంబరు బస్సు. చదివేడివారినీ చదివించేడివారినీ చదువుల చోటుకు తీసుకువెళ్తున్నాననీ కాబోలు గర్వం. ఆ గర్వంకొద్దీ అప్పుడప్పుడు ముందడుగు వేయక బ్రైకాయిస్తుంటుంది ఈ బస్సు—

అని ముకుందం అనుకుంటూండగా ఆ బస్సు కనాట్ప్లేస్ మలుపు తిరగబోయింది. కాని తిరగకుండా ఠక్కున ఆగింది. ముకుందం బస్సు కిటికీలోనుండి బయటికి చూస్తే వేగం పాలిటి యముడు ఎఱ్ఱదీపం వెలిగిఉంది. ఆ వెలుగు అర నిముషం మాత్రమే.

ముకుందం గుండె వేగంగా కొట్టుకోసాగింది.

బస్సు పంచ్కుయిన్ రోడ్డుమీద నడుస్తుంది. దాని వేగం హెచ్చింది.

అతడి ఒళ్లంతా కళ్లయింది.

అన్సారి గుమ్మమూ, పెద్ద పెద్ద ఫర్నిచర్ షాపులూ రామకృష్ణాశ్రమమార్గమూ, పహాడ్గంజ్ థానా అన్నీ వెనక్కు వెళ్లిపోయాయి.

'లింక్ రోడ్ కోయీహై ?'' అని అరిచాడు కండక్టర్.

''హై హై !'' అని బస్సులో ఎందరో అరిచారు—

అన్పించింది ముకుందానికి. కాని ఒక్కరు కూడా అట్లా అరవలేదు.

లింక్ రోడ్ స్టాప్ వద్ద ఆగకుండానే సాగింది బస్సు.

ఆశ్చర్యపడి, కోప్పడి, బాధపడి—అంతలోనే అవనీ మరిచిపోయి, కిటికీలోనుండి బస్ స్టాప్కు కొద్ది దూరంలో ఉన్న పండ్ల దుకాణం వైపు చూశాడు ముకుందం.

ఉంది ! ఆఅమ్మాయి ఉంది.

రకరకాల పండ్ల మధ్య పారిజాతపుష్పంలా కూచుని ఉంది. నవ్వుతూ ఎవరికో పండ్లు అమ్ముతూ ఉంది !

ఆ దృశ్యాన్ని బస్సు కిటికీలోనుండి అయిదు సెకండ్లయినా చూడలేదేమో ముకుందం. కాని మనసులో ఆ దృశ్యాన్ని చూసుకోవడానికి కళ్లతో పనిలేదుగా. ఇవాళ అర్జెంటుగా హోటలు చేరి తీరాలి కనుక, పరుగెడుతున్నాడు గాని, లేకపోతే దిగి కనీసం నాలుగు అరటిపండ్లన్నా కొనుక్కునేవాడే ! అక్కడినుండి బస్సు దొరక్కపోతే హోటలుకు నడిచేవాడే !

ముకుందం మనసులోని ఈ అనుభవానికి వయసు ఎంత, పందరోజు లుంటుందేమో. ఒకనాడు యూనివర్సిటీలో తా నెక్కిన బస్సు లింక్ రోడ్ దగ్గర ఆగిపోయి—ఇహ ముందుకు కదలనని మొండికేస్తే, వచ్చినట్లు అందరితో బాటు తానూ దిగాడు. యథావిధిగా ఢిల్లీ బస్సువాళ్ళని దీవిస్తూ, మరునటిరోజు దినపత్రిక సంపాదకుడికి తను రాయబోయే ఘాటయిన లేఖలోని వాక్యాలను నిర్మిస్తూ నిల్చుని ఉంటే—కొన్ని గజాల కవతల కనపడింది ఒక పండ్ల దుకాణం.

కమలా, ద్రాక్ష, ఆపిల్, సపోటా, లాచీ, అరటి—మొదలయిన పళ్ళు చిన్నచిన్న గంపలనిండా ఉన్నాయి. ఒక అమ్మాయి వాటి నమ్ముతున్నది. ఆమెకు పదహారేళ్లుంటాయేమో. దారివెంబడి వెళ్లేవారిలో ఎవరన్నా తమ దుకాణంవైపు చూచి ఏదయినా కొంటారేమోనని అందరివైపు చూస్తూ, ఎవరన్నా అటు చూస్తే చాలు మొహమంతా చిరునవ్వు చేసుకు వాళ్ళని పిలుస్తూ, వాళ్ళు బేరమాడ్డం మొదలెడితే తమకి గిట్టే రెండు పైసల లాభం వివరిస్తూ ఆ పండ్ల నిటు ఇస్తూ ఈ చిల్లర నటు పడేస్తూ, మధ్యమధ్య ఒక అయిదేళ్ల అబ్బాయి—తమ్ముడు కాబోలు వాడిని సముదాయిస్తూ చెంగుచెంగున లేడిపిల్లలా గెంతుతూ ఉన్నది ఆ అమ్మాయి.

పగిలిన అద్దం

ఆమె కాదు కాని, ఆమెలోని ఒక ప్రత్యేకత ముకుందాన్ని ఆకట్టుకుంది.

ఆమె అందమయినది కాదు. నూనె రాయని జుత్తు. కడగని మొహం. ఉతికి చాల కాలమయిన చీర. భయంకరమైన వంగ రంగు కుంకుమబొట్టు. మోచేతిదాకా రంగు రంగుల గాజులు.—ఇవన్నీ కూడా నాజూకైన అభిరుచిని చెదరగొట్టే పదార్థాలు.

మరి యూనివర్సిటీ లెక్చరర్ ముకుందం యొక్క బెదరును పోగొట్టి అతడి కుతూహలాన్ని ఆకర్షించింది. అంటే ఆ ఆకర్షణ ఆ అమ్మాయిలో ఒక ప్రత్యేకతే గాని ఆమె మాత్రం కాదనే అనుకోవాలి.

ఏమిటి ఆ ప్రత్యేకత ?

ఆ అమ్మాయికి తల్లి ఉన్నట్టు కనిపించదు. తండ్రి ముసలివాడు. ఎప్పుడూ దగ్గుతూనో బీడి తాగుతూనో—కాస్త వెనక్రప్రక్కగా పాత నులకమంచంమీద కూర్చొని ఉండేవాడు వాళ్లకు వేరే గుడిసె అంటూ ఉన్నట్లు లేదు. ఆపాత మంచంమీద మాసిన పరుపు, మంచంక్రింద నాలుగు కుండలూ—ఇవే వాళ్ల ఆస్తి.

దుకాణమా వీధిమీద ఉంది. వర్షం వస్తే వ్యాపారం ఉండదు. ఏ క్షణాన్నయినా పోలీసులో మున్సిపాలిటీవారో వచ్చి దుకాణాన్ని ఎత్తివేస్తే ఆ ముగ్గురికి పొట్ట గడవదు. కళ్లు కానక ఏ లారీయో, బస్సో కాస్త ప్రక్కకు మళ్లితే వాళ్లకు చావు తప్పదు. ఇదీ వాళ్ళు జీవిస్తున్న వాతావరణం. ఇన్ని ప్రమాదాలలో ఏ ఒక్కటి ఉన్నా చాలు మన మనస్సు శాంతిని కోల్పోయి యమయాతన పడుతుంది. కాని, ఆ అమ్మాయి అసలు ఈ అపశ్రుతుల ఉనికిని గుర్తించినట్లే లేదు. తమ జీవితాలలో 'రక్షణ' అన్న గుణం క్షణక్షణానికి ప్రాణం పోసుకుంటుందన్న బాధ కన్పించలేదా అమ్మాయిలో. తాను బళ్లకు వెళ్లి పెద్దగా చదువుకొని ఏదో అయిపో వచ్చునే, అట్లా కాకపోతినే అన్న దిగులు కన్పించదా అమ్మాయిలో.

ఆడపిల్ల ఆడదిగా అయ్యే వయసున అట్లా రోడ్డు మీద కూచుని ఎందరో మగవారి ఎన్ని రకాల చూపులకో ఎర అవుతూ, వయసు తనలో తెచ్చే మార్పుల్ని గుర్తించి అందు నిమిత్తం మనసులో కల్పించుకోవలసిన వరదాల విషయమే తెలియకుండా మసలుతూ, ఎంతమంది ఎక్కువగా తమ దుకాణము నుండి పండ్లను కొంటే తమకంత మంచిదన్న ఒక నిజమే వూపిరిగా బ్రతుకుతూ, చందమామను చూచిన పాపాయి మొహాన ఉదయించే చిరునవ్వును నవ్వుతూ, నలుగురిచే 'మంచి' గుర్తింపబడి ఆకాశాని కెత్తబడిన క్షణాన సిగ్గుతో ఒకవిధమైన జన్మసాఫల్య భావంతో మంచి మనిషి విస్సే చిరునవ్వును నవ్వుతూ ఉండేది ఆ అమ్మాయి.

ఎల్లప్పుడూ ఆ చిరునవ్వుతో, ఆ వెలుతురుతో ఆ చైతన్యంతో ఉండే ఆ గుణం ఆకర్షించింది ముకుందాన్ని కాని, మాటలు జడిసే సరిహద్దు ఇది. పదాలు బెదిరే ప్రాంతమిది. అందుకనే ఎవరన్నా గమక ముకుందాన్ని నిలవేసి "'ఆ అమ్మాయిపట్ల ఏమిటి నీ మోజు'!—అని అడిగితే అతడు తెల్లమొహం వేయక తప్పదు. ఒకవేళ ఏట్లాగో అతడు ఈ భావాలను పదాలలో బంధించి అందించినా విన్నవారు నవ్వుతారు. తప్పక పిచ్చికోసం వెతుకుతారు కాని అదృష్టవశాత్తు అతడి నెవరూ అడగాలేదు. అతడూ చెప్పాలేదు.

సాధ్యమయినంతవరకు ముకుందం ఆ బస్ స్టాప్ వద్ద దిగి ఏదో పండ్లను కొనేవాడు. ఆ అమ్మాయిని వాళ్ల నాన్నను పలకరించేవాడు. వాళ్ల నాన్న దగ్గు కేవేవో హోమియోపతి మందులను సూచించేవాడు. వాళ్లకూ, అతడికీ మధ్య ఒక వింత బాంధవ్యం అల్లుకుంది.

రోజూ రాత్రిపూట హోటలువాడు భోజనం అంటూ పెట్టే గడ్డి తర్వాత పండ్లను తాను తిని కొన్ని రూంమేటు రఘుపతి కిచ్చేవాడు ముకుందం.

అట్లాంటిది తాను ఈనాడు బస్సు దిగకుండానే, ఆ దుకాణాన్ని అర నిముషమన్నా చూడకుండానే మొట్టమొదటి రోజునుండి నేటిదాకా పెరుగుతూ వచ్చిన బాంధవ్యాన్ని అతడు సమీక్షించగలిగితే—అందులో వింత ఏమీ లేదు !

ఇంకో రెండు వారాల తర్వాత దసరా సెలవులు వచ్చాయి ముకుందం తన వూరికి బయలుదేరాడు. వెళ్తూ వెళ్తూ పది హేను రూపాయలకు బుట్టనిండా పండ్లు కొని తీసుకు వెళ్లాడు.

సెలవు లయింతర్వాత ఒక ఆదివారంనాడు మళ్లీ ఢిల్లీలో దిగాడు.

ఆ సాయంకాలమే హోటలునుండి బయలుదేరాడు. తిన్నగా నడుచుకుంటూ వెళ్లాడు ఆ పండ్ల దుకాణానికి.

"రండి బాబూ రండి ! చాలారోజులు కనపడలేదు."

"అవును, మా వూరికి వెళ్లాను. ఇవాళే వచ్చాను."

"మీ వూళ్లో గోధుమలు బాగా దొరుకుతున్నాయా బాబూ ?" అని అడిగాడు ముసలివాడు.

"ఆ .... గోధుమలకేం, బాగానే దొరుకుతున్నాయి. కాని మేము తినేది బియ్యం కదూ, దానికే కాస్త యిబ్బందిగా ఉంది." అన్నాడు ముకుందం నవ్వుతూ.

"మరే, ఏది కావాలో అదే దొరకదు బాబూ!"

ఈ సంభాషణ జరిగినంతసేపూ ఆ అమ్మాయిని కళ్ళతో వెతికిన ముకుందం, ఇక ఉండబట్టలేక ముసలాడి (ప్రక్కన ఉన్న చిన్న కుర్రవాడిని చూపించి అడిగాడు" వీడి అక్కయ్య ఏమయిందీ? దుకాణంమీద లేదే, ఒంటో బాగులేదా?" అన్నాడు, వీలయినంతవరకూ 'ఆ! ఆ! అమ్మాయి ఏమయితే వాకేంలే'—అన్న ధ్వని స్ఫురించేటట్లు.

"బాబూ—ఆడపిల్ల ఏనాడయినా ఇంకొకరి ఇంటి సొత్తే కదా? ఈమధ్యనే ఒక సంబంధం వస్తే పెళ్లిచేసి అత్తారింటికి పంపేశాను .... మరి తమకు ఒక డజను అరటి పళ్లిమ్మంటారా లేక ఆపిల్సు ఇమ్మన్నారా?"

"ఆ! ఆ!" అన్నాడు పండ్ల విషయం చెవి కెక్కని ముకుందం.

ఆ ముసలివా డిచ్చిన ఏవో పండ్లను తీసుకుని అతడి చేతికి ఏదో నోటు ఇచ్చి, అతడు వెనక్కిచ్చిన చిల్లర తీసుకుని—మనసులోనూ, మహా నగరంలోనూ చీకటి అలముకుంటుండగా తన గది చేరాడు ముకుందం.

ముచ్చటగా పెరుగుతూ వచ్చి మొగ్గ తొడిగిన మొక్కనెవరో పీకివేసినట్లయింది.

ఆ రాత్రి రఘుపతి ఆశ్చర్యపోయాడు." అయినా ఒక్క డజను అరటిపండ్లు ఎందుకు తెచ్చావోయ్?"

"ఆ?" అన్నాడు ముకుందం.

"కొంపతీసి పెళ్లిచూపుల్లో ఏమన్నా పాల్గొన్నావేమిటి ఈ సీజన్లో—:'

తల ఆడించాడు ముకుందం.

"చచ్చాం ఫో! .... వాయర్‌గాడికి ఒక ఖాతాదారు నష్టం! పూర్ బర్డ్!!" అని రఘు రెం డరటిపళ్లు ఆరగించి ముకుందాని కొకటి ఇచ్చాడు. అతడు వద్దన్నాడు.

రఘుపతి వెళ్లిపోయాడు.

ముకుందం లేచి హోటల్ డాబామీదికి వెళ్లి నిల్చున్నాడు. దూరంగా ఎత్తుగా ఎర్రగా వెలుగుతున్నాయి ఏదో రేడియో కంపెనీ పేరును పలుకుతున్న దీపాలు. క్రిందుగా వీధిలో—కారుల రొద. ఆకాశంనిండా నక్షత్రాలు. పల్చటి మంచుతెర. చీకటి. దీపాలు. జంకుతున్న చంద్రుడు. జాత్రమాత్రం కన్పడుతున్న మనుష్యులు.

"ఆ అమ్మాయి మొగుడు ఎవడు? ఎట్లాటివాడు?"

హుం! ఇం కెట్లాటివా డవుతాడు. డబ్బే దైవమయిన ఈ లోకంలో గుణాన్ని గుర్తించేవా డెవడు? కట్నాలకు డబ్బు ఎక్కడనుండి తెస్తాడా రోగిష్టి ముసలివాడు—ఆ అమ్మాయి జీవితం ఏ రెండోపెళ్లికో అంకితమయి ఉంటుంది. లేదా, జీవితాన్ని నవ్వుతూ జీవించగల ఆ అమ్మాయిని కొట్టో తిట్టో హింసించి ఆమె నవ్వును చంపివేయగల రాక్షసుడికి ఆమె భార్య అయిఉంటుంది. భగవాన్! అడవిలో వెన్నెల లాగున, ఎవరికీ అర్థం కాని చోట ఈ ఔన్నత్యమేం? ఇదంతా నీకు ఆట అనుకోవాలా? లేక ప్రపంచంలో నవ్వూ చైతన్యమూ 'ఎక్సెస్' అయిందనుకున్నావా?

అని గింజుకున్నాడు ముకుందం.

ఆలోచించాడు ముకుందం—

ఆ వలయంలోనే పరిభ్రమించాడు ముకుందం.

—రోజులు గడవసాగాయి.

అప్పుడప్పుడు అతడి మనసు ముందు నవ్వు మాయమయిన మొహంతో ఆ అమ్మాయి నిలిచేది. హఠాత్తుగా ఏదో తపం వచ్చి మీద పడ్డట్లుగా వణికేవాడు ముకుందం. మళ్లీ స్మృతుల సుడిగుండాలలో పడి ఈదసాగేవాడు.

ఎందుకో ఒకనాడు అన్పించింది.

ఆ అమ్మాయి! ఆ అమ్మాయిని తాను పెళ్లిచేసుకుని ఉంటే? తనకే ఆ ధైర్యం ఉండి ఉంటే?

మరి, మరి .... అయితే మరి తనెప్పుడూ ఆ అమ్మాయిని అసలా దృక్పథంతో చూడందే—

అదీ, అది కాదు విషయం. తన ఊహా కోక అలౌకికానందమిచ్చే ఆ అపురూపమయిన వస్తువు ఒకనాడు అదృశ్యమయిపోతుందని తాను అనుకోలేదు.

ఆమెలోని ఆ మెరుపుని, చిరునవ్వుని గుర్తించి దానిని తన ప్రాణంగా పోషించి, అమూల్యమైన వస్తువుగా గుండెల్లో దాచుకుని, ఆ సుగంధాన్ని ప్రపంచమంతటా పరిమళం పంచగల పారిజాత వృక్షంగా చేసి, ఆ తీగ పలికే తియ్యటి పలుకు నొక మధుర రాగంలా దిగంతాలకు ఆలపించి, ఆ చిన్న ప్రమిదను ఆకాశానికి అందమిచ్చే వెలుతురుగా చేసి, ఆ ఆరాధ్య దైవానికి తానొక అర్చకుడయి ఎంత ధన్యత పొందిఉండేవాడు తను!

ఆమె వంటిది ఆమె ఒక్కతే. ఆమెను చదవగల్గినది తా నొక్కడే! కాని అదను దాటిపోయింది.

తనకా ధైర్యం లేకపోయింది.

ధైర్య మేమిటి—వివాహం అన్న అవకాశాన్ని మరిచేపోయా డతను.

ఇపుడు సమయం ఎగిరిపోయింది.

వజ్రం బూడిద కడుగున పడిపోయింది.

సుకుమారమైన కుసుమం బాటమీద రాలింది.

ముచ్చటగా ఎగరగల పావురాయి ఏదో పంజరంలో ఇరుక్కుంది.

ఇంతటి దారుణం జరగకుండా అడ్డుపడ గల్గినవాడు తాను. వజ్రాన్ని బంగారంలో పొదిగి, కుసుమాన్ని శిరస్సున దాల్చి, పావురాయిని ఆకసంలో ఎగరనిచ్చి—ఆనందాన్నిచ్చి పుచ్చుకోగలిగిన వ్యక్తి తాను.

కాని ఏం లాభం ? శాపగ్రస్థుడైన దుష్యంతుడిలా ఉండిపోయాడు తను.

శకుంతలా వెళ్లిపోయింది ఆమె. ఎక్కడికో ?

—అన్పించేది ముకుందానికి ....

ఈ లోపుగా వేసవి వచ్చింది.

పరీక్ష లనబడే బరువయిన రోజులు వెళ్లిపోయాయి.

ఉత్సాహంతో తమ తమ సెలవులకు బయల్దేరారు విద్యార్థి జనం.

ఆటే జనం రావడంలేదని 21 వ నెంబరు బస్సు కాస్త నొచ్చుకుంది.

ఊరికి రైలెక్కిపోయే ముందురోజు రాత్రి ఒక హిందీ సినిమాకు వెళ్లాడు ముకుందం.

ఈ రోజులలో ఆడపిల్లల జడ ముడులవలె, మొహెంజదారో శిథిలాలమీద లిపి వలె—అదోకలా ఉండింది ఆ సినిమా.

కాని, ఇటువంటి సినిమాలో కూడా, తెరమీద పాట వస్తే కూడా గొంతు కలిపి, ఆట వస్తే ఆనందించి, హాస్యం వస్తే చప్పట్లు కొట్టి, కథానాయకి కన్నీళ్లు పెడితే బాధ పడి—ఇట్లా క్షణక్షణమూ ఆ సినిమాను సంతృప్తితో సంపూర్ణంగా అనుభవిస్తూ తన ముందు కూర్చున్న దంపతులు కొంత చిరాకు కలిగించారు. ముకుందానికి.

'అసలే చెత్త ఫిల్మ—అందులో వాళ్ల దొక పిడకల వేటా !—' అనుకొన్నాడు ముకుందం.

ఇంటర్వెల్ కొక ఐదు నిముషాల ముందుగా బయటికి నడిచాడు.

మళ్లీ జనమంతా లోపలికి ఎగబడడానికి ముందరే లోపలికి వచ్చాడు. తన కుర్చీలో కూర్చోబోతూ ముందు వరుసలోని దంపతులను పరీక్షగా చూశాడు.

ఆమె !!


ఆమె, ఆ పండ్లమ్మిన అమ్మాయి ! ఆమె ప్రక్కన పొతికేళ్ల యువకుడు, బాగానే ఉన్నాడు. బట్టలు చూస్తే ఏదో గుమాస్తాలా ఉన్నాడు. మొగుడు కాబోలు !


దీపాలు ఆరాయి.

ముకుందం లేచి గబగబా సినిమాహాలు విడిచి బయటికి వచ్చాడు.

లోపల సినిమాలో ఘోరుమంటూ మొదలయింది. ఒక యుగళగీతం.

ముకుందం హొటలువైపు నడవసాగాడు—ఒంటరిగా.





దివాకర సిద్ధాంతము

శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు

షడ్బలానంతర ఫల నిర్ణయ విధానము గణిత పద్ధతి క్రమమున ఈ వ్యాసమందు శ్రీపతి, శ్రీధరుడు, కేశవుడు, దివాకర దైవజ్ఞులచే చెప్పబడిన ఇతి ననుసరించి పాఠకులకు విశదీకరించి ఇంతటితో ప్రస్తుతము వ్రాయుచున్న వ్యాసములను నిలుపుచున్నాను. గత 12 మాసములనుండి నా వ్యాసముల ప్రచురించిన భారతి సంపాదకులకు నా కృతజ్ఞత దెలుపుచున్నాను. జ్యోతిష శాస్త్ర రహస్యము లనేకము లున్నవి. ఋషి ప్రోక్తమగు పురాతన గ్రంథములు ఎల్లరకూ అందుబాటులోలేవు. సామాన్య గ్రంథములు, కొన్ని ముఖ్య గ్రంథములు మాత్రము దొరుకుచున్నవి. వీలైనంతవరకు పురాతన గ్రంథములందలి రహస్య విషయముల ప్రచురించినాను. ఇందలి తప్పుల మన్నించి, ఒప్పుల నాదరించిన పాఠక మహాశయులకు కూడ కృతజ్ఞత దెల్పుచున్నాను.

నవంబరు 1964 భారతిలో షడ్బలానంతరము వ్యాసమందు ప్రచురించిన జాతకమును ఉదాహరణ జాతకముగా ఈ వ్యాసమందు తీసికొని ఫల నిర్ణయ విధానక్రమము దెలుపుచున్నాను.

శని	కుజ	రాహు	
చంద్ర శుక్ర	రాశి		
రవి బుధ			
లగ్నము	కేతు		గురు

	లగ్నము కుజ రాహు		బుధ
చంద్ర శని	నవాంశ		గురు
రవి			
శుక్ర		కేతు	

గ్రహముల షడ్బలములు రూపములలో

రవి—5.53, చంద్ర—7.31, కుజ—10.03 బుధ—6.75, గురు—5.35, శుక్ర—6.53. శని—6.92.

గ్రహముల ఇష్ట కష్ట బలములు:—

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
ఇష్ట	0.24	0.37	0.24	0.43	0.19	0.71	0.04
కష్ట	0.68	0.57	0.17	0.53	0.63	0.25	0.92

ఉచ్ఛరశ్మి

రవి—3.70, చంద్ర—4.48, కుజ— 4.86 బుధ—2.86, గురు—4.46, శుక్ర—5.62, శని—1.87.

జేష్టరశ్మి

రవి—1.79, చంద్ర—2.48, కుజ — 6.47, బుధ—4.50, గురు—1.48, శుక్ర—5.25, శని—1.06.

స్ఫుట ఇష్ట కష్ట బలములు—

వివిధ గ్రహముల షడ్బలములను వాని ఇష్ట కష్ట బలము లచే హెచ్చించిన ప్రాప్తించును.

రవి షడ్బలము 5.53 ఇష్టఫలము 0.24 రూపములు.

స్ఫుట ఇష్ట బలము — 5.53 × 0.24 = 1.32

స్ఫుట కష్ట బలము — 5.53 × 0.68 = 3.76

పై క్రమమున సప్త గ్రహములకు స్ఫుట ఇష్ట కష్ట బలములు.

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
ఇష్ట బలము	1.32	2.70	2.41	2.90	1.02	4.63	0.28
కష్ట బలము	3.76	4.16	1.70	3.58	3.37	1.63	6.37

ఉదాహరణ జాతకమందు సప్త వర్గజ గ్రహస్థితి:—

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	శని-సమ	శని-మిత్ర	స్వ	శని—మిత్ర	బుధ—అ.శ	శని—అ.మి	గురు—శత్రు
హోర	చంద్ర-అ.మి	చంద్ర—స్వ	రవి—అ.మి	రవి—సమ	రవి—సమ	రవి—సమ	రవి—సమ
ద్రేక్కాణము	శని—సమ	బుధ—అ.మి	స్వ	శుక్ర—అ.మి	శుక్ర—అశ	శని—అమి	కుజ—సమ
సప్తాంశ	చంద్ర—అ.మి	శుక్ర—శత్రు	స్వ	కుజ—మిత్ర	రవి—సమ	గురు—శత్రు	స్వ
నవాంశ	శని-సమ	శని—మిత్ర	స్వ	స్వ	చంద్ర—సమ	గురు—శత్రు	స్వ
ద్వాదశాంశ	శని—సమ	రవి—అ.మి	శుక్ర—మిత్ర	రవి—సమ	శుక్ర—అశ	కుజ—మిత్ర	గురు—శత్రు
త్రింశాంశ	కుజ—అ.మి	గురు—శత్రు	స్వ	గురు—శత్రు	శని—శత్రు	శని—అమి	స్వ

అ.మి—అధిమిత్రుడు, మిత్ర—మిత్రుడు, సమ—సముడు, శత్రు—శత్రువు, అ.శ—అధిశత్రువు, స్వ—స్వక్షేత్రము

గ్రహములకు వివిధ వర్గములందు ప్రాప్తించు శుభాశుభ బలములు :—

రాశియందు మాత్రము	శుభ బలము	అశుభ బలము
ఉచ్ఛ	1.00	0.00
మూలత్రికోణము	0.75	0.25
స్వక్షేత్రము	0.50	0.50
అధిమిత్రక్షేత్రము	0.375	0.625
మిత్రక్షేత్రము	0.25	0.75
సమక్షేత్రము	0.125	0.875
శత్రుక్షేత్రము	0.0625	0.975
అధిశత్రుక్షేత్రము	0.03125	0.96875
నీచక్షేత్రము	0.00	1.00

ఉదాహరణ జాతకమునకు పై క్రమమున సప్తవర్గము లందు ప్రాప్తించు శుభాశుభ బలములు :—హోర, ద్రేక్కాణ, సప్తాంశ, నవాంశ, ద్వాదశాంశ, త్రింశాంశలందు రాశి బలములకు సగముండును.

రవి రాశియందు సమక్షేత్రమందున్నందున శుభ బలము 0.125, అశుభ బలము—0.875. హోర యందు అధిమిత్ర క్షేత్రవర్తి గాన ఇచట ప్రాప్తించు బలమును సగము చేయగా 0.375/2=0.187 శుభ బలము, 0.625/2=0.313 పాప బలము ప్రాప్తించినవి. ఇట్లే త్రింశాంశ వరకు బలనిర్ణయము చేయగా సప్త గ్రహములకు:—

		రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	శుభ	0.125	0.25	0.75	0.25	0.031	0.375	0.125
	అశుభ	0.875	0.75	0.25	0.75	0.968	0.625	0.875
హోర	శుభ	0.187	0.25	0.187	0.062	0.062	0.062	0.062
	అశుభ	0.313	0.25	0.313	0.438	0.438	0.438	0.438
ద్రేక్కాణ	శుభ	0.062	0.187	0.25	0.187	0.015	0.187	0.062
	అశుభ	0.438	0.312	0.25	0.312	0.485	0.312	0.438

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
సప్తాంశ– శుభ	0.187	0.031	0.25	0.125	0.062	0.031	0.25
అశుభ	0.312	0.469	0.25	0.375	0.438	0.469	0.25
నవాంశ – శుభ	0.062	0.125	0.25	0.25	0.062	0.031	0.25
అశుభ	0.438	0.375	0.25	0.25	0.438	0.469	0.25
ద్వాదశాంశ శుభ	0.062	0.187	0.125	0.062	0.015	0.125	0.031
అశుభ	0.438	0.312	0.375	0.438	0.485	0.375	0.469
త్రింశాంశ–శుభ	0.187	0.031	0.25	0.031	0.031	0.187	0.25
అశుభ	0.313	0.469	0.25	0.469	0.469	0.313	0.25
మొత్తము–శుభ	0.872	1.061	2.082	0.967	0.278	0.998	1.030
అశుభ	3.124	2.937	1.938	3.032	3.321	3.001	2.971

శుభపంక్తి - అశుభపంక్తి

గ్రహములకు సప్త వర్గములందు ప్రాప్తించిన శుభాశుభ బలములను 4 చే భాగింపగా శుభాశుభ పంక్తు లేర్పడును. రాశి యందు ప్రాప్తించిన బలమునకు సగము ఇతర వర్గములందు ప్రాప్తించును.

ఉదాహరణ జాతకమందు రవికి 0.872 శుభఫలము, 3.124 అశుభఫలము ప్రాప్తించినది. దీనిని 4 చే భాగింపగా రాశియందు 0.218 శుభ బలము, 0.781 అశుభ బలము ఏర్పడినది. ఇతర షడ్వర్గులందు అందు సగము 0.109 శుభ బలము, 0.390 అశుభ బలము ఏర్పడును.

0.218 అశుభపంక్తి 0.781. ఇతర వర్గులందు శుభపంక్తి 0.109, అశుభపంక్తి 0.390 అయినవి. గాన రవి శుభ మధ్యమ బలము 1.030 × 0.218 (సప్తవర్గజ శుభ బల × శుభ పంక్తి) = 0.225. అశుభ మధ్య బలము 2.971 × 0.781 = 2.320. ఇవి రాశియందు ప్రాప్తించిన బలములు. పై విధమున శని వర్గులగు ద్రేక్కాణ, నవాంశ, ద్వాదశాంశములందు 1.030 × 0.109 = 0.112 శుభ మధ్యమ బలమును, 2.971 × 0.39 = 1.158 అశుభ మధ్యమ బలము ప్రాప్తించినవి. రవి చంద్రహోర యందున్నాడు. గాన ఈతనికి హోర యందు ప్రాప్తించు శుభాశుభ మధ్యమ బలములు 1.061 × 0.109 = 0.116, 2.937 × 0.390 = 1.145 అగు

శుభపంక్తి

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	0.218	0.265	0.520	0.242	0.069	0.249	0.257
హోర	0.109	0.132	0.260	0.121	0.034	0.124	0.128
ద్రేక్కాణము	"	"	"	"	"	"	"
సప్తాంశ	"	"	"	"	"	"	"
నవాంశ	"	"	"	"	"	"	"
ద్వాదశాంశ	"	"	"	"	"	"	"
త్రింశాంశ	"	"	"	"	"	"	"

అశుభపంక్తి

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	0.781	0.734	0.484	0.758	0.830	0.750	0.743
ఇతర వర్గులు	0.390	0.367	0.242	0.379	0.415	0.375	0.371

రవి రాశియందు శని క్షేత్రమందున్నాడు. ద్రేక్కాణ, నవాంశ, ద్వాదశాంశలందు కూడ శని క్షేత్రగతుడై వాడు. శ. శనికి సప్తవర్గజ శుభాశుభ బలములు పై క్రమమున 1.030, 2.971 అయినవి. రవికి రాశియందు శుభపంక్తి చున్నవి. సప్తాంశయందు చంద్రు నింట నున్నందున హోర యందలి బలములు ప్రాప్తించును.

త్రింశాంశయందు కుజక్షేత్రమందున్నందున శుభాశుభ మధ్యమ బలములు క్రమముగా 2.082 × 0.109 = 0.227,

$1.938 \times 0.390 = 0.756$ ప్రాప్తించినవి. ఈవిధముగా సప్తగ్రహములకు ప్రాప్తించు శుభాశుభ మధ్యమ బల నిర్ణయము ఈ క్రింది విధమున నున్నది.

$\sqrt{3.76 \times 4.16} = 1.145$ = స్పష్ట అశుభఫలము $= 2.303$.

రవి శని ద్రేక్కాణమందున్నాడు గాన,

శుభ మధ్యమబలము

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	0.225	0.273	1.083	0.249	0.067	0.256	0.071
హోర	0.116	0.140	0.224	0.106	0.030	0.108	0.112
ద్రేక్కాణ	0.112	0.128	0.541	0.121	0.034	0.128	0.266
సప్తాంశ	0.116	0.132	0.541	0.251	0.030	0.034	0.132
నవాంశ	0.112	0.136	0.541	0.117	0.036	0.034	0.132
ద్వాదశాంశ	0.112	0.116	0.259	0.106	0.034	0.258	0.356
త్రింశాంశ	0.227	0.037	0.541	0.018	0.035	0.128	0.132
మొత్తము	1.020	0.952	3.730	0.968	0.266	0.946	1.201

అశుభ మధ్యమబలము

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	2.320	2.181	0.938	2.252	2.516	2.278	2.468
హోర	1.145	1.138	0.756	1.184	1.296	1.171	1.159
ద్రేక్కాణ	1.158	1.113	0.469	1.137	1.245	1.114	0.719
సప్తాంశ	1.145	1.101	0.469	0.734	0.804	1.245	1.102
నవాంశ	1.158	1.090	0.469	1.149	1.258	1.245	1.102
ద్వాదశాంశ	1.158	1.146	0.726	1.184	1.296	0.727	1.232
త్రింశాంశ	0.756	1.219	0.469	1.259	1.378	1.114	1.102
మొత్తము	8.840	8.988	3.996	8.899	9.793	8.894	8.884

అనంతరము గ్రహములకు స్పష్ట శుభ, స్పష్ట అశుభ త్వము నిర్ణయింపవలెను. రాశియందు రవి శని వర్గస్థుడు. వర్గీశుడు శని (రవి రాశి చక్రమందు మకరమం దున్నాడు) ఈతని స్పష్ట ఇష్ట షడ్బలముపైన సాధించిన క్రమమున 1.32 శని స్పష్ట ఇష్ట షడ్బలము 0.28. వీరి స్పష్ట కష్ట షడ్బలములు క్రమముగా 3.76, 6.37 అయినవి. గాన వీరల స్పష్ట షడ్బలముల మొత్తమునకు వర్గ మూలము సాధించి, ఆ ఫలములను స్పష్ట శుభ మధ్యమ ఫలము, స్పష్ట అశుభ మధ్యమ ఫలములచే హెచ్చింపవలెను.

రవి—రాశియందు 1.32 స్పష్ట ఇష్ట షడ్బలము $\times$ శని శని స్పష్ట ఇష్ట షడ్బలము 0.28 ల మొత్తమునకు వర్గమూలమగు 0.60 ను 0.225 చే హెచ్చింపవలెను.

$\sqrt{1.32 \times 0.28} = 0.60 \times 0.225 = 0.135.$

స్పష్ట అశుభ ఫలము $= \sqrt{3.76 \times 6.37} = 4.89 \times 2.32 = 11.345.$

హోరయందు చంద్ర గ్రహమం దున్నాడు గాన,

$\sqrt{1.32 \times 2.70} = 0.116$ = స్పష్ట శుభఫలము $= 0.218$.

$\sqrt{1.32 \times 0.28} = 0.112$ స్పష్ట శుభఫలము $= 0.07$.

$\sqrt{3.76 \times 6.37} = 1.158$ స్పష్ట అశుభఫలము $= 5.67$.

రవి చంద్ర సప్తాంశయం దున్నాడు గాన,

స్పష్ట శుభ ఫలము = 0.218

స్పష్ట అశుభ ఫలము = 2.303.

రవి శని నవాంశ యందున్నందున ద్రేక్కాణ ఫలములు వర్తించును.

స్పష్ట శుభ ఫలము—0.07.

స్పష్ట అశుభ ఫలము—-5.67.

రవి శని ద్వాదశాంశ యందున్నందున ద్రేక్కాణ ఫలము వర్తించును.

స్పష్ట శుభఫలము—0.07.

స్పష్ట అశుభ ఫలము—5.67.

రవి కుజ త్రింశాంశయం దున్నాడు గాన,

$\sqrt{1.32 \times 2.4} = 0.227$ = స్పష్ట శుభ ఫలము $= 0.41$.

$\sqrt{3.76 \times 1.70} = 0.756$ = స్పష్ట అశుభఫలము = 1.94.

ఈ క్రమమున సప్త గ్రహములకు ఫలముల సాధింపగా ఈ క్రింది క్రమమునున్నవి—

బుధ × శని	0.90	4.87
బుధ × రవి	1.95	3.66
బుధ × శుక్ర	3.66	2.41
బుధ × కుజ	2.64	2.46

స్పష్ట శుభఫలము

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	0.13	0.23	2.60	0.22	0.11	0.28	0.03
హోరా	0.21	0.38	0.39	0.19	0.03	0.25	0.06
ద్రేక్కాణము	0.07	0.36	1.30	0.44	0.06	0.14	0.15
సప్తాంశ	0.22	0.46	1.30	0.66	0.03	0.07	0.01
నవాంశ	0.07	0.12	1.30	0.35	0.02	0.07	0.01
ద్వాదశాంశ	0.07	0.23	1.30	0.19	0.07	0.83	0.48
త్రింశాంశ	0.41	0.02	0.87	0.03	0.01	0.14	0.01
మొత్తం	1.19	1.50	9.06	2.08	0.33	1.78	0.75

స్పష్ట అశుభ ఫలము

	రవి	చంద్ర	కుజ	బుధ	గురు	శుక్ర	శని
రాశి	11.34	3.69	1.59	10.95	8.70	7.15	11.43
హోరా	2.30	0.58	0.60	4.16	4.59	2.88	5.62
ద్రేక్కాణము	5.67	4.27	0.61	0.34	2.90	3.57	2.33
సప్తాంశ	2.30	2.86	0.61	1.79	0.28	2.90	6.99
నవాంశ	5.67	1.84	0.61	4.12	4.67	2.90	6.99
ద్వాదశాంశ	5.67	4.52	0.61	4.16	3.02	1.19	15.67
త్రిశాంశ	1.94	4.56	1.26	4.37	6.37	3.57	6.99
మొత్తము	34.89	22.31	5.89	29.69	30.53	26.16	55.62

ఈ జాతకునకు గ్రహస్థితి ననుసరించి వర్గేశ, వర్గస్థ గ్రహముల వలన ప్రాప్తించు శుభాశుభ ఫలములు. ఇవి స్పష్ట శుభాశుభ ఫలముల సాధించుటకు ముందు ప్రాప్తించిన వర్గమూల ఫలములు.

గ్రహములు	శుష్ట	కష్ట
రవి × శని	0.60	4.89
రవి × చంద్ర	1.89	3.95
రవి × కుజ	1.78	2.54
చంద్ర × శని	0.86	1.69
చంద్ర × బుధ	2.80	3.85
చంద్ర × శుక్ర	3.53	2.60
చంద్ర × గురు	0.52	3.74
కుజ × శుక్ర	3.34	1.66
బుధ × గురు	1.72	3.47
గురు × రవి	1.16	3.56
గురు × శుక్ర	2.17	2.34
గురు × శని	0.47	4.65
శుక్ర × శని	1.14	3.22
శుక్ర × రవి	2.47	2.47
శని × కుజ	0.68	3.29

గ్రహములకు సంబంధించిన శుభాశుభ బలముల ననుసరించి వా రివ్వగల ఫలములు ఆయా దశాంతర్దశలలో వారికి అధిపత్య సంబంధములు గల భావములను నన్వయింపవలెను.

పై జెప్పబడిన గణిత భాగము సాధించుట కష్టమనుట గ్రహించిన కేశవాచార్యులు వేరొక మార్గమున సులభ పద్ధతి జెప్పియున్నాడు. దాని క్రమ మెట్లనిన :—

గ్రహములు	మిత్ర లేక అధిమిత్ర వర్గములందున్న	1 శుభ బిందువు బలము ప్రాప్తించును
,,	శత్రు లేక అధి శత్రు ,,	1 అశుభ బిందువు బలము ప్రాప్తించును
,,	మూల త్రికోణ లేక స్వక్షేత్రములందున్న	2 శుభ బిందువులు
,,	సౌమ్య గ్రహరాసులందున్న	1 శుభ బిందువు
,,	క్రూరగ్రహ రాసులందున్న	1 అశుభ బిందువు
,,	ఉచ్ఛ లేక యుద్ధమందు జయమొందిన	4 శుభ బిందువులు
,,	నీచ లేక యుద్ధ పరాజయము లేకఅస్తంగత్వము నొందిన	4 అశుభ బిందువులు
,,	సమ రాసులందున్న శుభాశుభత్వములు సమానములు.	

ఈ క్రమమున ఉదాహరణ జాతకమునకు :—

హిత / అహిత	రవి హిత	రవి అహిత	చంద్ర హిత	చంద్ర అహిత	కుజ హిత	కుజ అహిత	బుధ హిత	బుధ అహిత	గురు హిత	గురు అహిత	శుక్ర హిత	శుక్ర అహిత	శని హిత	శని హితఅ
రాశి	—	1	1	1	2	1	1	1	1	1	1	1	1	1
హోరా	1	1	2	—	1	1	—	1	—	1	—	1	—	1
ద్రేక్కాణ	—	1	2	—	2	1	1	1	1	1	1	1	—	1
సప్తాంశ	1	1	1	1	2	1	1	1	—	1	1	1	2	1
నవాంశ	—	1	1	1	2	1	2	—	1	1	1	1	2	1
ద్వాదశాంశ	—	1	1	1	1	1	—	1	1	1	1	1	1	1
త్రిశాంశ	1	1	1	1	2	1	1	1	—	2	1	1	2	1
ఉచ్ఛ	—	—	—	—	—	—	—	—	2	—	—	—	—	—
నీచ	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—
అస్తంగత	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—
యుద్ధ జయ	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—
యుద్ధ పరాజయ	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—	—
మొత్తము	3—	7	9—	5	12—	7	6—	6	6—	8	6—	7	8—	7
సాముదాయక		—4		+4		+5		0		—2		—1		+1

ఈ క్రమమున ఈ జాతకునకు చంద్ర, కుజ, శనులు శుభులు. రవి ఎక్కువ పాప ఫలములను అంతకంటె తక్కువగా గురు, శుక్రులు ఇవ్వగలరు. బుధుని వలన ప్రాప్తించు శుభాశుభ ఫలములు సమానము.

ఇంతవరకు గ్రహములచే ప్రాప్తించు శుభాశుభ ఫలముల చెప్పియున్నాను. ఈ క్రమమున ద్వాదశ భావములకు ఆయా గ్రహసంబంధములచే ప్రాప్తించు ఫలముల గణిత విధానమున (పై క్రమమున) పట్టిక తయారుచేసిన, శాస్త్ర రీత్యా ఏఏ భావములకు ఎంతవరకు నవగ్రహములు తమ ఆధిపత్య స్థితి సంబంధములచే శుభాశుభ ఫలముల నీయగలవో తెలియ నగును. గణిత విధానమున ఇంతకు మించిన సాధన క్రమము లేదు. గాన ఈ పద్ధతి ననుసరించి ఫలముల క్రమముగా నెరుగనగును.

ఉదాహరణ జాతకమందు కొన్ని భావముల వివరములు:

ఆయుర్భావము—భావ బలము	= 7.58
(చంద్ర) భావాధిపతికి షడ్బలమందు	= 7.31
(శని) భావకారకుని షడ్బలము	= 6.92
మొత్తం	21.81

భావమందు గ్రహములులేవు. భావకారకుని + భావాధిపతి శుభ మధ్యమ బలము

కారకుడు శని 1.20 + 0.90 భావాధిపతి చంద్రుడు = 2.15.

భావమునకు కుజపాప వీక్షణ యున్నందున కుజుడు $\frac{3}{4}$ పాపిగాన ఈతని శుభ మధ్యమ బలమందు $\frac{3}{4}$ వంతు అనగా

$3.73 \times \frac{3}{4} = 2.79$ తీసివేయగా—0.64 ప్రాప్తించినది. ఇందులకు లగ్నాధిపతి పూర్ణ శుభుడైనందున ఈతని శుభ మధ్యమ బలమును 0.27 ను 4 చే హెచ్చింపవలెను.

$= 1.08$ గనుక $1.08 - 0.64 = 0.44$ శుభఫలము ప్రాప్తించినది.

$\therefore 21.81 \times 0.44 = \sqrt{9.59} = 3.09$ ఇందులకు లగ్నాధిపతికి ప్రాప్తించిన స్పష్ట శుభఫలము చేర్చగా $3.09 + 0.33 = 3.42$ బలము ప్రాప్తించినది. ఆయుఃకారకుడగు శనికి 5 రూపముల బలము ప్రాప్తించిన పూర్ణాయువు ప్రాప్తించును. త్రైరాసికమున 3.32 రూపములు బలము ప్రాప్తించిన పూర్ణాయుర్దాయవంతుడగును. గాన ఈ జాతకుడు 64 సంవత్సరములకుపైగా ఆయుర్దాయవంతుడగును.

అనగా $\frac{64 \times 10}{100} = 6.4 = 6$. సంవత్సరముల 4 నెలల 24 రోజులు.

వెరశి 70 సంవత్సరముల 4 నెలల 24 రోజుల ఆయురాయము గలవాడు.

మోక్షభావము	భావబలము	— 9.68
	భావాధిపతి బలము	—10.03
భావ కారకుడు	కేతువు కుజ సమానుడు	—10.03
	మొత్తం	29.74

భావమందు కేతు వున్నందున ఈతని శుభ మధ్యమ

బలము కుజ సమానము గాన	3.73
భావాధిపతి బలము	3.73
	7.46
భావమునకు కుజ పాప వీక్షణ యున్నందున	— 2.79
	4.67
లగ్నాధిపతి పూర్ణ శుభుడైనందున ఈతని శుభ మధ్యమ బలము × 4	1.08
	5.75

$\therefore \sqrt{29.74 \times 5.75} = \sqrt{171.00} = 13.0$

లగ్నాధిపతికి ప్రాప్తించిన స్పష్ట శుభఫలము చేర్చగా $13.00 + 0.33 = 13.33$ బలము ప్రాప్తించినది. గాన ఈ భావము అధిక బలయుతమైనది. ద్వాదశ భావము వ్యయమును గూడ సూచించును గాన ఈ జాతకుడు అధిక వ్యయము చేయువాడనుట సందేహములేదు. ఈ జాతకుని గూర్చి పరాశర హోరయందు :—

లగ్నపోయిస్మిన్ కాలే కర్మేవ్యవస్థితేపతి
రాత్రిస్తు కారికీప్రోక్తం చాపలగ్నేతు చింతనం
రంధ్రాధిప షష్ఠాధిపానాం తృతీయే కుంభకేయుతి
మోక్షే కేతు అలంకృతంతు షష్ఠేసర్పిస్తు లక్షణం
పంచమపో పంచమేవిద్ధి జీవాత్ అష్టమేయుతి
సౌఖ్యేమందః పూర్ణజలే జీవదృష్టి సమన్వితః

స్వక్షేత్రవాసి యుగ్రగ్రహమునకు గురుడు షష్టాష్టమములందుండుట విశేష లక్షణమని పరాశరమతము.

భాగ్యాధిప కర్మాధిపానాం ధనేవ్యవస్థితేపతి
రాహోస్తు కాలికే ప్రోక్తం శేష భాగసమన్వితః
శతభిష్ నక్షత్ర కావిద్ధి పుంజన్మని విశేషతః

ఇంతవరకు ఈజాతకుని జననకాల గ్రహసంపత్తి వివరింప బడియున్నది. ఈ గ్రహసంపుటి ప్రాప్తించినందున పరాశరులు ఈ జాతకుని మోక్షభావమును విశదీకరించుట ముఖ్యమని చెప్పియున్నారు. "ద్వాదశీ భావకే విద్ధి విస్తృత వ్యంతు అర్థతః."

"దైవికాస్పద లక్షణానాం నానా విదేషు చింతనం పూర్వ వాసనహో విద్ధి కేతుకారక లక్షణాత్, వంశాచార రతోవిద్ధి విస్పంశ మేన కధ్యతే. బుద్ధిః తీక్ష్ణ్య లక్షణం, పండితే పామీన్యకేయుతి, ప్రారంభం గణితలక్షణాః, విశేషకం దైవజ్ఞాయ అనుగ్రహం తు అర్థతం, గణితే పుష్టి యోగేతు, దీర్ఘః బుద్ధి ప్రవర్తితే, దైవికాస్పద యోగత్వే త్రికాల జ్ఞాన లక్షణే, అన్య పంధానపే విద్ధి, గచ్ఛతీతి ససంశయః. వాక్ స్థానస్థ బేదస్థ, జీవదృష్టి సమన్వితా, నిజ ప్రయోగ కార్యాణి ఫలితవ్యం అద్భుతం కృతం." ఇంతవరకు వాక్‌స్థాన బుధుడు, గురు దృష్టి నొందిన ఫలముల చెప్పియున్నారు.

మోక్షభావ విషయమై "నిజోపాసన సమానం స్యాత్, అంతరేయాగ కృత్యకం, విశేషకం దృఢ మతినో, వృద్ధిమాన్ భవతి నిశ్చితం, ఆకాంక్ష్యనూరా, ఆగంతుకానాం, ఆదామ్యాన్ స్వ బుధ్య క్తి కృతం, త్రికాలజ్ఞా నైశ్వర్యం, లక్ష్మీకటాక్షమేవహి, తురీయా శ్రమ సహోవిద్ధి, మానసికేన కేతుకే, అతిదీర్ఘతరం విద్ధి, నవగ్రహస్య ప్రసాదవత్, పారోపాసన యా విద్ధి, యత్ కృతం తస్య పుణ్యకం, తత్ప్రాముఖ్యంత విద్ధిస్యాత్, జ్ఞానభాగ్యంచ లభ్యతే. దైవికాస్పద యోగత్వే, సాంబమూలేన గచ్ఛతే, సాక్షాత్ బృహస్పతినా విద్ధి, పూర్ణత్వేన అనుగ్రహం, పూర్వపుణ్య వశేనేవ,

జన్మ సాఫల్యకం యుతి. జ్ఞాన పూర్ణత్వమే వేహ, చరిత్రం తత్తలక్షణం."

పై హంశముల ననుసరించి ఈ జాతకుని మోక్ష భావ ఫలములు ఎట్లుండునో విశదమగుచున్నది. పూర్ణాయుర్దాయము ప్రాప్తించినందున ఇట్టి జ్ఞాన సాధన కనుకూలమైనదని చెప్పుటకు "ఆయుర్గ్యానే దీర్ఘత్వాత్, ఏవం అనుభవం మహత్." యని పరాశర మహర్షి చెప్పియున్నారు. "కేతు కాల ఫలం ముఖ్యం, ద్వాదశే భావనే యుతి" అన్నారు. గాన ద్వాదశమందున్న కేతు దశయందు ఈ జాతకునికి ప్రాప్తింప మన్న ఫలములు విశదమగుచున్నవి. ఈ జాతకుని నవాంశ చక్రమును పరిశీలించిన వాల్గు గ్రహములు వర్గోత్తమమునొందుట. గురుడు ఉచ్ఛ నొందుట, గురు శుక్రుల షష్టాష్టక స్థితి, మూడు గ్రహముల స్వక్షేత్ర స్థితి, లగ్నమందున్న రాహు కుజులకు శని విశేష దృష్టి (పాద స్థానమగు మూల త్రికోణమునందుండి వీక్షించుట), కర్మస్థానమునకు ఉచ్ఛ గురుని దృష్టి మొదలుగా గల విశేష లక్షణములు గాననగును. కేతువు చరరాశినుండి లగ్నమును వీక్షించుట విశేష ఫలప్రదము.

మహా యోగములు

1. సింహాసన యోగము—సోమ జాతకం—

వన సింహాసనో యోగః కన్యాళో ఉవకే జపే చాపేనరే హారే, కుంభే గ్రహైశ్చైవ పరోమతః। దంతీ తురంగయుక్తో వాకావేష్టు గుణికాంతః నృపనచివో భవత నృపః యోగే సింహాసనే జాతః॥

కన్యయందు గాని, వృశ్చికమందు గాని, వృషభమందుగాని, మీనమందు గాని, ధనస్సునందుగాని, తులయందు గాని, సింహమందు గాని, కుంభమందు గాని గ్రహములుంటే సింహాసన యోగము ప్రాప్తించును. ఇందు జనన మొందినవారు ఏనుగులు, గుర్రములు, వ్యాపార నౌకలు గలిగియుందురు. వీరు గుణరూపములు గలవారు. రాజగాని రాజమంత్రి గాని కాగలరు.

ఈ యోగమును భావ కుతూహలమందు—

కన్యా మీన వృషాళిపే యదిఖగాః సింహాసనః కీర్తితః
కింవా చాపన్య యుగ్మ కుంభ హారిభే ఖేటేహి సింహాసనః॥
యః సింహాసనయోగతో హిమనుజో భూషాధిరాజోఽబలీ
గర్జత్ కుంజరత్ వాజి రాజి మకుటారూఢో ధరామండలే॥

కన్య, మీన, వృషభ, వృశ్చిక, ధను, మిధున, కుంభ, సింహములందు గ్రహములున్న సింహాసన యోగము. ఈ యోగమందు జనన మొందినవారు మహారాజులు, బలవంతులు, ఏనుగులు, గుర్రములు, వాహన యోగము గలవారై ప్రసిద్ధ పురుషు లగుదురు.

2. చతుశ్చ్రకయోగము—సోమ జాతకము—

హారో ప్రస్త్రియా మలావాపి ఘటే, మీనే, వృషే, వరే,
గ్రహైర్లగ్నేవ యోగోయం ఛతుశ్చ్రరో భిధీయతే॥
చక్రవర్తి మహావీర్యః సర్వజ్ఞః సర్వజీవనః
ఆజ్ఞా మహోమహ తేజాః పరాక్రమీ నృపోభవేత్॥

సింహ, కన్య, వృశ్చిక, కుంభ, మీన, వృషభ, తులలందు, లగ్నమందు గ్రహములున్న చతు శ్చ్రకయోగము ప్రాప్తించును. ఇందు జనన మొందినవారు చక్రవర్తులు, బలవంతులు, సర్వజ్ఞులు, అనేకులకు ఆధారమగువారు. ఆజ్ఞాపించువారు, తేజోబల సమన్వితులు, శూరులగు రాజా లగుదురు.

దీనినే భావ కుతూహలమందు—

వృషే సింహే, కన్యా, కలశ, మిధునాంత్యాః తురగే
సమాజః ఖేటానామిహ భవతి జన్మన్యతి నరః॥
చతుశ్చ్రక యోగే సకల సుఖ భోగేన మిలితో
మహిపానామాలీ మకుటమణి పాలీ విజయతే.॥

వృషభ, కన్య, సింహ, కుంభ, మిధున, మీన వృశ్చిక, ధనస్సు, లగ్నములందు గ్రహములున్న చతుశ్చ్రకయోగము ప్రాప్తించును. ఇందు జనన మొందువారు సర్వ సుఖభోగముల ననుభవించు రాజాధిరాజు లగుదురు.

3. కనకదండ యోగము—సోమ జాతకము—

మీనే మేషే వృషేచైవ తులాయాంచ స్థితే గ్రహే
యోగః కనకదండాఖ్యో దేవానురను దుర్లభః॥

మీన మేష వృషభ తులలందు గ్రహములున్న కనకదండ యోగము ప్రాప్తించును. ఇది దేవానురులకు గూడ దుర్లభము.

4. డమరుక యోగము—సోమజాతకము

వృషేచ మిధునే చాపే కీటే డమరుకోమతః
అపరో యువతీ సింహే ఘటే మీనే ఉదాహృతః॥
జాతో డమరుకే యోగే విద్యా విఖ్యాత కీర్తిమాన్
పరోపకారీ దాతాచ వారీ హృదయ వల్లభః॥

వృషభ, మిధున, ధను, వృశ్చికములందు గ్రహములుండగా జనన మొందిన డమరుకయోగము ప్రాప్తించును లేదా కన్య సింహ, కుంభ, మీనములందు సర్వగ్రహములున్నను ఈ యోగము ప్రాప్తించును. ఇందు జనన మొందువారు విద్య, కీర్తి, పరోపకారబుద్ధి గలవారు. స్త్రీలను ఆకర్షించు వారు అగుదురు.

5. ధ్వజయోగము—సోమజాతకము—

మేషే వృషే ఝషే వాపి స్థిత స్థానే గ్రహాయది
దోషా ఛత్ర ప్రదో యోగే రాజయోగ ధ్వజోత్తమః॥
యోజాతో ధ్వజయుగే స భవతి నీచో౽పిదోలయా
యుక్తః
అన్యో భవతి సచివో నృపయో భవతి నృపోన సందేహః॥

మేష, వృషభ, మీనములందు గ్రహము లుండగా జనన మొందు వారలకు ధ్వజ యోగము ప్రాప్తించును. ఇది ఛత్రాది సత్యము యోగము గాన రాజయోగములలో ఉత్తమ మగు చున్నది. ఇందు జనన మొందువారు నీచులైనను డోలికా యోగమునొంది మంత్రి, లేక రాజపుత్రుడు, లేక రాజుకాగల డనుట నిస్సందేహము.

6. ఏకావళీయోగము—సోమజాతకము—

ఏకైక గ్రహయోగేన భవేదే కావళీ శుభా
లగ్నం వినా శుభై ర్వాపి స మతా కవ్య బిన్మతే॥
దాతా భోక్తా ప్రచుర యువతీనాం నిధీనాం విధాన
మేకావళ్యాం భవతి సచివః సర్వ రాజ్యం పృథివ్యాం॥

లగ్నేతర వాసులు ఏకగ్రహయుతములైన ఏకావళీ యోగము ప్రాప్తించును. లేదా లగ్నముని విడచి శుభ గ్రహ ములు ఒక్కొక్క రాశియం దుండుట ఏకావళీ యోగము. ఇందు జనన మొందువారు దాతలు, బహు స్త్రీ వల్లభులు, అమితమగు ధనము గలవారు, మంత్రిసమానులు, రాజ్యభోగము లనుభవింపగలరు.

ఈ యోగమును భావ కుతూహలమందు—

ఏకేకేన ఖగేన జన్మసమయే స్వైకావళీ కీర్తితో
ముక్తావిన సమస్త భూప మకుటాలంకార చూడా
మణిః॥
శజ్ఞాతోరిపు పుంజ భంజనకరీ గంధర్వ దివ్యాంగనా
బృందానంద సరోగుణ ప్రణధరో విద్యాకరో మానవః॥

జననకాలమందు ఒక్కొక్క గ్రహము ఒక్కొక్క రాశి యందున్న ఏకావళీయోగము ప్రాప్తించును. ఇందు జనన మొందువారు చక్రవర్తులు, శత్రుసంహారకులు, సుందరీ మనో హరులు, గుణవంతులు, విద్యావంతులు కాగలరు.

7. రాజహంస యోగము—సోమజాతకము

ఘటేమేషే నరే చాపే తులాయా సింహగే గ్రహే
రాజహంసో భవేద్యోగః రాజస్య స సుఖప్రదః॥

కుంభ, మేష, నర, ధను, తుల, సింహములందు గ్రహము లుండగా జననమొందు వారలకు రాజహంసయోగము ప్రాప్తిం చును. ఇట్టివారు రాజభోగముల ననుభవింతురు.

8. చతుస్సాగర యోగము—సోమజాతకము.

తులా మకర మేషేషు కర్కటేవా స్థితే గ్రహే
చతుస్సాగరయోగో యం రాజ్యదో ధనదో మతః॥
నైక వాణిజ్య కుశలః శాస్త్రజ్ఞః స్థాన తత్పరః
భూపతిః నృపతుల్యాలోచరః సాగరయోగజః॥

తుల, మకర, మేష, కర్కటములందు గ్రహము లుండగా జననమొందు వారలకు చతుస్సాగరయోగము ప్రాప్తించును. ఇట్టి జాతకులు అనేకవిధములగు వర్తక వ్యాపార కుశలులు, శాస్త్ర రహస్యముల నెరిగినవారు, జన్మభూమియందు ఆద రింప బడువారు, రాజు లేక రాజతుల్యు లగుదురు. ఈ యోగము రాజ్యప్రదమని, ధనప్రదమని ప్రసిద్ధి నొందినది.

ఈ యోగమును భావ కుతూహలమందు—

యది తులా మక రాజకుళీరభే రవిముఖాః సకలా
విలసంతి చేత్
ఇహ చతుష్కమహోదధి సంజ్ఞకః సురపతేః సమతాం
తనుతే నృణాం॥

సూర్యాది గ్రహములు తుల, మకర, మేష, కర్కటము లందుండ జననమొందు వారలకు ఈ యోగము ప్రాప్తించును. ఇట్టివారు ఇంద్రసమాను లగుదురు.

9. గృధ్రపుచ్ఛ యోగము—సోమజాతకము.

మృగే కీటే భవేత్ ఉచ్ఛః కన్యాళో వృషభే఼ ఝషే
గృధ్రపుచ్ఛో భవేద్యోగ చతుః సాగరతః శుభః॥

సింహము, వృశ్చికము, కన్య, కర్కటము, వృషభము, మీనములందు గ్రహము లుండగా జననమొందు వారలకు గృధ్రపుచ్ఛ యోగము ప్రాప్తించును. ఇది చతుస్సాగర యోగము కంటె అత్యంత ఫలప్రదము.

10. ఛిన్నపుచ్ఛయోగము—సోమజాతకము—

మృగే కర్కిణి సింహే చ చాపేవా మిథునే ఘటే
యోగానా ముత్తమో యోగో ఛిన్నపుచ్ఛో మహాఫలః॥

కర్కట, సింహ, ధను, మిథున, కుంభములందు గ్రహము లుండగా జననమొందు వారలకు ఈ యోగము ప్రాప్తించును. ఇది అన్ని యోగములలో ప్రశస్తము. బహు ఫలప్రదము.

11. ప్రచండయోగము—భావ కుతూహలము—

కులీరే కన్యా యా మనిమిష ధనుర్యుగ్మ భవనే
జనుః కాలే యస్య ప్రభవతి నభోగో రవిముఖః॥

ప్రచండ ప్రోత్తుంగ ప్రబలరిపు హంతా క్షితిపతిః
సమంతా దాధిక్యం వ్రజతి ధనదాసేవ మహతామ్.॥

కర్కాటు, కన్య, మీనము, ధనుస్సు మిథునములందే సూర్యాది గ్రహము లుండగా జననమొందు వారలకు ఈ యోగము ప్రాప్తించును. ఇట్టివారు శత్రుహంతకులు, రాజ్యాధిపతులు, ధన దానములందు పేరుగొన్నవారు. ఉత్తములు.

12. శ్రీచ్ఛత్రయోగము—భావ కుతూహలము—

ప్రసూతికాలే యది సర్వఖేచరైః తను వ్యయాంగార్థ
గృహస్థితైశ్చేత్
పురాతనాత్ పుణ్యత ఏవ పుంసాం శ్రీచ్ఛత్రయోగం
ప్రవదంతి సంతః॥

ప్రసూతి కాలమందు సమస్త గ్రహములు లగ్న, వ్యయ ధనభావములందున్న పూర్వపుణ్యమువలన అట్టి జాతకులకు శ్రీచ్ఛత్రయోగము ప్రాప్తించును. ఇది మహాయోగములలో ముఖ్యము. సర్వ శుభప్రదము.

13. ప్రజానాయకత్వ యోగము—మాండవ్య జాతకము,

విలగ్న భవనం గతే బలయుతే చ వర్గోత్తమే
చతుః ప్రభృతిభిర్ గ్రహైః శశివా సమాలోకితే॥
న సంభవతి పార్థివః ఖలు కృపాణపాణి రణే
కదా బిదపి వీక్షితే రిపుజనో న యుష్యానసం॥

లగ్నముగాని, చంద్రుడుగాని వర్గోత్తమాంశ యందున్న వానిని ఇతర గ్రహములు ఇతర కేంద్రముల నుండి వీక్షించిన ప్రజానాయకత్వము నొందును.

లగ్నమునుగాని చంద్రునిగాని వానినుండి 4, 11 లందున్న శని, 6, 10 లందున్న కుజుడు, 5, 9 లందున్న గురుడు వీక్షింపగలరు. ఇందు శని లాభస్థితి వీక్షణ, కుజుని షష్ఠస్థితి వీక్షణ, గురుని అధివీక్షణలు వర్జించి, చతుర్థ శని, రాజ్య కుజుడు సప్తమ గురువీక్షణకే ప్రాధాన్య మివ్వబడినది. సప్తమ చంద్ర వీక్షణకు ప్రాధాన్య మివ్వరాదు. అందు బుధుడుండి వీక్షించిన లేక శుక్ర వీక్షణ ప్రాప్తించిన ఈ యోగము పరిపూర్ణత నొంది సర్వ శుభ ఫలప్రద మగును. ఇట్టి యోగమందు జననమొందిన జాతకులు ప్రజానాయకు లగుదు రనుట నిస్సందేహము. ఇట్టి యోగములు లగ్నమునుండి 22, చంద్రునుండి 22. మొత్తము ద్వాదశరాసులకు 44 ప్రాప్తించును.

రాజయోగము

అరంధ్రయా శ్లిష దోషే ధర్మ కర్మాధి నాయకౌ
రాజయోగకరౌ స్యాతాం సంబంధా త్పరివర్తనాత్॥

అష్టమ లాభాధిపత్యములతో, స్థితితో కూడని భాగ్య రాజ్యాధిపతులు పరస్పర సంబంధమువలన, పరివర్తన వలన రాజయోగ కారకు లగుచున్నారు.

లగ్నేశయోగ దృష్టిభ్యాం యోగోయాం ప్రభవో
భవేత్
రంధ్రేశ్వరస్య దైత్యస్య యోగేన శిథిలో భవేత్.

లగ్నాధిపతి యొక్క సంబంధముచే పై జెప్పబడిన రాజయోగము ప్రబల మగును. అష్టమాధిపతి సంబంధముపై యోగమునకు ప్రాప్తించిన అట్టి రాజయోగము భంగమగును.

అషష్ఠా యాశ్లిష దోషే బుద్ధి కర్మాధి నాయకౌ
రాజయోగ కరే ప్రోక్త స్సంబంధా త్పరివర్తనాత్॥

షష్ఠ లాభాధిపత్యముయొక్క స్థితి సంబంధ దోషము లేని పంచమ రాజ్యాధిపతుల సంబంధ పరివర్తనలచే రాజ యోగము ప్రాప్తించును.

అయుంచయోగే లగ్నేశ దృశ్యోగాభ్యాం బలిజవేత్
షష్ఠేశ్వరస్య దైత్యస్య యోగేన శిథిలో భవవేత్॥

లగ్నాధిపతి సంయోగ సంబంధములచే పైన చెప్పబడిన యోగము వృద్ధియగును. షష్ఠాధిపతి సంబంధము ప్రాప్తించిన యోగము బలహీనమగును.

అవ్యయా యా శ్లిష దోషే లగ్న కర్మాధి నాయకా
రాజయోగ కృతా ప్రోక్త స్సంబంధా త్పరివర్తనాత్॥

లాభవ్యయాధి పత్యస్థితి సంయోగముగాని సంబంధముగాని లేని లగ్న రాజ్యాధిపతుల యుతిచే గాని పరివర్తనచే గాని రాజయోగము ప్రాప్తించును.

విశేష్యేశయోగ దృష్టిభ్యాం యుగోయం ప్రభవో
భవేత్
వ్యయేశ్వరస్య యోగేన యోగోయం శిథిలోవభవేత్.

లగ్న రాజ్యాధిపతుల సంబంధముచే ప్రాప్తించిన రాజయోగము పంచమ భాగ్యాధిపతుల యుతి చేతను లేక దృష్ట్యాది సంబంధములచేతను ప్రబలగమును. అట్టి యోగమునకు వ్యయాధిపతి సంబంధము ప్రాప్తించుట అశుభ ఫలకారణము.

రాజయోగః పరశ్చంద్రో యది సర్వ గ్రహేక్షితః
సర్వ గ్రహేక్షితం రాజ్యం యది యోగోఽ వ్య
ఉచ్యతే॥

చంద్రునకు సర్వగ్రహ వీక్షణ ప్రాప్తించిన ఉత్తమ రాజయోగము ప్రాప్తించును. రాజ్యభావమునకు సర్వగ్రహ వీక్షణ ప్రాప్తించినను ఉత్తమ రాజయోగ మగును.

విద్యతే యస్య భావస్య పంచాదీనాం విలోకనాం
యోగస్తద్భావ సంబంధా భవేత్కృశ్చి దమత్తమః॥

పంచగ్రహ వీక్షణాది సంబంధములు ఏ భావమునకు ప్రాప్తించునో అట్టి భావ సంబంధమగు రాజయోగము ప్రాప్తించును.

సర్వైస్త్రైస్సర్గిక శుభైః త్రిషడాయా వ్యవస్థితైః
యోగస్స్యాన చ యోవా మధన వృద్ధి కరోర్యణామ్॥

త్రిషడాయములందున్న నైసర్గిక శుభములచే ప్రాప్తించు రాజయోగము ధనయోగముగా వర్ధిల్లగలదు.

చంద్ర తశ్చోదయం యోగో బుద్ధిః వృద్ధి కరో భవేత్
ధనే వ్యయేచ భయత్రత్రి యోగోసం గణాధిభిః॥

నైసర్గిక శుభులు చంద్రునకు దశమమునతప్ప ఇతర ఉపచయ స్థానములందున్న బుద్ధి వృద్ధి గలుగును. చంద్రునకు ఉభయపార్శ్వములందు కుజాది పంచగ్రహములున్న శ్రీయోగము. అత్యంత మంగళదాయకము.

త్ర్యాధి భిస్తుంగగైః శౌర్యై స్స్వర్ క్ష స్థైః శ్రుతురాధిభిః
పంచ భిః భిశ్చ సంయుక్తై స్త్యోగా ఐశ్వర్యదాయకాః.

మూడు గ్రహములు ఉచ్ఛయందున్నను, నాలుగు గ్రహములు స్వక్షేత్రములందున్నను, ఐదు గ్రహములు ఏక రాశిగతులైనను రాజయోగప్రదము లగును.

కేంద్రస్థితే రాహు త్రికోణదీశే
సంబంధినో రాహు త్రికోణ సంస్థే
కేంద్రేశ సంబంధిన యోజితస్య
సద్రాజ యోగం విజయం దదాతి॥

దశమ కేంద్రమందు రాహువుగాని, కేతువుగాని, నవమ స్థానమందుండి దశమాధిపతి సంబంధము నొందినను మహారాజయోగము ప్రాప్తించును కోణమందుండి ఇతర కేంద్రాధిపతుల సంబంధము పొందినను సామాన్య రాజయోగము ప్రాప్తించును. దశమాధిపతి బలయుతుడై దశమమందు రాహు కేతులలో ఎవరున్నను రాజయోగము ప్రాప్తించును.

Statement about ownership and other particulars about newspaper

BHARATI

1. Place of Publication . Madras
2. Periodicity of its publication : Monthly
3. Printer's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address: 6&7, Thambu Chetty Street, Madras-1.
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Nationality: Indian
   Address : (As above)
5. Editor's Name: Sri S. Sambhu Prasad
   Nationality Indian
   Address: 29, Chamier's Road, Madras-28.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	29, Chamier's Road, Madras-28.
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	6 & 7, Thambu Chetty Street, Madras-1.

I, S. Radhakrishna, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. RADHAKRISHNA,
1-3-65. Signature of Publisher.

అంకితం

శ్రీ పోరంకి దక్షిణామూర్తి

ఈ కావ్యం రాసినవాడిపేరు ఎక్కడా లేదు
ఎప్పుడు రాశాడో అంతకంటె తెలియదు
ప్రతిఒక్క హృదయమూ అది చదువుతుంది
లిప్త లిప్తకూ ఒక్కొక్కపుట తిరుగుతుంది
ఎవడి మట్టుకువాడే ఆ కావ్యం చదువుకోవాలి
ఆ జన్మాంతం అలా చదువుకొంటూనే ఉండాలి
ఏ హృదయం నేర్చిన భాషలో ఆ కావ్యం పలుకుతూ ఉంటుంది
అజరామరంగా నేపథ్యంలో సంగీతం వినిపిస్తూ ఉంటుంది
ఏ నాటిదో సుగంధం పరిమళిస్తూ ఉంటుంది!
ఈ కావ్యమంతా నలుపు తెలుపుల్లో అగపడినా
కంటికి ఆనని వేవేల వర్ణాల చిత్రలిపిలో రాసినట్లుంది
ఎంత లోతుగా చూసేకొళ్లకి అంత ఎత్తుగా అగపడుతుంది.
కాని,
దీంట్లో మొదటి పుటా, చివరి పుటా అల్లరిపిల్ల వాడెవడో
అప్పుడే చింపేశాడు!
అందుకని, ఎవరి పుటలు వాళ్లు చేర్చుకుంటారు
ఎవరి పుట్టకలలో నాళ్లు నేర్చుకొంటారు
అందుకనే యీ కావ్యం, ఆద్యంతమూ
ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటుంది
అందుకనేనేమో యీ కావ్యం యింత గొప్పది
అందుకనేనేమో అంతనీ కలుపుకొనేటంత దొడ్డది
అందుకే యిది 'జీవితం'
అందుకే యిది అద్భుతం
అతనికే యిది అంకితం!

ప్రజలు ప్రభుత్వం

శ్రీ జాన్ స్ట్రాచీ

పశ్చిమ రాజ్యాలలో ప్రజలు, ఉత్పత్తి సాధనాలన్నిటినీ జాతీయం చేయడానికి ఓటు చేస్తారని నా అభిప్రాయం కాదు. కొన్ని దేశాలలో చేయవచ్చు. కొన్ని దేశాలలో చేయకపోవచ్చు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రజలు తమ జాతీయ ఉత్పత్తి ఆదాయాన్ని తమకు కావలసిన రీతిగా పంచటానికి వోటు చేస్తారు. పూర్వానుభవం దీనిని తెలుపుతున్నది. ఈ సందర్భంలో సాధారణంగా అనుసరించేది, అనువరమైన రీతిలో పన్నులను వేయడం. ఉత్పత్తి వల్ల వచ్చే లాభాలను, యజమానులకు పోకుండా జన సామాన్యానికి లభింపటట్లుగా పన్నులను వేస్తారు. రాజకీయంగా బాగా ముందుకు వెళ్ళిన పశ్చిమ రాజ్యాలలో ఈ రకమైన పన్నుల పద్ధతి పెద్ద ఎత్తున అమలులో ఉన్నది.

పశ్చిమ రాజ్యాలలో, స్వలాభంకోసం నిర్వహింపబడే ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న పనివారిస్థితిని, కమ్యూనిస్టు దేశాలలో ప్రభుత్వం నిర్వహించే సంస్థలోని పనివారి స్థితిని సరిపోల్చి చూడండి. పశ్చిమ రాజ్యాలలో పని వారికి వోటింగు హక్కున్నది. ట్రేడ్ యూనియనులు స్థాపించుకొనే హక్కున్నది. ఎక్కువ వేతనాలను సాధించుకొనడానికి సమ్మె చేసే హక్కున్నది. ఒక రాజకీయ పార్టీని నిర్మించుకొనే హక్కున్నది. కమ్యూనిస్టు దేశాలలో పనివారికి ఈ హక్కులేమీ లేవు. కాబట్టి తాము ఉత్పత్తిచేసే వాటి విలువలో భాగం పొందటానికి ఎవరికి ఎక్కువ హక్కున్నదంటారు! ప్రజా ప్రభుత్వ హక్కులున్న పశ్చిమ రాజ్యాలలోనే ఎక్కువ అవకాశం ఉన్నదనటానికి సందేహంలేదు.

ఒకటికన్న ఎక్కువ రాజకీయ పక్షాలను నిర్మించటానికి అవకాశమున్నపుడే, ప్రభుత్వాన్ని నియమించి లొంగించే పద్ధతి సవ్యంగా నడుస్తుందని పశ్చిమ రాజ్యాలవారి మైనమా అభిప్రాయము. మాకూ, కమ్యూనిస్టులకు ఈ విషయంలో ఉన్నంతగా తీవ్రాభిప్రాయాలు మరే విషయంలోనూ లేవు. కమ్యూనిస్టు సిద్ధాంత మేమిటో మొదట పరిశీలిస్తాము.

కమ్యూనిస్టులు ఒక ప్రత్యేక తరగతి ప్రతినిధులని మార్క్సు సిద్ధాంతము. 19 వ శతాబ్దంలో టోరీలు తాము భూస్వాముల ప్రతినిధుల మన్నారు. తాము వస్తూత్పత్తిదారుల ప్రతినిధులమని లిబరల్ పార్టీ వారన్నారు. కూలివారి ప్రతినిధులుగా చార్టిస్టు పార్టీవారు వ్యవహరించాలని ప్రయత్నించారుగాని విఫలు లయ్యారు. రాజకీయ పక్షాలను గురించి మార్క్సిస్టు సిద్ధాంతము చెప్పేది ఇంతమాత్రమే అయితే, అది సమస్యను అతి తేలికగా తేల్చి వేయడమే అవాలి. ప్రస్తుత రాజకీయ పార్టీల పుట్టుపూర్వోత్తరాలనుచూస్తే అది తెలియవస్తుంది. అమెరికా, బ్రిటనులలోఉన్న మోస్తరు, పెద్ద పార్టీలున్నచోట్ల అనేక తరగతి తరహాల ప్రజలు కలిసి ఆ పార్టీలకు వోటు చేయటం జరుగుతుంది. ఇక్కడ కూడా లోతుగా పరిశీలిస్తే వారందరికీ ఎప్పుడో కుదురు ఒకటేనని తెలుస్తుంది.

కాబట్టి కమ్యూనిస్టులు ఇలా అంటారు. "విప్లవానంతరము మిగిలేది ఒకే ఒక తరగతి. అది కూలి పనివారిది అలాంటప్పుడు ఒక పార్టీకన్న ఎక్కువ ఎందుకు? ఒకే వర్గం కాబట్టి ఒకే పక్షం. అందుకనే మేము కమ్యూనిస్టులకే సర్వాధికారం ఉండాలంటాము. ఒకటికన్న ఎక్కువ పార్టీ లుండాలని పశ్చిమ రాజ్యాలిచ్చే సలహా, విషయ పరిగ్రహణ లేకపోవటం మూలాన అనే చెప్పాలి."

అయితే ఈ కమ్యూనిస్టు వాదంలో ఒక లోపం ఉన్నది. ప్రతివర్గము ఒకే ఒక పార్టీని నిర్మిస్తుందనీ, ఒకే ఒక వర్గమున్నపుడు మరొక పార్టీని నిర్మించడానికి ఎవరికీ ఇచ్ఛ ఉండదు అన్న సిద్ధాంతము నిజమైనట్లయితే వేరే మరొకపార్టీ రాకూడదని నిషేధించడం దేనికి! ఇంకొకరికి ఇచ్ఛ అనేదే ఉండదంటున్నారుగా! రాజకీయ పక్షాలను గురించి కమ్యూనిస్టులుచెప్పే సిద్ధాంతము సవ్యమయినట్లయితే కమ్యూనిస్టుపార్టీకాక మరొక పార్టీని రానివ్వకపోటం దేనికి?

కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులకు పోటీగా నుంచోవచ్చని అంటే, మ్రుశ్చేవ్ సోవియట్‌కు పోటీ చేయుడానికి రష్యాలో చాలామంది సిద్ధపడతారని అందరికీ తెలుసు. రష్యాలో ఇంకా వర్గ రహిత సంఘం ఏర్పడక పోవడమే దీనికి కారణం. రష్యను కర్షకులు వెంటనే ఒక పార్టీని నిర్మించి సాముదాయిక వ్యవసాయ పద్ధతిని వెంటనే రద్దు చేయాలనే కార్యక్రమాన్ని ప్రకటిస్తారు. రష్య జనాభాలో కర్షకులు సగానికి సగం ఉన్నారు. వారికి కనుక అధికారంవస్తే రష్య ఆర్థికస్థితి బాగుపడుతుందని నా అభిప్రాయం. ఆహార వస్తువుల కొరత గత విషయంగా మారిపోతుంది. పోలెండులో వ్యవసాయాన్ని సాముదాయికంచేసే ప్రయత్నం విరమించటం మూలాన అది సాధ్యమైనది.

వారు నిజంగా వర్గ రహిత సంఘంగా ఏర్పడినా కూడా హక్కు కనుక ఉంటే రష్యయులు పోటీ రాజకీయ పక్షాలను తయారు చేయుటానికి సిద్ధపడతారు. రాజకీయ పక్షాలు కేవలం సంఘంలో ఒక తరగతి ప్రతినిధులని చెప్పడం, సమస్యను అతి "తేలిక" చేయడమేనని చెప్పాలి. రష్యను పని వారలలో కూడా వేరొక పార్టీని తయారు చేయుడానికి కావలిసినంత భేదాభిప్రాయా లుండవచ్చు.

ఏకవర్గ సంఘంలోగాని, వర్గ రహిత సంఘంలోగాని పోటీ పక్షాలు అవలంబించే కార్యక్రమాలు ఏమైయుంటాయి. వారికి ఏకీభావం కుదురక పోవటానికి కారణాలు ఏముంటాయి! చాలా ఉంటాయి. వర్గ విభేదములే విభేదా లన్నిటికీ కారణమని కమ్యూనిస్టులు చెప్పేది పైన చెప్పినట్లు సమస్యను సులభం చేయుటమే. సంఘస్థితి అంత కన్న క్లిష్టమైనది.

తీవ్ర వర్గ విభేదాలున్న సంఘంలో, సహన భావమనేది తగ్గి ప్రజా ప్రభుత్వ సంస్థలు పని చేయడం చాలా చిక్కు అవుతుంది. వర్గ సంఘర్షణ తీవ్రంగాలేని నేటి సంఘాలలో కూడా, విరుద్ధ ప్రయోజనాలు కలిగినవారి సంఘర్షణలు చూస్తే వాటిని సమన్వయం చేయటం దుస్సాధ్యంగా కనుపడుతుంది. రాజీ పడటం, సర్దుకుపోవటం అనేది ప్రజా ప్రభుత్వ సంస్థలలో తప్పనిసరి. అంతమాత్రంచేత వర్గ రహిత సంఘంలో భేదాభిప్రాయాలుండవనటం తప్పు. తరగతుల మధ్యఉండే తారతమ్యాలు తగ్గిన కొలదీ సంఘర్షణలు సన్నగిలుతాయి. ప్రజా ప్రభుత్వ సంస్థలు బాగా పని చేస్తాయి. ఆయా రాజకీయ పక్షాలు వివిక దృక్పథంగల పౌర సంస్థలకు ప్రాతినిధ్యం వహించినపుడే ప్రజా ప్రభుత్వం పరిణతి చెందుతుంది.

వర్గములు లేక, ప్రజా ప్రభుత్వమున్న సంఘం ఎలా ఉంటుంది. (ఇంతవరకు మానవ చరిత్రలో పెద్ద ఎత్తున అలాంటిది జరుగలేదు) ఈమధ్య ఒక భారతీయ ప్రముఖ అధికారి అన్నమాటనుబట్టి అది ఎలా ఉంటుందో కొంత ఊహించవచ్చు. "మా దేశానికి ఇపుడు కావలిసింది 6% పార్టీ 8% పార్టీ" అని ఆయన అన్నాడు. భారతదేశ సమస్య వేగం. అంటే ఆర్థిక అభివృద్ధి ఎంత త్వరగా వడవటం అన్నది ప్రధాన సమస్య అని ఆయన తాత్పర్యం. జాతీయ ఉత్పత్తి 6% చొప్పున లేక 8% చొప్పున అభివృద్ధి చెందాలా? ఇది నిజమైన అసలు సమస్య. ఈ చిన్న అంకెలలో ప్రతిభారతీయుని జీవితమును మార్చివేసే గొప్పదైన సాంఘిక, రాజకీయ నిర్ణయాలు ఇమిడి యున్నవి. తొందర పడితే సాంప్రదాయంగా వచ్చేవన్నీ మారి అశాంతి రావచ్చు. బాధాయుతమైన త్యాగాలు అనేకం చేయవలసి రావచ్చు. అలాకాక నెమ్మదిగా సాగుతే, గందరగోళాలు తక్కువగా యుండవచ్చుకాని కాని పది సం. లలో సాధింపగలిగే అభివృద్ధి చాలా కొద్దిగా యుండవచ్చు. అతివాదులు తొందర పడుతారు. మితవాదులు నెమ్మది అంటారు. ఈ ఉభయ పక్షాల పోటి నుండి సవ్యమైన, అందరికీ అంగీకార యోగ్యమైన, దేశ సమస్యలను ఆకళింపు చేసికొన్న కార్యక్రమం రూపొందుతుంది.

వర్గ రహితమైన సంఘంలో ఈవిధమైన ఆర్థిక సమస్యలమీదనే రాజకీయపార్టీలు పోటీలుపడుతాయి. అక్కడ ప్రజలుమాత్రం స్వేచ్ఛను పొందియుండాలి. సమస్యలన్నీ ఆర్థికమేకావు. బాగా అభివృద్ధి చెందిన సంఘాలలో వాటిని మించినవి వస్తాయి. మనపిల్లలు తెందాకా చదువుకోవాలి. ఆ చదువు ఎలాంటిదై ఉండాలి. అది పూర్తిగా శాస్త్రీయంగా ఉండాలా మానవ ప్రకృతికి సంబంధించినదై ఉండాలా లేక ఈ రెండూ సమ్మిళితమైనదిగా ఉండాలా? మతమువట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉండాలి. ప్రతికూలమా అనుకూలమా! తాటస్థ్యమా? ప్రతి దేశమూ సంపూర్ణ స్వతంత్రమై ఉండాలా

లేక ఇతరులతో కలిసి ఉండాలా?' ఇదీ కాకపోతే ప్రపంచ సంస్థ అనేది ఉంటే దానికి ఎంత అధికారం ఉండాలి! అలోచించాలిగాని ఇలాంటి సమస్యలు అనేకం వర్గ రహిత సంఘంలో వస్తాయి. రాజకీయ పక్షాలు వాదోపవాదాలకు దిగటం జరుగుతుంది.

20 వ శతాబ్దం మధ్యలో వచ్చిన కమ్యూనిస్టు సంఘాలను గురించి చరిత్రలో ఎలాంటి తీర్పు వస్తుంది! ఆర్థిక, సైనిక రంగాలలో వారు అమోఘమైనవి సాధించారని వ్రాయటం జరుగుతుంది. జన సామాన్యానికంతటికీ విద్య నిచ్చిన మొదటి మానవ సంఘాలనే ఖ్యాతి వారికి వస్తుంది. అయితే వారు సాధించిన దాని గొప్పతనము, వారు అవలంబించిన నిర్బంధ విధానమువల్ల నాశనమైపోతుంది. ముఖ్యంగా 1930 సం. లలో కృశ్చేవ్ చెప్పినట్లు, రష్యా ఒకవిధమైన పెద్ద హింసా గృహముగా పరిణమించినది. ఎపుడూ ఏ ప్రభుత్వమూ చేయనంతటి ఘోరకృత్యాలు స్టాలిన్ అధికారంక్రింద జరిగినవి.

1960 సం. లో కూడా కమ్యూనిస్టు ప్రభుత్వాలలో అతి పెద్దదైన తూర్పు జర్మనీ ప్రభుత్వం వంటివి తమ దేశాన్ని ఒక బందిఖానాగా తయారు చేశారు. తమ దేశం చుట్టూ గోడనుకట్టి ప్రజలలో ఎవరు పారిపోకుండా చూస్తున్నారు.

కమ్యూనిస్టుదేశాలలో రెండో పెద్ద దేశమైన చైనా తన వ్యవసాయ రంగంలో అతిభయంకరమైన తప్పులను చేస్తున్నట్లున్నది. ఆ తప్పుల ఫలితంగా కోట్లకొలది ప్రజలు క్షామానికి గురి కావలసి వచ్చింది.

ఇవి ఘోర విపత్తులు. అయితే ఈ విపత్తులు కమ్యూనిస్టులకు మాత్రమే అనుకోకండి. అవి మన అందరికి, యావత్తు మానవజాతికి విపత్తులనే అనుకోవాలి. ఎందుకనంటే ఆ తరువాత కమ్యూనిస్టులు ముందూ వెనుకా చూడక వ్యవహరిస్తారు. వారి విధానాలింకా ఘోర రూపము దాలుస్తాయి. ప్రపంచములో ఎప్పుడు ఏమవుతుందో అన్న భయము ఎక్కువవుతుంది. ఈ అణుయుగంలో యుద్ధంవస్తే మానవ నాగరికత నాశనమయి పోతుంది. ఈ విషమ స్థితి రావటానికి కమ్యూనిస్టు దేశాలలో ప్రజా ప్రభుత్వ సంస్థలు లేకపోవడమే కారణము. ప్రభుత్వములు కనుక తమ ప్రజలకు ప్రాథమిక స్వేచ్ఛలను ఇవ్వకపోతే వాటిని తోసివెయ్యాలి. ఈ విషమ పరిస్థితులు వచ్చినప్పుడే ప్రభుత్వాలను తోసివేయుటం జరుగుతున్నదని అనుభవంవలన తెలుస్తున్నది.

రష్యా తన కష్టాలన్నీ గడచి సంపదతో కూడిన జాతీయ భావముగల దేశముగా అభివృద్ధి చెందుతోంది. అయితే వారు సాధించిన దానికి రష్యను ప్రజలు చేసిన త్యాగము నిజముగా అవసరమా అని అడుగటం అసమంజసమా? కాదు. వారు సాధించినది ఏమంత అసాధారణమైనదికాదు. కమ్యూనిస్టేతర దేశాలనేకం సాధించినది రష్యా సాధించిన వాటితో సరిపోల్చవచ్చు. జన సామాన్యమంతటికి విద్య నివ్వటంతప్ప వారు సాధించినది పారిశ్రామికంగా శక్తివంతమయిన మరొక దేశాన్ని తయారు చేయుటమే. దానికోసం రష్యను ప్రజలు చెల్లించిన ముడుపు చాలా ఎక్కువ. నేను చెప్పినట్లు, కమ్యూనిస్టులు ఉపయోగించిన సాధనాలు అతి ఘోరమైనవి. వారు సాధించినవి అతి సామాన్యమైనవి. ఇంతేకాదు, ఇతర ప్రభుత్వాలకన్న కమ్యూనిస్టు ప్రభుత్వాలను ఉన్నతమైన ప్రమాణాలతో చరిత్ర విచారిస్తుంది. కమ్యూనిస్టులు ఎక్కువ గొప్పలు చెప్పుకున్నారు. మానవ చరిత్రలో ఏ ప్రభుత్వమూ ఆశించనంతటి ఉత్తమ ఆశయాలతో కమ్యూనిస్టు ప్రభుత్వము బయలుదేరింది. "స్వర్గంలోకి తీసుకుపోయే బోల్షివిక్కుల"మని ప్రగల్భాలు పలికారు. కాబట్టి ఎక్కువ ప్రాంతాల్లో ఎక్కువ కాలం పరిపాలించిన సాధారణ ప్రభుత్వాలకన్న తమను ఎక్కువ పరీక్షకు గురి చేస్తారని వారు గ్రహించాలి. ఇరవయ్యో శతాబ్దపు పెద్ద భ్రమ ఒకటి పోగొట్టడమనేది కమ్యూనిస్టుల పాలబడింది. వారు పెద్ద నేరాలు, తప్పులు చేయుటంవల్ల మనకంటే తక్కువవారని అనుకోకూడదు. వారిని అంత తేలికగా క్షమించలేక పోవడానికి కారణం వారు ఒకప్పుడు ప్రపంచానికి ఆశాజ్యోతిగా ఉండటమే. షేక్స్పియర్ అన్నట్లు,

"Lilies that fester smell far worse than weeds."

ఈ శతాబ్దములో వచ్చిన అనేక విషాద సంఘటనలకు కారణం కమ్యూనిస్టు దేశాలలో ప్రజా ప్రభుత్వం లేక పోవటంవల్లనేనని చెప్పాను. అయితే మానవుల బాధలన్నింటికి ప్రజా ప్రభుత్వం ఉపశమనమని అనుకోకూడదు. నిజానికది కాదు. కాకపోవటానికి కారణాలు చాలా ఉన్నాయి.

అన్ని దేశాలలోను ప్రజా ప్రభుత్వ సంస్థలు పని చేసేటట్లులేదు. ప్రపంచంలో అనేక దేశాలలో ప్రజలు ప్రజా ప్రభుత్వపు వ్యవస్థలను సమర్థంగా నిర్వహించడానికి తగినంతగా రాజకీయ పరిణతి పొందలేదు. ఇలా అంటే అందరూ మెచ్చరు. అది కొత్తగా స్వాతంత్ర్యము పొందిన దేశాల వారి మనస్సులకు కష్టం కలిగిస్తుంది. అయినప్పటికి దానిని కాదనడానికి వీలులేనంత సాక్ష్యం ఏ రోజు కారోజు పెరుగుతోంది.

పూర్వ అస్వతంత్ర దేశాలవారు స్వపరిపాలన చేసుకోలేనివారని నే ననటములేదు. వారిలో చాలామంది అతి సమర

తతో వ్యవహరిస్తున్నారు. కాని చాలామంది పాత ప్రభుత్వ పద్ధతిని పరిపాలన సాగిస్తున్నారు. ఈ ప్రభుత్వాలను రాజ్యాంగ విరుద్ధమయిన దౌర్జన్య పద్ధతుల ద్వారానే మార్చటం సాధ్యం. ఇలా అనటం మూలాన వారి స్వాతంత్ర్యాన్ని అంగీకరించడం తప్పని అర్థంకాదు. చరిత్ర తెలిసినంతవరకు ప్రజలందరూ నిరంకుశ ప్రభుత్వము క్రిందనే ఉన్నారు. అయితే ఒక్కసారే ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు విశ్వ వ్యాప్తమవుతాయని అనుకోవడానికి వీలులేదు.

కొన్ని ప్రదేశాల ప్రజలు ప్రజా ప్రభుత్వ సంస్థలను నిర్వహించ సిద్ధంగా లేరనే వాదాన్ని పురస్కరించుకొని కొంత మంది సామ్రాజ్యవాదాన్ని బలపరుస్తున్నారు. ఆఫ్రికాలో ఉన్న తెల్లవారు తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి దీనిని సాకుగా ఉపయోగించుకుంటున్నారు. ఒక దేశం ప్రజలు ప్రజా ప్రభుత్వ పద్ధతిలో పరిపాలన సాగించుకొనలేకపోతే మరొక దేశ ప్రజకు వారిపైన ఆధిపత్యం వహించటానికి హక్కులేదు. అంతమాత్రంచేత చాలా వలస దేశాలు స్వతంత్రులు కాగానే ప్రజా ప్రభుత్వ వ్యవస్థలను నిర్వహించలేక పోయారనేది కప్పిపుచ్చలేము.

ఆసియా, ఆఫ్రికా దేశాలలో చాలామంది సాధించ గలిగిన స్వప్రభుత్వము తమ దేశీయులు నిర్వహించగలిగిన ప్రభుత్వము మాత్రమే. అంతేగాని ప్రజలంతా కలిసి అదుపులో పెట్టగలిగే స్వీయ ప్రభుత్వంకాదు. పరాయి దేశపు నిరంకుశ ప్రభుత్వం స్థానే స్వదేశీయుడైన ఒక నాయకుని నిరంకుశ ప్రభుత్వము గాని ఈ రెంటిలో ఒకదాన్ని చాలా దేశాలలో ప్రజలు ఆమోదించవలసి వస్తున్నది. సహజంగా వీరు స్వదేశ నాయకుని నిరంకుశ పరిపాలననే కోరుకుంటారు. తరచూ ఈరకం ప్రభుత్వాలు పూర్వపు పర ప్రభుత్వమంత సమర్థనీయంగా నడవవు. అయితే ఎంతైనా అవి వారి స్వప్రభుత్వాలు. పర ప్రభుత్వాలు అనేక సందర్భాలలో కేవలం అల్ప సంఖ్యాకులైన తెల్ల వారి ప్రయోజనం కోసమే పరిపాలిస్తాయి.

ప్రజా ప్రభుత్వానికి ఇదొక పెద్ద పరిమితిగా ఉన్నది. ఈ విధమైన ప్రభుత్వాన్ని ప్రపంచములో చాలా ప్రాంతాల్లో అమలు జరపడం సాధ్యంకాదని అనుభవంవల్ల తెలుస్తోంది. దానికి అవసరమైన పరిస్థితులూ, వాతావరణం, ఇంకా ఏర్పడలేదు. ఇది అనేక సందర్భాలలో రెండు విధాలుగా వ్యక్తమయింది. ఈ దేశాలలో కొన్ని స్వతంత్రం అవగానే, కొన్ని దేశాలు స్వతంత్రం కాబోయేముందూ తరచు ప్రజా ప్రభుత్వ వ్యవస్థల స్థాపన జరిగింది. అక్కడ ఈ వ్యవస్థలకు అవసరమైన వాతావరణం, పరిస్థితులూ లేకపోవడంవల్ల సరియైన ఫలితాలు రాలేదు. ఒకటిమాత్రం జరుగుతుంది. మధ్య ప్రాచ్య దేశాలలో సయోజన వోటింగు పద్ధతి అమలు జరిపినపుడు "భూస్వాముల (షేక్‌లు) ప్రజా ప్రభుత్వం" అనేది వచ్చింది. ప్రతి ఒక్కరికి వోటు వచ్చింది. కాని చాలా మందికి చదువురాక పోవటంవల్ల, పేదరికంవల్లా ఈ వోటు నేం చెయ్యాలో తెలియలేదు. వారి భూస్వాములు చెప్పినట్లు వోటు చేసారు. నిజానికి వారు వోటు చేయలేదు. వారిచేత వోటు చేయించారు. ఈవిధంగా ఈ దేశాలలో ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు అభివృద్ధికి అవరోధమయాయి. అయితే అక్కడ అభివృద్ధికోసం తపించిపోయే సమర్థనీయమైన మధ్య తరగతి ప్రజలు తయారైనారు. కాని ఎన్నికలలో భూస్వాములకు వ్యతిరేకంగా గెలువలేకపోయినారు.

ఈ స్థితికి ఈజిప్టు మంచి ఉదాహరణ. ఇంతకు ముందు సయోజన వోట్లద్వారా ఎన్నిక అయి అధికారం లోకి వచ్చిన ప్రభుత్వాలకన్న నాసరు సైనిక నియంతృత్వం ఎక్కువ సమర్థత గలది పురోగమన దృక్పథంగలది అని తేలుతున్నది. ఇంతకుముందు వచ్చిన ఆ ప్రభుత్వాలు ఎన్నికలలో వచ్చినా అవి నిజంగా ప్రజా ప్రభుత్వాలుకావు. అక్కడి వోటర్లు భూస్వాముల ఆట వస్తువులు.

మరీ కొత్తగా స్వతంత్రమైన దేశాలలో ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు ఇంకా తేలికగా భగ్నమైనాయి. ఏ ఒక భూస్వామ్యం తరగతీ వోటర్లందరినీ అదుపులో పెట్టారనికాదు. అసలు పటుత్వంతో వ్యవహరించగలిగిన ప్రభుత్వమే ఏర్పడకుండా పోవటం జరిగినది. ప్రభుత్వాన్నిగాని, ప్రతిపక్షాన్నిగాని ప్రజా ప్రభుత్వంలో నడపటానికి కావలసిన నిబ్బరం వారికి అబ్బలేదు.

కొత్తగా స్వాతంత్ర్యము వచ్చిన దేశాలలో ప్రజా ప్రభుత్వ వ్యవస్థలను స్థాపించటానికి వారు ఎన్ని కష్టాలను ఎదుర్కొన వలసి వస్తుందో ఈమధ్య నేను ఆఫ్రికా వెళ్ళినప్పుడు తెలిసింది. శాసన సభలో ప్రతిపక్ష నాయకునికి, "ప్రధాన శత్రువని" ఆఫ్రికాభాష అన్నిటిలోను అనువదించారట. భాష అనేది ఈ సందర్భంలో మనోవైఖరిని దిద్దుతుంది. మనోవైఖరిభాషను దిద్దుతుంది. ప్రజా ప్రభుత్వము సక్రమంగా పనిచేయవలెనంటే తమ దేశ ప్రభుత్వము క్రమబద్ధముగా నడచుటకు ప్రతిపక్షము ప్రభుత్వముతో సహకరిస్తూనే ఎదిరి పక్షముగా వ్యవహరించాలి. ఈ పాత్ర నిర్వహణ ఎదిరి పక్ష నాయకునికి ప్రధాన శత్రువు అనే పేరు పెట్టితే ఎలా కుదురుతుంది! ఈ ప్రధాన శత్రువునే బ్రిటనులో ఏమంటారో చూడండి! అక్కడ "రాణీగారి విశ్వసనీయమైన ఎదిరి పక్ష నాయకుడు" అంటారు. నేనున్న పార్టీ నేడు ప్రతి కూల పక్షంగా ఉన్నది. ప్రభుత్వ ప్రతికూల పక్షాన్ని నడిపినందుకు ఆ పార్టీ నాయకునికి జీతం ఇస్తారు. (ఇది సబబని నా అభిప్రాయం.) అందుకని ప్రతిపక్ష నాయకుడు (1963 నాటి ప్రభుత్వ) విధానాలను గట్టిగా ఎదిరించడు అనుకొంటే అది శుద్ధ పొరపాటు. మా లేబరు పక్ష సభ్యులందరూ కన్సర్వేటివ్ పక్ష విధానాలకు ప్రతికూలురము. మేము అధికారంలోకి వస్తే, వారు చేసిన వాటి నన్నిటినీ మార్చివేస్తాము. మా భక్తి విశ్వాసములు బ్రిటిను ప్రజా ప్రభుత్వమువల్ల. దానిని నిలబెట్టుటకు, రక్షించుటకు మేము ప్రయత్నిస్తాము.

ఈవిధమైన స్థితి రావటానికి ఉన్నతమైన రాజకీయ పరిజ్ఞానము కావాలి. అది రావటానికి చాలాకాలం పడుతుంది. రాజకీయంగా పెరుగని దేశాలలో ప్రతిపక్షమంటే సంపూర్ణంగ ప్రాతికూల్యం చూపించటమే. సంపూర్ణమైన ప్రాతికూల్యమంటే విప్లవబద్ధమైన ప్రాతికూల్యమౌతుంది. ఈ విధమైన ప్రాతికూల్యము దౌర్జన్యముతోను కూడిఉంటుంది. ఈ దేశాలలో ప్రతికూల పక్షాలన్నీ త్వరలో కుట్రకీ, దౌర్జన్యానికీ దిగుతాయి. ప్రభుత్వాలు నిర్బంధ విధానానికి దిగుతాయి. దాంతో అశాంతి చెలరేగుతుంది. ఒక నాయకుడు బయలుదేరి అధికారము వశపర్చుకొని, పేరుకు ప్రజా ప్రభుత్వమంటూ నిరంకుశంగా పరిపాలన సాగిస్తాడు. ఘనా, పాకిస్తాన్‌లలో ఈ విధంగానే జరిగింది.

ఈ దేశాలను పాలన చేయటంగాని, వారికి స్వాతంత్ర్య మివ్వటము పొరపాటనిగాని అనటము తప్పు. ఈ దేశాలలో ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు భగ్నమైన తరువాత ఏర్పడిన నిరంకుశ ప్రభుత్వములు అభివృద్ధి కరంగాను, సమర్థనీయంగాను వ్యవహరిస్తూ ఉన్నాయి. ఈ దేశాలు స్వపరిపాలనా నిర్వహణకు ఒక మార్గము ఏర్పరుచుకొన్నందుకు అందరూ సంతోషించ వలసినదే. ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు సక్రమంగా పని చేయటానికి అవసరమైన పరిస్థితులు వీరు కల్పించలేకపోయినారని మాత్రమే తేలింది. పెట్టుబడిదారీ విధానము క్రింద ఉండే ప్రజలను గురించి లెనిన్ అనుకొన్నది వీరివల్ల నిజమైనది. అది అన్ని కాలాలలోనూ, అన్నిచోట్లా నిజమవుతుంది. కాని లెనిన్ చెప్పినది పెట్టుబడి విధానము బాగా అభివృద్ధి చెందిన చోట్ల వర్తించలేదు. వర్తించదు. బ్రిటను, అమెరికా, పశ్చిమ యూరపు దేశాలలో పనివారు ప్రజా ప్రభుత్వ వ్యవస్థలను సమర్థతతో నిర్వహిస్తున్నారు. వారి నిర్వహణ పూర్తిగా నిర్దుష్టంగా ఉండకపోవచ్చు. వారు అన్ని సమయాలలోనూ విజ్ఞతతో ప్రవర్తించక పోవచ్చును. తప్పులు చేస్తారు. మొదట ఎన్నుకున్న ప్రభుత్వాలు తరువాత అంగీకారం కాకుండాపోతాయి. అయినప్పటికీ ఈ వ్యవస్థలను వారు నిర్వహిస్తున్నారు. దాన్ని కాదనటం తమ సిద్ధాంతములతో కళ్లకు గంతలు కట్టుకోవటమే. లెనిన్ చెప్పిన దానికి వ్యతిరేకంగా జరుగుతున్నది. అంటే ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ దేశాలలో పనివారు నానాటికీ బీదరికానికి గురి కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఉండటంవలన విద్యావంతులవటమువలన ప్రజా ప్రభుత్వ వ్యవస్థను బాగా నిర్వహింపగలుగుతున్నారు. ఎక్కడైతే ప్రజలు దుస్థితి ననుభవిస్తూ బీదరికానికి గురి అవుతున్నారో, నిరక్షరాస్యులుగా ఉంటారో అక్కడ సాధారణంగా ప్రజలు ప్రజా ప్రభుత్వ వ్యవస్థను నిర్వహించలేరు.

అయితే ప్రజా ప్రభుత్వానికిముందు కావలసిన స్థితి గతు లేమిటి? ప్రజా ప్రభుత్వ వ్యవస్థలను నిర్వహింపగల శక్తి ఒక దేశానికి ఎలా వస్తుంది! ఈ ప్రశ్నకు సమాధానం కష్టం! ఏ ఒక్కటే అశక్తినిచ్చేది అని చెప్పటానికి వీలులేదని ప్రపంచానుభవం తెలుపుతున్నది. వోటర్లు అక్షరాస్యులై యుండాలనీ, వారి ఆదాయము ఇంత ఉండాలని మీరు అనుకోవచ్చు. కావచ్చును కాని, ఒక దేశమున్నది. ఆ దేశంలో జనాభాలో మూడింట రెండు వంతులు చదవటం రానివారు. వారి ఆదాయం చాలా తక్కువ అయినా అక్కడ ప్రజా ప్రభుత్వ సంస్థలు బాగానే నడుస్తున్నాయి. ఆదేశం భారతదేశం. దక్షిణ అమెరికా చూడండి. అక్కడ కొన్ని దేశాలు బాగా అభివృద్ధి చెందాయి. వారికి ఆదాయం చదువు, బాగానే ఉన్నాయి. ఒక తతాబ్దంగా ప్రజా ప్రభుత్వ వ్యవస్థలున్నాయి. అయినా, ఎందుకోగాని అక్కడ సరిగా పని చేయులేదు.

మరికొన్ని దేశాలున్నాయి. అక్కడ జాతి విభేద సంఘర్షణలు సాగుతూ ఉంటాయి. దక్షిణాఫ్రికాలో ప్రజా ప్రభుత్వ సంస్థలు పని చేయటం సాధ్యమేకాదు.

ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు పని చేయాలంటే ఒక రకమైన నాగరికత అవసరమని మాత్రమే చెప్పవచ్చును. భారత దేశానికి ఉన్నది అదే. భారతీయులలో చాలామంది బీద వారైనప్పటికి, చాలామందికి చదువురానప్పటికి నిజంగా వారు నాగరికులు. అంతేకాకుండా బాగా తెలివిగల, చదువుకున్న మధ్య తరగతి ప్రజలు చాలామంది ఉన్నారు. వీరు రాజకీయాలలో ప్రతిభతోనూ, పట్టుదలతోనూ పని చేస్తారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశంలో ప్రజా ప్రభుత్వ వ్యవస్థలు కొంతవరకు ఉన్నాయి. బ్రిటను నిరంకుశంగా పరిపాలించినా ప్రజా ప్రభుత్వానికి ప్రధానమైన, లాకోర్టులను ప్రతిష్ఠించింది. పాఠశాలలను కళాశాలలను స్థాపించటం చేత మధ్య తరగతివారు విద్యావంతులవటానికి అవకాశం చిక్కింది. ట్రేడ్ యూనియనుల ప్రచారం చేయ నిచ్చారు. (సంపూర్ణ ఆమోదం కాకపోయినా) బ్రిటీషుపాలన చివరి దశలో, రాజకీయ పార్టీలలో పెద్దదైన కాంగ్రెసు పార్టీని నిర్మించి స్వాతంత్ర్య ప్రచారమును సాగించటానికి తగిన స్వేచ్ఛను ఇచ్చారు. అప్పుడప్పుడు కాంగ్రెసు నాయకులను అరెస్టుచేసి నిర్బంధించిన మాట నిజమేకాని, దానిని పూర్తిగా ఎప్పుడూ అణచి వేయులేదు. క్రమంగా ప్రజలకు వోటు హక్కు నిచ్చే ప్రజా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పరచటం జరుగుతూ వచ్చినది. ఇది మొదట రాష్ట్రాలలోనూ ఆ తరువాత కొంత వరకు కేంద్రంలోనూ అమలు జరిపారు.

అందువల్ల 1947 సం. లో పూర్తిగా అధికారం భారతీయులకు వచ్చేసరికి ప్రజా ప్రభుత్వ రాజకీయం, యంత్రాంగమంతా సిద్ధంగాఉన్నది. ఇలా అనుకోటం బ్రిటీషు వారి స్వోత్కర్షగా మీరు భావించవచ్చు. కావచ్చు. నేను తీర్పు చెప్పడం కష్టం. ప్రజా ప్రభుత్వ వ్యవస్థల నిర్వహణలో ఒక డజను మంది విఫలులై యుండవచ్చుకాని భారతదేశం కృతకృత్యురాలవటం ఎన్నదగిన విషయం. దానికి భారతీయుల సమర్థతే ప్రధాన కారణం. దానితోపాటు బ్రిటిషువారినుంచి వచ్చిన వారసత్వము కూడా కారణం అని నా అభిప్రాయం.

ఆంధ్ర భాగవత ప్రామాణ్యము

శ్రీ వంతరాం రామకృష్ణారావు

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమివారు ఆంధ్ర భాగవతమును పరిష్కరింపించి ప్రకటించుట సర్వదా ప్రశంసనీయము. తాళపత్ర మాతృకలను వివిధ ముద్రిత ప్రతులను సంప్రతించి ప్రామాణికమైన ప్రతిని తయారు చేయుటకు సంపాదకులు పరిశ్రమించినారు. పూర్వ పరిష్కర్తలవలె కవి ప్రయుక్త భాషను ఇష్ట వచ్చినట్లు మార్చి వేయరాదను సంపాదకుల నియమము మెచ్చదగియున్నది. కాని కవి ప్రయుక్త భాషను గుర్తించుటలో ఒక చిక్కేర్పడినది. అదేమనగా శివకవులు వైరి పదాదులను వాడి లక్షణ సేతూల్లంఘనము చేసిరనియు భాగవత కవులు ఆ కోవకు చెందినవారే అనియు సంపాదకులు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయము భాగవత ప్రామాణ్యమునకు భంజకమైనది. ఇదంతయు బసవ పురాణ పీఠిక ననుసరించుటచే వచ్చిన ప్రమాదము. పూర్వ లాక్షణికులు భాగవతమునుండి లక్ష్యములను చూపలేదు. ఇందుకు కారణము రేఫఱకార సాంకర్యము మాత్రమే. అంతకుమించి వారైనను వేరే కారణమున్నట్లు చెప్పలేదు. మీదు మిక్కిలి "సలక్షణము కాకిమ్మహి నేమిటం గాదవ" అని ఎట్టి కొదవయు ఒదవ లేదని స్పష్టపరిచియున్నారు. పోతన కవితా భాగములలో ఈ రేఫఱకార ప్రాసలును లేవని సూచిమించి తిమ్మనకవి చర్చించి ఉదాహరణము లిచ్చియున్నాడు. "తిమ్మకవిగారైతే చాలా ప్రయత్నించారుగాని ఈ పని జరిగి సుమారు నూరు సంవత్సరాలకంటే ఎక్కువ కాలమే అయినా ఇప్పటికింకా లక్ష్యవిషయంలో పోతరాజు గారంటే కవిలోకానికి ప్రామాణ్య బుద్ధి కలిగి వచ్చేలేదు" అని చెప్పి శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు "బమ్మెర పోతనామాత్యుడు" అను వ్యాసములో భాగవత ప్రామాణ్యమును నిరూపించుటకు చాల కృషి చేసి యున్నారు. (కథలు—గాథలు 3 భా) అకాడమీవారు ప్రకటించిన ప్రతిబట్టి ఇంకను అనేక ప్రయోగాలను గూర్చి చర్చించవలసిన అగత్య మేర్పడినది. ఇట శివకవి సంప్రదాయమును గూర్చి ఒక మాట చెప్పవలసి యున్నది. శివకవులు నన్నయ తిక్కనల ప్రయోగముల ననుసరించుచునే కొన్ని విలక్షణ ప్రయోగములు చేసినారు. లక్షణ విరుద్ధముకాని వ్యావహారికభాషను జాను తెనుగు భావముతో వాడినారు. వైరి పదాదులను ఎంత మాత్రము వాడలేదు. "వైకల్యమత్యుక్తి, వైరి పదంబు, ప్రాభ ఛందో విరుద్ధంబాది యగున, లాభ ప్రలాపోక్తి లాఘవంబనక, పసి గూర్చు క్రీతులునా వద్దను బెరుగు, బిసుకు చందవు బిబిబిబి కృతుల్ కృతులె" అని ఉద్ఘాటించిన సోమనాథుడు వైరి పదాదులను వాడెననుట సత్యవిదూరము. కాన శివకవుల ననుసరించినవారన్న పక్షమున భాగవత కవులును లక్షణ విరుద్ధ భాష వాడినవారు కారనవలెను.

సింగన రచన

మదుప్ఛజాబలిమి (6—391) — 'బలిమి' వైకృతమని నిఘంటువులు. అందుచే ఇది వైరి పదము కావలెను. కాని, నిఘంటువులు చూపిన 'బలిమి' కృదంత రూపము. బలియు + ఇమి = బలిమి—అని ఆ పక్షమున పదచ్ఛేదము. "బలిమి పేయని భూమి వలయువతుల" మున్నగు నన్నయ ప్రయోగములనుబట్టి యీ కృదంత రూపము కలదన వచ్చును. సింగన వాడిన 'బలిమి' వేరు. ఇది 'బలము + ఇమి' అను చొప్పున ఏర్పడిన తద్ధిత రూపము. తద్ధిత ప్రత్యయములు తత్సమములపై కూడ చేరుట కలదు. కోపకాడు 'కాశీ 4—90, భీమ 4—13) కోపకత్తె (క్రీడా 129 ప) కార్యకాడు (ఆముక్త 4—263) అభిమానకత్తె (బసవ) పదారి (చెన్న బ. పు. 4—277 సా. స.) తిక్కన 'గాలకాడు' (అను 5—256) ఇట్టిదే. (వ్యా. సర్వ. 128 పు) కాన 'మదుప్ఛజా బలిమికిన్' వైరి పదము కాదు. సలక్షణమే. అందుచే 'మద్భుజా పటిమకున్' అను దిద్దుబాటు సరికాదు.

నా ర స ర చ న

(1) దానవరాచూలు (10 ఉ 374) శివకవి సంప్రదాయమునకు సరిపడునని యిదే కవిపాఠ మనబడినది. శివకవులు వైరి పదములు వాడలేదని చెప్పకతీరదు. కాన ఇది కవి పాఠము కాదనవలసి యున్నది. 'దానవరాచూలికి' అను పాఠమునుబట్టి ఆలోచింపగా 'దానవి రాచూలికి' కవి పాఠమని తోచును. దానవి యైన రాచూలికి అన్నమాట. విశేష్యము షష్ఠిలోను విశేషణము ప్రథమలోను కలదని సమాధానపడ వచ్చును. (బాల. కారక 27) "వాఁడు దానవికిఁ జేసిన వెయ్యు మెఱుంగి" (ఆది. 3-1-84) అని నన్నయ శర్మిష్ఠను దానవి అన్నాడు. ఇట నారన ఉషను దానవి అనుట యీ కారణముచే శంకాస్పదము కాదు. 'ఎట్టులో యీ రాచూలికి' అను దిద్దుబాటు కవి సమ్మతము కాదు.

(2) బంధువరువ (10. ఉ. 573) దీనిని వైరిపద మనుకొనరాదు. బంధుయొక్క వరువ (బాల. తత్సమ 49) అని గ్రహింపవలెను. వేల్పుటావు (వేల్పుయొక్క ఆవు.) ఆమంద, ననదండ— మున్నగువాని వలెనె 'బంధుయొక్క' అనుచో బహువచనార్థము లభించును.

(3) అనేకమార్లు. (10 ఉ 725) ఈ 'హ' ప్రతి పాఠము ఫుట్ నోటులో చూపబడెను. 'పెక్కుమార్లు' అన్నది ప్రధాన పాఠముగా ముద్రిత మగుట ప్రశంసనీయము. అనేకమార్లు గాని పెక్కుమార్లు గాని ఆ జరాసంధ వాక్యములో సరిపడుచున్నట్లు లేదు. ఏమయినను 'అనేకమార్లు' మాత్రము కవి సమ్మతము కాదు.

(4) పరిపాల—పరిపాలన (10 ఉ 760)—పణము—పణనము, భణము—భణనము, అసము—అసనము, అపగమము—అపగమనము, త్రాణము—త్రాణనము—అను రూపద్వయము వలె పరిపాలము—పరిపాలనము గ్రాహ్యము.

(5) దక్షున్ననురూప (3—267) దక్షున్—దక్షుని యొక్క—అని అర్థము. ఇందుకు చూడుడు ప్రౌఢ. సంధి 17 సూత్రము. 'అయ్యువిద వల్కుల్వంటి' (పాండు 1—29) ఉ, రులు విజమంత కోమలి మరుం బ్రసవాస్త్రహతిం జలింపదే" (కు. సం. 5—133) ఇట "మరు ప్రసవాస్త్ర" కవి పాఠముగా ముద్రింపబడుటయు, ఇది శివకవి సంప్రదాయమనుకొనుటయు కేవలము అవిమర్శ మూలకములు. "మరుం బ్రసవాస్త్ర—అని ప్రాతప్రతి. ఈశుండాదులు—మున్నగువాని వలె మగాగమము వచ్చిన దనుకొనవలెను." (శ్రీ కోరాడ శ్రీపాద వారల ఫుట్‌నోటు) 'రక్షాచణు' పాఠము సరికాదు. 'దక్షున్ననురూప' సాధు పాఠము.

(6) మహదైశ్వర్య (10 ఉ 785) "మహతాం దేవేంద్రాది దిక్పాలకానాం యదైశ్వర్యం తత్సదైశ్వర్యం— అని వ్యధికరణ సమాస తాత్పర్యంతో అభియుక్తులు వాడి ఉంటారు" అని చెప్పి శ్రీ చెళ్లపిళ్లవారు తిక్కన ప్రయోగములను రెంటిని చూపియున్నారు. "శూల పినాకాది సుమహదాయుధముల" (ద్రోణ 5—409) "సుమహదు పాశ్రయప్రమద శోభిత విశ్వ జగన్మధుప్రతా" (ఉద్యో-4-416) ఈప్రయోగములు పై సమర్థనకు లొంగవు. 'మహదరి' (10 ఉ 874) అను నారన ప్రయోగమును లొంగదు. ఇట్టి రూపములు పిల్లలమర్రి పినవీరన పాల్కురికి సోమన మున్నగు వారును వాడిరి. మహా ఇన అవరతి మహతి—దీని శత్రంతము ఈ ప్రయోగములలోని 'మహత్' శబ్దమని సమర్థించుకొనవలసి యున్నది. (వ్యా. సం. సర్వ 1153 పు.)

(7) సప్తవాసరము (10 ఉ 1237) "పూరణార్థమున నేకేవల సంఖ్యావాచకములును ప్రయుక్తములై యున్నవి. శతాంశము (శత తమాంశము) సహస్రాంశము (సహస్ర తమాంశము) త్రిభాగ శేషమనిశాను చక్షణమ్ (తృతీయ భాగ శేషాను—కాళిదాసు) త్రివిష్టపము (తృతీయ విష్టపము) మొ. అని తత్సమ చంద్రికలో చెప్పబడెను. (263 పు.) కాన 'సప్త' అను కేవల సంఖ్యావాచకము పూరణార్థమున ప్రయోగింపబడె ననదగును. 'అష్టమాస గర్భము' (భాస్కర. కిష్కింధ 388) ఇట్టిదే కావచ్చును.

(8) కమండలంబు (10 ఉ 1248) వ్రాయసకాండ్రు వ్యవహారవశమున ఇట్లు వ్రాసియుందురు. ఈ రూపము ఉత్తర హరివంశమున కలదని బాలకవి శరణ్యము (240 పు.) ఇట్టి వానిని నిర్వాహక స్థలములలో లేనిదే కవిసమ్మతము అనరాదు. 'కమండలువును' అను తం. వా. ప్రతుల పాఠమే గ్రాహ్యము.

(9) శిథిల దవయువుఁడు (4—822) శిథిల ఇత ఆచరన్—శిథిలత్. శిథిలమువలె ఆచరించుచున్న అనగా శిథిల మగుచున్న—కానగును (కుమారాయిత శక్తిశాలి—తిక్కన.)

(10) ప్రత్యగము (2.194) "తాన సద్గతికులు"అను 'హ' పాఠము ఫుట్‌నోటులో కలదు. "ప్రతి యుగమందు సంకుచిత భావులు సల్పత రాయువుల్ మదు, ర్గతికులు నైన మర్త్యుల కసమ్యములున్ స్వకృతంబులున్ మశా, శ్రుతములు నైన వేదతరుశాఖలు దా విభజించినట్టి వ, న్నుతుడు పరాశర ప్రియ తనూజుఁడు నా హరి పుట్టె నర్మిలిన్" అని వావిళ్ల ప్రతిలో సరిగానే యున్నది. 'ప్రతి యుగము' అన్నదే కవి పాఠము.

(11) శావానిరతుల్ (11—15) 'శరణంబులు నీ పదాబ్జ శావా నిరతుల్' అని కలదు. యతిని బట్టి 'శావా' అన్నదే

కవి పాఠమనిపించును. కాని, సమాసగతమై యుండుటచే కవి పాఠము కానేరదు. 'సేవానిరతుల్' అన్నదే కవి పాఠము. 'సేవా' శబ్దమును 'శావా' అని వ్రాయుట తాళపత్ర లేఖకులకు పరిపాటి. 'సేవా' అన్నచో యతి తప్పును. పోతన కొన్ని చోట్ల యతులు తప్పునని సంపాదకులే తెలిపినారు. వాటిలో ఇది యొకటి. 'వసియించి, వినచోఁ దత్పుణ్యతీర్థ సేవారతులై' (10 ఉ 1039) అని పోతన స్థలాంతరమున సరిగానే వాడి యున్నాడు. 'చెడని పదార్థకులు విష్ణుసేవా నిరతుల్' (8—127) అని పోతనయు వాడెను. యతి తప్పలేదన్న పక్షమున "సెరణంబులు నీ పదాబ్జ సేవానిరతుల్" కవి పాఠ మన దగును. శపించు—సెపించు, శల్యుఁడు—సెల్యుఁడు, శయ్య—సెజ్జ మున్నగు వానిలో 'శ—సె' మార్పు కలదు. 'సెరణము' నకు ప్రయోగాంతరము లేదు గదా'! అనవచ్చును. నిజమే కాని 'సెల్యుఁడు' అను తిక్కన ప్రయోగము ప్రయోగాంతరము లేనిచో అసాధువు కావలసినదేనా? అట్లే 'సెరణము' అనుటకు ప్రయోగాంతరము లేకున్నను క్షతి లేదు. 'శావానిరతుల్' అనుదానిని 'సంస్మరణంబుల్' అని సవరించుట కవి హృదయమునకు విరుద్ధము.

(12) శాన (10 ఉ. 667) జాలములనుండి ముత్యాల శాన లొలుక—'హ' పాఠము. 'శాన' లో అవాంఛిక వర్ణము తొలగించి 'సాన' కవి వాడియుండును. పోతన మాత్రము 'సేన' అనియే వాడెను. (10—1743) 'సేమలందుండి' అను సవరణ సరికాదని తోచును.

(13) కంచల (10 ఉ. 797) 'చ' యతిగతమై యున్నది. జెలగ-జలగ, అచ్చెరువు-అచ్చరువు, మున్నగురూపములు కలవు. అట్లే కంచెల-కంచల—ఉండవచ్చును. 'కంచల' దంత్య చకారముతోను, 'కంచెల' తాలవ్య చకారముతోను పలుకవలెను. దంత్యోచ్చారణము చేయవలసినచోట తాలవ్యోచ్చారణము లోకమున కలదు. చిన్నయసూరి సూత్రాంధ్ర వ్యాకరణములో "అక్కజాదిషు" అను సూత్రమున అక్కజము, జాణ, జాను తెనుఁగు, జడ, జలగ, చాయ—మున్నగు పదములలోని చ జ లు తాలవ్యములని అభిప్రాయపడెను. బాలవ్యాకరణమున ఈ అభిప్రాయమును ప్రకటింపక విరమించుకొనెను. శ. ర. సూ. రా నిఘంటువులలో ఈ పదములపై దంత్యచిహ్నములు నిలుపబడెను. 'కంచల' అను రూపము కలదనుటలో వ్యాకరణ వైరుధ్యము లేదని చెప్పనగును (వ్యా. సర్వ. 74 పు).

(14) చంచలమందె (4—273) ఇట విశేషణమ్ము విశేష్య లక్షకముగా వాడబడినది. (ప్రౌఢ శబ్ద 12 సూ).

(15) వారిజనేత్రి (10 ఉ 243) ఈ రూపమ్ము ముగ్ధబోధ వ్యాకరణముచే సాధువు. 'భీష్మక వరపుత్రిన్ సుత చరిత్ర వారిజనేత్రిన్" కవి పాఠము కానోపును. 'సుతచరిత్రి' అపపాఠము. యతిప్రాసలలోనే ఎంతో స్వాతంత్ర్యము చూపిన పోతన అనియతములగు శబ్దాలంకారములలో అతివాది కాజాలడు. "అలకాళి జితద్విరేఫు సంబుజనాభున్ (10 ఉ 622) మొదలగునవి.

(16) కీర్తి (4—263) కీ, ర్తి విభవ ప్రశస్త మచరిత్రుడు—'కౄత్ + క్తిన్' అగు చొప్పున కీర్తి శబ్దము సిద్ధించెనను పక్షమున "కృదికారా దక్తినః" (బహ్వాదిభ్యశ్చ—అను దాని గణపాఠము) అని యుండుటచే 'కీర్తీ' అను ఙీప్రత్యయ రూపము లభింపదు. కాన అసాధువని స్థూలదృష్టికి తోచును. కాని 'కీర్తి' శబ్దము 'హ్వాపిషిరుహి వృతి విది ఛిది కీర్తిభ్యశ్చ .... కీర్తిః" (సి. కౌ. ఉణాది 558) .... క్రూత సంశబ్దనే ఏభ్య ఇన్ ప్రత్యయ ఇత్యర్థః (బాలమ) అను చొప్పున ఏర్పడినది. ఈపక్షమున 'కీర్తి' శబ్దము నందలి ఇ కారము 'క్తిన్' ప్రత్యయ సంబంధికాదు కాన "కీర్తి కృదికారాదిత పక్షే ఙీష్" అను చొప్పున 'కీర్తీ' శబ్దము సిద్ధించును.

(17) అనుస్వార సంధి :—'న దైవం కేశవా త్పరంబని' (2—228) ఇట 'పరమ్మ' ని కవిపాఠ మనుటలో క్షతి కాన రాదు. "తస్మాద్గ్రాహ్యం, బనియును గలదనిరి వేద భక్తి విధిజ్ఞులు" అని శివతత్త్వసారమున కలదు. కాని శివతత్త్వసారము ఇతర శతకముల వంటిదే. ఇది యొక ప్రమాణము కాదు. "సర్వం విష్ణుమయము జగత్తని" అని ముద్రించిరి. దీనికే శివ తత్త్వసార ప్రయోగమును ఆధార మనుటకు లేదుగదా! ఇవి లేఖక ప్రమాద మూలకములే అనుట యుక్తము. వీనిని యథోచితముగా సంస్కరించుకొనవలెను.

గ ం గ న ర చ న

(1) నాగకన్నియలు (5—2 ఆ—124) ఇది 'నాగకన్యకా' శబ్ద భవము. దీనిని నాగకన్యకలు' అని సవరించివేసిరి. సరికాదు.

(2) అచ్యుత భావము. (5.137) 'అచ్యుతభావము' అని అన్ని ముద్రిత ప్రతులు. ప్రాసమునుబట్టి 'అచ్చుత భావము' కవి పాఠమనిరి. సమాస దోషము శివకవి ప్రయోగము వంటిదని చెప్పి సంతృప్తిపడిరి. "అచ్చుత భావము" కవి పాఠ మనుట యుక్తము. "అధిప విధవభావ మడరె నేఁడు" (9—308) అగుచో విధవ యొక్క భావము—అని గ్రహింప వలయును. 'అచ్చుతు యొక్క భావము' అని దీనినిబట్టి సమ్మతింపదగియున్నది.

పోతన రచన

(1) విరటజా గర్భంబు (1—183) విరాట శబ్దభవము 'విరట' శబ్దము. "గ్రామమానుష్య బిరుద శబ్దానామపి సోమతః" అని అధర్వణుడు గ్రామ మనుష్య నామములతో సిద్ధ సమాసము సంగీకరించి యున్నాడు. 'విరట' శబ్దము మనుష్యనామ మగుటచే "విరటజా గర్భంబు" అని ప్రయుక్తమయి యుండును. "విరటుచూల్, విరాటతనయా—అను సవరణలు కవి సమ్మతములు కావని తోచును.

(2) భానువందురులు (8—536) 'భాను చందిరులను' కవి పాఠము. "చందిరః—చంద్రః"—శబ్దకల్పద్రుమము. 'భాను చంద్రములను' అను దిద్దుబాటు సమంజసము కాదు.

(3) హైమగుండము (8—536) ఇది 'హైమకుండ' శబ్దభవము. 'హైమకుండము' అని సవరించుట తగదు.

(4) ఒక్కనేత్రుండు (8—607) ఇది 'ఖణ్ణ కంఠుండు' అను నన్నయ ప్రయోగము వంటిది. 'ఏకనేత్ర' శబ్దభవ మన్నను అనార్ఛిక వర్ణము లేకుండుటచే చిక్కులేదు. 'ఏకనేత్రుండు' అన్నదే ప్రధాన పాఠముగా ముద్రితము. పాఠాంతరము చూపబడలేదు. 'ఒక్క నేత్ర' మయ్యె నపుడు కవి పాఠమేమో ! "ఈ పద్యము తాళపత్ర ప్రతులలో లేదు. దీనికి మూలమును లేదు" అని ఫుట్‌నోటు. కనుక ఇది ప్రక్షిప్తమేని కావచ్చును.

(5) వగాయుత్తులు (10 పూ 991) "అత్తలు మామలున్ వగవ నాఱడి కోడక నాథులన్‌వగా, యుత్తులఁ జేసి" అను 'హ' పాఠము పరియ్మెనదనబడెను. కాని గ్రంథములో '్రతపా, యుత్తుల' అనియే ముద్రితము. 'ఉగాయుత్తుల' తం. వా. ప్రతుల సవరణ. 'వగాయుత్తుల" కవి పాఠము కాదు. 'వగవ' అన్న వెంటనే మరల 'వగాయుత్తుల" అని పోతన అని యుండడు. శ్రీకృష్ణుడు "ఇలువడి నున్నచేసి హృదయేశుల సిగ్గులు వుచ్చి యత్తమా, మల వెరియించి .... వత్తురాంగనలు వత్తురే ?" అన్నాడు. (10 ఉ 976) కనుక గోపికలు "అత్తలు మామలున్ వగవ నాడిక కోడక నాథులం ద్రపా, యుత్తులఁ జేసి .... వచ్చినారమే, పొత్తుల నొల్లమో పురుష భూషణ దాస్యము లిచ్చి కావవే" అన్నారు. "హృదయేశుల సిగ్గులు వుచ్చి వత్తురే" అని కృష్ణు డనియుండుటచే "నాథులం ద్రపా, యుత్తులఁ జేసి వచ్చినారము" అని గోపిక లనుట సహజము. కావున '్రతపాయుత్తుల' అన్నదే పోతన పాఠము. 'ఉగాయుత్తుల' అను సవరణయు గ్రాహ్యముకాదు.

(6) కమండలోదకము (8—628) ఇది లేఖక ప్రమాద మూలకమే కాని కవి సమ్మతము కాదు. 'కమండలూదకము' అనియె గ్రంథమున ముద్రితము.

(7) తావకీయు (7—365) 'ఈయ' ప్రత్యయ పర కత్వమున తవకాదేశము ప్రయోగింపబడినది. "తావకీయమని ప్రయోగము గలదు" అని తత్సమ చంద్రికలో ఈ భాగవత ప్రయోగమే చూపబడెను. (213 పు).

(8) ఖరతర జింహానకు (7—294) "ఖరతర జిహ్వానకు న్ఖగతర రంహానకున్" అనియే ముద్రితము. 'జింహానకు' పాఠాంతరముగాను లేదు. 'జింహ' అను రీతి ఉచ్చారణమును బట్టి అంత్యానుప్రాస సరిపెట్టుకొనబడి యుండును. లేదా యీ షడ్భేద మవివక్షిత మనుకొనవలెను.

(9) నియ్యల్లుడు (9-66). నీ + అల్లుఁడు=నియ్యల్లుఁడు అయ్యె ననుటకు అవకాశములేదు. "నీ యల్లుఁ డితఁడు భార్గవుడయ్యా .... నెయ్యంబు .... తొయ్యలి .... అని ముద్రితము. ప్రాస సరిపెట్టుటకు నియ్యల్లుఁడు' అనరాదు. "అయ్యా.... ఇయ్యాగము .... ఇయ్యాఁడుది .... మియ్యంతటి" (9—12) అనుచో 'మియ్యంతటి' అను ముద్రణమును సరికాదు. 'ఐయన్' అను తమిళ రూపమును బట్టి 'ఐయ' అను రూపమును తెలుగున కలదన నగును. 'అయ్య' అను రూపమునకు 'ఐయు' అను రూపాంతర మున్నట్లే 'అయ్య' అను రూపమునకు 'ఐయ' రూపాంతరము. నీ యల్లుఁడు, ఐయా, నేయము, తోయలి—అని మొదటి పద్యమున గ్రహింపనగును. రెండవ పద్యమున "ఐయా, ఈ యాగము, ఈ యాఁడుది, మీ యంతటి" అని గ్రహింపనగును. "ఐయా ! యనఁగ నేమి య్మైయా ! యటంచుఁ, దీయ నామంబు నజ్ఞియ యడంచి" అని ద్రావిడభాషా పారంగతుఁడగు పాల్కురికి సోమనాథుడు ప్రయోగించియున్నాడు. (పండితా.) పరిష్కర్తగారు 'అయ్యాత, దియ్య' అని అపశబ్దమును ముద్రించిరే గాని కవి పాఠమును గ్రహింప యత్నింపలేదు. "తియ్య .... ప్రయ్య .... వియ్యాన... కుయ్యాలింప" (10—పు. 1056) ఇట 'వియ్యాన' 'హ' పాఠము సరికాదు. 'వియ్యాన' అను పాఠమే సమంజసము. పాఠాంతరమును (తం. ఫుట్‌నోటు) సరిగానే యున్నది.

(10) పాడిచింది (10 పూ 800) 'పాడువుఁ గొండమీఁద బొడిచింది మొదలుగా' 'హ' పాఠము. 'పాడమింది' 'చ' ప్రతి పాఠము. 'పాడుమట' అను సవరణ యుక్తమే. 'పాడిచింది' లేఖక ప్రమాద మూలకము కావచ్చును. "ప్రొద్దు పోయింది సందని బుజ్జగించి" అని భీమఖండమున ప్రయుక్త మయి

నట్లు బాలకవి శరణ్యము 'ప్రొద్దుపోయెను' నేటి ముద్రణములు. యథాస్థితముగా అంగీకరించినను అది అనుకరణములో నున్నది. 'పొడిచింది' అనుకరణలోను లేదు. కనుక కవి పాఠము కాదు. 'పొడిచిన మొదలుగా' కవి పాఠము కావచ్చును.

(11) బ్రాహ్మలు (1—62) 'సురలున్ బ్రాహ్మలు సంయమీంద్రులు' 'బ్రహ్మలు' (బ్రహ్మ=బ్రాహ్మణుడు) అని గాని బమ్మలు అని గాని సవరణ ప్రతిపాదింపవచ్చును. కాని 'బ్రామ్మలు' కవి హృదయమని నా అభిప్రాయము. బ్రామ్మడు బ్రామ్మలు—వ్యవహారసిద్ధములు. 'పరశురాముడు తొలి, బ్రామ్మల కర్చి' (పద్మ. పు) బ్రామ్మఁడైన విష్ణుభక్తుండు గాఁడేని (పాల్కురికి) (బ్రాహ్మలు—అను ముద్రణములు సరి కావు.) బమ్మఁడు—అను రూపమునకు "రమ్మని యంటే చాలును, బమ్మఁడు నా వెంటఁ బెద్ద పరుగున వచ్చున్" అను వైజయంతీ విలాస ప్రయోగము సూ. ని. లో చూపబడినది. 'వైజ' కర్త వ్యావహారిక ప్రియుడు. కనుక అతడు 'బ్రామ్మఁడు' అనియే యిట వాడెనేమో అనిపించును. బ్రాహ్మణ శబ్దభవముగా 'బ్రామ్మఁడు' గ్రాహ్యము కావచ్చును. 'బ్రాహ్మణ' అను దిద్దుబాటు సరికాదు.

(12) తోటి (9—236) నిర్వాహక స్థలములో లేదు కాన 'తోడి' అనియే ముద్రితము. కాని "తోడు. జా "తోటివారని కొంచెపాటిగాఁ జూడక—ముకుంద" అని సూ. ని.

ఇంతవరకు రచనా విభాగ పూర్వకముగా కొన్ని ప్రయోగములను గూర్చి వ్రాసితిని. మిగిలిన వాటిలో కొన్ని ముఖ్యము లయిన ప్రయోగములను గూర్చి సంగ్రహముగా వ్రాయు చున్నాను.

(1) కచాకరణము (10 ఉ. 329) 'కచాకరిష్ణము. నారన పాఠమయి యుండునని స్థలాంతరమున వ్రాసియుంటినిఁ ముగ్ధబోధ వ్యాకరణమున 'కర్షణ' శబ్దమునకు 'కరిషణ' శబ్దము రూపాంతరముగా వీయబడెనట. అగుచో యథాస్థితముగా ఉంచవచ్చును. (తత్సమ చంద్రిక 160 పు) లేనిచో 'కరిషణ' కవిపాఠ మనవచ్చును. ('ఆ' ఉపసర్గ.)

(2) హరుష (11—55) "హరుషాశ్రు పులకితుం డయి, పురుషుఁడు" తత్సమ చంద్రికలో 'హర్షము—హరుషము' అని రూపభేద ప్రకరణమున చూపబడెను. "హరుషః—అ. పు. హర్షః అని పర్యశబ్దసంబోధిని. కనుక 'హరుష' అనుపాఠము 'హరషాశ్రు' అనవలెను. "హరిషః-పుం. హర్షః-ఇతి కేచి" అని శబ్దకల్పద్రుమము. కాన 'హరాషాశ్రు' అనియొని గ్రహింపవలెను. 'తం. వా.' ప్రతులలోని 'భరితాశ్రు' అను దిద్దుబాటు సరి కాదు.

(3) క. హర్షము గదురగ భారత
వర్షమునం గలుగు పుణ్యవర తీర్థములు
త్కర్షం జూచుచు విగతా
మర్షుండై సంచరించె మనుజవరేణ్యా. (3—40)

హరుషము. వరుషము, ఉత్కరుషము (ట ఠ జ డ)—అని ఫుట్‌నోటులో కలదు. హరిష, కరిష, వరిష, సరిషప, ప్రరిశ శబ్దములనుబట్టి 'మరిష' శబ్దమును ఉండవచ్చునని తోచును. "వరిషం—వృ + సః బాహులకాత్ ఇట్. వత్సరః—ఇతి శబ్ద రత్నావళీ. వర్షః స్యాత్ వరిషేప్యా పిచ' ఇత్యుజ్జ్వలదత్త ధృత చంద్రదవచనమ్" అని శబ్దకల్పద్రుమము. "మృష + షుఙః — పృషోదరా దిత్వాత్ః మరిషః' అని 'మరిష' శబ్దమును సైతము సాధించుకొనవచ్చును. కనుక హరిషము (హరషము) వరిషము, ఉత్కరిషన్ (ఉత్కరిషణ్) విగతా, మరిషుండై ః' అన్నవి నారన పాఠములు కావచ్చును.

(4) సద్వితీయుఁడు (4—581) 'స' శబ్దము 'సుప్ సుపా' అను చొప్పున ద్వితీయ శబ్దముతో సమసించెను. "సద్వితీయుడు రామనాథుఁడే కర్త" బసవ. (వ్యా. సం. సర్వ 199 పు.)

(5) నాకౌక సార్థము. (10 ఉ 1150) "సంబంధార్థమందో లేక స్వార్థమందో అణ్ ప్రత్యయాన్ని చేసుకున్నప్పటికీ వచ్చే వైరూప్యం ఆదియం దుండదు. అంతములందు అణ్ణు చేరి అకారాంతమై అప్పుడు ఆకారాంత మవుతుంది. అర్థశబ్దం కల్పితే ప్రస్తుత రూపం సిద్ధిస్తుంది" అన్నారు. శ్రీ వెల్లసిళ్లవారు. ఈ నారన ప్రయోగము వలెనే "సుధాంధ సమూహి" (7—482) అను పోతన ప్రయోగమును సమర్థనీయము.

(6) యశోల్లాస (10 ఉ 379) "కేచిత్సకారాంతః అకారాంతా అపి భవంతి' అను న్యాయముచే 'యశ' అను అకారాంతము గలదనవలెను. 'సమ్యగ్య శశాలి' అను భారత ప్రయోగమును గలదు. (అరణ్య 6—92) "రమాకు, చ రజ వివిలివృ" (పాండు 2—108) అని రామకృష్ణుఁడు 'రజ' శబ్దమును వాడెను. ఇట్లే 'వాసస్' అను సకారాంతమే కాక 'వాస' అను అకారాంతమును గలదు. "వాస—వస ఘఞ్. గృహే—వస్త్రే—శబ్దస్తోమ మహానిధి. 'దుర్వాస తీర్థముత్సుకతమైఁ జూడు" (పండితా) "రజః—రంజయుతీతి. రన్‌జ్ + అచ్" శబ్దక.

(7) అంజని (5—2 ఆ—51) 'అంజనీసుతుఁడు' అని ముద్రితము. 'అంజనా' శబ్దము మాత్రమే సంస్కృత కోశములలో కలదు. ఇట 'నీ' యతిగతమును కాదు. కాని 'అంజన' శబ్దమునకు 'అ' ప్రత్యయముతోపాటు 'శః

ప్రత్యయమును రావచ్చునని తత్సమ చంద్రికను బట్టి తెలియు చున్నది (306 పు) కాన ఈ గంగన ప్రయోగము సాధువే, అనదగును.

(8) సమాసాంతములు :—బ్రహ్మవర్చస్సు (4—671, 6—288) సప్త గోదావరి (10 ఉ. 946. సప్త గోదావరీం—మూలము) అహోరాత్రులు (5—2 ఆ—87) అని వారన, సింగన, గంగనలు ప్రయోగించిరి. "సమాసాన్త విధిర నిత్యః" అను పరిభాష చొప్పున సమాసాంత ప్రత్యయములు రాలేదనుకొనవలెను. 'అర్ధరాత్రి' అని (3—103) వారన ప్రయోగించెను. "పూర్వాపరాధరోత్తర మేకదేశి నైకాధికరణే" (సి. కౌ. 712) అను సూత్రమున 'మధ్య' శబ్దము లేకుండుటచే "అహస్సర్వైకదేశ సంఖ్యాత పుణ్యాచ్చరాత్రేః" (సి. కౌ. 787) అను సూత్రమున విధింపబడిన సమాసాంతము రాదు. కనుక 'మధ్యరాత్రి' అనియే అగునని మల్లినాథసూరి మతముగా చెప్పవలసియున్నది. (ఉపారతాః పశ్చిమరాత్రి గోచరాత్—అను కిరాతార్జునీయ వ్యాఖ్య.) కాని "కేచిత్తు సర్వైకదేశః కాలేన సమస్యతే న త్వహ్నైవ. జ్ఞాపకస్య సామాన్యాపేక్షత్వాత్. తేన మధ్య రాత్రః ఉపారతాః పశ్చిమరాత్ర గోచరా ఇత్యాది సిద్ధ మిత్యాహుః" అని భట్టోజీ దీక్షితులు తెలిపినారు. (సి. కౌ. 712) 'కేచిత్తు' అని వారే యిది కేచిన్మత మన్నారు. కనుక 'మధ్యరాత్రి' అనియు ఒక మతమున ఉండవచ్చునని తోచును. "సమాసాన్త విధి రనిత్యః" అన్నది యెట్లును కలదు. కావున సమాధేయమే.

(9) పుమ్పంధయు (10—1462; 10—1694) 'ముంజకూలాస్య పుస్పిద్దేటః"—అను ముగ్ధబోధ వ్యాకరణముచే ఇది సాధువు. నన్నయాదులతోపాటు "ముష్టాముష్టి" (10 ఉ 66) రూపమును పోతన వాడెను. ఇదియు ముగ్ధబోధ సమ్మతమే. 'పుమ్పంధయు' (ప్రభావ 3—35. శ్రీ వెం. సూ. వ్యాఖ్య)

(10) ఇచ్ఛయించు. (8—195) "ఇచ్ఛయింతువె తుచ్ఛ వృత్తికి" అనుచో 'చ్ఛ' ప్రాసగతమై యున్నది. ఈ పదము పలుచోట్ల ఇట్లే ముద్రితము. ఇచ్ఛ + ఇంచు = ఇచ్ఛయించు అగుటకు దారిలేదు. 'కరుణయించు'.వంటి రూపము లనులేవు ఇచ్ఛ + ఇంచు—ఇచ్ఛించు-అగుటధర్మము. "ఎటనుండి వచ్చితి మేమి యిచ్ఛించెదు" (8—305) అనుచో "ఇచ్ఛించు' పోతనచే ప్రయోగింపబడినది. కాన కోప + ఇంచు—కోపించు, కోపగించు అను రూపద్వయము వలెనే ఇచ్ఛ + ఇంచు—ఇచ్ఛించు, ఇచ్ఛగించు—అను రూపద్వయము సమ్మతింపనగును. (బాల. క్రియా 79) 'ఇచ్ఛయించు' అను పాఠ మనియు 'ఇచ్ఛగించు' సాధు పాఠమనియు తోచుచున్నది.

(11) అఖిలరూపులు. (8—80) ఇది పోతన ప్రయోగము. వారనయు నరరూపు (4—457) అని వాడెను. బహురూపులు—పాల్కురికి. చిత్రరూపులు—అని తిక్కన. (ఉద్యో 4—116, భీష్మ 1—240, భీష్మ 2—157) తిక్కన పరివార సన్నాహ బిరుదు గలుగ" (నిర్వచ) అని 'బిరుదు' శబ్దమును తత్సమముగానే వాడెనని శ్రీ చెళ్లపిళ్లవారు తెలిపి యున్నారు. 'శరణన్న గాచుదు' అను నన్నయగారి 'శరణు' ఎట్టిదో రూపు, బిరుదు శబ్దములును అట్టివే. వీటిని నిఘంటువులు వైకృతము లనుట పొరపాటు. (బాల. ఉద్యో. 125 పు.)

(12) బాలకి (11—20) ఈ రూపము నితర కవులు నిర్ధారక స్థలములలో వాడిరి. (భోజరా. 3. 175, పారిజా 4—16). "షిద్గౌరాదిభ్యశ్చ—అకృతి గణోయమ్ (సి. కౌ. 498 స్త్రీ ప్రత్యయ) అని యుండుటచే (షిద్గౌరాదిభ్యశ్చ—అను సూత్రమువద్ద) బాలక—'బాలకీ' కావచ్చునని తోచును. ఇట్లే 'వల్లభీ' శబ్దమును సాధించుకొన నగును. (8—474; 9—632) 'వాయకి' (పాండు 3—132).

ఇంకను చర్చనీయాంశములున్నను విస్తరభీతి నింతతో విరమించుచున్నాను. "భాగవత ప్రయోగమనే టప్పటికి ఇక చెప్పేదేమిటి ? "సహేంద్ర తక్షకాయస్వాహా ! అయ్యో, అయ్యో ఇది యెంత అన్యాయం" అన్నారు శ్రీ చెళ్లపిళ్లవారు. ఈ అన్యాయమును తొలగించుటకు నా చేసిన యీ ప్రయత్నము ఎంతవరకు సఫలమయినదో పండితలోకమే ప్రమాణము. ఛందో విషయములను గూర్చియు ఇతర అవసరములను గూర్చియు ప్రత్యేక వ్యాసములలో చర్చింపవలసి యున్నది. ఇప్పటికి స్వస్తి.

శబ్దమయ ప్రపంచం-3

శ్రీ జాఁ పోల్ సార్త్రె

1963. ఏప్రిల్: 22వ తేదీ. కొత్తఇల్లు. పదిలంత స్థులకు పైగా వుంది. నేను ఏదో అంతస్తులో కూర్చున్నాను. ప్రూఫులు దిద్దుతున్నాను. కిటికీ తెరిచివుంది. పారిస్ కన్పిస్తున్నది. ఒక స్మశానం కన్పిస్తున్నది. సెయింట్ క్లౌడ్ వుంది. పర్వతం. నీలంగావుంది. అది కన్పిస్తున్నది. నాపట్టుదల ఏమో ఇక్కడే కన్పిస్తుంది. ప్రతిదీ మారిపోయింది. నేను వున్నాను. ఈ ఉన్నతస్థాన సంపాదన చికీర్షే నాకు తగినదని చిన్నతనంలో నేను అనుకునివుంటే, పావురాళ్ళయందు నాకు గల ప్రేముడి అభివ్యక్తం అయివుండవలసింది. ఈ వృధావాంఛ కన్పించివుండ వలసింది.

నేను ఉన్నతుణ్ణికాదు. ఆ ఔన్నత్యపులేమి ఇందులో కలిమి అయివుండవలసింది. అట్లా జరగలేదు. నేను అనుకున్న పవిత్ర వృక్షాన్ని అధిరోహించడం అన్నది ఇక్కడ సమస్యే కాదు. నేను అక్కడే వున్నాను. క్రిందికి దిగిరావడం నాకు ఇష్టం లేదు. వద్దను కున్నాను. ఇతరులకంటే ఉన్నతుణ్ణి అనిపించుకుందామన్న దిలాసా నాకు వున్నదా? అదీలేదు. నాకు అచ్చమైన గాలిలో తేలిపోవాలనివుంది. గాలిలాగా లాఘవతతో గాలిలో ఆడే వస్తువుల మధ్య వుందామనివుంది. తర్వాత తర్వాత గాలి పడగలను పట్టుకు ప్రేళ్ళాడటమునకు బదులు, క్రింది దిగి రావడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేశాను. పాదరక్షలకు సీసపు 'అడుగులు' వేయించవలసి వచ్చింది. కొన్ని కొన్ని సమయాలలో దిన్న ఇసుకల మధ్య నీళ్లలో పుట్టేక్రిమి కీటాలతో తగాదాలు పడ్డాను. వాటికి పేర్లుకూడా వుండి వుండవు. నేను పెట్టాను. మరికొన్ని సమయాలలో నేను పట్టి ఆకట్టుణ్ణాయి పోయినాను. ఏదో అప్రవస్యమైన లఘుత్వం నన్ను పైకి తేలుస్తూ వచ్చింది. చివరికి నాశక్తి ఎందుకు కొరగాకుండా పోయింది. ఒక్కప్పుడు నేను డికారే గారి తర్కంలో మునకలు వేసే వాడిని. మరి ఒకప్పుడు విట్టి సముద్రంలో మునిగేవాడిని. యుగపత్తుగా ఈ రెండు పనులూ చేసిన సందర్భాలు కూడా వున్నాయి. అంతా సందర్భాన్ని పట్టి జరుగుతూ వుంటుంది. గాలిలో తిరగడం అల వాటై పోయింది. క్రిందికిదిగి తిరుగుదామని కూడా ప్రయత్నిస్తానుగాని, సాధ్యమేకావడం లేదు.

నాకు రచయితలను గురించి చెప్పక తప్పదు. తాతయ్య ఆ పని చేశాడు. చేశాడేకాని, అబ్బో! అందులో ఎంత జాగ్రత్త. వేడి ఏమాత్రం లేదు. చప్పగా చెప్పాడు. గొప్పవాళ్ల పేర్లన్నీ నేర్పాడు. ఒంటరిగా నేను ఆ పేర్లను వల్లె వేశాను. హెసియడ్ దగ్గరనుంచి హ్యూగో దాకా నాకు ఆ జాబితా అంతా కంఠోపాఠం అయిపోయింది. నాకు నేనే ఆ పేర్లను అప్పచెప్పు కునేవాణ్ణి. వాళ్లు దేవతలు. దేవతలతో సమానమైన వాళ్లు. వాళ్ళు ప్రవక్తలు. ఛార్లెస్ ష్వీట్జర్ వాళ్ళను ఆరాధిస్తున్నాను అనేవాడు. అనేవాడేగాని వాళ్ళంటే మహా గాబరా ఎత్తిపోయేది. వీళ్లు మనుష్యులు. గొప్ప రచనలు చేశారు. వారి సృష్టి పరమోత్తమంగా వుంది. ఇదంతా "హోలీ గోస్టు" చేసిందనడం ఎట్లా. తాతయ్యకు అది చిక్కుగా వుండేది. వీళ్లు వుండి తన్ను ఆ మాట అననీయడం లేదు. అడ్డువస్తున్నారు. అసలు తాతయ్యకు పేరూవూరూ చెప్పకుండా రచనలు సాగించినవాళ్లంటే ఇష్టం. పెద్ద పెద్ద భవంతులుకట్టి పేరు చెప్పకుండా అంతరించిన శిల్పులు ఎందరో వున్నారు. జానపద కవిత్వం వుంది. వ్రాసింది ఎవరో తెలియదు. వ్రాసిన వాళ్ళుచెప్పుకో లేదు. వాళ్ళంటే ఇష్టం. షేక్స్పియర్ ఉన్నాడు. తాతయ్యకు ఆయనయందు ద్వేషం కించిత్తూలేదు. అందుకు కారణం వుంది. ఆ షేక్స్పియర్ నేను ఫలానా అని చెప్పివావలేదు. హోమర్ అన్నా తాతయ్యకు ప్రేమ. ఇందుకే. ఇట్లాంటి మహాపురుషులు చాలా మంది వున్నారు. వాళ్లు నిజంగా వున్నదీ లేనిదీ కూడా తెలియదు. అందుకని తాతయ్య వాళ్లందర్నీ ప్రేమిస్తాడు. ఇకపేరూ వుండి, వూరూ వుండి, తన సంగతి ఏమిటో పూర్తిగా చెప్పుకోక మిగుల్చుకున్న వాళ్లు కొందరు వుంటారు. వాళ్లతో తాతయ్య సర్దుకు పోతాడు. వాళ్లు బ్రతికివున్నారా యేమిటి ? చచ్చిపోయినారు—అంటాడు. సమకాలంలో వాళ్లను ఎవ్వర్నమా

మెచ్చుకొనటం తాతయ్య పనికాదు. ఒక్క అనటోల్ ఫ్రాన్సు మినహా. అట్లాగే కోర్ట్‌లెన్‌ను కూడా కొంచెం మెచ్చుకునేవాడు. వాళ్ళిద్దరు ఆయనకు కొంచెం సుఖాన్ని తెస్తున్నట్లు కన్పించేవాళ్ళు.

ఛార్లెస్ స్క్వ్యాట్జర్ వృద్ధుడు. సభ్యత కల మనిషి. రూపసి. మంచిలక్షణాలు కలవాడు. అందువల్ల ఆయన్ను అంతా గౌర వించేవాళ్ళు. అది ఆయనకు ఎంతో ఆనందంగా వుండేది. మార్టిన్ లూథర్ గోత్రానికి చెందినవాణ్ణి కదా అని కూడా తాతయ్యకు వుండేది కాదు. బైబిలులో చెప్పినట్లు, తన ఇంటిని ఆ పరమాత్మ ఆదరించాడని అనుకుంటూవుండేవాడు. ఆ మాట అనకుండా, అనుకోకుండా వుండే వాడు కాదు. భోజనాల ముందు కూర్చున్నప్పుడు తాను గడిపిన జీవితాన్ని గురించి సమీక్ష చేసుకొని, వున్నవాడు వున్నట్లుగా దానికి విరమనం కుదుర్చుకునేవాడు. ఇట్లా చెప్పేవాడు. "పిల్లలు! ఒకళ్లను మాట అనవలసిన పని లేకుండా జీవితందొర్లిపోవడం ఎంత అదృష్టంవుంటే కల్గుతుంది." తాతయ్యకు వుండి వుండి కోపం వస్తూవుంటుంది. దర్పం ఎక్కువ. దర్జా అధికం. ఆత్మాభిమానం కూడా తక్కువకాదు. అతీంద్రియ విషయలన్నా మహద్విషయులన్నా ఆసక్తిమెండు. ఈ అన్నింటి అడుగునాపడి ఒక విధమైన పిరికితనం అవగుంఠితం చెంది వుంది. ఆ పిరికి తనం ఆత్మ సంబంధము, జీవిత తత్వ సంబంధము అయింది. ఆయన మతం, ఆయన కాలం, ఆయన పరిసరాలు, చదివిన విశ్వ విద్యాలయం వీటి అన్నింటిలోనుంచి అది పుట్టుకు వచ్చింది. ఇది కారణం ఏమో, తాతయ్యకు లైబ్రరీలోవున్న పవిత్రులు, రాక్షసులు అయిన రచయితలంటే గిట్టకపోవడం. వాళ్లను వట్టి వెధవలు అని ఆయన పైకి అనకపోయినా, రహస్యంగా లోపల అనుకుంటూఉండేవాడు. వాళ్ల పుస్తకాలుసరే! తాతయ్య హృదయాంతరాళంలో మాత్రం ఆ భావం ఉంది. అవి ఎందుకు పనికిరానివి. అసంబద్ధమైనవి. చెత్త. నేను పార బడ్డాను. తాతయ్యలో ఉత్సాహం బలవంతంగా తెచ్చి పెట్టి కున్నట్లు ఉండేది. ఆ ఉత్సాహం అడుగున ముక్తసరిగా ఉండటం ఉండేది. నేను దీన్ని కాఠిన్యం అనుకునేవాణ్ణి. ఒక పరీక్షకుడు చూపిస్తున్న తీవ్ర వైఖరి అనుకునేవాణ్ణి. అయితే ఆయన మత గురువు అవడంచేత వీటి అన్నింటికి అతీతుడుగా ఉండ కల్గేవాడు. ఉండేవాడు. ఆయన ఎట్లా ఉంటే నాకేమి! నాకు మాత్రం ఇట్లా చెప్పేవాడు : అబ్బాయి! ప్రతిభ అన్నది ఉన్నది. అది అప్పనంటిది. కష్టపడితేనేగాని పుట్టదు. అందుకు ఎంతో బాధపడాలి. ఎంతో నలగాలి. కొంచెం తగ్గుస్థాయిలోనే అనుకో, గట్టివిమైన కష్టాలు, విమ్మరాలు అనుభవించాలి. ఇంతచేస్తే నీకు ఏవో మాటలు విన్పిస్తాయి. ఏదో పలుక్కుతుంది. ఆ మాట చెప్పినట్లు వ్రాయి : ఇట్లా చెప్పేవాడు.

రష్యాలో మొదటి విప్లవానికి ప్రపంచ యుద్ధానికి నడిమి కాలంలో, 'మల్లార్మె' మరణించిన పదిహేను ఏళ తర్వాత, దాన్యేల్-పాల్=దోపి కొత్త విషయాలను కనిపెడుతున్న రోజుల్లో 19 వ శతాబ్దానికి చెందిన ఒక మనిషి. తన మనమడికి లూయీ ఫిలిప్‌కాలంనాటి భావాలను బోధ చేస్తున్నాడు. రైతాంగంలో కొన్ని కొన్ని అలవాట్లు, ఆచారాలు పాతుకుపోయి ఉండటం ఎందుకో కారణం ఇదేననిపిస్తుంది. తండ్రులు పొలాలకు పోతారు. పిల్లలు ఇంట్లో ఉంటారు. వాళ్ల ముసలివాళ్ల చేతుల్లో పడ తారు. నేను తల ఎత్తడమే ఇట్లా జరిగింది. ఇరవై అయ్యే దేళ్ల లోపంతో తలఎత్తాను. ఇంకా చెప్పాలి అంటారా? నాకు నాకే తెలియదు. మన సమాజాలు స్తిమితం కలవికావు. ఎన్నో ఎగుళ్ళు. ఎన్నో దిగుళ్ళు. ఇందులో ఆలస్యాలు. ఆ ఆలస్యాలవల్ల నాకు కొంత కలిసి వచ్చింది. దీన్ని ఇట్లా ఉంచుదాము. నా ముఖాన ఒక బొమిక పారవేశారు. పీక్కుతినమన్నారు. నేను వదిలి పెట్ట లేదు. అది అద్దంలాగాఅయి, ఇటునుంచి చూస్తే అటు కన్పించే టంతవరకు దాని పని పట్టించాను. తాతయ్య అనుకున్నది ఒకటి. రచయితలంతా వట్టి తార్పుడుగాళ్ళు: వాళ్లంటే నాకు అసహ్యం పుట్టిద్దా మనుకున్నాడు. జరిగింది ఇంకొకటి. ఆయన అనుకున్నదానికి పూర్తిగా వ్యతిరేకంగా జరిగింది. నాకు ఒక చిక్కువచ్చి పడింది. బుద్ధి విభవానికి యోగ్యతకు తేడా ఎరుగలేకపోయినాను. ఒకదానిని ఒకటి అని భ్రమపడ్డాను. ఈ గ్రంథకర్తలంతా నాకు మల్లేనే కౌటిల్యం తెలియనివాళ్ళు. ఆర్జవం కలవాళ్ళు. నేను మంచిగా ఉన్నాననుకోండి. లేదా పెగడ్డలు వేసినప్పుడు ఆ బాధను భరించాననుకోండి. అందుకు తగిన ప్రతిఫలం నాకు లభించాలి. ఆ హక్కు నాకు ఉంది. శైశవంఅంటే అదే. ఛార్లెస్ స్క్వ్యాట్జర్ నాకు ఇతరులైన పిల్లలను చూపించేవాడు. నాకు మల్లేనే పరీక్ష చేసేవాడు. నన్ను సంభావించినట్లే సంభావించేవాడు. వాళ్ళు కూడా నాకు మల్లేనే పిల్లలు. జీవితమంతా నా అంత వయస్సులోనే గడిపారు. నాకు అన్నలు లేరు : తమ్ముళ్ళు లేరు; అక్కలులేరు: చెల్లెళ్ళు లేరు; ఆఖరికి కలిసి ఆడుకునే స్నేహితులు గూడా లేరు. వీరిని నాకు స్నేహితులు అనుకున్నాను. స్నేహితులను చేసుకున్నాను. వాళ్ళు నాకు తొలి స్నేహితులు. వాళ్ల ప్రేమలు చేశారు. బాధలు పడ్డారు. వారి నవలలో నాయకులను పోలి. ఇది ముఖ్యం. వాళ్ళు చెడలేదు. బాగుపడ్డారు. వారి బాధలను నేను పిల్చానా అనిపించేది. వారియందు అనుక్రోశం. ఆనంద ప్రసన్నమైన సానుభూతితో ఆ బాధలను రెక్కొల్పి నానా అనిపించేది. వాళ్ళు,

ఆ కుర్రవాళ్ళు అట్లా దైన్యంలో పడి ఉన్నప్పుడు ఎంత ఆనందాన్ని పొందేవాళ్ళు. "ఏమి అదృష్టం! ఒక మంచి వాక్యం జ్ఞాపకొచ్చింది.

వార్ధక్యంలో వాళ్ళెప్పుడు మృతిని కనలేదు. జీవం ఇంకా వాళ్ళ గ్రంథాలుగా రూపాంతరం చెందారు. కార్లైల్ వున్నాడా! పట్టికొండవాళ్ళు. ఎర్రబడినట్లు ముఖం. అన్నీ గ్రంథులు. వీపు అదోవిధంగా వుండేది. పిరా కంపు కొట్టేవాడు. శతమునీ, ఈ శ్వర్గళీ, మెత్తని మాటలు తోలి ఎదుగనివాడు, అతని పుస్తకాలను తొడలు పడేట్టు మోపాను. అతని గ్రంథాలు అట్లా చేత తిరగ వేస్తేవాలు, రసాన్యాలు త్రవ్వి పోసున్నట్లు వుండేది. ఫ్లాబేర్ నన్ను రకం మనిషి. వాగ్మికత ఎరిగిన వాడై లక్షణం అయిన దగ్గర కన్పించదు. పట్టి ఏదుకంపు. ఒళ్ళంతా మచ్చలు. ముడతలు. విక్టర్ హ్యూగో బహుముఖీన ప్రతిభ కలవాడు. ఎక్కడేది కన్పిస్తే దానిమీద పిట్ట కూర్చున్నట్లు కూర్చునేవాడు. కదిలేవాడు కాదు. వీళ్ల కాయిక విషయాలు ఇట్లాంటివి. మరి వాళ్ల అక్షరో! పుస్తకాలలో కన్పిస్తాయి. వాటిల్లో అవి కాపురం చేస్తాయి. ఆ పుస్తకాలలో పుటలు, అవి పుటలుకావు, కిటికీలు. ఆ కిటికీలు గాజుబందీ చేశారు. ఆ గాజుబందీని ఆనుకొని ఏదో ముఖం కన్పించేది. నన్ను బెదిరిస్తున్నట్లు, నన్ను చూస్తున్నట్లు వుండేది. నేను ఏమి చూట్టం లేనట్లు వుండేవాడిని. ఉరుకునే వాడిని. చదువుకుంటూ పోయేవాడిని. నాకళ్ల అక్షరాలకు అంటుకు పోయ్యేవి. ఛాటోబ్రాండ్ చర్చి ఎక్కడ వున్నాడో— అతని దృష్టి క్రింద ఇట్లా జరిగేది. ఇట్లా ఎంతోసేపు ఉండేదికాదు. తర్వాత నేను, నా ఆటగాళ్ళు. వాళ్ళను నేను పూజించేవాణ్ణి. ఉపాసించేవాణ్ణి. వాళ్ళకున్న నాకు అధికులు ఎవ్వరూలేరు. వాళ్ళను ఆ అంతస్తులో పెట్టాను. జర్మనీని ఫార్డెన్ అనేరాజు పాలించాడట. పడవ ఫార్డెన్. ఆయన కైటస్ అనే అరమ బొమ్మలు చేయడానికి నాటిన కుంపటి పెట్టుకున్నాడట! అయితే ఏమైంది! రాజా అంటూ ఉన్నదెందుకు? అందుకే నాకు రాజులంటే పిసరంత కూడా గౌరవం లేదు. వాళ్ళు గొప్పవాళ్ళు. అందుకని వాళ్ళను ఎందుకు పొగడాలి. భట్టువని చెయ్యాలని ఎక్కడ ఉంది. వాళ్ళు చెయ్యవలసినది చేస్తున్నారు. వాళ్లకంటే ఇతరులు తక్కువ వాళ్ల మనుకుంటారు. అట్లా చాలకపోయినందుకు వారిని నేను నిందిస్తాను. నాతో అంతా తల్లక్రిందులే. ఏది ఉన్నదో అది నాకు సాధారణ విషయం అవుతున్నది. మానవజాతి అంతా ఒక "సెలెక్టు కమిటీ". దాన్ని చుట్టేసుట్టూ జంతువులు కూర్చున్నాయి. ఇట్లా ఉంది.

తాతయ్య గూడా వాళ్లను గురించి మంచి మాట చెప్పలేదు. సరిగ్గా చెప్పలేదు. చెప్పటంటే గంభీరతతో లీనమై ఉండేవాడిని. తేలిక చేసేవాణ్ణికాదు. విక్టర్ హ్యూగో మరణించాడు. అంతే. తాతయ్య మళ్లీ పుస్తకం ముట్టుకుంటే ఒట్టు. చేయడానికి ఏమీ లేకపోయినప్పుడు, హ్యూగోను పుచ్చుకొని పేజీలు తిరగ వేసేవాడు. తాతయ్య పని చదవడంకాదు. తర్జుమా చెయ్యడం. ప్రపంచ సాహిత్యమంతా తాతయ్యకు ముడి పదార్థం. గ్రంథకర్తలున్నారు. వారికి యోగ్యతలు నిర్ణయించేవాడు. అందులో గూడా వరుసగడే. వరుసగతూనే జాబితా చేసేవాడు. ఇది పైకి. తాతయ్యకు మక్కువ కొందరియందు. అది ఎంత దాచ్చామన్నా దాగేదికాదు. ఆ మక్కువలు పట్టేవి కాదు. ప్రయోజనంతో ఉపయోగంతో కూడి ఉండేవి. మపాసా ఉన్నాడు. జర్మన్ విద్యార్థులకు అపరూపాలు అయిన్ను వ. స్త్రీ ఖర్గిని. పాటలు కట్టడంలో గొథెని మించడం ఎట్లా! తాతయ్యకు నవలలు నచ్చేవికాదు. నవలలంటే మంచి అభిప్రాయం కూడా లేదు. కాని ఐదు పంతులాయె. ఇబ్బ ప్రపంచంకోసం వాటిని వదిలేందుకు ఇష్టపడకపోయింది. అందువల్ల అవి అమూల్యాలయ్యాయి. పూర్తిగాకాదు. ముఖ్యమైన భాగాలు మాత్రమే. తర్వాత చూదాము. మదాం బవరీ లోంచి కొన్ని ముఖ్య భాగాలను మపాస్సా తన శిష్యుల్లకోసం పనిపెట్టుకొని పుస్తకంగా చేశాడు. తాతయ్య దాన్ని తిప్పుతూవుండేవాడు. ఒకమూల ఫ్లాబేర్ పుస్తకం—పుస్తకం అక్కడ పడిఉంది. ఇరవై సంవత్సరాలుగా పడిఉంది. ఆయన దాన్ని అనుభవించవచ్చు. తాతయ్యకు వాళ్ళు అక్కరలేదా! నాకు అట్లా అనిపించింది. అందువల్ల నా పని తేలిక కాలేదు. సైకి ఏమో వాళ్ళను పూజిస్తున్నట్లు, భక్తి చేస్తున్నట్లు నటించేవాడు. నిజానికి వాళ్ళను కట్టి పడ చేసేవాడు. ఇంకో భాషలోకి వాళ్ళను దింపడంకోసం ముక్కలు చేయడానికి జంకేవాడుకాదు. అట్లా చేయటం తేలిగ్గా ఉండేది కాబట్టి.

వాళ్ళ గొప్పతనం, వాళ్ళ దైన్యం నాకు ఒక్కసారిగా అర్థమైనాయి. 'కూర్‌మోయీ'కి పరిపోయే దురదృష్టం 'మెరిమే'కి పట్టింది. అందుకోసం అతను ద్వంద్వ జీవితం గడిపాడు. లైబ్రరీవాలుగో అంతస్తులో కొలంబా ఉంది. వేయి రెక్కలతోటి పావురంలా ఉంది. పిలిస్తేరాలు వస్తానన్నట్లుగా ఉంది. అటు చూసేవాళ్ళే లేరు. ఒక్క సారి అటు పోయిన పాపం జరగలేదు. ఒక్కసారి ఆ అందాన్ని కుమ్మలేదు. పుస్తకాల బీరువాలలో అడుగు భాగాన శం కన్యక, శం అనాధ్రమాత పుణ్యం వల్లని కంపుకొట్టే పాత 'బైండు'లో బంధించబడి ఉంది. ఆ కథలో మార్పులేదు. ఆ భాషలో తేడాలేదు, అంతా అదే. జర్మన్ భాషలో "నోట్సు" ఉన్నాయి. మాటలు.

మాటలకు అర్థాలు ఉన్నాయి. నేను ఇంకో మాట కూడా విన్నాను. అల్సెస్—లోరైన్ ఘోరం తర్వాత ఇంత ఘోరం ఎప్పుడూ జరిగి ఉండదు. అది బెర్లిన్‌లో ప్రకటించబడిందట. తాతయ్య ఆ పుస్తకాన్ని వారానికి రెండుసార్లు తన పంచీలో పెట్టుకునేవాడు. దాన్ని నానా పాడు చేశాడు. అన్నీ మరకలు. గుర్తులు. బొబ్బలు. నాకు అసహ్యం వేసింది. జుగుప్స కల్గింది. ఇది 'మెరిమీ'ని అవమానపరచడం. అందులో ప్రతి ఒక్కముక్క నా కళ్లముందు పడింది. బళ్లో తాతయ్య నోట్లోంచి పడ్డట్టు. జర్మనీలో అచ్చు వేశారు. జర్మన్‌లకోసం అచ్చు వేశారు. ఈ మాటలేమిటి? తెలిసినవి: గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉన్నవి. ఇవి ఫ్రెంచి మాటలకు కుటిలమైన విడంబనాలు కాకపోతే ఏమిటి?

నా యువ మిత్రుల కష్టాలు ఇట్లా ఉన్నాయి. నేను వారితో సమానుడను అనుకున్నాను. సమానుడను అన్న విశ్వాసం నాకు కుదిరింది. వారి శక్తులు, సామర్థ్యాలు నాకు లేవు. వ్రాద్దామన్న బుద్ధి గూడా నాకు అప్పటికి పుట్టలేదు. నేను ఒక మత గురువు మనుమణ్ణి. అందుచేత ఆభిజాత్యంవల్ల వాళ్లకంటే గొప్పవాణ్ణి. నాలో పరాయణత్వం ఉంది. అనుమానం లేదు. ఈ మత గురువులు మృత్యు సాత్కృతులు అవుతూ ఉండటం ఉంది. వాటిని వింటేనే నాకు అకాండ క్షోభంగా ఉంటుంది. అవి నాకు రుచించలేదు. కాని మత గురుత్వం అంటే కొంత ప్రేమ, భక్తి కుదిరాయి. ఛార్లెస్ ష్క్వైట్జర్ మతానికి రక్షకుడు. సంస్కృతికి కాపలాదారు. నేనూ అట్లాగే అనుకున్నాను. నాలో జీవ చైతన్యం పుష్కలంగా ఉంది. క్రియ మాణత్వము అంతే. మరణించిన వారిని ముక్కలు చేయడం ఎట్లాగో నాకు తెలియలేదు. నాకు ఏవో ఇష్టాలు అయిష్టాలు ఉన్నాయి. వాళ్లమీద వాటిని ప్రయోగించాను. వాళ్లను చేతుల్లోకి తీసుకున్నాను. మోశాను. నేలమీద పెట్టాను. తెరిచాను. మూశాను. వారికిస్థితిలేదు. భావస్థిరతలేదు. ఆలేని దానిలోనుంచి వూడలాగాను. తిరిగి అందులోకి త్రోశాను. ఇవి మనుష్య పేటికలు. నాకు ఆట బొమ్మలు. వారికి అమరత్వం అంటకట్టబడింది. అది వారి అవస్థ. పశ్చాదవస్థానం. అది దయనీయమైన పక్షవాత స్థితి. నాకు దుఃఖం వేసేది. తాతయ్య ఈ గాఢ సౌహార్దములను ప్రోత్సహించేవాడు. ప్రతి శిశువు ఉద్దీప్తుడౌతూ ఉండటం ఉంది. కవులనుచూచి ద్వేషించవలసిన అవసరం వారికిలేదు. ఆ కవులు కూడా తమకువలెనే శిశువులు. నాకు "కోర్తిలీన్" అంటే వెర్రి పిచ్చి కల్గింది. మాకు ఒక వంటమనిషి ఉంది. దానికి "థియోడోర్ చర్చ్‌దో అల్యుయెట్" కంఠతావచ్చు. చదవమని దాన్ని వేపుకు తినే వాణ్ణి. నా పిచ్చి వాళ్లకు నవ్వుగా ఉంది. కౌతుకాన్ని సృష్టించింది. అది జాగ్రత్తగా ప్రోత్సహించబడింది. నాకు శ్రద్ధ హెచ్చింది. ఇంట్లోవాళ్లకూ అంతే. చివరకు అది అభినివేశమై పోయింది. ఒక రోజున. తాతయ్య అన్నాడు. "కోర్తిలీన్" మంచివాడే. అతనంటే నీకు అంత ఇదిగా ఉంది. ఒక్క ఉత్తరం ఎందుకు వ్రాయకూడదు." నేను వ్రాశాను. ఛార్లెస్ ష్క్వైట్జర్ వ్రాయించాడు. నా చేయి అతని చేతుల్లో నడిచింది. ఒక రెండు వర్ణక్రమ దోషాలు వదిలిపెట్టివేశాడు. ఆతర్వాత కొన్ని పత్రికలు ఆ ఉత్తరాన్ని ప్రకటించాయి. దానిని చదివి నేను కొంచెం బాధ పడ్డాను. వ్రాసిన ఉత్తరం మీద "నీకు కాబోయే స్నేహితుడు" చెప్పి సంతకం చేశాను. అది నాకు సరిగానే ఉంది. వాల్టైర్, కార్నీయ్‌లు నాకు పరిచితులవంటివాళ్లు. "కోర్తిలీన్" బ్రతికి ఉన్నాడు. రచయిత. అటువంటివాడు నా స్నేహాన్ని ఎట్లా కాదంటాడు? "కోర్తిలీన్" కాదన్నాడు. నాకు ప్రతి సమాధానం వ్రాయలేదు. మంచిదే అయింది. నేను పిల్లవాణ్ణి. చిన్నవాణ్ణి. నాకు సమాధానం వ్రాస్తే తాతయ్యమీద పడినట్లయ్యేది. ఆ రోజుల్లో కోర్తిలీన్ మౌనం మాకు కోపాన్నే తెచ్చింది. వాడికి మర్యాద తెలియదనుకున్నాము. ఛార్లెస్ అన్నాడు. "కోర్తిలీన్‌కు ఎన్నో పనులు ఉంటాయి. ఉంటేమాత్రం పిల్లవాడు వ్రాశాడుగదా! జవాబు ఇవ్వద్దూ?"

ఈ చనువు అన్నదే ఒక అల్ప దోషం. అది ఇంకా నన్ను వదల్లేదు. ఉంది. మృతి చెందిన మహాకవులున్నారు. మహారచయితలు ఉన్నారు. వాళ్లందర్నీ నా సహపాఠులని అనుకుంటూ ఉంటాను. "బాడలేర్" తో గట్టిగా మాట్లాడతాను. ఫ్లాబేర్ అంటే లెక్కలేదు. వాళ్ళు గూడా నన్ను ఏమన్నా అంటారు. నేను వూరుకోను. "మీ సంగతి ఏమిటో మీరు చూసుకోండి. మీరు ప్రతిభావంతులే. కాదనను. కాని ఇప్పుడు ఆ ప్రతిభ అంతా నాలో కుంభితం అయి ఉంది. అది నా ఆస్తి. ఆ ప్రతిభను నా చేతుల్లో లాలించాను. గాఢంగా ప్రేమ చేశాను. భక్తితో ఆరాధించాను. మీముందు నేను చిన్నవాణ్ణిగా చితక వాణ్ణిగా ఎందుకు ఉండాలి?" ఇట్లా అందామని అనుకునే వాణ్ణి. తాతయ్య ఒక విధమైన కారుణికవాదాన్ని తెచ్చి పెట్టుకున్నాడు. అది మత గురువుల కారుణ్యం. ఒక్క రోజున నాకు హఠాత్తుగా ఒక్క మనిషేమిటి? అందరు మానవులు ఒక్కటేననిపించింది. ఒక్కమనిషే అందరు మానవులూ అనిపించింది. ఇది నాకు గ్రాహ్యానికి వచ్చింది. ఆ రోజున తాతయ్య కారుణ్యవాదాన్ని నాలోంచి తుడిచి వేశాను. ఒక వ్యాధి వచ్చింది. అది నయం కావడం కూడా దుఃఖాన్ని కల్గిస్తుంది. నాకు అట్లా అయింది. భాష ఉన్నదంటే అందులో ఇంద్ర

జాలాలు ఉన్నాయి. ఆ ఇంద్రజాలం రహితం అయినప్పుడు భాష తన సత్తానే కోల్పోతుంది. కవివీరులు ఉన్నారు. వారు ఒకప్పుడు నాతో సమానులు. వారికేవో విశేష శక్తి సంపత్తి, అధికార సంపత్తి, స్వత్వ సంపత్తి ఉన్నదనుకున్నాను. అది తొలగిపోయింది. పూడ పీకాను. అప్పుడు ఏమైంది. వాళ్ళు గూడా మామూలు మనుష్యులైపోయారు. మామూలు స్థాయికి దిగజారారు. వారికోసం నేను దుఃఖిస్తాను. దుఃఖించాను. ద్విరా చరణంగా దుఃఖించాను.

నేను ఇది వ్రాశాను. ఇది తప్పు. నిజము. ఉన్మాదులు ఉన్నారు. మనుష్యులు ఉన్నారు. వారిని గురించి వ్రాశారు. ఆ వ్రాసిన దానికి సరికాదు. నాకు జ్ఞాపకం వచ్చినదాన్ని జ్ఞాపకానికి వచ్చినట్లు వ్రాస్తున్నాను. నేను ఉన్మాదినా? అందులో నాకు ఉన్న విశ్వాసం ఎంతటిది? ఉన్మాదిని అని నన్ను నేను నమ్ముతున్నాను. ఇది అసలు ప్రశ్న. దాన్ని గురించి మనస్సును నికరం చేసుకోలేక పోతున్నాను. ఇదమిత్థమని తేల్చుకోలేక పోతున్నాను. తర్వాత తర్వాత తెలిసింది. ప్రతి మనిషి తన ప్రేమానురాగాలను గురించి ఉన్నదంతా తెలుసుకోవచ్చు. తెలియంది ఒకటి మిగులుతుంది. అది వాటి బలం. వాటి తీవ్రత. అంటే ఆ ప్రేమానురాగాల అర్ణవము, నిర్వ్యాజత ఎంతలోతో, అది తెలియదు. ప్రవృత్తులు, లేక ప్రవర్తనలు ఉన్నాయంటే అవి స్వతః ప్రమాణాలు కాజాలవు. ప్రమాణాలు కావుటకు అవి హావ భావ విశేషాలుకాదని, ఇంగితాలు కాదని, అభిమానాలు కాదని తేలాలి. అది అట్లా ఎప్పుడూ జరగదు. పెద్దవాళ్ళు ఉన్నారు. వాళ్ళతో కుర్రవాణ్ణి నేను ఉన్నాను. అప్పుడు నాకు ఏమి అనిపిస్తుంది? నేను గూడా పెద్దవాణ్ణి అనిపిస్తుంది. నేను ఆ పెద్దవాళ్ళలాగానే పెద్ద పుస్తకాలు చదువుతాను. ఇది వాస్తవం అవదు. అందులో అసత్యదోషం సంక్రమిస్తుంది. మిథ్యవలె అవభాసిస్తుంది. ఎందుచేత? నేను పసివాణ్ణి. ఈ రెండు యుగపత్తుగా జరగడం, ఉనికి కొనడం ఎట్లా? నేను నేరం చేశానని అనడంలేదు. అది అట్లా ఉన్నదంతే.

నా యీ అన్వేషణలు, గవేషణలు ఇంటిల్లిపాదికి ఒక విచిత్ర సంతోషాన్ని కల్గిస్తూ వచ్చాయి. ఇది ఒక ఉల్లాస నాటకంలాగా ఉంది. అట్లా ఉంటుందనే అనుకున్నాను. వీడో అద్భుత శిశువు. ప్రతిరోజూ ఏవో పాత గ్రంథాలు, ఏవో లిఖిత పుస్తకాలు త్రవ్విపోస్తాడు. తాతయ్య వాటిని ముట్టుకోవడం మానివేశాడు. నా వయస్సుకు, నా జీవితానికి సంబంధంలేదు. వయస్సుమమించి జీవితం సాగుతోంది. కొంతమంది సంపాదనకు మిగిలి జీవిస్తారు. అట్లా ఉంది. ఇందులో ఉత్సాహం, అలసట, అతి వ్యయం అన్నీ ఉన్నాయి. ఇదో విడంబనం. నేను తలుపులు తోసుకొని లైబ్రరిలో ప్రవేశిస్తానో, ప్రవేశించనో, నేను ఒక ముసలివాడి గుండెల్లో దూరేస్తున్నాను. పెద్దబల్ల. బ్లాటింగ్ పేపరు. సిరా మరకలు. రూళ్ళకర్ర. సిరా బుడ్డి. పాలిపోయిన పుగాకుకంపు. శీతాకాలం అయితే శాలమాండర్స్ ఎర్రగా మండుతూవున్నట్లు ఉంటుంది. మైకా ప్రోగుతూ ఉంటుంది. కారల్ యొక్క మూర్త స్వరూపం ఇది. అతని సత్తా. నాకు కావలసింది అదే. అంతలో ఒక హోదా వచ్చినట్లవుతుంది. నేను పుస్తకాలకోసం పరుగు పెడతాను. ఇందులో ఆర్జవం ఉన్నదా? నేను ఆకుపటినా? దీని అర్థం ఏమిటి? ఇవ్వాళ్ల దాన్ని ఇట్లా అని ఎట్లా వివరించి చెప్పగలను. చాలా కాలం అయిపోయింది. ఏదో పొందుతున్నామనే భావానికిన్నీ, వాగుడుకాయ తనానికిన్నీ ఇక్కడ తేడా ఎంచడం ఇప్పుడు ఎట్లా! అది అందే విషయంకాదు. దొరుకుతుంది. దొరకదు. మారిపోతున్న సరిహద్దుల లక్షణం కలది. నేను పొట్టమీద పడునేవాణ్ణి. ఎదురుగుండా కిటికీలు. కళ్ళముందు పుస్తకం. నేలమీద తెరిచి పెట్టేవాణ్ణి. కుడిప్రక్కన మంచి నీళ్ళ గ్లాసు. అందులో రెండు చుక్కలు "వైన". 'జాము', 'శాండ్విచ్చి' ఎడమ వైపున ఒక ప్లేటులో పెట్టుకునేవాణ్ణి. ఒంటరిగా ఉన్నానుగదా! నాకు నాకే ఇది నాటకం అనిపించేది. అనీ—మారిఉంది. కార్లమాణి ఉన్నది. ఈ ఇద్దరు నేన్న ఇంకా ఎప్పుడోపుడలా నవగా ఈ పుస్తకాలు తిరుగ వేశారు. చదివి వేశారు. ఇప్పుడు నా కళ్ళముందు వారి తెలివి పడిఉంది. వారి విజ్ఞానం తెరువబడివుంది. సాయంత్రం కాగానే నన్ను అడిగేవాళ్ళు. "నీవు చదివిందేమిటోయి నాన్నా!" అనేవాళ్ళు. "అర్థం చేసుకున్నావా?" అని ప్రశ్నించేవాళ్ళు. నాకు తెలుసు. ఇట్లా అడుగుతారని. నేను ముందే ప్రసవవేదన పడేవాణ్ణి. రత్నంలాంటి ముక్క పుట్టుకు వచ్చేది. పుస్తకాలు చదువు. పెద్దవాళ్లను తప్పించుకు తిరుగు. తప్పించుకు తిరుగుతూ వాళ్ళను సంభావిస్తూ ఉండు. ఇది మంచి మార్గం. వాళ్ళు నీ దగ్గర లేరు. అప్పుడు వారి ముందుచూపు నీలో ప్రవేశిస్తుంది. తలయొక్క వెనుక భాగంనుంచి ప్రవేశిస్తుంది. కళ్ళల్లోంచి బయటికి వస్తుంది. నేల బారుగా దూసుకుపోతుంది. అవి అన్నీ అంతా చదివినవే. నేను ఇప్పుడు చదువుతున్నాను. మొదటిసారి.

నేను చిన్నప్పుడు, అక్షరాలురాని వయసప్పుడు చైనా వాళ్ళను గురించిన కథల పుస్తకాన్ని కూడాబలుక్కు చదవడం నటించి ఉన్నాను. అప్పటికి ఇప్పటికి నాలో మార్పు వచ్చిందా? అది ఏమీలేదు. ఆ నాటకం సాగుతూనే ఉంది. నేను చదువుకుంటూ ఉంటాను. ఎవరో వెనుకవైపునుంచి తలుపు తెరుస్తారు. ఏమి చేస్తున్నానో చూద్దామని ఎవరో వస్తారు.

నేను వాళ్లను కికురిస్తాను. ఎగిరి గంతువేసి కాళ్ళమీద నిలుస్తాను. చదువుతూవున్న 'ముస్కెట్'ను యుద్ధస్థానంలో ఉంచేస్తాను. 'కార్నెయ్'ని పట్టుకు చక్కా వస్తాను. నా వెనుక ఏవో గుసగుసలు వినిపిస్తాయి. ఆ గుస గుసలలో మెప్పుదలలు వినిపిస్తాయి. "కార్నెయ్" అంటే మనవాడికి ఇష్టం అనుకుంటూ ఉంటారు. నాకు ఇష్టంకాదు. ఆ "అలగ్జాండ్రైన్"లు నాకు గిట్టవు. తత్తర బిత్తర పరుస్తాయి. అదృష్టం అంటే అట్లా ఉండాలి. ఈ పుస్తకాన్ని అచ్చువేసినవాడు 'కార్నెయ్' నాటకాలలో ముఖ్యమైన వాటినే పూర్తిగా వేశాడు. తక్కిన వాటిని గూర్చి ముక్తసరిగా కథ చెప్పి వదిలి పెట్టాడు. ఆ నాటకాల పేర్లు, 'ప్లాటు'లు ఇచ్చాడు. నాకు అది ఇష్టం. "రోడలిండ్ ఉన్నది. ఆమె పెర్‌త్రైట్ పెళ్లాం. ఆయన లొంబార్డుల రాజా. గ్రిమోల్డ్ అతణ్ణి జయించాడు. ఉనూల్ఫ్ ఏమన్నాడంటే, ఆమెను విదేశీ రాకుమారుడి ఇచ్చెయ్యమన్నాడు." 'లే సిడ్' 'సిన్నా' లకు ముందే నాకు రోడోగూన్, థియొడోర్, ఆజిసిలాస్‌లు తెలుసు. ఆ పేర్లన్నీ సంగీతం పుట్టిపడుతూ వుంటాయి. నోటినిండా వాటిని పట్టించుకునే వాడిని. గుండెనిండా భావాలను నింపుకునేవాణ్ణి. అవి దివ్యంగా వుండేవి. కుటుంబ సంబంధాలు, చుట్టరికాలు, ఈ జంఝాటం ఏమీ నేను పెట్టుకోలేదు. పట్టించుకోలేదు. అదో బురద. ఇంట్లోవాళ్లు అనేవాళ్ళు: పిల్లవాడికి చదువునేర్పు ఆట అయిపోయింది. నిఘంటువులు నమిలివేస్తున్నాడు: నేను వూరుకునే వాణ్ణి. వాళ్ల ఇష్టం వచ్చినట్లు అనుకోమనేవాణ్ణి. నేను నిజంగా నేర్చుకోడంలేదు. నిఘంటువులలో నాటకాల కథలువున్నాయి. క్లుప్తంగా వున్నాయి. నవలలు సంగతికూడా అంతే. ఇది నేను కనిపెట్టాను. వాటిని పట్టుకు వ్రేలాడటం మొదలుపెట్టాను.

నన్ను చూసి అంతా సంతోషించాలని వుండేది. నా మట్టుకు నాకు సంతృప్తిలో మునిగి తేలుదామని వుండేది. ఏరోజు కారోజు నేను ఏదో గొప్పతనాన్ని, ఏదో పవిత్రతను తెచ్చిపెట్టుకునేవాణ్ణి. మాటవరసకు—ఒకొక్కప్పుడు అట్లా నేలమీద బల్లపరువుగా పడుకొని, పుస్తకాలు తిరగవేస్తూ వుంటేచాలు. వాళ్ళంతా నాస్నేహితులు కదా! తరచు ప్రార్థనా చక్రాల్లాగా ఉపయోగపడేవాళ్ళు. నాకు ఆనందంకల్గేది. భయమూ వేసేది. ఇందులో అబద్ధంలేదు. కొన్ని సందర్భాలలో నన్ను నేను మరిచిపోయేవాణ్ణి. వగర్చుకుంటూ పరుగెత్తేవాణ్ణి. నన్ను ఒక పిచ్చితిమింగలం ఎత్తుకు పోతూ వుండేది. ఆ తిమింగలం ఏమిటి? ఏమీకాదు, ఈజగత్తు. నీవు ఏమన్నా అనుకో. అట్లాజరిగేది. నా కళ్లు ఎప్పుడూ మాటలను అంటిపెట్టుకు వుండేవి. వాటి మీద తిరిగేవి. పని చేసేవి. ఆశబ్దాలను నేను పరీక్ష చెయ్యాలి. నాజూకుచెయ్యాలి. అర్థాన్ని నిర్ణయించాలి. చివరకు నాకు ఒక సభ్యత అలవడింది. అదికూడా విచిత్రమైంది.

నేను నిజంగా అసలు చదవక పోలేదు. చదివాను. లైబ్రరీలోకాదు. పడకటింట్లో. వంటింట్లో భోజనాలబల్ల క్రింద. నేను ఎవరితోను ఈవిషయం చెప్పలేదు. మాట్లాడలేదు. అమ్మకు మాత్రం తెలుసు. అమ్మే నాతో మాట్లాడింది. నాకు మధ్యే మధ్యే కోపం వస్తూవుండేది. ఆనీ—మారీ ఒకర్తె పట్టించుకుంది. నిజంగా పట్టించుకుంది. అమ్మతో చెప్పింది. అమ్మమ్మ విషయం చెప్పక్కర్లేదు. ఆవిడ అమ్మవైపే. ఇంకోవైపు తిరగదు. నికార్సయిన మిత్రం. "ఛార్లెస్‌కు బుద్ధి లేదు. పిల్లవాణ్ణి వూరికే తోలుతున్నాడు" అంది. "నేను చూస్తూనేవున్నా. పిల్లవాణ్ణి నానారొమ్ము పెడుతున్నాడు. పిల్లవాడు ఎండిపోతే, మనం మండేది ఎట్లా?" అనేది. ఇద్దరు ఆడవాళ్ళు బరువును గురించి, బాధను గురించి, 'మెనింజిటిస్'ను గురించి మాట్లాడేవాళ్ళు. అదిఅంతా ఏదో గోప్యంగా చెప్పుకునేవాళ్ళు. తాతయ్యతో ఎదురు పడి తగాదా పెట్టడం బ్రహ్మకు కూడా తరంకాదు. అదివృధా. అమ్మమ్మ పక్కపోరు పెట్టింది. పార్శ్వంలో తగిలింది. మేము షికారుకు పోతూ వుండేవాళ్ళం. ఆనీ—మారీ దారిలో ఎందుకో ఆగినట్టు ఆగేది. అక్కడ ఒక బడ్డీ. ఇప్పటికీవుంది. సెంట్‌మైకేల్ రోడ్డు, సాఫ్లోట్ తెరువులు కలిసేచోటు. ఆ బడ్డీలో బొమ్మల పుస్తకాలు నాకు నచ్చాయి. అవి కావాలనివుంది. సంపాదించాను. ఈ "ట్రిక్కు" పని చేసింది. ప్రతివారం ఏదో బొమ్మలపుస్తకమో, పుస్తకమో కావాలనడం. అవి రావడం. క్రి-క్రి, ఎల్-ఎపటాంట్, లేపేకన్సెన్, జాం—దొ—లా—హైర్ ది లె—ట్రాయ్—బోయ్—స్కౌట్స్, ఆర్నాల్డ్‌గాలోపిన్‌గారి టూర్—దు—మొండే—ఎన్—ఏరోప్లేన్. ఇది 'సీరియల్' గా వచ్చేది. ప్రతి గురువారమున్నా. ఒక గురువారం గడిచి ఇంకో గురువారం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూచేవాణ్ణి. ఆండీ కొండల డేగ, మార్షల్ డ్యూమాంట్, వైమానికుడు క్రిష్టియన్. ఇట్లా ఎన్నో. ఇప్పుడు నాకు వీళ్ళ 'రాబెలే' కంటే, విగ్నీ కంటే కూర్చిన వాళ్ళయిపోయారు. నాలో శైశవం పాడైపోకుండా చూడాలని అమ్మ దుగ్ధ. అందుకోసం ఏమి పుస్తకాలు ఇవ్వాలో వెదకి తెచ్చి మరీ ఇచ్చేది. మొదట 'దేవకన్యల కథలు' తెచ్చి ఇచ్చింది. తర్వాత క్రమంగా లే—ఎన్‌ఫాన్ట్స్ — దు—కేప్టెన్ గ్రాంట్, ది—లాస్ట్—ఆఫ్—ది—మొహికన్స్, నికోలస్ నికల్బీ, ఇట్లా తెచ్చింది. చివరకి లే—సింక్—ది—లావార్డ్ ఇచ్చింది. నాకు జూల్స్‌వెర్న్ అంత నచ్చలేదు. పాల్—డి—ఇవోయ్ నచ్చాడు. జూల్స్ వెర్న్ అంతా కట్టుదిట్టంగా వ్రాస్తాడు. నాకు పట్టలేదు. వ్రాసింది ఎవరు అన్న ప్రశ్నలేకుండా నాకు నచ్చిన గ్రంథాలు

ఉన్నాయి. అవి హెచ్‌జెల్ సంపుటాలు. అవి నాకు రంగస్థలాల్లా ఉండేవి. తెరలకు బదులు ఇక్కడ అట్టలు. అవి బంగారం అతికిన ఎర్రని అట్టలు. అట్టల అంచులు బంగారుతో మలాము చేసినట్లు ఉండేవి. అవి దీపాలు అనుకునేవాణ్ణి. ఇట్లా రంగస్థలం సిద్ధమైంది. నాకు సౌందర్యాన్ని గూర్చిన ప్రథమ అనుభవం అంతా వీటిల్లోనే కల్గింది. ఫాటోబ్రాండ్ మాటలు తూచివేస్తాడు. నిజమే. ఈ అనుభవం నాకు ఆ మాటల్లో కల్గలేదు. హెచ్‌జెల్ సంపుటాలు తెరిస్తే చాలు. నాకు ప్రపంచమే కన్పించదు. అంతా మరిచిపోతాను. ఇది చదవడమా ? కాదు. ఆనందంతో చావడం. కొట్టుకుపోవడం. ఉక్కిరిబిక్కిరి కావడం. నన్ను నేను మరిచిపోతాను. నా కళ్లముందు ఎన్నో దృశ్యాలు తిరిగిపోతాయి. "నేటివు" లు నన్నని బల్లెములు పుచ్చుకు ప్రత్యక్షం అవుతారు. చిట్టి పొదలు దుబ్బులు దుబ్బులుగా కన్పిస్తాయి. ఒక అన్వేషకుడు దర్శనం ఇస్తాడు. తలమీద తెల్లని టోపీ, వాడూను. నేను గూడా వాళ్లలో ఒకడన్నై పోతాను. 'జెదా' బుగ్గలు నల్లగా అందంగా ఉన్నాయి. నేను ఆ బుగ్గలను ముందు ఎత్తివేస్తాను. ఫిలాస్ పాగ్ మీసాలు పొడుగు. వాటిని కాంతితో నింపుతాను. ఈ మైకంలోంచి ఎట్లాగో బయటపడ్డామేమో ఈ అద్భుతం శుద్ధమైన ఆశ్చర్యంగా పరిణమిస్తుంది. భూమికి పద్దెనిమిది అంగుళాల ఎత్తులో ఈ ఆనందం పుడుతున్నది. ఇది అచ్చమైన ఆనందం. బంధాలు లేవు ప్రభువులు లేరు. ప్రభారాలు లేవు. ప్రత్న ప్రపంచం కంటే మాత్న ప్రపంచం మొదట్లో కొంత గందరగోళంగా ఉంది. అక్కడ అన్నీ దోపిడీలు. దొమ్మీలు. హత్యలు. నెత్తురు పూరికే ప్రవహించడం. ఇండియన్‌లు, హిందువులు, మొహికన్‌లు, హాట్టెటాట్లు. వీళ్లు ఒక పిల్లను ఎత్తుకుపోతారు. తండ్రిని కట్టి పడవేస్తారు. నీవు చావు చస్తావు—జాగ్రత్త— అని హెచ్చరికలు చేస్తారు. ఇంతకన్నా పాపం ఉండదు. ఈ పాపం ఎంతటిది ! చివరికి మంచితనానికి బలాదూరై పోతుంది. మంచితనం ముందు సాష్టాంగదండప్రణామం చేస్తుంది. చస్తుంది. అందుకే అది అక్కడ ఉంది. ఇంకో అధ్యాయంలో అంతా చక్కబడిపోతుంది. తెల్లవాళ్లు నికార్సు ధైర్యం కల వాళ్లు. వాళ్లు వస్తారు. అనాగరికుల నందరిని గ్రీకులు ఎద్దులలాగా బలివేస్తారు. నరికేస్తారు; ఆ పిల్ల తండ్రి కట్లు పూడదీస్తారు. పిల్ల ను విడిపిస్తారు. ఆమె చేతులు అట్లా చాస్తుంది. ఆ తండ్రి ఆ చేతుల్లో అట్లా వాలిపోతాడు. చూశారూ. ఇక్కడ ఎప్పుడూ పాపులే చస్తూ ఉంటారు. మధ్యే మధ్యే ఒక కొంచెం మంచివాళ్లు కూడా చావడం ఉంటుంది. కథకోసం వాళ్లు అట్లా చస్తూఉంటారు. ఇవి చేతి ఖర్చులవంటి చావులు. చావులలో గూడా ఒక విచిత్రం ఉంది. ఇక్కడ మృత్యువుకు కూడా వైద్యం జరుగుతుంది. దురంతమృత్యువు అంటూ ఉండదు. నీవు పూరికే చేతులు చాచి పడిపోతావు. నీ గుండెలకు ఎడమవైపున ఒక చిన్న బొత్త కన్పిస్తుంది. ఆ బొత్త గూడా గుండ్రంగా ఉంటుంది. అంతే. తుపాకులు ఇంకా రాలేదు అనుకోండి, అప్పుడు దుర్మార్గులు "కత్తికి ఎరవేయు"బడ్డారు. ఈ పదం బాగుంటుంది. మాట అందంగా తిరిగింది. నాకు నచ్చింది. కత్తి ఉన్నదంటే తెల్లగా మెరుస్తుంది. దాన్ని నేను వూహించాను. వెన్నపూసలో దిగినట్లు దిగిపోతుంది. దుర్మార్గుడిగాడి నీవులోపలగా ఉద్రేకిస్తుంది. వాడు ఒక్క నెత్తురుబొట్టు క్రింద పడకుండా నేలకు ఒరిగిపోతాడు. ఒక్కొక్క సందర్భంలో ఈ మృత్యువు మరీ అసందర్భంగా సంభవిస్తుంది. లా—ఫెల్యూల్—ద—రోలాండ్ ఉంది. అందులో 'సారసీన్' వట్టి అసందర్భంగా చస్తాడు. ఆ "సారసీన్" ఉన్నాడే, వాడు తన గుర్రాన్ని దేవుడి వీరుడి మీదకు నడిపి ఉంటాడు. ఆ వీరుడు సామాన్యుడా? చార్లమేన్ నమ్మిన మహా వీరుల్లో ఒకడాయెను. అతను ఆవేశంగా తన చేతిలో ఉన్న పట్టాకత్తితో ఆ 'సారసీన్' గానిని శిరస్సు నుంచి సిరిపాదందాకా నిలువునా చీల్చివేస్తాడు. వూరుకుంటాడా మరి ! గస్టావ్‌దోర్ ఈ బొమ్మను వేశాడు. ఎంత బాగుంది ! ఆ 'సారసీన్' గాడి శరీరం రెండుబద్దలు రెండు అరమున్నాల్లాగా రికాబులమటూ వాలిపోయాయి. ఆ గుర్రం ఆశ్చర్యంతో వెనక్కు గెంతింది. నేను కొన్ని సంవత్సరాలు ఆ బొమ్మను చూచాను. చూచినప్పుడల్లా నాకు పొట్ట చెక్క అయ్యేట్టు నవ్వు వచ్చేది. నవ్వకుండా ఉండలేక పోయేవాడిని. కళ్లవెంట నీళ్లు కూడా తిరిగేవి. చివరికి నాకు ఏమి అర్థంకావాలో అది అర్థమైంది. ఇక్కడ శత్రువు ఉన్నాడు. అతణ్ణి నేను ధ్వంసించవలసి ఉంది. ధ్వంసించగలను. అతను వట్టి నిరపాయి అని తేలింది. అతని వేషాలు సాగలేదు. మోసం పనిచెయ్యలేదు. అతని తంత్రాలు వృథా అయిపోయాయి. ఇంతాచేస్తే అతను గూడా భగవంతుడి సేవకు ఉపయోగపడ్డాడు. ఒకసారి ఏదో జరిగి, మళ్లీ మామూలు పరిస్థితి ఏర్పడటం అంటే, అందులో ఏదో కొంత అభివృద్ధి, అభ్యుదయము బలపడి ఉండక తప్పదని నేను గ్రహించాను. వీరులకు గౌరవం దక్కింది. వారు బహుమానింపనుగూడా బహుమానింపబడ్డారు. డబ్బుకుకూడా లోటులేదు. పుష్కలంగా లభించింది. వారి ఒక్క సాహసంవలన ఒక దేశం జయించబడింది. ఒక శిల్పం "వేటిన్" ల నుంచి లాగుకొని రాబడింది. మన మ్యూజియంలు దానితో అలంకరింపబడినాయి. అన్వేషణకు పోయిన వాణ్ణి ఒక అమ్మాయి ప్రేమించింది. అతడు ఆ అమ్మాయి ప్రాణాన్ని రక్షించాడు. అందుకు ప్రేమలో పడింది. చివరికి వాళ్లకు పెళ్లి అయింది. అంతా ఇట్లా సమాప్తం అవుతుంది.

అన్ని పుస్తకాలు ఇట్లానే ఉంటాయి. ఈ పుస్తకాలు, ఈ పత్రికలు చదివి నేను ఒక్కమాట నేర్చుకున్నాను. అది మీకు వింతగా కన్పించవచ్చు. నాకూ వింతగానే ఉంది. ఆమాట ఇది : ముందును గురించి దిగులు లేకపోవడం. ఉత్సాహం కలిమితో ఉండటం.

ఈ పుస్తకాలు చాలాకాలం గోప్యంగా ఉండిపోయివాయి. ఆసీ—మారీ నన్ను వల్లెత్తుమాట అనవలసిన పని లేకపోయింది. అవి ఎందుకు పనికిరానివి. చెత్త. ఈ పుస్తకాల సంగతి మరిచిపోయి గూడా నేను తాతయ్యకు చెప్పలేదు. నేను పట్టి జపమ్ములతో నేస్తం కట్టాను. పండుగరోజులను వేశ్యావాటికలలో గడుపుతున్నాను. కాని నన్ను నేను ఎప్పుడూ మరిచిపోలేదు. నా ఆత్మను విస్మరించలేదు. నా ఆత్మ దేవాలయంలో ప్రార్థనావేదికమీద ఉన్నట్లు ఉంది. ఇప్పుడు తాతయ్యతో చెప్పి ఆయనలోని మతాధికారిని బాధపెట్టడం దేనికి ? నేను దారి తప్పాను. తప్పు చేశాను. ఆత్మను పాడుచేసుకోలేదు. చివరికి తాతయ్యే పట్టుకున్నాడు. ఆడవాళ్ల నిద్దర్ని కేకలు వేశాడు. వాళ్ళమీద ఆయనకు కోపం వచ్చింది. వూపిరి తీసుకుంటూ తాతయ్య ఒక్క క్షణం జడివాన వెలిసాడు. అంతే. అమ్మా, అమ్మమ్మా అందుకున్నారు. తప్పంతా నా నెత్తిన రుద్దారు. నేనేమో ఆ పత్రికలు, పుస్తకాలు చూశాను. కావాలన్నాను. కొనిపెట్టమన్నాను. వాడు అట్లా అంటుంటే మేము ఎట్లా కాదనడం ? ఆడవాళ్ళు ఇద రు మహా చమత్కారం చేశారు. వంచనచేసి నన్ని అబద్ధం ఆడారు. తాతయ్యకు ఏమి అనడానికి లేకపోయింది. అరే ! వీ డెంతవాడైనాడు ! కొలంబాకు ద్రోహం చేశాడే ! డెల్ఫిలో అప్పోల్లో గణాచారి ఉండేది. ఆమె పేరు పైథోనిస్. నేను అవిధంగా ఒక ప్రవక్తలాగా, భవిష్యత్తును దిద్దేవాణ్ణి అవుతానని తాతయ్య అనుకున్నాడు. ఇప్పుడు ఇది చూచి ఉసూరు మన్నాడు. ఉన్నతమైన సాహిత్యక్షేత్రాలలో వీడు "ఎలియాకిం" కాగలడనుకున్నానే ! వీడు ఇట్లా పాడైపోతున్నాడు. అనుకున్నాడు. పరమ అసహ్యమైన సాహిత్య వ్యవహారంలో వీడికి అభిరుచి మెండైపోతున్నది. అందుకు విచారించాడు. ఇప్పుడు ఏమి చెయ్యాలన్నా తాతయ్య చెయ్యవలసి ఉంది. నేను గొప్పలు కొట్టడం అన్నా మానివేయాలి. లేదా నా అభిరుచులు ఉన్నాయి. అవి తాతయ్యకు అర్థంకావు. వాటిని అట్లా వదిలివేసి చూస్తూ వురుకోన్నా వూరుకోవాలి. నా అభిరుచులను మన్నించాలి. ఫార్చెన్ స్ట్రీట్ల్యర్ నాకు తండ్రే అయిఉంటే ఆ పుస్తకాలన్నీ తగులబెట్టేవాడు. వాటిని 'లంకాయాగం' చేసేవాడు. మరి తాతయ్య అయిపోయెను. బాధపడినా ఊరుకున్నాడు. గారాబం చేశాడు. ఇంతకంటే నేను కోరిందిలేదు. నా జీవితం రెండిందాలుగా ఉంది. అది అట్లా సాగింది. దానికి అంతం ఇంతవరకు లేదు. ఇవాళ్ళ కూడా అంతే. మిక్‌జెక్‌స్కీక్‌ను. "సా నోయర్" ను తెచ్చి నాముందు పెట్టండి. నేను విట్‌జెన్‌స్టీన్ వదిలిపెట్టి, "సెరినోయిర్" ను చదువుతాను.

"ఎన్‌కౌంటర్" సౌజన్యంతో.

చీకటి గతంలోంచి....

శ్రీ మన్‌మోహన్ సహాయ్

కనిపించే చీకటి గతంలోంచి
కనిపించని భవిష్యత్తు చీకాకులోకి
వర్తమానపు వెలుగుబాటలో
క్షణాల తప్పటడుగులతో
చుక్కలు ఉద్ఘోషించే ఋక్కులసాయంతో
కనురెప్పల వెనుక బంధించిన చూపులతో
అనుక్షణం వదిలేస్తూ గతానికి
రాబోయే వర్తమానంలోకి;
ఊహాలు పేర్చిన దీపాల హారాలకి మెడచాస్తూ
ఆశలు ప్రసరించిన పరిమళాల ఊపిరిపీలుస్తూ
అనంతమైనది జీవనం
అనవరతం ఆనందం
అనే తలపోతల తమకంతో—
కాలపు జారుడుమెట్లు దాటినకొలదీ
గులాబీలు మార్గంలో పరుచుకుంటాయని,
ఆ మెత్తటి రేకుల వెనుక
ఆ సుకుమార కుసుమాల పయ్యెదల చాటున
కంటకాలు కంట్రక పెట్టవని
పాదాలు ముద్దిడుకుని పన్నీరు చిలికిస్తాయని
భ్రమః భ్రమరోత్సాహంతో—
భవిష్యత్తు పెదాలమీద
చిరునవ్వుల పువ్వులు గుబాళిస్తాయని
వసంతాల సిగ్గులు పులకిస్తాయని,

రానున్న కాలవాహినిలో
సుడిగుండాలు సుళ్లు తిరగవని
అందరి ఆనందోత్సాహాలని హత్యచెయ్యవని;
ఆశల క్రొన్నెత్తురు నింపుకుని
నే సాగించే పయనం—
వర్తమానపు వెలుగుబాటలో
కనిపించే చీకటి గతంలోంచి
కనిపించని భవిష్యత్తు చీకాకులోకి
చింతలో చిదానందాలో తెలియని ముంకులోకి.



బ్రతకనివ్వండి

శ్రీ ఆదివిష్ణు

ఎవరి గురించో యెందుకు ? నా గురించి నేనే వ్రాసుకుంటాను. ఎవడి గురించి వాడే రాసుకోడంలో గల ఇబ్బంది మరొాడి గురించి వ్రాయడంలో ఉండదు. ఎదటివాడి గొప్పతనాన్ని ఎత్తి చూపుతే కాబోసనుకోవచ్చు. తన గొప్పతనం గురించి ఏ కొంచెం రాసుకున్నా అతిశయోక్తి అనేస్తారు. కనుక తన గురించి తనే రాసుకోడం ప్రారంభిస్తే తగిన జాగ్రత్త తీసుకోడం చాలా అవసరం. ఈ అవసరాన్ని తూ. చ. తప్పకుండా పాటించేను.

కథావస్తువు సర్వ సాధారణమైనది. ఈ వస్తువు గురించి 'మంచి కథలూ' 'మంచి' గా రాయలేని కథలూ ఇంతకుమునుపే వచ్చివుండొచ్చు. ఈ కథాంతం నన్నాకర్షించక పోతే ఈ కథ రాసిఉండేవాడిని కాదు. పైగా ఇది నా కథ!

ఆఫీసనబడే నాలుగ్గోడల మధ్య కొందరదృష్టవంతులూ, మరికొందరు దురదృష్టవంతులూ వాళ్ళవాళ్ళ తల లొంచుకుని పనిచేయడ మనేది కొత్త విషయం కాదు. కాబట్టి ఆఫీసు వాతావరణాన్ని రెండు రకాలుగా భాగించవచ్చు. మొదటి కొందరికి స్వర్గంగానూ, రెండో కొందరికి నరకంగానూ మారుతుంటుంది. రెండోదాని గురించి లోగడెప్పుడో వ్రాసియుండటం చేత ఈ కథ నిప్పుడు తప్పనిసరిగా మొదటి రకానికి అంకితం చేస్తున్నాను. మీదు మిక్కిలి ఈ వస్తువూ దానికి సంబంధించిందేను.

కాలేజీ వదిలి (దాని గురించీ కొన్ని కథలు రాయడం జరిగింది) నాలుగేళ్ళు పూర్తయ్యాయి. అప్పట్లో నాకో సరదా ఉండేది. క్లాసు జరుగుతున్నప్పుడు వెనక బెంచీలో కూర్చుని 'పారిస్' గురించి కలలుకనే కుర్రాళ్ళలో నే నొకడ్ని. ఇతర దేశాల్లో కాలం గడిపే జాతకుల అదృష్టాన్ని అభినందించే వాళ్ళల్లో నేను మొదటివాడిని. బందరనబడే కేవలం తెలుగు పట్టణంలో కూర్చుని ఆయా దేశాల వాతావరణం, ఆచార వ్యవహారాల గురించి ఆలోచనలు చేస్తూ, దాని ద్వారా లభ్యమయ్యే మహత్తరానందాన్ని సంపాయించుకున్న కలల మనిషిని.

ఆ రోజుల్లో టెక్నిలర్‌లో కల లొస్తుండేవి. సరదాగా ఉన్నప్పుడు నా చుట్టూ చేరిన నా మిత్రులకి మనసు విప్పుకుని నా కలలు గురించి చెప్తుండేవాడిని. వింటూన్న కాస్సేపూ శ్రద్ధగా విని, వెళ్ళిపోతూ భుజం చరిచి అనేవారు—'హారేయ్ రావూ! నువ్వు కథలు రాసే ప్రమాదానికి దిగజారిపోగలవు సుమా' అని.

నా కలల్నే కథలుగా రాయమీండి—లేదూ—అనుభవాలనే రాయమీండి, నా మిత్రులన్న మాటల్ని నిజంచేసి ఈ కలల మనిషి కథల మనిషిగా మారిపోయేడు. ఇప్పటికీ పై మదవారించిన 'అవస్థ' నుంచి దూరంకాలేదు. పైగా స్థాయిని పెంచుకున్నాడు గూడాను.

నా కిష్టమైన ప్రపంచాన్ని తప్పనిసరిగా వదులుకుని రోజుకి ఇన్ని గంటలని చెప్పి ఆఫీసనబడే జైల్లో ఎలా బతికేది ?—ఉద్యోగంలో కాలుపెట్టిన మరుక్షణం కలిగిన ఈ రకమైన ప్రశ్నకి అనుభవం కొంచెం లేటుగా జవాబు చెప్పింది. ఆఫీసు తలుపులు పదిన్నరకి తెరుచుకుంటాయి మళ్లా అయిదున్నరకి మూసుకుంటాయనేది అనుభవం నేర్పిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక్క నిమిషం ముందుగానీ మరో క్షణం వెనగ్గానీ కాలాన్ని ఖర్చు చేయలేదు.

విదేశాల్లో గడపాలనే పగటి కల దుమ్ముకొట్టుకుపోయిందేమోనని తలుచుకుని కుమిలిపోయేంత చాతకాని మనిషిని కాను. దాని ఫలితంగా ఏర్పడిన 'కసి' ని నన్ను పోషిస్తున్న ఉద్యోగమ్మీద రుద్దేంత తెలివితక్కువవాడినీ కాను.

నవోత్సాహాన్ని, రంగుల లోకాల్ని చూపించే కథారంగం నన్ను దూరం చేసుకోదు. నేను దూరం కాలేను. ఈ స్థితిలో రోజుకున్న ఇరవైనాలుగ్గంటల్లో ఆరు గంటలు మరో వ్యాపకాన్ని నెత్తి నెట్టుకు పూజించడం పెద్ద శిక్ష! ఒప్పుకుంటాను! కానీ అలా అని చెప్పి నా శ్రమకి ప్రతిఫలమిస్తూ, నా కృషినట్ల నమ్మకం పెట్టుకున్న ఉద్యోగానికి అన్యాయం చేయడం నా ధర్మం కాదు.

శ్రద్ధగా రాసే కథకీ, నడుంవంచి చేసే ఉద్యోగానికీ తోటి మనిషి మెచ్చుకున్నా మెచ్చుకున్నా లోపలున్న ఆత్మారాముడు తృప్తిపడి సర్టిఫికేటిస్తే అంతకన్నా మించిన ఆనందం మరెక్కడుంటుందనేది నా అభిప్రాయం. అందుచేత, ఆఫీసుకి కేటాయించిన కాలాన్ని తూ. చ. తప్పకుండా పాటించడం జరుగుతోంది. దేవుడిచ్చేది, ఆ కాలాన్ని వృథా చేయడం నా కిష్టంలేదు.

అయిదున్నరకి సరిగ్గా బైటికొస్తాను. అడుగు బైట పెట్టంగానే కళ్ళెంలేని ఆలోచనల గుర్రం నాకోసం సిద్ధంగా ఉంటుంది. రోజులో మిగిలిన కాలమంతా దానిమీదనే స్వారీ చేస్తాను. దేవుడిచ్చేది, ఆ గుర్రం మరి దిగను.

ఆఫీసులో రాజకీయాలు చోటు చేసుకోవచ్చు. ఒకళ్ళంటే మరోళ్ళకి వల్లమాలిన విరోధం గావచ్చు. పైవాళ్ల అభిమానంకోరకు వెకిలి వేషాలు పెట్రేగిపోవచ్చు. వీ టన్నిటికీ నేను అతీతుడిని. నా లోకం వక్క ఆఫీసే కాదు. నా కర్తవ్యం, నా క్షేమం, నా భవిష్యత్తు వగైరాలు కేవలం ఆఫీసుకే అంకితం కాదు. నేను మరికొంచెం పరాయి మనిషిని. ఎక్కువగా ఇతర రంగానికి సంబంధించినవాడిని. నాకున్న సోపిక మొత్తాన్ని ఆఫీసుకే ధారపోస్తే నాగతేంగాను ? నా కలమేంగాను ?

ఇదీ గుమాస్తాగా, కథకుడిగా నాటూకీ పరిచయం.

ఉద్యోగంలో చేరిన కొత్త రోజులు కొంచెం దడగా గడిచేయి. నా మనసు సర్దం చేసుకుని నాకో స్థాన మివ్వగలదా యీ బృంద మని భయపడ్డాను. కానీ అదృష్టవశాత్తూ నే ననుకున్నంత నరకం కాలేదు మా ఆఫీసు. అన్నిరకాలవాళ్లూ ఉన్నా ఎవరి పరిధుల్లో వా ళ్లున్నారు గనుక నాకు రక్షణ కలిగింది.

నా సీటు గురించి గూడా కొంచెం చెప్తాను. లక్షలో తూగుతున్న మనిషికి వందలు సంపాయించే మరో మనిషితో తలమునిగేంత పనుంటుందని తెలిసిన మరుక్షణం నేవెంతో ఆశ్చర్యపోయేను. మనుషుళ్నే కొనగల తాహతు వాళ్లది. కేవలం 'సర్వీసు' నాది. చిత్రం. అందుచేతనే అంటారు. సృష్టిలో పనికిరాని చవట వస్తువు ఒక్కటీ లేదని. కవిత్వానికీ అదే మాత్రం. ఉపయోగించగల నేర్పుండాలే గాని అగ్నిపుల్లా, సబ్బు బిళ్లా, కుక్కపిల్లా మొదలైన వేవీ నిషేధాలు కావుట.

రోజూ వచ్చే పోయేవారితో మా ఆఫీసు రద్దీగా ఉంటుంది. వొచ్చేవాళ్లల్లో ఎక్కువభాగం నా కోసమే. మర్యాదగా మటాడినంతకాలమూ మర్యాదగానే నడిచి, తృతిమించిన మరుక్షణం తగ్గ సమాధాన మివ్వడం అలవాటు నాకు. క్రూరాడినీ, వేడి నెత్తురు కలవాడినీ పైపెచ్చు కథలు రాస్తున్నవాడినీ గనుక సరసరాన్న ఈ గుణం బాగా పనిచేస్తోంది. సంగతి తెలుసుకొని మరీ నాతో వ్యవహారించేవారు వచ్చే 'లక్షల మనుషులు.'

ఆఫీసు పరంగా ఆ సీటుకున్న గౌరవం నాకు దక్కింది. దానికి తోడు ఆఫీసరు మననున్న మనిషి. నా వెనుక కొండంత అండగా నించునేవారు.

చాలా నెలలు గడిచేయి. చాలా అనుభవాలు గడించేను. చాలామంది చేత 'మంచి' అనిపించుకున్నాను. పైళ్ల సీట్లో పెరిగిపోవడం యిష్టంలేదు. ప్రతి కాగితం వెంటనే కదలడం సరదా. ఆఫీసులో పెరిగిన పాపం బయట నా మనసుని తినేస్తే నా గుర్రపుస్వారీ ఏంగాను ?

ఈ చేతులు లక్షలు రాసి లక్షాధికారుల అవసరాలకి సాయపడ్డాయి. ఈ చేతులు వాళ్లందరిచేతా మన్ననలు పొందేయి. అంతేగాని, ఈ చేతులకి సంకెళ్ళు వేసుకోవడం తెలీదు. ఈ చేతులు మరోళ్ల చెప్పుచేతల్లో నలిగిపోడం తెలీదు. ఆ పరిస్థితి కలుగుతే వేడినెత్తురు చల్లబడి గుండె ఆగుతుంది. లక్షలిస్తున్నప్పుడు, అదే కారణంగా 'ఆశ' చెందడం సాంప్రదాయమైతే, ఆ సాంప్రదాయాన్ని అసహ్యించుకోడం నా గుణం. లక్షల్ని నా సంస్థ యిస్తున్నది. అలా యిచ్చేందుకు నాలాటి మరమనుషుల్ని ఏర్పాటుచేసుకున్నది. మరలు పనిచేస్తాయి. సంస్థ ప్రతిఫల మిస్తుంది. మరలకీ సంస్థకీ మధ్య లక్షల మనుషులో ప్రమేయంలేదు. ఆ అవకాశాన్ని మర స్వయంగాయిస్తే ఆ మర చెడిపోయిందనే చెప్పాలి. దాన్నిసంస్థ అనబడే యంత్రంనుంచి తొలగించాలనే అనాలి.

అందుచేత నేను లక్షల మనుషుల దగ్గర 'ఆశ' చూపించేవాడిని కాదు. వాళ్ళు వస్తే పలుకరించేవాడిని. చాతనైతే వాళ్లక్కావల్సిన పని చేసేవాడిని. లేదూ—ఉచితంగా వాయిదా వేసేవాడిని.

—తన గురించి తనే రాసుకోడంలో గల ఇబ్బందిని గమనించి, కావల్సిన జాగ్రత్త తీసుకున్న మీదట తయారైన ఉపోద్ఘాతంపై నుదహరించాను. అది మేకులోత్తు బిగించి మరీ రాసింది.

అయిదున్నర తర్వాత నాకున్న వ్యాపకం ముందే మనవి చేశాను. దానికి సంబంధించిన మనుషులు కొందరు ఒక చిన్న సమావేశం లాటిది ఏర్పాటు చేయడం మూలంగా, పోనాడు, అక్కడికి వెళ్లడం జరిగింది. ఆ సమావేశంలో నాకు పరిచయమైన కుర్రాడి పేరు రాజా. అతనికి కథలు చదవడం చాలా యిష్టంట. కాలం కలిసివస్తే అతనూ మాలాగా తయా

రవ్వాలని ఉద్దేశంట. అతనిది తణుకుట. తెలిసిన మిత్రుడెవరో మా సమావేశం గురించి చెప్పగా విని వచ్చాట్ట.

సమావేశం ముగిసిన తర్వాత అతను నాతోపాటు మా రూముకి వచ్చేడు. నా కథల గురించి చాలాసేపు మాట్లాడేడు. మా హొటల్లోనే భోజనం చేశాం. 'హెలియన్స్' సినిమా గూడా చూసినట్టు జ్ఞాపకం. అతనేదో లాడ్జింగ్‌లో గది తీసుకోడం మూలంగా అత వెళ్ళిపోయేడు. ఆ రాత్రి అలా గడిచింది.

ఆ మర్నాడు అతను మా ఆఫీసుకి, నా సీటుకి వచ్చినప్పుడు నే నెంత ఆశ్చర్యపోయేనో అత నంత కలవరపాటు చెందేడు. అత నొచ్చిన పని టూకీగా చెప్పేడు. ఆ పని నిన్ననే చేసినట్టు చెప్పగా విని మెరిసే కళ్లతో తన కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. రాజా వాళ్ల నాన్నగారు పేరొందిన పెద్ద కాంట్రాక్టరు. ఆంధ్రలో ఆయనకి మంచిపే రున్నది. ఆయనకి మా సంస్థ చాలా డబ్బు యిచ్చింది. ఇస్తూనే ఉంది. అందు నిమిత్తం అవసరమైనప్పుడల్లా తండ్రి తరఫున రాజానే వస్తూంటాట్ట.

రాజాతో ఆనాటి నా పరిచయం ఇంత థ్రిల్‌గా జరిగింది. తర్వాత తను చాలాసార్లు వచ్చేడు. వచ్చిన ప్రతిసారీ కేవలం నేటి కథలూ, వాటి కథకులూ గురించి మాట్లాడేవాడు. అప్పుడప్పుడూ తనవెంట అతను రాసిన కథలూ తీసుకొచ్చేవాడు.

ఇదీ రాజా. నా సీటుతో పనున్న పెద్దమనుషు లందర్లోనూ రాజామీదనే నాకు అమితమైన అభిమానం. కారణం ప్రత్యేకించి రాయక్కర్లే దనుకుంటాను.

ఓనాటి సాయంత్రం ఏమీ తోచని వేళ అద్దె గదిలో కూర్చున్నాను. సమయానికి రూమ్మేటూ లేడు. చీకటి పడేంత వరకూ తలా తోకా లేని ఆలోచనల్తో కుస్తీ పట్టేను. ఏడింటిక్కాబోలు భగవద్గీత తీసి చదవడం ప్రారంభించేను.. రూము ముందు రిక్షా ఆగిన చప్పుడైతే అటువేపు చూసేను. రాజా వొచ్చేడు.

రాజాలో ఒక ప్రత్యేకత ఉంది. అత నెప్పుడూ నవ్వుతూంటాడు. అంత అందమైన మనిషి మరింత అందంగా నవ్వుతే తెలసీలాటి ఆనందం నాకు. అతనిమళ్లీ నవ్వాలని, నవ్వి, అద్దంలో చూసుకుని ఆ ప్రయత్నాన్ని విరమించిన ఘడియ నాకు బాగా జ్ఞాపకం.

"ఏమిటండి, బాబోయ్! భగవద్గీత చదివేస్తున్నారు" అన్నాడు.

"రండి. రండి. ఏం తోచక బోరుకొట్టి చస్తున్నాను. సమయానికి శ్రీకృష్ణ పరమాత్మలా వొచ్చేరు."

అతను నా ట్రంకుపెట్టెమీద కూర్చుని కాలుమీద కాలు వేసుకుని కళ్లల్లో ఆశ్చర్యాన్ని నింపుకుని మరీ అడిగేడు—

"తోచకపోవడమా ? మీకా ? నన్ను నమ్మమనే ?"

"నమ్మలేరా ?"

"వూహూ. చస్తే నమ్మలేను." ఆడపిల్లలా కులుకుతూ అన్నాడు.

"పోనీలెండి". భగవద్గీత అల్మారులో పెట్టి సిగరెట్టు పేకెట్టు విప్పేను. నేనోటి ముట్టించుకుని అతనికో సిగరెట్టు యివ్వబోయేను.

"వొద్దండి. మాని రెండురోజు లైంది."

ఆశ్చర్యపోయేను.

"మాని రెండురోజులైందా? మీరా ? నన్ను నమ్మమనే?" అతన్ని అనుకరిస్తూ అన్నాను.

"నమ్మలేరా ?" న న్నతను బాగా అనుకరించేడు

ఆడపిల్లలా కులుకుతూ 'వూహూ .... చస్తే నమ్మలేను' అని అందా మనుకున్నాను గానీ చాతకాదని గ్రహించి వూరుకున్నాను.

"మా నాన్నగారికీ నాకూ మొన్నామధ్య పెద్ద యుద్ధం జరిగింది."

అతనన్న ఆ మాటని తేలిగ్గా తీసుకోడం నా తప్పుకాదు. సిగరెట్ల గురించి యిలాంటి యుద్ధాలు చాలా విన్నాను గనుక నే నది పట్టించుకోలేదు. కానీ ఆ యుద్ధం సిగరెట్ల గురించి కాదని అతనే చెప్పేడు.

"ఈ పెద్దవాళ్ల పట్టుదలలు మరీ అసహ్యంగా ఉంటాయండి. మన మనసులు అర్థంచేసుకోలేరు. వాళ్ల మాట వాళ్లదే గానీ మనమాట వినిపించుకోరు. అవునాండి ?"

"కావచ్చు."

"నాకూ హృదయముంది గనక ప్రేమించేను. వాళ్ళు స్థితిపరులు కాకపోవచ్చు. అంతమాత్రంచేత ఆపిల్ల నాకు దూరం కావల్సిందేనా ?"

ఎంతకీ అంతస్థూ, కులం ఈ రెంటినీ ముఖ్య కారణాలుగా తీసుకుని కుమిలిపోయే భగ్నప్రేమికుల అవస్థ రాను రాను బోరుకొట్టేస్తుంది. వెరైటీ కోసరమైనా మరో అందమైన డిస్‌క్వాలిఫికేషను వినిపించడంలేదు. గనక రాజా చెప్పే ప్రేమాయణం పట్ల ఆసక్తి తగ్గడం తప్పనిసరి. ఇది గన్న

వించేడు కాబోలు వాళ్ల వ్యాపారం గురించి మాట్లాడేడు ప్రస్తుతం వాళ్లు కొంచెం కష్టాల్లో ఉన్నార్ట.

లక్షాధికారుల కష్టాలు నాకు తెలీవు. కానీ, అతను చెప్తూన్న వాళ్ల కష్టాలు వింటూంటే నిజాని కవి బలమైన వేనా అని అనుమానం కలిగింది.

దీన్లోనూ నాఆసక్తి ప్రదర్శించకపోడంతో కథల్లోకి సంభాషణ మార్చాడు. ఆ సంభాషణ ఎనిమిదిన్నర వరకూ నిరాటంకంగా సాగింది. రాజా ప్రేమాయణంగానీ, వాళ్లనాన్నగారి కష్టాలుగానీ యీ చర్చముందునిలవవు. దీన్లోవున్న రక్తి చెప్పి నంత మాత్రాన అర్థమయ్యేది కాదు. నిమిషాలు, గంటలు రోజులూ గడిచిపోతున్నా 'విషయం' తరగనిది. క్షణక్షణానికీ రంగుమార్చుకుని నిత్యనూతనంగా కనుపించే మహత్తరమైనట్ఱు వంటిదనీ.

ఆరాత్రి భోజనంచేస్తోన్నా, సినిమాచూస్తోన్నా మా కథలకబుర్లు తగ్గలేదు. మళ్లా రూముకొచ్చి నడుం వంచే మన్నమాటేగానీ కంటికి నిద్రరానూలేదు.

ఆ ఉదయం కొంచెం ఆలస్యంగా నిద్రలేచాము. ఆఫీసుకి వేళవడంమూలంగా గబగబా తయారయ్యాను. ఇద్దరం హోటల్లో కూర్చుని కాఫీ తాగుతున్నవేళ పదిగంటలైంది.

కాఫీముగించి బయటకొచ్చి రిక్షాఎక్కుతూ అతనన్నాడు.

"నాకు వేళవుతుంది. నేనుంటాను. మళ్లా ఎప్పుడైనా కలుసుకుందాంలేండి."

అతనో కరచలనం చేసేందుకు చేయిముందుకు చాపేను. కరచలనం ముగిసింది. అతనిరిక్షా కదిలింది. నా గుప్పెట్లో ఓకొత్తఅనుభవం భయంకరంగా దాక్కునుంది.

ఈ కథకిదే కథావాస్తువు!.

భయం వేస్తోంది. రోడ్డుమీద నడుస్తోన్నజనం నన్ను తీక్షణంగా చూస్తున్నట్టు అనుమానం కలిగింది. చేతులు వొణుకుతున్నాయి. గుండెల్లో ఓమూల దడగావుంది. భూమి మీద నించునే వోపిక తక్కువవుతోంది.

నేనునమ్మినమనిషి, నన్ను అభిమానించేమనిషి, మనసుకి నచ్చి స్నేహితం నటించి ఇంతద్రోహం తలపెట్టేందుకు అతని ఆత్మక్షోభించ లేదాని ఆ కాసేపట్లో కొన్నివందల తడవు లనుకున్నాను.

రాజానా యింత పనిచేస్త?

గుప్పెటవిప్పడానికి భయంగా వుంది. నా చేతిలో దాక్కున్న దయ్యాన్ని చూడటానికి గట్సులేవు. గుప్పెటని జేబులో దాచేశాను. కళ్లల్లో నీళ్లు తిరుగుతూంతగా నెమ్మదిగా ఆఫీసుకొచ్చేను. నా సీట్లో కూర్చుని ఎవరూ చూడకుండా గుప్పెట విప్పేను.

రెండు వచ్చనోట్లు!

వెంటనే గుప్పిట మూసేను. గుండె వేగం మరింత ఎక్కువైంది. మనసు ఆఫీసులోలేదు. రాజా టెరిలిన్ చొక్కా లోపల దాక్కున్న శరీరంలో వో మూలనున్న చిన్న స్పైజు అతని 'గుండె'ని దేనితో తయారు చేశాడా దేముడని ఆలోచిస్తోంది. మిత్రుడై, నా దగ్గర ఓ స్థానాన్ని సంపాయించుకుని బతికి పోయేడు—ఇప్పుడు నేనేం చేయాలి? ఏం చేయాలి?

సెలవు పెడుతూండగా హెడ్ క్లార్కు అడిగేరు. వంట బాగోలేదని చెప్పేను.

"అంటే మరో కొత్త కథేమైనా రాస్తూన్నారా?"

నవ్వేసి వూరుకున్నాను.

నా వంట్లో బాగోలేదన్నా, నాకీవేళ సెలవు కావాలన్నా, ఆఫీసులో ఎప్పుడైనా పరాకుగావున్నా వాళ్లందరూ భావించేది ఒక్కటే—రావ్ ఏదో కథ రాయబోతూన్నాడు!

ఇంత నమ్మకాన్ని, గౌరవాన్నీ సంపాయించుకున్న నేను ఇప్పుడేం చేయబోతున్నాను. ఏం చేశాను. చేసింది దాచుకుని మామూలు మనిషిలా తిరుగుతే, రేపొద్దున ఈ విషయం పదిమందికీ తెలిసి—భగవంతుడా రాజాని చంపేందుకు ఇంకా ఆలస్యం చేస్తావెందుకు?

రూమ్‌వేపు నడుస్తున్నాను. రూముని దాటి వెళ్ళిన సంగతి గమనించిన క్షణం వెల్‌కం హోటల్‌ముందు నించున్నాను. లోపలికెళ్ళి కూర్చుని కాఫీకి ఆర్డరిచ్చేను.

జీవితంలో ఇంత డబ్బుని చూడకకాదు నేనింత భయపడటం! దీని కెన్నో రెట్లు డబ్బుని చూసేను. ఖర్చు పెట్టేను. జీతం డబ్బు స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకునే అధికారమూ, దర్జాగా తీసుకునే అర్హతా ఉన్నాయి. కథలు రాస్తున్నాను· వాటి ప్రతిఫలాన్ని ఆనందంగా స్వీకరిస్తాను. గర్వంగా ఖర్చు పెట్టుకుంటాను. దేవుడిలాటి నాన్న, కొండలాటి అన్న—ఇద్దరూ నన్ను అమితంగా అభిమానిస్తారు. నోరు తెరుచుకు అడగాలేగానీ రాజా ఇచ్చిన డబ్బుకి పదిరెట్లు మరుక్షణాన్న నా ముందుంచుతారు.

గుండెల్లో కత్తిదూసినా ఇంత బాధ కలగదేమో! నేను అమితంగా గౌరవించిన ఒకానొక వ్యక్తి చేతుల్లో నా పరువూని వ్యక్తిత్వాన్ని పెట్టి, వెలకట్టి చూడండి. మాస్టారూ! అని గృధేయ పడేంత దౌర్భాగ్యం మళ్లా వచ్చే జన్మకి వద్దు·

ఆ సాయంత్రంవరకూ భోజనం చేయలేదు. ఆ మాట కొస్తే రూము నుంచి బైటకు రానూలేదు. ఆఫీసు మూసే వేళకి ఆఫీసు కెళ్ళేను. ఆఫీసర్ని కలుసుకున్నాను. ఆయన నవ్వుతూ అడిగేరు—

"సెలవు పెట్టారుట"

"అవునండి"

"రెస్టు తీసుకోకుండా మళ్ళా ఎందు కొచ్చేరు?"

"మీతో నేను కొంచెం మాట్లాడాలి."

"నిరభ్యంతరంగా మాట్లాడొచ్చు."

"నన్ని సీట్లోంచి మార్చండి."

"ఎందుకనిట?"

ఏమని చెప్పుకోను? నిప్పులాటి మనిషిముందు నా నీక తాత్పర్యాన్ని విప్పి చెప్పుకున్న తర్వాత క్షమించడమనేమాట అటుంచి, వాచేత ఆ క్షణంలో ఆత్మహత్య జరిగే అవకాశం తప్పకుంగా చోటు చేసుకుంటుంది. అందుచేత నిజాన్ని దాచేను.

"సీట్లో పని ఒత్తిడి ఎక్కువైంది" అనేశాను.

"ఇన్నాళ్ళూ ఎలా చేయగలిగేరు?"

అవును ఎలా చేయగలిగేను? నిజానికి పని ఒత్తిడనే చిన్న కారణాన్ని భూతద్దంలోంచి చూచి భయపడేంత పిరికివాడిని కానేకాదు. ఈ మనిషి కేమని చెప్పాలి? ఎలా నచ్చచెప్పాలి?

"చూడండి రావ్! మీ నెత్తురు తాగాలని ఇక్కడ ఎవ్వరూ కూర్చోలేదు. మీ పని మీరు చేసుకుపొండి. ఒత్తిడనేది ఇలాటి ఆఫీసుల్లో సర్వ సాధారణమైనది. అందుకని చెప్పి మీలాటి యువకులు భయపడితే జీవితంలో మీరు సాధించే దేముంటుంది. ఆల్‌రైట్! మీ నిజమైన ప్రాబ్లమ్ ఏమిటో చెప్పేందుకు అభ్యంతరమైతే దాచుకోండి. మరో నాలుగు రోజులు సెలవుపెట్టి రెస్టు తీసుకోండి. అన్నీ అనుకూలమైనప్పుడే మళ్ళా ఆఫీసుకి రండి. హేపీగా ఉండండి రావ్. మీరే దిగులుపడి పోతే ఎల్లా? వెళ్ళిరండి."

ఆయనకేం? ఆయన ఎన్ని నీతులైనా చెప్పగలరు. నా క్కావల్సిన ఓదార్పు ఈ రకమైనదికాదు. నా మనసు నీతి తప్పి కుళ్ళిపోతోంది. ఈ మందులు దానికి పని చేయవు.

ఆరాత్రి నిద్రపట్టలేదు. తెల్లవారింది. తెల్లవారుతూనే ఓ నిర్ణయాని కొచ్చేను. తణుకు ప్రయాణం కట్టేను. అనుకోకుండా బస్సులో ఓ మిత్రుడు కనుపించేడు. అత నడిగేడు.

"ఎందాకా?"

"తణుకు"

"పని?"

"ప్రత్యేకంగా ఏమీలేదు."

"ఏమైనా పన్నాగమా?"

"అలాంటిదే."

"నీకేం గురూ! వెలిగిపోతున్నావ్"

—నామీద అతనికి జెలసీ! ఏంచూసి జెలసీవో? నీతిగా బ్రతుకుతున్నాననా? 'బ్రదర్! నా గురించి ఎత్తు ఆలోచనలు చేయకు' అని చెప్దామనుకున్నాను. అతను ఏలూర్లో దిగిపోయేప్పుడు గూడా చెప్పనేలేదు.

తణుకులో దిగేను. రాజా వాళ్ళింటి గురించి వాకబు చేశాను. ఓ సోడా షాపతను ఓ కుర్రాడ్నిచ్చి వాళ్ళింటికి పంపేడు.

రాజా వాళ్ళ ఇల్లు అతనిలా దాబు సరిగా ఉంది. అతని ఆకారాని కది చక్కటి పోలిక. నే మా ఇంట్లోకి వెడుతూండగా ఓ నల్లకారు నన్ను దూసుకుపోయింది. అందులో వున్న ఓ బట్టతలాయన నన్ను చూచి గూడా పట్టించుకోనట్టు చుట్ట కాల్చుకోడంలో నిమగ్నుడై ఉన్నాడు. అతను రాజా వాళ్ళ నాన్నగారని షాపు కుర్రాడు చెప్పేడు. తల పంకించేను.

షాపు కుర్రాడు ఇంట్లోకివెళ్ళి మరో అయిదు నిమిషాల్లో పద్నెమినిదేళ్ల కుర్రాడితో తిరిగొచ్చేడు. మా ఇద్దర్నీ వరండాలో నించోబెట్టి తన దారిని తను వెళ్ళిపోయేడు.

అతను నన్ను పలుకరించలేదు. అతని చేతిలో కాగితం, కలం ఉన్నాయి. రాజా పోలికలు అతన్లో స్పష్టంగా కనుపిస్తున్నాయి. బహుశా అతని తమ్ముడై ఉంటాడు. చందమామలాగానే ఉన్నాడుగానీ మర్యాదా, మన్ననా బొత్తిగా తెలీని రాతియుగపు మనిషిలా కనిపించేడు. చెట్టంతటివాడిని కాకపోయినా పరాయి మనిషిని, పనిగట్టుక ఇంతదూరం వచ్చిన వాడిని కనీసం— మీ పేరేమిటి? ఎవరికోసం వచ్చారు?' లని అడగటంలేదు. పైపెచ్చు ఎవరికో ఉత్తరంరాసే ఘనుడిలా అదే పెద్ద రాచకార్యంలా భావించి 'నీ వెధవ పనేదో చెప్పు, నా కవితల తల మునిగేంత పనుంది' అనే తత్తర చూపులా వాడూను.

అభిమానం దెబ్బతిన్నది. కార్యార్థిని, ఒక గాడిద కాళ్ళు పట్టుకునే నిమిత్తం వచ్చిన అతి సామాన్యుడ్ని. అందుచేత నేనే ముందుగా అన్నాను.

"రాజాకోసం వచ్చేను. అతన్ని చూడాలి."

నా మాట విని గూడా అతను నోరు విప్పలేదు. గబగబా. కాగితంమీద ఏదోరాసి నాకు చూపించేరు. దాన్లో ఇలా ఉంది

'రాజన్నయ్య పది నిముషాల్లో వస్తాడు. లోపలికొచ్చి కూర్చోండి'

చదివి అతని మొహంలోకి చూసేను. అతను చిన్నగా నవ్వేడు. ఆ నవ్వు నాకు అర్థమైంది. నవ్వు కాదది. నోరులేని మనిషి కళ్ళకు కల్పించే మహత్తర కార్యమైన ఆదరణ! చలించి పోయేను.

అతనితోపాటు లోపలికెళ్ళి కూర్చున్నాను.

గదిలో కూర్చుంటూ గదినంతా పరిశీలించేను. అది రాజా గదని చెప్పేందుకు రాజా ఫోటోలు నాలుగైదు కనిపించేయి. ఓ మూల పుస్తకాల షెల్ఫున్నది. మరోపక్క అందమైన రేడియో ఉన్నది.

అతను వాల్యూమ్ తగ్గించి రేడియో ఆన్ చేశాడు. లోపలికెళ్ళి కాఫీతో తిరిగొచ్చేడు. కాఫీ యిచ్చి నా ముందు కూర్చున్నాడు. నేను కాఫీ తాగుతుండగా అత నేదేరాస్తున్నాడు. అతను రాసేది చదవాలన్న తాపత్రయం కలిగింది. కాఫీ ముగించేను. ఈమాటు కొంచెం ఎక్కువగా రాసేడు.

'ఇప్పుడు చెప్పండి. మా రాజన్నయ్య మీకెలా తెలుసు మీదేవూరు? నా పేరు ప్రభు. గ్రహించే ఉంటారు. దేముడ. నా నోరు కట్టేశారు. లేకపోతే మీతో చాలా మాట్లాడేవాడినే. ఒక్కోసారి గొంతెత్తి ఏదో పిచ్చిగా పాడేయాలన్నంత కోరిక కలుగుతుంది. వెంటనే ఏడుపొస్తుంది. పోనీలెండి—మీ సంగతులు చెప్పండి. వింటాను.'

అనుభవాని కొచ్చిన దారుణాల్లో ఇదొకటి. అతని ఉత్సాహాన్ని, కోరికని, మంచి మనసుని ఈవిధంగా అన్యాయం చేసిన దేవుడు జాలిలేని రాయనే చెప్తాను. కానీ ఆ ఇంట్లో రాజ్యం చేస్తున్న అవినీతికీ, దురాలోచనకీ సాక్ష్యంగా ఈ జీవని సృష్టించి ఉంటాడనేది నిజం.

ప్రభుమీద జాలి కలిగింది. నే నొచ్చిన పని సవివరంగా చెప్దామనుకున్నాను. ఇంత మంచి కుర్రాడికి కథ తెలీకూడదని చెప్పలేదు. నా పేరు చెప్పేన. నా వూరు చెప్పేను. ప్రయాణంలో ఓ మాటు రాజాని చూచిపోదామని వచ్చినట్టు చెప్పేను.

అంతలో రాజా వచ్చేడు. రాజా రావడంతో ప్రభు వెళ్ళిపోయేడు. రాజా కూర్చుంటూ అన్నాడు.

"ఇంతదూరం మీరు రావాలా? కాకితో ఖబురంపితే వ్యయంగా నేనే వచ్చే వాడినిగా."

"ఎందుకు? మరి రెండు పచ్చ కాగితాలు చేతిలో కుక్కి నా పీక నొక్కేడానికా రాజా! చాలు. నీ స్నేహం గుణపాఠమైంది. నీ వేషం దగా చేసింది. తీసుకో, ఈ నరకం నేను భరించలేను. నన్ను మంచిగా బ్రతకనివ్వు. ఆమాత్రం మేలు చేయి. చాలు" అన్నాను ఉద్రేకంగా.

ఆ పాపిష్టి డబ్బు టీపాయ్ మీదుంచేను.

అతను సోఫాలో తలవాల్చి చాలా బాధ పడుతున్నట్టు నటించి అన్నాడు.

"నన్ను అర్థం చేసుకోండి. తండ్రి చాటు మనిషిని. వ్యాపార దక్షత ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నవాడిని."


"సెలవ్" అన్నాను లేచుని.

అతను చివాలునలేచి నా రెండు చేతులూ పుచ్చుకున్నాడు.

"మీరు వెళ్ళద్దు. ఒక్క క్షణం ఆగండి" అని చెప్పి గబగబా తన పుస్తకాల్లోంచి డైరీతీసి, ఓ పేజీ తిప్పి నా చేతిలో ఉంచేడు. చదివేను.

'ఇంటి కొచ్చేను. నాన్నతో అన్నాను—ఆయన నా డబ్బుని, నన్నూ అవమానించేరు. ఆయన్ని పాడు చేయడం నా కిష్టంలేదు. నా డబ్బు నా మొహాన్న కొట్టిన ఆ మంచి మనిషికి చేతులెత్తి నమస్కారం చేశాను. నన్ను మళ్ళా ఆ పాడుపనికి పంపకండి. నేనిక వెళ్ళను—అని.'

అదిరిపోయేను. అతని కళ్ళల్లోకి తిన్నగా చూశాను. అత నేదో చెప్పబోతూండగా ప్రభు రెండు యాపిల్ పళ్ళతో మా గదిలోకి వచ్చేడు.



రచయిత అతని సమస్యలు - 5

శ్రీ యుజ్నే ఐనెస్కో

నిజానికి నేడు విమర్శలు ఈ విధంగా లేవు. ఎందుకనంటే విమర్శ అనేది అన్నిటి కలగలుపు. తరుచూ అది విమర్శ మినహా ఏదైనా అవుతుంది. సృజనాత్మకుడైన శిల్పి స్వీయభావ వ్యక్తీకరణతో ఆరంభిస్తాడు. తరువాత తాదాత్మ్యస్థితిని అందుకుంటాడు. రచయితలోంచి తోసుకొనివచ్చి రచన స్వస్వరూపాన్ని పొంది స్వతంత్రస్థితిని సాధించుకుంటుంది. తన అదుపులో తాను ఉన్నాననుకుంటూన్న రచయిత, "తాను" అన్న దానికి వ్యష్టి చెప్పుకొన్నట్లు గ్రహిస్తాడు. పాక్షికభావ మెరుగమని చెప్పుకొనే విమర్శకులు తరుచూ కొంత కాకపోతే కొంతయినా పాక్షికదృష్టిని కనుపరుస్తారు. నాటకం, రచయిత వ్రాసేదొకటి, నటుడు చేసేది ఇంకొకటి, ప్రేక్షకులు చూసేది మరొకటి, అంటారు. అసలు పరిస్థితి ఇంతకంటేకూడా క్లిష్టమైనది. ఒక రచన తెలియజేసే సత్యం ఒకటిగా వుండదు. వేర్వేరు ముక్కలుగా వుంటుంది. ఈ ముక్కలు ఒకదానినొకటి కాదంటాయి, విరుద్ధార్థాలకు అవకాశమిస్తాయి. ఈ విరుద్ధ వ్యాఖ్యానాలను అడ్డంపెట్టుకొని నిలబడినట్లుంటుంది. వ్యాఖ్యానాలనే శాఖలకు వృతంగా కనపడే అవసరంకూడా లేకపోయింది. రచనకు నేరే అర్థం కల్పించటంకోసం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది. వివిధము, విరుద్ధము, వికారము అయిన వ్యాఖ్యానాలు చేయడము మానివేసిన మరుక్షణం మిగిలేదేమీ ఉండదు. ఒకసారి దాని కులగోత్రాలు నిర్ణయమైతే చాలు ఇక అది చచ్చినట్లే. దానిని తిరిగి బతికించాలంటే వినూత్నమైన వ్యాఖ్యానం వ్రాయవలసి వుంటుంది. అంటే దానికి ఇదివరకులేని నూతన స్వరూపాన్ని ఇవ్వవలసి వుంటుంది. రచన అనేది ఇతరులు అనుకున్నదానికిమించి ఏమీ కాదని అనిపిస్తోంది. లేకపోతే ఒక రకమైన కిరణప్రసారానికి మూలశక్తిగా ఉంటుంది. విమర్శకులు ఇతరులను గురించి చెప్తున్నామని అనుకుంటారు. కాని నిజానికి తమను గురించే చెప్పుకుంటూ వుంటారు. తమ అహాన్ని వదలలేరు. రచన రచననూ, రచయితనూ, ప్రతిఫలించడంకన్న విమర్శ విమర్శకుని మనః ప్రవృత్తిని ఎక్కువగా ప్రతిఫలిస్తుంది. రచన రచయిత మూర్తిని స్ఫురింపచేస్తుంది. విమర్శ

విమర్శకుని స్వరూపానికి పూర్తిగా ప్రతిబింబముగా ఉంటుంది. నిజానికి విమర్శ, రచన, రచయితలకంటే విమర్శకుల గుఱించే ఎక్కువ చెప్పేదిగా ఉంటుంది.

విమర్శకుడు స్వీయభావ బంధితుడు. తనభావ వైఖరిని, తనమనో వైఖరిని, వాటిని దిద్దిన తన కాలవైఖరినీ, తన ఉద్దేశాలను తనయిష్టాలను వ్యక్తపరుస్తాడు. మన కాలములో ప్రతివిమర్శకుడూ ఒక పక్షం వహిస్తాడు. రచనలో తనకు కావలిసిన, ఇష్టమైన అభిప్రాయాల చిత్రీకరణకే చూస్తాడు. వాటి కనుకూలంగా ఉన్నంతవరకూ భూషిస్తాడు. లేనంతవరకూ దూషిస్తాడు. రచన తంకాలానికి ప్రత్యక్షమైన వ్యక్తీకరణ. అయితే అది సార్వాత్మికమైనందువల్ల కాలగతిని అధిగమించి కాలాతీతస్థితిని పొందుతుంది. అప్పటికిమాత్రము సంబంధించినదై, ఏదో ఒక శాఖాబద్ధమై, సార్వాత్మికరహితమై, పాక్షికబద్ధమై ఉంటుంది విమర్శకుని తత్త్వము. విమర్శలన్నింటికీ వేళ్లు ఆ నాటి సమస్యలనే కుదుళ్లలో పాతుకుని ఉంటాయి. అందుకనే మొత్తము విమర్శంతా పత్రికా రచన. అది ఈ విధంగా అభిమానబద్ధమై అనుకోకుండానే పాక్షికమై ఉంటుంది. ఆ ఒక్క కారణమువల్లనే దాని స్వరూపము పోతుంది.

ఇంతేకాకుండా వారనుసరించే సూత్రాలు నిష్పాక్షికదృష్టిని అడ్డగిస్తాయి. ఈసూత్రాలు Aesthetics కు సంబంధించినవి కావచ్చు. నైతిక, తాత్త్విక మూఢనమ్మకాలు కావచ్చు. అందుకని విమర్శకుడు రచనను పురస్కరించుకొని తాను ప్రయోగించిన సూత్రానురి పరీక్షించాలి. అంతేగాని తనసూత్రాలను పురస్కరించుకొని రచనను పరీక్షించకూడదు. సిద్ధాంతానికి రచనకుమించిన స్థానము ఇవ్వకూడదు. మొదట విమర్శకుని సిద్ధాంతము ఒక Work of art మూలాన నిర్ణీతమై ఉండవచ్చు. తరువాత అలవాటుకి మాంద్యానికి బద్ధకానికి లొంగిపోయి పని సులువుగా తెముల్చుకోడానికోసం తానను సరించే సిద్ధాంతాలను శంకించడమే మానుకున్నారు. అయితే ఏ విధమైన దురుద్దేశము లేక అపార్థము కల్పించేవారి విషయమే ఇప్పుడు మనము అనుకునేది. కాని తరుచూ ఎదురయ్యేవారు వేరు. విమర్శకుడు కనుక ఒక నైతిక రాజకీయ మత సంబంధమైన వర్గానికి చెందిన వ్యాఖ్యాత అయితే చిక్కువస్తుంది. వాటికిచెందిన సిద్ధాంతాలను తెలియచెప్పడానికి, బలపరచడానికి ఉపయోగపడటం మీద రచన యొక్క ప్రాశస్త్యం ఆధారపడివుంటుంది. నాటకాలాడించే నామిత్రుడొకడు ఈ విషయాన్ని ఈవిధంగా చెప్పాడు. "నాదగ్గఱ మంచి మెషిన్ గన్ ఉంది దానిని పేలిస్తే నామిత్రుల మీదైనా పేలుతుంది. అందుకని అది చెడ్డదని చెప్పలేను - శత్రువులమీద పేలితేనే మంచిదనలేను. ఎవరిమీదైనా సరే అసలు బాగా పేలుతుందా లేదా అనేది చూడటమే విమర్శకుని పని." ఎవరిమీద కాల్చాలి అనేది రాజకీయపార్టీలది, రాజకీయవాదులది సైనికులది, సాంఘిక శాస్త్రవేత్తలది. చాలాసార్లు విమర్శ ఆక్షణంలో విమర్శకుని కళాకళలనుబట్టి, కచ్ఛ ద్వేషం అసూయ ఇష్టాయిష్టాలనుబట్టి (సాధారణంగా ఒక ఊళ్ళో ఉండేవారికి ఒకరంటే ఒకరికి గిట్టనట్టు) సడు

స్తుంది. వారు శత్రువులా స్నేహితులా అన్నది, విమర్శకు విలువలేకుండా చేయడానికి చాలు. కాని అతనికి దాని ప్రభావము చాలా ఉంటుంది.

సాహిత్యపరులు గ్రంథకర్తలు విమర్శకులు మొదలైనవారిది పరిమితమైనసంఘము. అది ఒక విధమైన సమిష్టి కుటుంబము. కుటుంబములోని వారు చిన్నచిన్న వాటిమీద పోట్లాడుకున్నట్లు వీరూ పోట్లాడుకుంటారు. తమ కుటుంబచ్ఛిద్రాలను బైటికి పొక్కకుండా లోలోపల సర్దుకోటానికి బదులు ఊరంతా చూచేటట్లు వీధినపడ్తారు. వ్యక్తిగతమైన సంగతులు తెలియని జనం వాళ్లూ వీళ్లూ చెప్పినవి నమ్ముతారు. ఇలా మోసపోయేది ఒక్కజనమే కాదు. పండితులు పరిశోధకులు ఎక్కడో దూరంగా ఉన్న విమర్శకులు కూడా మోసపోతారు. విమర్శకుడు నిష్పాక్షికంగా ఉంటాడని అనుకుంటారు. అతను చెప్పిన వాదాలను అప్పచెప్పుతారు, వివరిస్తారు. ఒక విషయసూచికను తయారుచేస్తారు. అసలు రచనకన్న కూడా దీనిని గురించిన వివరణలు ముఖ్యమనుకుంటారు. ఇతరులు చెప్పిన దేదీ మనసుకెక్కనివ్వకుండా తమంతట తాము చదివి బోధపర్చుకునేవారు చాలా కొద్దిమంది. వ్యాఖ్యానమనేది అదివరకే జరిగి వీరిదగ్గరకి టీకాతాత్పర్యాల మోతబరువుతో వస్తుంది. ఈ విధంగా అప్పుడప్పుడు కపటమైన, పూర్తిగా కొత్తదైన-సాహిత్యాన్ని గురించిన-శాస్త్రం ఒకటి తయారయి వెలుగులోకి తీసుకునిరావటం జరుగుతోంది ముఖ్యంగా నాటకాలకి సంబంధించిన విమర్శల విషయంలో ఇది ఎక్కువగా జరుగుతోంది. నాటకాలు ఆనాడు జరుగుతున్న సమస్యలను తిరుస్తూ ఉండడమే దీనికి కారణం. అందుకని ఇతరవిధమైన రచనల కన్న పత్రికారచనకు ఇవి సన్నిహితంగా ఉంటాయి.

నిజమైన సృజనాత్మకశక్తిగల శిల్పి పూర్తి చిత్తశుద్ధి కలిగి ఉంటాడని చెప్పాను. అతను చెప్పేది నిజము. అయితే అతను చెప్పే ఆ నిజము, నిజాయితీల స్వభావము ఏమిటి ?

రచయిత మనకు చెప్పే కథలు కల్పితాలు. అందువల్ల అవి నిజముయినవి కావు. రచయిత కల్పించాడు కాబట్టి అతను అబద్ధాలు చెప్పుతున్నాడనటానికి వీలులేదు. కల్పన అంటే సృష్టించటం ఆత్మసందర్శనం పొందటం అన్నమాట. సృష్టింపబడిన రచన కల్పితమైనా ఊహాజనితమైనా సజీవమయినది. నేనిదివరకు చెప్పినట్లు ఇది నిజమూ సజీవమూ అయిన జీవి. సృజనాత్మకమైన రచనయొక్క సత్యాన్ని కాదనలేము. అబద్ధాలు చెప్పటం అంటే మోసంచేయుటమూ, ఉన్నదానిని తీసివేసి దానిస్థానే వేరొకదానిని ప్రతిష్ఠించటము. నైతికంగా నీచమైనా, ఉదారమైనా ఏదో ప్రగల్భంకోసం ప్రచారంకోసము ఏవో ఉన్నవని లేవనీ అనటం మోసంచేయటం అవుతుంది. సృజనాత్మకుడైన రచయిత తాను కల్పించిన ఊహించినపాత్రలలో తనను చూసుకోవచ్చు "Medame Bovary, Cestmor" అన్న Flaubert విఖ్యాత వ్యాఖ్యానం మనందరికి తెలుసు. అబద్ధాలకోరు ఒకదాని కొకటి చెప్తాడు. రచయిత అలాచేయడు. అతని

సృష్టి వాస్తవానికి భిన్నంగా ఉండదు. అందుకనే సత్యానికి ఊహాలో వేళ్లుంటాయి. నిజానికి Madam Bovary పూర్తిగా Flaubert కాదు. Flaubert బిడ్డ. పుట్టిన తరువాత ఇక ఆబిడ్డ అతని అదుపు ఆజ్ఞలను దాటిపోయినది.

ఒక వాదాన్ని సమర్థించే రచయిత ఒక విధంగా ఫోర్జరీకోరు. అదివరకే నిర్ణీతమైన ఒక గమ్యస్థానానికి తన పాత్రలను నడిపిస్తాడు. ఒకదారిని నడపవలసిందిగా బలవంత పెడతాడు. పాత్రలు ఎలా ఉండాలో అతనికి ముందే తెలుసు. తన కళ స్వేచ్ఛను, తన పాత్రల స్వేచ్ఛను, బలిచేసేస్తాడు. అతని కళ అన్వేషణయాత్ర కాకుండా పోతుంది - అది వరకు చూసిన ప్రదేశమునుంచి రావటం మూలాన. అతని పాత్రలు వట్టి కీలు బొమ్మలు. అతని శిల్పంలో సాక్షాత్కారమనేది ఉండదు. వివరణా, చిత్రీకరణ మాత్రమే ఉంటాయి. మొదట్లో నేపథకంలో ప్రతిదీ నిర్ణయమయిపోయివుంటుంది. ప్రత్యేక పక్షము వహించి వాదించటంవల్ల సహృదయతతో వ్యవహరించడం ఉండదు. నిజాయితీ అనేది ఉండదు. అతని పాత్రలుగాని రచనలుగాని మనకేవిధమైన ఆశ్చర్యాన్ని కలిగించవు. ఏ సిద్ధాంతము పూర్తిగా నిష్పాక్షికంగా ఉండటం సాధ్యంకాదు. రచయిత ఒక వాదాన్ని సమర్థిస్తున్నప్పుడే అది బోధించే సత్యానికి ఇతర వాదాలు బోధించే సత్యాలకన్న ఉన్నత స్థానాన్ని ఇస్తాడు. అలా సమర్థించే రచయితకూడా నిజమైన సృజనాత్మక శిల్పి కావచ్చు. అందుకని మొదట ఏమనుకొన్నా తాను సమర్థించే వాదాన్ని అతిక్రమించి తనపాత్రలకు స్వేచ్ఛనిచ్చి తన అంతఃప్రేరణలకు లొంగిపోతాడు, అలా చేసినంతకాలం అతను సృజనాత్మకుడుగానే ఉంటాడు. చాలామంది రచయితలు ప్రచారంచేసే ఉద్దేశంతోనే రచన ఆరంభిస్తారు. కాని ఆ ప్రయత్నంలో నెగ్గలేనివారే గొప్పరచయితలవుతారని నేనిదివరకే చెప్పాను. వారు సృష్టించే పాత్రలు వారి అధీనంలోంచిపోయి వారిపైన ఆధిపత్యం వహిస్తాయి.

"Peoples theatre" అనేది ఉండాలని చాలా కాలంగా చాలామంది గొడవ చేస్తున్నారు. దాని అర్థమేమిటో నాకు బోధపడలేదు. భాషలోను భావంలోను ఆదికాలం నాటినుంచి ఉద్భవించినట్లుగా ఉండాలా? అది ప్రజలచేత రచింపబడిన ఒక విధమైన నాటకపద్ధతా? అదే అయితే ప్రజలంటే మనం చెప్పే అర్థమేమిటి? అది ఏదయినా ప్రజల కోసం వ్రాయబడిన నాటకకళా? విద్యాప్రబోధకమైన, రాజకీయంగా విద్యాప్రబోధకమైన నాటకకళా? అదే అయితే మనం నిజం నిజాయితీ మరిఏ విలువా లేదన్న ప్రచారబద్ధమైన నాటకకళను తిరిగి వరిస్తున్నామన్న మాట? ఈ విధమైన నాటకకళ ప్రభుత్వ పథకంతో ముడిపడుతుంది. ప్రభుత్వాధికారుల భావనిరంకుశత్వానికి లొంగిపోవలసి ఉంటుంది. పథకముఅంటే ప్రభుత్వ పథకము; అంతేగాని అసలు పథకము ఉండకూడదనికాదు. పథకము దానికై ఉండాలి. దానిలోదై ఉండాలి. ఏదో తెచ్చి దానికి అంటకట్టకూడదు. అలా అంటకడితే దాని ఉద్దేశముపోయి అపార్థము ఆపాదింపబడుతుంది. ప్రజలు అంటే మనము—మీరూ

నేను. సాహిత్యంద్వారా భావప్రకటన చేయడానికి మనకందరికీ హక్కు ఉన్నది. సాహిత్యంలోపడి ఆనందిస్తాము. ప్రధానంగా మనము ఒకరినుండి ఒకరం వేర్వేరు కాము. మనలో ప్రతిఒక్కరు ఇతరులందరిలోనూ ఉన్నారు. అందుకనే కళ అంతగాఢమైన అనుభూతినిస్తుంది. నూతనస్వరంతో పలుకుతుంది. ఆశ్చర్యపరుస్తుంది. గుర్తుకు అందనిది; కాని గుర్తుకురాగల స్వరూపముగలది.

రచయిత తన ఆవేదనను తనవాంఛను తాను ప్రతిష్ఠించదలచిన సిద్ధాంతాలను తన స్వీయాభిప్రాయాలను అన్నింటినికూడావదలి కేవలము తనఅంతఃప్రేరణ లాక్కుపోయిన త్రోవను పోవాలి. అప్పుడతనికి ఆకస్మికంగా వొక నూతనప్రపంచము-అనుకున్నదీ అనుకోనిదీ సాక్షాత్కరిస్తుంది. తాను ఆశ్చర్యపోయి చూస్తూవుంటే తన ముందరే పైకి పెరుగుతూ వుంటుంది. ఈ ప్రపంచము మనము వుండే ప్రపంచమంత విచిత్రంగా వుంటుంది. హడావిడిగా ఉండే దైనందిన జీవితంలో అప్పుడప్పుడు లభించే విరామ సమయంలో కనుక సరిక్రొత్తగా శ్రద్ధగా చూస్తే అది తెలియవస్తుంది. ఈ ప్రపంచాన్ని యధాతథంగా ప్రవేశపెట్టాలి. అది సున్నితమైన సత్యమైన ప్రపంచము. దానిని మార్చకూడదు. దానిదారిన దానిని పోనివ్వాలి. తనప్రమేయమేమీ వుండకూడదు. దానిని చూస్తూవుండాలి. అతిశ్రద్ధతో ధ్యానిస్తూ వుండాలి. వాటంతటవి స్వంతంగా మాట్లాడటానికి అనుమతిస్తున్నానని భావనవుండాలి. తనప్రమేయము దర్శకత్వము లేకుండా సంఘటనలు వాటంతట అవి జరిగిపోతున్నాయని అనుకోవాలి. స్వీయభావన అయినా దూరంగా నిలబడి ప్రేక్షకుడుగా చూడాలి.

తానే తనవిమర్శకుడుగా నీతిబోధకుడుగా తత్వజ్ఞుడుగా మానసికశాస్త్రవేత్తగా వ్యవహరించే హక్కుఉన్నది. కాబట్టి తన రచన గురించి తరువాత తను అనుకునేది చెప్పవచ్చు. మొదట్లో దానిని గురించి ఏమీ అనుకోకూడదు. ఆలోచించనేకూడదు. రచయిత కనుక నిష్పాక్షికంగాను శ్రద్ధగాను వ్యవహరిస్తే తాను సృష్టించిన ప్రపంచం ప్రత్యక్షమవడానికి కోరుతున్నదని గ్రహిస్తాడు. దానికి వేరే శాసనాలు వేరే పద్ధతి వేరే విధీ ఉన్నాయి. దానికి పూర్తి స్వేచ్ఛనిచ్చి దానిత్రోవన దానిని పోనిస్తే ఎలా ఉండగోరుతుందో ఎలా ఉండితీరాలో అలా పెరగటానికి ఒప్పుకోవాలి. రచయిత తన స్వంతబాధలను అధిగమించినట్లుగా రచన రచయితను అధిగమించాలి. అతని చిన్న చిన్న సమస్యలు లెక్కలోనికిరావు. తాను ఇంతకాలము వెతికే ఒక ప్రపంచం రూపొందింది. అది సజీవమయినదనటానికి జీవవంతముగా ఉండాలి. రచయిత దానిని చూచి ఆశ్చర్యపోతాడు, ఆశ్చర్యపోడు. తాను ఒక నెట్టు నెట్టటం తప్ప మరేమీ చేయలేదనే భావంలో ఉంటాడు. ఈ ప్రపంచందాని జనం తనలోంచి పుట్టి పెరిగి వారి దోవన వారు బయటకెళ్లి బ్రతకటానికి అనుమతిస్తూ గేట్లుమాత్రం తెరిచానని అనుకుంటాడు. సత్యాన్ని అసత్యాన్ని అధిగమించే (కేవలం ఆదర్శాలు ఆధారంగాగల నైతికశాస్త్రం

నిర్ణయించిన సత్యం అసత్యం) ఊహాజనితమైన రచనమాత్రమే మనం వర్ణించే మూలస్థితిలో అంటే జీవితంలో వేళ్ళు నాటుకుని వుండే రచన అవుతుంది. అని ఇది తెలియచెప్తుంది. దానికే నిత్యనూతనస్థితి వస్తుంది. అపుడు వచ్చే మార్పులు దానిని ఏమీ చేయలేవు. దాని స్వరూపం చెక్కుచెదరదు. భిన్నవిధాలుగా మెప్పుపొందవచ్చు. కాని నిరంతరం మారేది ప్రజలదృక్పథం. వారి చైతన్యధోరణి. కాని ఆ రచన మాత్రము అలాగే నిలబడిఉంటుంది. అది అప్రతిహతం, చిరంజీవి. ఈ అర్థంలో అయితేనే ఒకరచన శాశ్వతత్వం గురించి కొంతవరకు మాట్లాడవచ్చు. మిగిలినవన్నీ మార్పుకు లొంగి—కాలం తీరిపోయిన సిద్ధాంతాలు, నిదర్శనకూ నిరూపణకూ నిలువలేవని తేలిపోయిన వాదాలు, శిథిలమైపోయిన ఆలోచనలూ—కూలిపోతాయి. కుళ్లిపోతాయి.

స మా ప్తి



అధికారభాషా సమస్య : ఒక సమీక్ష

శ్రీ తిరుమల రామచంద్ర

శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ 1959 ఆగస్టు సెప్టెంబర్ నెలలలో పార్లమెంటులో ప్రసంగించినప్పుడు అధికార భాషా సమస్యపై హిందీభాషేతర ప్రజలకు కొన్ని హామీలిచ్చారు. ఆ హామీలు వారికి అప్పుడు ఎంతో సంతృప్తి కలిగించాయి. ఆ హామీ లివి :

"ఏ రాష్ట్రమైనా కేంద్ర ప్రభుత్వంతో వ్యవహారానికి గాని, తోటి రాష్ట్రాలతో వ్యవహారానికిగాని ఇంగ్లీషును వాడవచ్చు. ఆ యా రాష్ట్రాల కార్యకలాపాలు ఆ యా ప్రాంతీయ భాషలలో జరిగినా, అఖిల భారత స్థాయిలో రాష్ట్రాలమధ్య ఇంగ్లీషు వాడకానికి పరిమితు లేవీ లేవు. ప్రజల అంగీకారం—ప్రజలంటే హిందీ భాషేతరులని నా అభిప్రాయం—లేనిదే ఇంగ్లీషు వాడకానికి గడువు ఏర్పరచడం కూడా జరుగదు."

మరొక ప్రసంగంలో శ్రీ నెహ్రూ ఇలా అన్నారు : "నేను రెండు విషయాలను విశ్వసిస్తున్నాను. మొదటిది: హిందీని హిందీ భాషేతరులపై బలవంతంగా రుద్దడం జరుగదు. రెండవది : అనిర్దిష్టమైన కాలంవరకు—ఎంతవరకో నేను చెప్పలేను—ఇంగ్లీషును సహాభాషగా ఉండనిస్తాను. ఎందుకంటే, హిందీ భాషేతర ప్రజలు తమ అభివృద్ధి మార్గాలు అరికట్టిపోయాయని భావించకూడదు గనుక. అందువల్ల ఇంగ్లీషు ప్రజలు కోరేటంతవరకు ప్రత్యామ్నాయ భాషగా ఉంటుంది. దాని తర్వాతి నిర్ణయాన్ని హిందీభాషవారికి గాక హిందీభాషేతరులకు వదలుతాను. హిందీ క్రమంగా అభివృద్ధి చెందుతుంది. కాని, ఇంగ్లీషు కూడా ప్రజలు కోరుతున్నంత కాలం రంగంలో ఉండాలని వాంఛిస్తున్నాను. కొన్ని రాష్ట్రాలు దీనిని అనుసరిస్తున్నాయి. అవి ఇంగ్లీషును వాడుతూ ఉండవచ్చు. ఇతర భాషలు క్రమంగా అభివృద్ధి అయిన తర్వాత ఇంగ్లీషు స్థానంలో మరొక భాషను ప్రతిష్ఠించుకోవచ్చు."

నెహ్రూ హామీలు

శ్రీ నెహ్రూ 1963 ఏప్రిల్ 24 వ తేదీని పార్లమెంటులో అధికార భాషా శాసనంపై ప్రసంగించినప్పుడు కూడా ఈ హామీలనే పునరుద్ఘాటించారు.

"మనం ఇంగ్లీషా—హిందీయా, హిందీయా—ఇంగ్లీషా అనే దృష్టితో చూడరాదు. అది సరైన దృష్టి కాదు. మనం వాటిని సముచితరంగాలలో వాడాలి. జాతీయ భాషా రంగంలో జాతీయ భాషలకు మాత్రమే స్థానం ఉంటుంది. ఆ రంగంలో మనం ఇంగ్లీషు ప్రసక్తి తేలేము. కాని, తక్కిన పెక్కు సందర్భాలలో మనం ఇంగ్లీషును వాడవచ్చు.

"అందువల్ల, మనం ప్రాంతీయ భాషలను అభివృద్ధి పరచుకోవాలి. విద్యారంగంలోను, పరిపాలనాది రంగాలలోను మనం ఎంతో పని ప్రాంతీయ భాషలతో సాగించగల మనడంలో సందేహం లేదు. భారతదేశం భాషల విషయంలో పరస్పర సహకారంతో అభివృద్ధి చెందగలదే కాని, పరస్పర సంఘర్షణలో కాదు. భారతీయ భాషలు సన్నిహితమైనవి. వాటి మూల భావాలు కూడ చాలవరకు ఒక్కటే.

"ఉన్న చిక్కంతా తర్వాతి దశలోనే. ఈ ప్రాంతీయ భాష లన్నిటినీ కలిపే కొలికి—లంకె—ఏమిటి? ఇంతవరకు ఆ కొలికి ఇంగ్లీషు. ఇంగ్లీషు కేవలం లంకె మాత్రమే కాదు. ఆ యా ప్రాంతాలలోని ప్రభుత్వ కార్యకలాపాలు కూడా ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి.

"ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెంది, త్రిభాషా మాత్రం ప్రకారం ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించ గలిగి, వివిధ ప్రాంతాల ప్రజలు సన్నిహితులయినప్పుడే, హిందీ భాషేతరులు హిందీని లంకె భాషగా అంగీకరించడం—స్పష్టం

సుప్రీంకోర్టులో వాడవలసిన భాషను 348 వ సూత్రం నిర్దేశిస్తున్నది. "సుప్రీంకోర్టులోని కార్యక్రమమంతా ఇంగ్లీషులోనే ఉండాలి" అని సరళంగా, స్పష్టంగా ఈ సూత్రం నిర్వచించింది. దీనికి అపవాద సూత్రాలేవీ లేవు. పార్లమెంటు మరొక చట్టంతో అన్యథాకరించేవరకూ దీనికి ఎలాటి కాలపరిమితీ లేదు.

రాష్ట్రాలలోని ఉన్నత న్యాయ స్థానాలలో వాడవలసిన భాషను గురించి 348 వ సూత్రమే నిర్వచించింది. రాష్ట్రాల హైకోర్టుల కార్యకలాపం కూడా సుప్రీం కోర్టులోలాగ ఇంగ్లీషులోనే జరుగాలని ఈ సూత్రం నిర్దేశించినా, ఈ సూత్రంలోని 2వ ఉపసూత్రం ప్రకారం గవర్నరు రాష్ట్రపతి అనుమతితో హైకోర్టు కార్యకలాపాలకు హిందీనిగాని, రాష్ట్రంలోని అధికారభాషనుగాని వాడడానికి ఉత్తరువులు జారీ చేయవచ్చు. అలాంటప్పుడు కూడా పార్లమెంటు అన్యథా చట్టం చేసే వరకు హైకోర్టు ఉత్తరువులు, డిక్రీలు ఇంగ్లీషులోనే ఉండాలి.

ఈ రాజ్యాంగ సూత్రాల వెలుగులో 1963 నాటి అధికార భాషా శాసనాన్ని పరిశీలిస్తే అది మొన్న కల్లోల పరిస్థితికి ఎంతవరకు బాధ్యమో స్పష్టమవుతుంది.

అధికారభాషా శాసనంలోని అస్పష్టత

ఈ అధికార భాషా శాసనం పీఠికలో "ఇది యూనియన్ ప్రభుత్వ కార్యకలాపాలకు, పార్లమెంటు వ్యవహారాలకు, కేంద్ర, రాష్ట్ర శాసనాలకు, హైకోర్టులలో కొన్ని పనులకు ఉపయోగించదగిన భాషల శాసనం" అని ఉంది. ఈ వాక్యాలలో సుప్రీంకోర్టు ప్రసక్తి లేదు. దీనినిబట్టి 1965 జనవరి తర్వాత కూడ సుప్రీంకోర్టులో ఇంగ్లీషు వాడకంలో మార్పేమీ ఉండదని స్పష్టం. అలాగే రాష్ట్ర శాసన సభలలో వాడే భాషల విషయంలోను మార్పు ఉండదని ఈ పీఠికవలన తెలుస్తున్నది. అందువల్లనే కేంద్రం తను ఆమోదించిన అధికార భాషా శాసనానికి అనుగుణంగా రాష్ట్రాలు కూడా శాసనాలు చేయాలని కోరడం. కాగా, ఇంగ్లీషు రాష్ట్రంలోని అధికార భాషలతోపాటు, హిందీతోపాటు అధికార భాషగా కొనసాగుతుంది. ఇలాటి శాసనాలు చేయడానికి నిరాకరించిన హిందీరాష్ట్రాలలో 210 వ సూత్రం ప్రకారం ఇంగ్లీషు వాడకం దానంతట అదే లోపించి పోతుంది.

వాస్తవానికి 1965 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చే ఈ అధికార భాషా శాసనంలో ముఖ్యంగా వివాదగ్రస్తమైన పరిచ్ఛేదం 3 వ పరిచ్ఛేదం. దీనిలో ముఖ్యమైనది "1965 జనవరి 26 వ తేదీ తర్వాత ఇంగ్లీషు హిందీకి అదనంగా కొనసాగవచ్చు" అనే వాక్యం. ఈ వాక్యం అస్పష్టంగా ఉంది. ఈ చట్టం ఇంగ్లీషును కొనసాగించే అవకాశం ఇచ్చినా, హిందీకే అనుకూలమైంది. 343 వ సూత్రమేమో హిందీని అధికార భాషగా సిద్ధాంత రీత్యా గుర్తించినా, 1965 జనవరి 26 దాక నిజానికి ఇంగ్లీషే అధికార భాష. ఈ కొత్త శాసనంవల్ల ఇంగ్లీషుకు ద్వితీయస్థానం ఏర్పడుతుంది. హిందీకి ప్రథమస్థానం చేకూరింది.

ఇంగ్లీషుకు రెండవ—గౌణ—స్థానం ఇవ్వడంవల్ల "ఇంగ్లీషు హిందీతోపాటు సహభాషగా ఉంటుంది" మొదలుగా శ్రీ నెహ్రూ చేసిన వాగ్దానాలు ఎంతవరకు నిలబడ్డాయనేదే ప్రశ్న. 1963 భాషా శాసనం ఆమోదించబడినప్పుడే ఈ వాద వివాదాలు చెలరేగగా, శ్రీ నెహ్రూ సమాధానమిస్తూ, "కొనసాగవచ్చు (మే) అన్నదానికి ప్రకరణ వశాత్తు కొనసాగుతుంది (షెల్) అనే అర్థమని వివరించారు. ఏమైనా" అధికార భాషా శాసనం 3 వ పరిచ్ఛేదం ప్రకారం 1965 జనవరి 26 తర్వాత ఇంగ్లీషు హిందీకి అదనంగా కొనసాగడానికి వీలులేకపోవడం స్పష్టం. శాసనం చేయమన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం సూచనవే వినని హిందీరాష్ట్రాలు కీర్తిశేషుడైన నెహ్రూ హామీలను వరకు చేస్తాయని నమ్మకమేమిటి?

హిందీభాషేతరుల అనుమానానికి కారణం ఏమిటి ?

రాజ్యాంగం, అధికార భాషా శాసనం ఇలా ఉన్నప్పుడు హిందీ భాషేతరుల భయాందోళనలను బాహ్య కారణాలూ ఇనుమడింప జేస్తున్నాయి. కాంగ్రెస్ ఉద్యమ సమయంలో విదేశీయమైనది ప్రతిదీ నిరాకరణ యోగ్యంగా కనిపించింది. ఇంగ్లీషును దాస్య చిహ్నంగా భావించాము. ఆ సందర్భంలో భాషా సమస్యపై గాంధిజీ అన్న మాటలను ఇక్కడ ఉట్టంకించడం అప్రసక్తంకాదు.

"భారతదేశాన్ని సంపన్నం చేస్తున్న ఆ యా రాష్ట్రాల భాషలను పునరుద్ధరించడం మనం చేయవలసిన మొట్టమొదటి పని. వెంటనే మన కోర్టులలోను, పాఠశాలలలోను, సచివాలయాలలోను భాషను మార్చడం పనికి రాదనీ, కనీసం కొన్ని సంవత్సరాలయినా గడవాలని వాదించడం మన మానసిక స్తబ్ధతకు చిహ్నం.

"కనుక నా వాదమేమిటంటే, మనను ఆక్రమించిన ఇంగ్లీషు పరిపాలనను మనం తోసివేసినట్టే, సంస్కృతి

రంగంలో ఆక్రమించుకున్న ఇంగ్లీషు భాషను కూడ తోసి వేయాలని. ఈ విషయంలో ఒక్కరోజు ఆలసించినా, అంత మేరకు మన జాతికి సంస్కృతి రంగంలో నష్టం కలుగుతుంది."

ఇంత ఎలుగెత్తి చెప్పిన గాంధీజీయే హరిజన్ పత్రికను హిందీతోపాటు ఆంగ్ల భాషలోను ప్రచురించారు. ఏమైనా అప్పటి దేశాభిమానావేశం అలాంటిది. హెచ్చుమందికి హిందీ తెలుసునని, దేశంలో హెచ్చు ప్రచారంలోఉన్న ఉరుదూను, హిందీని మేళవించి హిందూస్థానీ అని వ్యవహరించి దేవనాగరి పారసీలిపులు రెండూ వాడాలని గాంధీజీ విస్పష్టంగా చెప్పారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ రోమన్ లిపిలో హిందూస్థానీని వాడుకలోకి తెచ్చారు.

హిందీవారి ఆవేశం

కాని, అప్పటి విదేశీ విద్వేషంవేరు. ఆదివరకే
"మహారాజ్ కో సాహెబ్ నిత్య కల్యాణ్
జవానో నిరంతర ఏక్ జవాబ్
హిందీ, హిందూ, హిందుస్థాన్!"

అని భారతేందు హరిశ్చంద్ర చాటిన నినాదంతో వెర్రెత్తిపోయిన హిందీ దురభిమానులు గాంధీజీ మాటలుగాని, కాంగ్రెస్ తీర్మానాలుగాని వినక హిందీనుంచి ఉరుదూ, ఇంగ్లీషు పదాలను ఏరివేయడం ప్రారంభించి హిందీని కృత్రిమంగా చేయటానికి పూనుకున్నారు. ఈ పని 1937 లో యు. పి. లో ప్రారంభమై స్వాతంత్ర్యానంతరం తీవ్రమయింది. శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ ఎంత ప్రతిఘటించినా, హిందూస్థానీకి మారుగా, దేవనాగరి లిపిలో హిందీని రాజ్యాంగ పరిషత్తు అధికార భాషగా ఆమోదించింది. ఈ ఆమోదం ఒక్క వోటు మెజారిటీతోనని మనం గుర్తుంచుకోవాలి. ఈ హిందీ ఉన్మత్తులు హిందీలో శతాబ్దాలుగా చేరి సహజమైపోయిన అరబ్బీ పారసీ, ఇంగ్లీషు పదాలను ఏరి పారవేస్తూ, ఉక్కు పెనగం లాంటి సంస్కృత పర్యాయాలను తెచ్చి పెడుతున్నారు ప్రభుత్వాధికారబలంతో. ఇంజనీరు ఎంత సులభమయిన పదం? దీనికి మారుగా వచ్చింది అభియంత. టికెట్‌కు మారు క్షిపక్ అనే మాటను శ్రీ టాండన్ ప్రచారం చేశారు. సిగ్నల్ అని సర్వ సామాన్యంగా అలవాటులో ఉన్నమాటను ఒక హిందీ విద్వాంసుడు "ధూమ శకట గమనాగమన సూచక తంత్రిక లఘు స్తంభాగ్రవర్తి వర్ణ దీపిక దారు ఫలక పట్టిక" అని హిందీకరించినట్లు కరాకా ఎప్పుడో వ్రాశారు. ఈ వెర్రిని కాంగ్రెస్‌కాని, అభ్యుదయ వర్గాలుగాని ఆపలేకపోయాయి. సంస్కృత విద్వాంసులు అన్యభాషా పదాలను స్వీకరించడానికి అంగీకరించరు. హోర, తాలిక, ద్రేక్కాణవంటి జ్యోతిశ్శాస్త్ర పదాలు గ్రీక్‌భాషనుంచి వచ్చిచేరి సంస్కృతమైపోయాయి. వారికిలేని మడి హిందీ వారికి ఎందుకో! ఈ దాడి క్రమంగా హిందీ భాషేతరులపైనా బయలుదేరింది.

హిందీ గొప్ప ఏమిటి?

అయినా, హిందీవారి ఈ ఆవేశానికి కారణమేమిటో! వారి ఆధిక్యం ఏమిటా కనిపించదు. జాతీయోద్యమంలో అందరిలాగే వారూ పాల్గొన్నారు. నిజానికి జాతీయోద్యమ లీడర్లకు ఆలవాలం హిందీ భాషాప్రాంతం కానేకాదు మహారాష్ట్రభూమి, వంగ భూమీను. హిందీ భారతదేశంలోని హెచ్చుమంది భాష కాదు. దాదాపు 40% జనానికి మాత్రమే బాగా తెలిసిన భాష; మాతృభాషకాదు. ఆ తెలియడంకూడ నేడు ప్రచారం పొందిన ఖడీబోలీకాదు. ఉన్నవంటున్న నాలుగు హిందీ రాష్ట్రాలలోను మాండలిక భాషల రవ రవలు ఎప్పుడూ ఉంటున్నాయి. వ్రజ భాష, భోజ్‌పురీ, మైథిలీ, రాజస్థానీ, మేవారీ, మార్వారీ మొదలయినవి సామాన్య మాండలికాలు కావు. దాదాపు స్వతంత్ర భాషలు అంతకుముందు ఉరుదూ వీటికంతా లంకె భాష. హిందీ ఇతర భారతీయ భాషలలాగ, కనీసం తన పక్కచెల్లెలయిన ఉరుదూలాగనైనా అభివృద్ధి చెందిందా అంటే, అదీలేదు. బ్రిటిష్‌వారు రాకముందు అధికార భాషగా ఉన్నదా అంటే, లేదు. ఎప్పుడూ లేదు. అప్పుడు హిందీ అనబడేరాష్ట్రాలలోను ఉన్న అధికార భాష ఉరుదూయే. హిందీనుంచి తక్కిన రాష్ట్రాలవారు ఆధునిక సాహిత్యంనుంచికాని, ప్రాచీన సాహిత్యంనుంచికాని కొత్తగా నేర్చుకోవలసిన, నేర్వదగిన విషయాలేవీ లేవు. పూర్వ సాహిత్యానికి ప్రధానంగా సంస్కృత పారసీకాలు, నవీన సాహిత్యానికి ఆంగ్ల సాహిత్యం ప్రధాన క్షేత్రాలు. ఇక నిరక్షర రాజ్యాల సంఖ్య నూటికి 70% నేడు ప్రచారమయిన హిందీ ఢిల్లీ ప్రాంతపు వ్యవహారభాష. మొగల్ చక్రవర్తుల కాలంలో వారి సౌకర్యంకోసం పారసీ లిపిలో వ్రాయబడి, ఉరుదూ (లష్కర్ భాష)గా అభివృద్ధి అయినది. దానిని పట్టుకొని దేవనాగరిలిపి చేసుకుని హిందీవారు ఖడీబోలీ అని ప్రచారం చేశారు.

భారత సమైక్యంచేసిన భాష ఏది?

కాంగ్రెస్ హిందీని చేపట్టకముందు భారత సమైక్యానికి అది చేసిన సేవ ఏమైనా ఉన్నదా అంటే అదీ లేదు. భారతదేశం కాశ్మీరంనుంచి కన్యాకుమారిదాక ఒక్కటేనని, నానాత్వంలో ఏకత్వంలాగ వివిధ భాషలు, జాతులు ఉన్నా పూసలలో దారంలాగ ఏక సంస్కృతి అనుబద్ధమై ఉన్నదని తత్త్వవేత్తలు, చరిత్రకారులూ అన్నప్పటికీ, బ్రిటిష్‌వారి పరిపాలన

లోనే మన దేశంలో రాజకీయ సమైక్యం, ప్రాదేశిక సమైక్య సుస్థిరతలు ఏర్పడినవన్నది సామ్రాజ్యవాద ప్రతికూలోద్యమం వల్లనే. యావద్దేశంలోను ఒక్కుమ్మడిగా జాతీయత వెల్లువించింది వెల్లివిరిసిందన్నది విస్మరించరాని అంశాలు. ఈ జాతీయతా వికాసానికి ఇంగ్లీషు భాష తోడ్పడిన తీరు అమూల్యమైనది. అనిర్వచనీయమైనది. ఇదే వివిధ విభిన్న విజాతీయ సజాతీయ వర్గాలను ఏక ముఖం చేసింది. ఆధ్యాత్మిక రంగంలో సంస్కృత భాష చేసిన సమైక్యాన్ని రాజకీయ, జాతీయ రంగాలలో ఇంగ్లీషు సాధించింది. ఇతర విధాలుగాను అది వృద్ధి కలిగించినది, మనదేశంలో రెండు వందల సంవత్సరాలుగా భావ ప్రకటనకు తోడ్పడుతున్నదిది. అలాంటి భాషను మానుకోడం ఎందుకు?

దీనికి ప్రజాస్వామ్య సూత్రం అడ్డు వస్తున్నది. ఇంగ్లీషు చదువుకున్నవారు మన దేశంలో నూటికి ఒక్కరు— ఇంతకాలం పరిపాలించినా ఆ చదువు లేదనే సాకుతో ప్రజా సామాన్యంలోని రత్నాలు చూసే దిక్కులేక మరుగైపోతాయి. అందరికీ అన్ని అవకాశాలు కల్పించడం మన ప్రజాస్వామ్య లక్ష్యం. దానికి మాతృ భాషలలో, ప్రాంతీయ భాషలలో పరిపాలనాదికం కొనసాగినప్పుడే ఫలం ప్రజానీకానికి చేకూరుతుంది. మాతృ భాష సులభమయినట్లు పరభాష కాదు. జాతీయభావం సంతృప్తి కావడానికి దేశానికంతటికీ బాగా తెలిసిన భాషను పరస్పర వ్యవహారానికి నియమించుకొని, స్వ రాష్ట్ర పరిపాలన ప్రాంతీయ భాషలలో సాగాలి. లేకపోతే పర ప్రభుత్వాన్ని తొలగదోయడం ఎందుకు?—ఈ దృష్టితో చూచినప్పుడు దేశీయ భాషల అభివృద్ధికి భంగం లేకుండా రెండు శతాబ్దాలుగా అలవాటయిన ఇంగ్లీషును జనం వద్ద స్వంతవరకూ వాడుకుంటూ లంకె భాషను రూపొందించు కోవడానికి మార్గం చూడాలి. అసలు ఈ వివాదానికి కారణమంతా మన దేశం బహు భాషా సంకీర్ణమైనది కావడం వల్లనే.

మన జాతీయత రూపొందిన తీరు

మన జాతీయత కూడ విచిత్రంగా రూపొందింది. వివిధ భాషలు, జాతులు ఉన్న ఇతర దేశాలతో మన దేశాన్ని పోల్చి చూడడానికి వీలులేదు. అమెరికాలో వివిధ జాతుల వారూ, భాషలవారూ ఉన్నారు. కాని వారంతా ఒక మతం వారు కావడంతో సంస్కృతివల్ల కొంత సన్నిహితులై క్రమంగా ఒక్కటయి జాతిగా ఏర్పడ్డారు. కనుక తమ మాతృ భాషల కన్నా ఇంగ్లీషునే లంకె భాషగాను, అధికార భాషగాను అంగీకరించారు. సోవియట్ యూనియన్ పరిస్థితి దైవికంగా అనుకూలించింది. జార్ చక్రవర్తుల కాలంలో రష్యన్ భాష అధికార భాషగా సామ్రాజ్యమంతటా వాడుకలో ఉంది. సోషలిస్టు విప్లవం రాగానే మునుపటిలాగే అన్ని రిపబ్లిక్కులూ రష్యన్ భాషను అధికార భాషగా ఆమోదించడంలో కష్టమేమీ లేకపోయింది. అంతేకాక సోవియట్ యూనియన్‌లో రష్యే మాతృభాషగాగల వారి సంఖ్య ఎక్కువ. అది అన్ని విధాల అభివృద్ధి చెందినది. అది ఇదివరకే అధికార భాషగా ఉన్నందున అజర్‌బైజాన్, తాష్కెంట్‌వంటి ఆసియా జాతి రిపబ్లిక్కులు కూడా ఎలాటి పేచీ, దిగులు లేకుండా ఆమోదించాయి. స్విట్జర్లాండ్, బెల్జియం, యుగోస్లావియా, చెకోస్లొవాకియాలలో రెండు మూడు భాషలు అధికార భాషలు.

కాని, మనం ఈ విషయంలో ఇతర దేశాలను అనుసరించ నక్కరలేదు. మనది బహు భాషా దేశం గనుక రెండు మూడు భాషలు విధిగా నేర్చుకొనే పద్ధతి అమలు కావాలి. అప్పుడుకాని భావ సమైక్యం ఏర్పడి, వివిధ భాషలవారి మనస్సులలోని ఆందోళన తొలగదు. ఈ దృష్టితోనే త్రిభాషా పథకాన్ని 1957 లోనే సూచించారు. సమైక్య దృష్టిగల పెద్దలు. దీనిని అన్ని పక్షాలవారూ, కేంద్ర ప్రభుత్వం వారూ ఆమోదించారు. ఈ పథకం ప్రకారం హిందీ భాషేతర ప్రాంతాలలో ఆ యా ప్రాంతీయ భాషలు ఆ యా రాష్ట్రం అధికార భాషలుగాను, కోర్టు భాషలుగాను, బోధన భాషలుగాను ఉంటాయి. రెండవ భాష ఇంగ్లీషు, మూడవ భాష హిందీ. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు, ఇంగ్లీషు, హిందీ—ఈ మూడు భాషలూ విధిగా నేర్చవలసి ఉంటాయి. హిందీ మాతృభాషగాగల రాష్ట్రాలలో హిందీ, ఇంగ్లీషు, మరొక ఆధునిక భారతీయ భాష నేర్వాలి. ఈ ప్రాతిపదికన మూడు భాషల వాడకంవల్ల దేశ సమైక్యానికి బలం చేకూరి, ఇంగ్లీషు స్థానంలో ప్రాంతీయ భాషలు రావడానికి, బహుళ ప్రచారం గల ఏదో ఒక భారతీయ భాష దేశమంతటికీ లంకె భాషగా ఏర్పడడానికి దారి ఏర్పడుతుంది. 1962 లో జరిగిన జాతీయ సమైక్య మహాసభ కూడా ఈ త్రిభాషా పథకాన్ని కచ్చితంగా అమలు పరచాలని సూచించింది. రాష్ట్ర ముఖ్యమంత్రులు కూడా ఆమోదించారు.

శ్రీ నెహ్రూ 1963 లో అధికార భాషా శాసనంపై జరిగిన చర్చలో ఈ త్రిభాషా పథకాన్ని ప్రస్తావించి ఇలా వ్యాఖ్యానించారు : "మేము త్రిభాషా పథకం సూచించాము. దేశంలో ఎక్కువమంది తమ మాతృ భాష, కాక, ఇంగ్లీషును, మరొక భారతీయ భాషను నేర్చుకోవాలి. ప్రజలలో పరస్పరం ఇంగితజ్ఞానం పెరిగినకొద్దీ భాషలు కూడ సన్నిహితమై ప్రస్తుతం భారతీయ భాషలమధ్య ఉన్న దూరాలు తగ్గిపోతాయి. ఈ భాషలు తమ ప్రాంతాలలో త్వరిత అభివృద్ధి కావాలి." ప్రాంతీయ భాషల అభివృద్ధి, సన్నిహితత్వం కలిగిన తర్వాతే హిందీ భాషేతరప్రాంతాలవారు స్వచ్ఛందంగా హిందీని లంకె భాషగా అంగీకరిస్తారని శ్రీ నెహ్రూ ఆశించారు.

హిందీవారి అలక్ష్యం

కాని, హిందీప్రాంతాలవారు ఈ త్రిభాషా పథకాన్ని బుద్ధి పూర్వకంగానే పాడు చేశారు. మూడు భాషలు

నేర్పుతున్నామంటూ, రెండవ భాషగా ఆధునిక భారతీయ భాషను నేర్పడానికి మారు సంస్కృతం నేర్పడం ప్రారంభించారు. హిందీవారు చిత్తశుద్ధితో తమ మాతృభాష కాక, ఇతర ప్రాంతాలలోని భాషలను నేర్చినప్పుడే హిందీని దక్షిణాపథంవారు, తూర్పు రాష్ట్రాలవారు విధిగా నేర్చుకోవాలని ఒత్తిడి చేయవచ్చు.

అంతేకాక దేశంలోని 14 భాషలను సమానంగా జాతీయ భాషలుగా రాజ్యాంగం పేర్కొన్నా, 351 సూత్రం హిందీ అభివృద్ధికి ప్రత్యేకమైన అవకాశం కల్పిస్తున్నది. ఈ పరిస్థితిలో హిందీభాషేతరులు ముందులాగ ఇంగ్లీషే అధికార భాషగా కొనసాగితే, హిందీవారితో పోటీలో నెగ్గగలమని, తమకు భద్రత ఉండగలదని భావించడం తప్పు కాదు.

ఇంత గాఢంగా ఉన్న భయానుమానాలను కేంద్ర ప్రభుత్వమూ, హిందీ నాయకులూ గుర్తించలేకపోతున్నారు. గుర్తించినా, నిర్లక్ష్యం చూపుతున్నారు. మీదు మిక్కిలి సేఠ్ గోవిందదాస్‌వంటి రచయిత, దేశ సేవకుడు, బాధ్యత గల హిందీ ప్రచారకుడు కూడా భాషా శాసనంలో మార్పును ఈసడిస్తూ, ఇతర భాషల వారిని రెచ్చగొట్టడం హిందీ దురభిమానం కాక మరేమి? ఇలాటివారి ప్రకటనలవల్లనే హిందీ భాషేతరులు నాయకుల హామీలనుగాని, ప్రధాని శ్రీ శాస్త్రి చేసే వాగ్దానాలనుగాని నమ్మలేక పోతున్నారు. హిందీవారు కొంత ముందంజవేసి, ఇతర భారతీయ భాషలను నేర్చుకొనడం ద్వారా భాషారంగంలో సామరస్య సమైక్యాలకు పూనుకొనక పోతే, ఇతర భాషా పదాలను కూడా బహిష్కరించే అసహ్య వైఖరిని వదలు కొనకపోతే, హామీలకు, వాగ్దానాలకు విలువ ఏమిటి? కనుకనే హిందీభాషేతరులు శాసనం ద్వారా, రాజ్యాంగంలో మార్పుచేసి అయినా సరే, తమకు రక్షణ కల్పించాలని కోరడం.

దేశ సమైక్య దృష్టితోనే హిందీని తక్కిన భాషల వారు అధికార భాషగా అంగీకరించారు గాని, దాని సంపన్నతను చూచి కాదని మనం విస్మరించరాదు. అలాంటప్పుడు హిందీవారికి ఈ దేశ సమైక్య దృష్టి ఎందుకు లేదు? వారు ధైర్యంగా హామీలను శాసనబద్ధం చేయడానికి పూనుకొని, ఇతర భాషలవారికి ఎందుకు విశ్వాసం కలిగించడానికి నడుం కట్టడంలేదు!

ప్రజాహితం ముఖ్యమా? పట్టుదల ముఖ్యమా?

ఇక రాజ్యాంగంలో మార్పులు చేయడం అసాధ్యమా? కాదు. రాజ్యాంగంలో ఇంతవరకు 17 సార్లు మార్పులు, చేర్పులు జరిగాయి. చీటికి మాటికి రాజ్యాంగం సవరించడం, ఎవరో అల్లర్లు చేశారన్నంతమాత్రాన బెదిరిపోయి, శాసనాలు చేయడం సుస్థిరమైన ప్రభుత్వ విధానానికి ప్రతిఘాతంకాదా?—అని ఆక్షేపించవచ్చు. నిజమే. కాని, భాష అన్నది రక్తంలో రక్తంగా ప్రాణంలో ప్రాణంగా ఉండేది. మన భావప్రకటనకు ప్రధానమైనది. ఇతరుల ఇంగితం తెలుసుకొని మానవుడు నాగరకుడు, సభ్యుడు, సుసంస్కృతుడు కావడానికి, అంతత: విశ్వ మానవ కల్యాణ కారకుడు కావడానికి సాధ్యమైనది. ఇలాటి భాష విషయంలో నిర్లక్ష్యం, జాప్యం తగదు.

కనుక, హిందీవారు హిందీ తమ మాతృ భాష కావడం వల్ల ఇతరుల కన్నా హెచ్చు లాభాలు పొందకుండా చూడడానికి కేంద్ర ప్రభుత్వం తగు కట్టుదిట్టాలు శాసన రూపంగా చేయాలి. పోటీ పరీక్షలలో హిందీవారికి హిందీభాషేతర భాషలలో ఒకదానిలో పాండిత్యం ఉండేటట్టు చూడాలి.

భూత పూర్వ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నట్టు ఇంగ్లీషును హిందీభాషేతర రాష్ట్రాలవారు కోరినంతకాలం సహాధికార భాషగా ఉంచాలి. భారతీయ భాషలలో ఏదో ఒకటి—అది హిందీ అయినా సరే—అన్నిటికన్నా ముందుగా అభివృద్ధి చెందితే దానంతట అదే అధికార భాష అవుతుంది. హిందీవారు దేశంలో అత్యధిక సంఖ్యాకులు కదా. ఎందుకీ తొందర? ఎందుకీ భయం? హిందీ సహజంగా వికసించి, అన్ని రంగాలలోను తన స్థాయిని పెంచుకొని, సుసంపన్న మయేంతవరకు ఇంగ్లీషే అధికారభాషగా ఉండుగాక!

కాని, హిందీవారి ఆత్రానికి కారణం నాకు మరొకటని అనిపిస్తున్నది. హిందీ ఎప్పుడూ అధికార భాషగా లేదు. ఉరుదూయే అధికార భాషగా శతాబ్దాలుగా చెలామణీ అయింది. మరల ఉరుదూకు అలాటి ప్రాధాన్యం వస్తుందేమోనని వారి మనసులోని గిలి కాబోలు! తమ దారికి ఇంగ్లీషు అడ్డు వచ్చింది. మొగ్గలోనే గిల్లి పారేద్దామనుకొని ఇంగ్లీషుపైన విరుచుకు పడ్డారు.

కనుక శ్రీ నెహ్రూ హామీలను అధికారభాషా శాసనంలో పొందుపరచినా, హిందీవారి మనసుమారి, వాటిని చిత్తశుద్ధితో అమలుపరచాలనే ఉద్దేశం కలిగేవరకూ ప్రయోజనం ఉండదు. "ముక్కుపట్టుకోగలంగాని, ఓంభూః అనిపించగలమా?" అని సనాతనుల సామెత. జాతికంతకూ సంబంధించిన ఇలాటి సమస్యలలో పట్టు విడుపులు అవసరం. చిత్తశుద్ధి, సమయజ్ఞత చాల ముఖ్యమైన విషయాలు.

నిర్బంధంతో ఏపనైనా సవ్యంగా జరుగదని హిందీ దురభిమానులు గ్రహించాలి. దీర్ఘదృష్టి, ఇరుగు పొరుగు దేశాల అనుభవం, సహనం హిందీవారికి ఈ వివేకం అనుగ్రహించుగాక!

నెల్లూరు చోడవంశము

శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి

లోగడ సెప్టెంబరు, 1964—భారతి కలగూరగంపలో 'తిక్కన రచనా కాలము' చర్చించునప్పుడు క్రింది జిజ్ఞాస స్ఫురించినది.

'శ్రీ మన్మహా మండలేశ్వర ఇమ్మడిగండ గోపాల విజయాదిత్య మహారాజులకు రాజ్యాభివృద్ధి ..... (2 సం. 60 పు).

*　　*　　*

'ఇతడు 'ముక్కంటి కాడ్వెట్టి వంశావతారు' డో, కరికాలచోడ వంశావతారుడో స్పష్టముగా తెలియదు.

'అయినను, నెల్లూరు చోడ వంశములో మొదటి గండ గోపాల తిరుకాళ్తి (తిక్క) దేవరాజన్నట్లే, ఇమ్మడి గండ గోపాల విజయాదిత్య మహారాజన్నట్లు ఊహచేయ వీలున్నది. నిజము తెలియదు. (భా. పు. 76) అని విడిచిపెట్టితిని.

నెల్లూరు చోడరాజ వంశములో కొందరి పేర్లు చక్కగా సమన్వయము కాకపోయినను, చారిత్రకులా జిజ్ఞాసను చర్చించినట్లు కనబడలేదు.

క్రీ. శ. 1277—79 తేది కృష్ణ పట్టణ శాసనములో 'ఇరుమడి తిరుకాలత్తి' పేరు చెక్కుటచేత, నెల్లూరు చోడరాజ వంశములో ఇద్దరు తిక్క రాజులు మాత్రమే ఉన్నట్లు చారిత్రకులు లెక్కించుచున్నారు. కాని, క్రీ. శ. 1253 తేది ఉదయగిరి తాలూకా ఏపిలగుంట మజరా చిలుకపాడు శాసనములో ముమ్మడి తిరుకాల (తిక్క) రాజన్నట్లు తండ్రి—కొడుకుల సంబంధము తెల్పుచున్నది. సూర్యగ్రహణము నాటి ఆ శాసనములో దాన విషయ మిట్లున్నది.

'.... శ్రీ మన్మహా మండలేశ్వర (ప్రసాహిత ?) తిక్కయదేవ మహారాజులు ......(త) మ తాండినం తోడు నింతపట్టునం గూడియు .... వదొలగట్టునం దిష్టకథ వినోదంములం మన్నయునరంబున ధ ' ధర్మం విచారించి, తమ తండ్రి తిరుకాళేశ్వర శ్రీ మహాదేవరకు నంగరంగ భోగంములకు స్వస్తిశ్రీ శకవరుషంబులు 1174 నేండు....వడవారము నాంటి సూర్యగ్రహణమునాండు తిరుకాళేశ్వర దేవర దివ్య శ్రీపాద పద్మారాధకులైన త్రిపురాంతకదేవునికిన్ని అతని తమ్ముండు గేదారదేవనికిం చిలుకపాటి కంపనలములో బోగడపాడనున్నది...... ఇచ్చినవాండు.' (ND 2, W 48)

పై 1/3/1253 తేదీ శనివార సూర్యగ్రహణమునాటి నెల్లూరు చోడరాజ వంశములో 'తండ్రి తిరుకాళేశ్వర దేవరకు (కొడుకు) తిక్కయదేవ మహారాజ' కూడ కలడు. తిక్కన—నిర్వచనోత్తర రామాయణ—కృతిపతి వంశముకాని, గుంటూరు జిల్లా నర్సారావుపేట శాసనమందలి 'నెల్లూరి పట్టణపతి' చోడ వంశముకాని ఈతనికి అవకాశ మిచ్చుటలేదు.

'విక్రమసింహ పట్టణపతి' వంశములో పేర్కొన్న తిరుకాళేశ్వర—తిక్కరాజు లిద్దరికి తండ్రులు, మనుమసిద్ధులుగా కనబడుచున్నారు. మూడవ తిక్కదేవరాజు తండ్రి (మనుమసిద్ధి కాడు) తిరుకాళేశ్వర—తిక్కరాజు.

క్రీ. శ. 1253 తేదీ శాసన చోడవంశమును బట్టి చూచినచో మూడవ తిక్కరాజు ఇరుమడి తిరుకాలత్తిగాను, క్రీ. శ. 1279 తేదీ శాసన చోడవంశమును బట్టి చూచినచో రెండవ తిక్కరాజు కాలక్రమముగా ముమ్మడి తిరుకాలత్తిగాను లెక్కించవలసియున్నది. కాని, ఏ కారణముచేతనో అట్లు లెక్కింపబడలేదు. ముగ్గురిని ఇద్దరుగా లెక్కించుట తప్పు.

ఇక ఏ ఇమ్మడి తిక్కరాజే తిక్కరాజ కొమారుడో, నెల్లూరు చోడవంశ శాసనాధారములతో గుర్తించ వీలున్నదేమో చూతము.

క్రీ. శ. 1257 తేది మనుమసిద్ధి (AR. 580/1907) నందలూరు శాసనములో క్రింది చోడవంశమున్నట్లు ఆంధ్రకవి తరంగిణి (భా. 2—పు. 197) తెల్పుచున్నది.

గోదలోపం పూడిపోయినది గాక, అటు తరువాతి వంశ వృక్ష మీ క్రింది విధముగా నున్నది.'

'దాయభీముడు
|
వేలభూపతి
|
ఎఱ్ఱసిద్ధి
|
రాజేంద్ర మనుమసిద్ధి
|
తిక్కనృపతి
|

పేరు తెలియదు (తిక్కయ దేవమహారాజ— తండ్రి తిరుకాళేశ్వరదేవర1)	మనుమసిద్ధి (ఇతడే తిక్కనచే నిర్వచనోత్తర రామాయణమును కృతి నందినవాడు.)

నెల్లూరు చోడవంశములోని మొదటి తిక్కరాజునకు క్రమముగా తిక్కరాజ మనుమసిద్ధి అను కుమారు లిద్ద రున్నట్లు శాసన మంగీకరించినను, తిక్కనాదులే చిన్న తిక్కరాజ పేరెత్తక పోవుట కేదో కారణ ముండియుండును. కాని, మన కిప్పుడది తెలియదు.

అందువల్లనే కాబోలు శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిగారి క్రింది, చిదంబర శాసన రహస్య చరిత్రను బయట పెట్టియు, వెంటనే తోసిరాజన్నారు.

'(4) సుందరపాండ్యుడు (జటావర్మ) గండగోపాలుని చంపిన తర్వాత నెల్లూరి రాజ్యమును అతని తమ్ములకు (సహోదరులకు) ఇచ్చెనని యొక శాసనము కలదు. (ఇది కూడ చిదంబరము నటరాజాలయములోనిదే. ఎందుచేతనో డిపార్టుమెంటువారు ప్రకటింపలేదు. 'సెందమిళ్' అను తమిళ పత్రికలో ప్రకటింపబడినది.) .... ఈ 'తంబియువర్' ఎవరోగాని మనుమసిద్ధికి సహోదరు లుండినట్లు కానరాదు. దాయాదులుగా నుండియుందురు.'

(5)' క్రీ. శ. 1263 కు తర్వాత ఈ 'తంబియువర్' ఎంతకాలము పాలించిరో తెలియదు.....' (పు. 66) అని.

క్రీ. శ. 1964 సం. డిసెంబరు భారతిలో శ్రీ వేదము శాస్త్రిగారు వ్రాయుట సరికాదు.

చిదంబర తమిళ శాసనము అన్నదమ్ములు కలరని చెప్పుచున్నను, చిలుకపాడు శాసనములో మొదటి తిక్క తిరుకాళేశ్వరునికి తిక్క దేవరాజ కొడుకైనట్లు వాచ్యముగా చెప్పుచున్నను, శ్రీ శాస్త్రిగారు 'ఈ 'తంబియువర్' ఎవరోగాని మనుమసిద్ధికి సహోదరు లుండినట్లు కానరాదు. అనుట స్వవచన వ్యాఘాతము.

'పేరు వాడే' అని శాసనములలో వ్రాసిపెట్టి యుండునా? అట్లుండిన ఎట్టి కష్టము లేదుగదా. మన పరిశోధన ఎందులకు ? మనము చారిత్రక పునర్నిర్మాణము గుర్తించవలసి యున్నది. అందులకు నా యుపపత్తులను నేను చూపితిని.' (భా. సం. 41/1261) అని నేనును శ్రీ శాస్త్రిగారి సూచన నిచ్చుట పునశ్చరణ చేయుట కవకాశ మున్నది. అన్ని చర్చలు సత్యాన్వేషణము కొరకే కదా !

అన్నిటిలో లేకపోయినను, ఒక్క శాసనములో పేర్కొన్న వంశ చరిత్రను కాదన వీలులేదు.

ఇతర శాసన సాదృశ్య చోడవంశము నిక్కడ పోల్చి చూతము.


KV. 13.	AR. 508/1907
దూబగుంట శాసనము	నందలూరు శాసనము
క్రీ. శ. 1214 నాటిది	క్రీ. శ. 1257 నాటిది
—	దాయభీముడు
—	వేలభూపతి
—	ఎఱ్ఱసిద్ధి
రాజేంద్రచోడ	రాజేంద్రుడు2
మన్మసిద్ధన (?బసువ) తంగ దేవరాజ (1214)	మనుమసిది
(దాయాది)	తిక్కన నృపతి
(విజయాదిత్యరాజ)	(తిక్కరాజ) మన్మసిద్ధి (1257)

పై రెండు 'దాయాది' వంశములను వర్ధారావుపేట శాసన వంశమును కలిపి చూచినచో నెల్లూరు చోడ వంశ మిట్లుండవలె ననిపించుచున్నది.

---

1 ఇక్కడ తిక్కదేవరాజ శాసనభాగము చేర్చి, పోలిక చూపబడినది. మూలములో లేదు.

2 'రాజేంద్ర మనుమసిద్ధి' పే రొక్కరిదికాదు. తండ్రి కొడుకులదని పోలిక వంశము చెప్పుచున్నది.



చిహ్నములు కల చోడవంశీకు లిద్దరు తప్ప, తక్కిన అందరి విషయములో వివాద మేమిన్ని లేదు.

> 'దర్ప దుర్జయులగు దాయాది నృపతుల
> వని లోనుఁ బఱపఁడే యాగ్రహమున
> . . . .
> రాయగండ గోపాలు(డు)

తిక్కన కృతిపతి వంశములో వర్ణించిన 'దాయాది' పేరు తెలియక పోయినను, అతని కుమారుడు కాటోలన్న 'విజయక్ష్మాధీశ్వరుంగా పిగావేవిచేంజోలన మన్మసిద్ధి యనిః ప్రాయేటప్రబ గాఢోత్తతిన్.' అను 'ఇమ్మడి గండగోపాల విజయాదిత్యదేవ మహారాజుల రాజ్యాభివృద్ధి' శాసన చరిత్రను గుర్తించుటకు కివ్వు డవకాశ మేర్పడుచున్నది. 'ప్రాయేటు' అనగా 'సముద్రము'. కాబట్టి, కందుకూరు తాలూకా సముద్రతీరములో 'రాజ్యాభివృద్ధి' కై క్రీ. శ. 1259— 2 ప్రాంతమున దాయాదు లిద్దరికి యుద్ధము జరిగినట్లు పెంట్రాల గ్రామశాసన చరిత్ర సూచన ఘోషించుచున్నది.

ఇమ్మడి గండగోపాల విజయాదిత్యుడు చోడవంశ వృక్షమును బట్టి దాయాది తమ్ముడు కాటోలనుట కవగాశ మెక్కువ కలదు. అయినను, శ్లేష చరిత్రలో పల్లవ జగద గోపాల—విజయగండ గోపాల విజయాదిత్యుని యుద్ధచరిత్ర కూడ వ్యంజకమగుచున్నట్లున్నది.

కేతన కృతి—దశకుమార చరిత్ర—లో 'స్థాపిత సూర్య వంశ వసుధాపతిన్ ......బొగడొందెసిద్ధి సేనాపతి ప్రోడ తిక్కజననాథ శిఖామణి కాప్త మంత్రియై.' అని పేర్కొన్న సిద్ధయ ప్రెగడయు, కుమారుడు తిక్కయనాథ ప్రెగడయు క్రీ. శ, 1253 తేది నాటికి, తిక్కనాదులు వర్ణించక విడిచిపెట్టిన తిరుకాళేశ్వరుని కొడుకు తిక్కయ దేవరాయుల దగ్గరనే మంత్రులుగా ఉన్నట్లు చిలుకపాడు శాసన చరిత్ర వాక్యముగా వివరించుచున్నది.

' .... శ్రీ మన్మహా మండలేశ్వర (ప్రసాహిత?—ప్రశస్తి సహిత) తిక్కయ దేవమహారాజులు సమస్త ప్రశస్తి సహిత శ్రీ మన్మహా ప్రధానులైన సిద్ధన పెగడ తిక్కయనాథం పెగడయుం దమతాండినం తోడు వింతవట్టునుం గూడియు ..... ధర్మాధర్మం విచారించి తమ తండ్రి తిరుకాళేశ్వరదేవరకు వంగ రంగ భోగములకు .... ధారాపూర్వము చేసి ఇచ్చినవాండు. ....' (NDIW 48) అని నిరూపించుచున్నది.

తండ్రి కుమారు లిద్దరు తిరుకాళేశ్వర తిక్క దేవరాజు లగుటచే కవులు, శాసనదాతలు, భ్రమపడినారో, లేక—సంగ్రహ పక్కిలో చోడవంశోపశాఖలను చేర్చక విడిచిపెట్టినారో, తెలియక పోయినను, వ్రాసిన చిలుకపాటి శాసన చరిత్రను సంశయింప వీలులేదు.

క్రీ. శ. 1253—57 మధ్య కాలమునాటి జటావర్మ సుందరపాండ్యుని 'ముదుకూరు—ముత్తుకూరు—కృష్ణపట్టణ తీరం—' దండయాత్రలో ('వీరగండ గోపాల శివిన దావదహన కాష్ఠే పురవరాధీశ్వర, గణపతిహరిణ శార్దూల, నెల్లూరు పుర విరచిత వీరాభిషేక, ప్రణత రాజ ప్రతిష్ఠాపన'—

(S. 22, Vol. IV. P 631) 'వీరగండ గోపాల' బిరుదాంకితుడగు తిక్కరాజు కుమారుడు తిక్కరాజు రణ మరణము పొందిన పిమ్మట తమ్ముడు మనుమసిద్ధి కాకతీయ గణపతి నాశ్రయించి, గోదావరీ తీర యుద్ధములో సేనానిగా పాల్గొనినట్లున్నది.

అప్పుడు దాయాది సోదరుడు ఇమ్మడి గండగోపాల విజయాదిత్యుడు నెల్లూరు దిగ్విజేతయగు జటావర్మ సుందర పాండ్యరాజు నాశ్రయించి, నెల్లూరు సామంతరాజ్యమును సంపాదించుకొన్నందుచేత, రాజ్యభ్రష్టుడగు మన్మసిద్ధి రాయగండ గోపాలుడు అదాయాది ఇమ్మడిగండ గోపాల విజయాదిత్య చోడరాజును కందుకూరు సముద్రతీర ప్రాంత యుద్ధమున వోడించి, తరిమి తరిమి కొట్టి మరల నెల్లూరు రాజ్యము సంపాదించుకొన్నట్లు సమన్వయము కుదురుచున్నది.

కంచిరాజ్య పాలకులగు (A. 7) గండగోపాల అల్లుం దిక్కరాజు, తమ్ముడు విజయాదిత్య చోడరాజు లిద్దరు నెల్లూరు

3 'వారి తమ్ముండు బసువ (త) (—కర్క)గోపురవర ప్రాకార కడ నల్లె ?' మారుపేరు కాటోలు. (K.V. 13)

యుద్ధములో కాపమరదులకు సహాయమునకై వచ్చి నెల్లూరు చోడులు వోడినట్లు, కంచి చోడులు కూడ రాజ్య భ్రష్టులైనట్లు తోచుచున్నది.

'జగద గోపాల'—విజయగండ గోపాల విజయాదిత్య దేవ మహారాజా క్రీ. శ. 13 శతాబ్దములో నెల్లూరుజిల్లా ఆత్మకూరు పాకనాటిలో రాజ్యము స్థాపించి పరిపాలించినట్లు శాసనములు రెండు తెల్పుచున్నవి.

A. 25	A. 55
చిరమన శాసనము	రాజవోలు శాసనము
క్రీ. శ. 1285	క్రీ. శ. 1290
'శ్రీ మన్మహా మండలేశ్వర విజయగండ గోపాళ మహారాజా రాజ్యము.'	'శ్రీ మన్మహా మండలేశ్వర విజయాదిత్య మ(హా) రాజుల కొడుకు మలిదేవ మహారాజా రాజ్యము.'

ఇందలి తండ్రి—కుమారు లిద్దరు పల్లవకుల తిలకులు. కాబట్టి, కాశ్యప గోత్రికులైన చోడులు కారనుట స్పష్టము.

ఇట్లనుట కాక్షేపము లేవిచో పెంట్రాల శాసనమందలి ఇమ్మడిగండ గోపాల (దాయాది) విజయాదిత్యునికిని, చిరమన—రాజవోలు శాసనములందలి విజయగండ గోపాల (పల్లవ) విజయాదిత్యునికిని మధ్య వంశ గోత్ర వ్యక్తి భేదము లేదనుట కవకాశము లొరిగా లేదు.

పై రెండు శాసనములందలి 'జగద గోపాల—విజయగండ గోపాలు' నికిని, 'విజయాదిత్యు' నికిని మధ్య వంశగోత్ర భేద మంగీకరించినను, వానైక్య మంగీకారము కాదన వీలున్నది. ఒకడు 'జగద గోపాల' బిరుదాంకితుడు కాగా, మరియొకడు 'ఇమ్మడిగండ గోపాల' బిరుదాంకితుడుకాగా, ఈ విజయాత్యు లిద్దరి మధ్య వ్యక్తి భేద మున్నట్లు బిరుద ప్రశస్తి సూచించు చున్నది.

ఏది యెట్లయినప్పటికిని, క్రీ. శ. 1253—57 లో జటావర్మ సుందరపాండ్యునిచేత చంపబడిన వీరగండ గోపాలు (డు)' నే ఇదివరలో తలచినట్లు మనుమసిద్ధికా డనియు, అతని అన్న' తిక్కరాజ వీరగండ గోపాలు(డు)' కాకపోడనియు శాస నాధారములతో ఇప్పుడు చెప్ప వీలున్నది.

గూడూరు తాలూకా (G.67) మల్లాం (అరవ) శాసనములో 'వీరగండ గోపాల శాహి—9' రాజ్యపాలన కాలము లెక్కుటచేత క్రీ. శ. 1244—53 మధ్య కాలమున మొదటి తిక్క తిరుకాళేశ్వరుని కుమారుడు ఇమ్మడి తిక్క తిరుకాళేశ్వర వీరగండ గోపాలుడు నెల్లూరు రాజ్యమును పరిపాలించినట్లు లెక్కించ వీలున్నది.

రాపూరు తాలూకా (R. 39) మరువూరు శాసనములో క్రీ. శ. 1243 తేది 'శ్రీ మన్మహా మండలేశ్వర మధురాంతక పొత్తపిచోళ' తిలక నారాయణ మనుమసిద్ధరస' పేర శ్రీ కంఠం పెట్టి 'ఉత్తరాయణము' లో దాన మిచ్చినట్లున్నది.

మొత్తముమీద తండ్రి మొదటి తిక్క తిరుకాళేశ్వరుడు క్రీ. శ. 1232 లో కట్టకడపటి (R. 65) పూటుకూరు శాసనము చెక్కించగా క్రీ. శ. 1243—44 లో కుమారులిద్దరు (అన్న—దమ్ములు) తిక్కన—మనుమన్నసిద్ధనలు రాజ్యారంభం కావించుట కేదో యొక ప్రతిబంధక ముండితీర వలెను. అప్పుడు అన్నదమ్ముల మధ్య రాజ్యస్పర్థయో, ఇమ్మడి గండ గోపాల విజయాదిత్యుని దాయాది మత్సరమో, పల్లవ విజయగండ గోపాల విజయాదిత్యుని దండయాత్రయో కారణ మగుటచేత వెంటనే పట్టాభిషేకము జరిగినట్లు తోచలేదు.

క్రీ. శ. 1243—44 ప్రాంతముననే తిక్కన—మన్మ సిద్ధనల రాజ్యారంభ మైనట్లు శాసన దానములు సూచించు చున్నవి. క్రీ. శ. 1232—43 మధ్య నెల్లూరు రాజ్యము సుస్థిరముగా లేనట్లున్నది.

ఇట్లే క్రీ. శ. 1263—77 మధ్యకాలములో కూడ మనుమసిద్ధి నెల్లూరు రాజ్యము సుస్థిరముగా లేదు.

పల్లవ జగద గోపాల (విజయాదిత్యుడు—లేక) విజయగండ గోపాలుడు క్రీ. శ. 1268—70 ప్రాంతమున మనుమసిద్ధి రాజ్యము నాక్రమించి పరిపాలించగా, పిదప క్రీ. శ. 1275—77 మధ్య కాలములో 'బద్య (బద్దె) మహారాజా' రాజ్య స్థాపన జరిగినట్లు ఆత్మకూరు తాలూకా పాకనాటి శాసనములు సూచించుచున్నవి.

A. 25	A. 55
చిరమన శాసనము	రాజవోలు శాసనము.
క్రీ. శ 1285	క్రీ. శ. 1290
'విజయగండ గోపాళ మహారాజా రాజ్యమున .... బద్య (బద్దె) మహారాజ స్థాప(న) ....'	విజయాదిత్య మహారాజుల కొడుకు మలిదేవ మహారాజా రాజ్యమున .... బద్యమ(ద) (హా) రాజకొడుకుబయ్య(న)..'

ఈ బద్య (బద్య) న యుద్ధకాల మెప్పటిదో క్రీ. శ. 1275 తేదీ (A, 29) కామిరెడ్డిపాడు శాసన కాలము సూచించుచున్నది.

'శ్రీ మన్మహా మండలేశ్వర (నానే) దేవమహారాజులు నెల్లూరను సకల సాంమ్రాజ్యం జేస్తుండి సుఖసం కథా వినోదం బుల రాజ్యము చేయుచుండగాను ....' అను నెల్లూరుపాక

నాటి యుద్ధ చరిత్రమునుబట్టి పాకనాటి 'రాజ్యమున .... బద్య (బద్దె) మహారాజ స్థాప (న)' యుద్ధకాలమును నిరూపింప వీలున్నను, శ్రీ శాస్త్రిగారి శాసన చరిత్రను మరచిపోయి,

'ఇప్పుట రాజులుగాని, మనుమసిద్ధిగాని, యుద్ధము చేయుట గాని బొత్తిగా కనపడదే! ఇట్లుండగా శ్రీ రెడ్డిగారు ఎట్లు ఈ అభిప్రాయమునకు వచ్చిరో నా వూహకు అందుటలేదు. ఏదో ఒకదానికి మఱియొకటి అనుకొనియుందురు.' అని వన్నాక్షేపించుట వహేతుకము కాదు. 'గొల్లపూండి నాయకుల బద్య మహారాజ స్థాపనాచార్య' బిరుద కాల మెప్పటిదో క్రీ. శ. 1275 తేది (నానే) దేవమహారాజు .... నెల్లూరు .... రాజ్యము చేయు (ట)' చెప్పక చెప్పుచున్నది.

కేతన కృతిపతి వంశమును వర్ణించునప్పుడు ఖడ్గతిక్కన తమ్ముడు భాస్కరునికి 'బాచన' అను మారుపే రున్నట్లు క్రింది పద్యములో చెప్పియున్నాడు.

' .... విక్రమా భరణుని పెద్ద నార్యమతు బాచని వన్నవ గంధ వారణున్.'

ఇందలి బాచన—భాస్కర మంత్రి క్రీ. శ. 1275—77 మధ్య కాలములో 'వన్నవ గంధవారణ—బద్దెన' వన్ని చోడునికి సేనానిగా యుండుటచేత, తా నా 'వన్నవ గంధవారణ' బిరుద నామము రాజ చిహ్నముగా ధరించినట్లు సమకాల చరిత్ర సూచించుచున్నది.

ఖడ్గతిక్కన—బాచన (భాస్కరు) లిద్దరు శత్రురాజ్య స్థానములలో చేరి నెల్లూరు రాజ్యమును భీభత్సము చేసినారో, లేదో స్పష్టముగా తెలియక పోయినను, అనుమానమున కాస్కారము లేకపోలేదు.

క్రీ. శ. 1277—79 మధ్య కాలములో 'ఇరుమడి తిరుకాలత్తి శాహి—2' (కృష్ణ పట్టణ శాసనము) చెప్పుటచేత, కామిరెడ్డిపాడు శాసన మందలి (నానె) నన్నెదేవ మహారాజ—వన్నన గంధవారణ—బద్య మహారాజు నెల్లూరు రాజ్యము' క్రీ. శ. 1275—77 మధ్య కాలములో ముగిసినట్లున్నది.


వీనావి కిందలి 'ఇరుమడి తిరుకాలత్తి (వి)' కాలాను గుణముగా 'ముమ్మడి తిరుకాలత్తి' గా లెక్కించుట చోడవంశ సమ్మతము. ఇది మనుమసిద్ధి కుమారుని రాజ్యకాల మగుట వల్ల క్రీ. శ. 1277 నాటికి తండ్రి మనుమసిద్ధి రాజ్యము ముగిసిపోయినట్లు భావింప వీలున్నది. ముమ్మడి తిక్కరాజు రాజ్యాంగ కాలముతో నెల్లూరు రాజ్యము మరల నెల్లూరు చోడుల వశమైనట్లు కనబడుచున్నది.

క్రీ. శ. 1263—77 మధ్యకాలములో ఇమ్మడి తిక్కరాజు తమ్ముడు, ఇమ్మడి మనుమసిద్ధి నెల్లూరు రాజ్యము అన్యరాజాక్రమణలతో సుస్థిరముగా లేదనుట శాసన చరిత్ర సమ్మతము.

క్రీ. శ. 1268—75 మధ్య కాలములో 'బద్య (బద్దె) మహారాజ స్థాపన' కు ముందు నెల్లూరు పాకనాటిలో (పల్లవ) 'జగద గోపాల—విజయగండ గోపాల మహారాజు రాజ్యము' చెలామణి యైనట్లు (A. 25) చిరమన శాసన బిరుద చరిత్ర కాలము తెల్పుచున్నది.

మొత్తముమీద ఇమ్మడి మనుమసిద్ధి రాజ్యారంభ కాలములో ధాయాది ఇమ్మడి గండగోపాల విజయాదిత్యుడును, రాజ్యాంత కాలములో 'పర్న (ల్ల) వ'—జగద గోపాల విజయ గండ గోపాల విజయాదిత్యుడును నెల్లూరు పాకనాటి నాక్రమించి పాలించినను, కడపటికి విజయాదిత్యు లిద్దరు పరాజితు లైనట్లు సమన్వయ మేర్పడుచున్నది.

నెల్లూరు చోడరాజ వంశములో 'తిక్కయ దేవ మహారాజు .... తమ తండ్రి తిరుకాళేశ్వరదేవ' రాజు పేర దేవాలయము నిర్మించి, ఆ తిరుకాళేశ్వర దేవర శ్రీ పాదపద్మారాధకులైన' అర్చకులకు దానము చేసినట్లు క్రీ. శ. 1253 తేది చిలకపాటి శాసనము చెప్పుచున్నది. కాబట్టి మొదటి తిక్క తిరుకాళేశ్వర గండగోపాలుని కొమారుడు రెండవ తిక్క తిరుకాళేశ్వర వీరగండ గోపాలుడు కలడనుట కంటె గత్యంతరము కనబడుటలేదు. అయినను, ఇందలి సాధక బాధకములు, చారిత్రకులు చర్చింపు టావశ్యకమని నా విన్నపము.



శ్రీనాథుని కొన్ని క్రొత్తపద్యాలు

శ్రీ కె. ఎస్. కోదండరామయ్య

కవి సార్వభౌముడైన శ్రీనాథకవి ప్రణీతమైన శృంగారనైషధమును పరిష్కరించి వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సువారు మొట్టమొదట ప్రచురించారు. ఆ గ్రంథమునకు "సర్వంకష" యను వ్యాఖ్యానమును కీ. శే. వేదము వేంకటరాయశాస్త్రిగారు వ్రాసి, 1913 లో ప్రచురించారు. ఈ రెండు గ్రంథములను పోల్చి చూడగ రెంటియందును ఈ పద్యముల సంఖ్య సమానముగనే యున్నది. అచ్చటచ్చట స్వల్పమగు పాఠభేదములుదప్ప రెంటియందును పద్యములు ఒకే విధముగ నున్నవి.

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారికి రెండు శృంగార నైషధ తాళపత్ర గ్రంథములు దొరకియుండినట్లును, ఆ రెంటిని మరియు ముద్రిత ప్రతిని చక్కగ పరిశీలించి వారు పాఠనిర్ణయములు చేసినట్లు తమ వ్యాఖ్యానమందు వ్రాసియున్నారు. దీనినిబట్టి వారికి దొరకిన రెండు తాళపత్ర గ్రంథములందును నుండిన పద్యముల సంఖ్యయు, ముద్రిత గ్రంథములోని పద్యముల సంఖ్యయు నొకటేయని తెలియుచున్నది. వారికి దొరికిన రెండు ప్రతులలో నొకటి పిఠాపురము రాజాగారినుండి వచ్చియుండెను. అనగా నది గోదావరి జిల్లా ప్రాంతమునకు సంబంధించినదియగుచున్నది. రెండవ ప్రతి నెల్లూరునుండి వచ్చియుండెను. ఇట్లు ఆంధ్రదేశమునందు ఉత్తర దక్షిణ భాగములందు సుదూరమందుండు రెండు ప్రాంతములనుండి వచ్చిన తాళపత్ర ప్రతులలోగల పద్యముల సంఖ్య నొకటిగనే యున్నందున పై గ్రంథలేఖకులకు లభించియుండిన మూలప్రతులు ఒకే పాఠమును గలిగియుండెనని తెలియుచున్నది.

ఇట్లుండగ సుమారు రెండేళ్లకుముందు పెనుమూరులోని వ్యాయవాదులును, ఆంధ్ర భాషాభిమానులునగు శ్రీ బొమ్మకంటి సీతారామయ్యగారు తాము సేకరించి యుంచియుండిన తాళపత్రముల కట్ట నొకటిని పరిశీలనకోసము నా కొసగిరి. దానిని పరిశీలించి చూచుచుండగా నందు శృంగార నైషధమునకు సంబంధించిన ఏడు విడి పత్రములు గనబడినవి. వానిని చదివి చూడగ నందు నాలుగు ఆకులు ప్రథమాశ్వాసమునకు సంబంధించినవిగను, మూడు ఆకులు ద్వితీయాశ్వాసమునకు సంబంధించినవిగను నుండినవి. పత్రములు చాల పురాతనమైనవి. పెనుమూరులోని ఏ గృహస్థో వీనిని పనికిమాలినవని, పెరటిలో చెత్త చెదారములతో జేర్చి పారవేసియుండగ శ్రీ సీతారామయ్యగారు చూచి ఎత్తి భద్రపరచి యుండిరి. అందువలన కొన్ని ఆకులు అచ్చటచ్చట చెదలు తినివేసియు, కొన్నిటి అంచులు విరిగియు, కొన్నిటిలో అక్షరము లచ్చటచ్చట చెరగిపోయియున్నవి. అందువలన పెక్కు పద్యములు అసంపూర్ణములుగ నున్నవి.

ఈ తాళపత్ర ప్రతిలోనుండు పాఠములకును, ముద్రిత ప్రతులలోని పాఠములకును, అక్కడక్కడ వ్యత్యాసములు గలవు. నాకు లభించిన విడియాకులలో ప్రథమాశ్వాసమందు రెండు క్రొత్త పద్యములును, ద్వితీయాశ్వాసమందు ఎనిమిది క్రొత్త పద్యములును, మొత్తము పది పద్యములు గలవు. ఇంతవరకు ఆంధ్రదేశమందు గ్రంథ ప్రచురణకర్తలకును, పరిశోధకులకును చిక్కిన తాళపత్ర ప్రతులలో దేనియందునలేని పద్యములీ పెనుమూరు ప్రతియం దెట్లుండుట తటస్థించినదో ఆశ్చర్యకరముగ నున్నది. ప్రస్తుతము లభించియుండు ఏడు పత్రములందే పది క్రొత్త పద్యము లుండగా, సంపూర్ణ గ్రంథము దొరికిన, ఇంకను ఎన్ని క్రొత్త పద్యము లుండునోగదా!

ఇంకొక విశేషమేమనగా ప్రథమాశ్వాసమునకు సంబంధించిన ఆశ్వాసాంత గద్యగల పత్రమునందు గ్రంథకర్తకు సంబంధించిన వివరములు ఎందువల్లనో వ్రాయబడలేదు. కాని ఆశ్వాసాంతమందు మాత్రము ముద్రిత ప్రతిలోని "భారద్వాజ పవిత్ర గాత్ర", "కేళాదిరాయ" "జలకమత" మొదలగు పద్యము లున్నవి. అందువలన క్రొత్త పద్యములు శ్రీనాథకవి రచితము లనుట స్థిరమగుచున్నది. ఈ పద్యములక్కడపటి లేఖకుడు "గద్య" అని వ్రాసి, అంతటితో వదలి వేసినాడు. కవిపేరు, వంశాదికము మొదలగు వానిని వ్రాయలేదు.

ఇట్లు ఈ హొసూరు ప్రతిలో మాత్రము క్రొత్త పద్యము లెట్లుండ తటస్థించినవో, దీని లేఖకునకు లభించి యుండిన మాతృక ఏదో హొసూరేతర ప్రాంతములందు గల ప్రతులలో నీ పద్యము లేల లేకపోయినవో, అందులకు కారణమేమో పరిశీలింపవలసియున్నది. అందువలన ఈ విషయమును గురించి ఆంధ్ర పండితులు, పరిశోధకులు పరిశీలన చేయగలరను తలంపుతో నాకు లభించిన క్రొత్త పద్యములను ఈ వ్యాసము ద్వారా తెలియజేయుచున్నాను. హొసూర కోలారు ప్రాంతములందుగల మారుమూల పల్లెలలో వెదకి చూచిన, ఈలాటి పాఠములుగల ప్రతులు దొరకవచ్చును. ఇంకెవ్వరికైన ఈలాటి క్రొత్త పద్యములు లభించియుండిన వారు పత్రికా ముఖమున ఆ విషయమును తెలియజేయవలయు నని మనవి జేయుచున్నాను.

ప్ర థ మా శ్వా స ము

99 వ వచనమునకును, 100 వ సీసపద్యమునకునుమధ్య హొసూరు ప్రతిలో నొక క్రొత్త తేటగీతియున్నది.

తే. గీ॥ నైజ బాలా ప్రగల్భ కాంతల గురించి,
భవ్య చంచూపద ద్వయోపద ద్విపత్రి
తంబు.............................కార్జి,
తంబయిన రాగ మహీజాంకురంబు దాల్చి.॥

100 వ సీస పద్యమునకును, 101 వ కంద పద్యమునకును మధ్య హొసూరు ప్రతిలో నొకక్రొత్త చంపకమాలగలదు.

చం॥ అవని.............నందనవ గ్రహం.........
...వ్రుధికార్కి యెవ్వలనికై చనునచ్చటి కస్వతంత్రులై
...విలిన జంతు సంతతి మనంబు జనుం సురగాడ్పు...ద్రిమ్మ
రువిధంబున డెందము నంగణింపనన్॥

ద్వి తీ యా శా స్వా స ము

8 వ వచనమునకును 9 వ సీసమునకును మధ్య హొసూరు ప్రతిలో నొక క్రొత్త తేట గీతియున్నది.

తే. గీ॥ తోలుత......ప్రియంబులు పలుకనేర,
మే బరిహరించుగోనియెద హితవొనర్చి,
యెండ చేమున్న వృక్షంబు వెరియజేసి,
వెనుక నమృతంబు వర్షించు నినునిమాడ్కి.

9 వ సీస పద్యమునకును 10 వ తేట గీతికును మధ్య హొసూరు ప్రతిలో నొక క్రొత్త ఆట వెలది గలదు.

ఆ. వె॥ వరగుణాభిరామ వసుధాధినాథుండు,
గన్నకన్న దెలియ కమలజూచె,
వ్యవధియయ్యెనేని హరజటా జూటస్థ,
కలగణింప చంద్రకలయుగాదె॥.

11 వ కంద పద్యమునకును, 12 వ కంద పద్యమునకునుమధ్య హొసూరు ప్రతిలో నొక క్రొత్త కంద పద్యమున్నది.

కం॥ అకలికి కన్నుగవయును,
అకామిని సద్గుణంబులా కమలముఖీ,
లోకన యుగము శ్రీ
తిగామిత చెలువ మరుకుసుమ కార్ముకరూపా॥

12 వ కంద పద్యమునకును, 13 వ తేట గీతికిని మధ్యహెూమారు ప్రతిలో నొక క్రొత్త తేటగీతి యున్నది.

తే॥ గీ॥ ఉపమిత సమానమునవన్య యువతి రదన,
—వముల వచించు నదరబింబమనుపదము,
శైమి యదరంబు బలుకుదో బంధురాన్వ,
యంబు జెందు బహుస్వహిూ నాశ్రయించి॥

14 వ కంద పద్యమునకును, 15 వ సీస పద్యమునకును మధ్య హెూమారు ప్రతియందొక క్రొత్త మత్తేభవృత్తమున్నది.

మ॥ మద మొప్పన్ మదనాది...మఘ్మోత వేరాత్మజా,
వదన శ్రీకినయాాదునంచు జలదివ్యంబున్ ఘటించంగవే,
యుదకం బందుమునింగివేచి తనయాటోపం...నిం,
పొదవన్ భూమిజనాళికెల్ల నిజసీరోన్మజ్జన ప్రక్రియన్॥

16 వ కంద పద్యమునకును 17 వ కంద పద్యమునకునుమధ్య హెూమారు ప్రతిలో నొక క్రొత్త మత్తేభ విక్రీడిత వృత్తము గలదు.

మ॥ పరికింపన్ నిజహేతు దండగుణమున్ ప్రాపింగనో,
......ఘటంబు నందునది తథ్యంబట్లు కాదేనిద,
త్తరుణీ జాలశిస్తతనందంబున్ ఘటంచున్ ప్రభా,
ఝురచక్ర భ్రమకారినై వెలయునే చర్చించ నెల్లప్పడున్॥

ఈ పద్యమునకు దిమ్మట హెూమారు ప్రతిలో నొక క్రొత్త కంద పద్యమున్నది.

కం॥ నారీమణి కుచశ్రీం,
గారకళా విజితపింఛిగా కుంభములై,
చేరె కుమార బిడౌజుల,
నారయ నెప్పుడును శిఖావళేరా...లూ॥

19 వ మత్తేభవంబునకును, 20 వ మత్తేభవంబునకును మధ్య హెూమారు ప్రతిలో నొకక్రొత్త కందపద్యమున్నది.

కం ॥ నరసిసరిదమిత జలాం,
తరములను సమాధి యాబత బహుతపమై,
సరసిజము తత్పదము,
కరమరుదుగ జెంది మంజుగతిగా......॥

కూర్చుండు-పుట్టుక

శ్రీ ముడార్ వేణు

శ్రీశ్రీ వాస్తవగారు డిశంబరు నెం భారతియందు 'కూర్చుండు' అను తెలుగు పదం ఎలా పుట్టివుంటుందనే జిజ్ఞాసను వెల్లడించారు. అందులో వారు కన్నడంలో 'కూర్చుండు' అనుటకు 'కూన్పుకో' అని 'కూర్చుండునది' అనుటకు 'కూర్చుపడు' అనే పదాలున్నాయని వ్రాశారు.

కన్నడభాషలో 'కూర్చుండు' అనుటకు సరైన పదం 'కుళితుకో'. ఈ పదం రూపాంతరంచెంది 'కూతుకో' గామారింది. ఇక 'కూడు' 'కూడి' 'కూడువడు' పదాలు వరుసగా కూర్చొనుము, కూర్చొనుడు, కూర్చుండునది అనే అర్థాల్నిస్తాయి. కూర్చుండు అనుటకు 'మండిసు' పదం కూడావాడ్తారు.

ఈ'కూడువడు' రైల్వే వాళ్ళవాళ్ళల్లో పరిగి 'కూర్డువడు' గా మారి రైలుపెట్టెలో కెక్కుంటుంది. కానీ 'కూనుకో' కూరువడు' పదాలు కన్నడభాషలో కూర్చుండుకు బదులుగా వాడరు.

ఇక తెలుగు పదం కూర్చుండు ఎలా పుట్టుంటుందని ఆలోచిస్తే, బహుశ 'కూర్చుకొను' (కాళ్ళను చేతులను దగ్గర చేర్చుకొను) నుండి పుట్టుంటుందను కోవచ్చు.

కన్నడంలో 'కూడు' అంటే కలియుడం. తెలుగు భాషలో లాగే వీరు కూడా అదే అర్థంతోనే 'కూడు' 'కూడి' 'కూడువడు' మొ॥న పదాల్ని సృష్టించుకొని వుంటారు.

'కూలబడు' పదాన్ని అలసిపోయిన వ్యక్తి కూర్చుండి పోవటానికి చాలా ప్రాంతాల్లో వాడుతారు. ఈ పదం నుండైనా కూర్చుండు' పుట్టివుండవచ్చు. 'నిలు' అనే మన తెలుగు పదం 'నిల్లు' గా వాడుకొంటున్నట్టుగా కన్నడిగులు కన్నడిగులు నే 'కుళితుకో' గా మార్చుకొని వుండవచ్చు.

తెలుగుభాషా పరిశోధకులు, పండితులు, జ్ఞానవృద్ధులు ఈ విషయాన్ని యుదమిద్ధంగా తేల్చగలరని ఆశించవచ్చు.

అకాడెమీలకు ఆంధ్రప్రభుత్వం ధన సహాయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1965—66 బడ్జెటులో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడెమీకి, సంగీతనాటక అకాడెమీకి చెరి లక్షయాభై వేల రూపాయలు కేటాయించింది. లలితకళా అకాడెమీకి 50వేలు, కొత్తగా ఏర్పాటయిన సైన్సుఅకాడెమీకి 95 వేలు కేటాయించింది.

సాహిత్యఅకాడెమీకి పైన పేర్కొన్న లక్షయాభై వేల రూపాయల మొత్తమేకాకుండా ఆధునిక భారతీయభాషల అభివృద్ధి కోసం సహాయ నిధులక్రింద 1,06,000రూపాయలు కేటాయించింది. అంతేకాక సాంస్కృతిక సంస్థల నిధులలో రాష్ట్రం వాటాక్రింద 50 వేల రూపాయలను బడ్జెటులో కేటాయించింది. సాహిత్య అకాడెమీ బహుమతులు ఇవ్వడానికి అయిదువేల రూపాయలు మంజూరుచేసింది.

రాష్ట్రప్రభుత్వం కవులకు, కళాకారులకు ఆర్థికసహాయం చేయుడంకోసం 75 వేల రూపాయల మంజూరుకు అవకాశం కల్పించింది. ఇది సాంస్కృతికరంగంలో చెప్పుకోదగిన అంశంగా పేర్కొనవచ్చు.

రవీంద్రభారతి రంగస్థలానికి 90 వేల రూపాయలు గ్రాంటు ఇచ్చింది. రవీంద్రభారతిలో ప్రొజెక్టర్ కొనుగోలుకు 36 వేల రూపాయలు, ఉద్యానవనం పెంచడానికి పదివేల రూపాయలు ఇవ్వడానికి కూడా నిశ్చయించింది.

ఉత్తమ చలనచిత్రాలకు బహుమతులు సబ్సిడీలు

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించే నిమిత్తం బహుమతులు, సబ్సిడీలు ఇవ్వడానికి ఆంధ్రప్రభుత్వం నిశ్చయించి దానికి సంబంధించిన నిబంధనలను సిద్ధపరచింది.

ప్రభుత్వంనుంచి సబ్సిడీలు పొందే చిత్రం కనీసం 12 వేల అడుగుల పొడవు ఉండాలి. చిత్రం కథానికా చిత్రమై ఉండి, మూడువంతులు రాష్ట్రంలో తీసినదై ఉండాలి. నాల్గవవంతు వెలుపల ఎక్కడైనా తీసినదై ఉండవచ్చు.

డబ్బింగ్‌చిత్రాలకు సబ్సిడీపొందే అర్హతలేదు. సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికెట్టు, స్థానికంగా ఉన్న స్టూడియోలో తయారయినట్టు సర్టిఫికెట్టు, పన్నుబకాయి లేనట్టు సర్టిఫికెట్టు ఉండాలి. ఈ నిబంధనలకు లోబడిన చిత్రానికి 50 వేలు నిరాశం ఇవ్వబడుతుంది. అనేకభాషలలో ఇలాటి చిత్రాలు తీసిననిర్మాత ఒకచిత్రానికి 50 వేలు, తక్కిన చిత్రాలకు 25 వేలు పొందడానికి వీలుంది. చిత్రాలు ఏభాషలో నైనా ఉండవచ్చు. అన్నీ ఆంధ్రప్రదేశ్ లోనే నిర్మించిఉండాలి.

హైదరాబాద్‌లో రెండుకొత్త స్టూడియోలు ప్రారంభించడానికిగాను ఐదులక్షల రూపాయలు అప్పు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లల చిత్రాలు, వార్తాచిత్రాలు, విద్యాచిత్రాలలో ఉత్తమమైన వాటికి 50 వేల రూపాయలు బహుమతి ఏటా ఇవ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

గ్రంథ విమర్శలు

ఇహపరాలు

రచన : వాసమూర్తి, తెలుగువెలుగు ప్రచురణ; పంపిణీ: కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్, రాజమండ్రి, వెల : ఆరు రూపాయలు.

తెలుగులో సాంఘిక నవల అనేది కీ. శే. గోపీచంద్ తర్వాత—ఇటీవల కేవలం సాంఘికం వరకు మాత్రమేఉంటూ, దృక్పథాలనూ, ఆదర్శాలనూ, తత్వాలనూ అంతగా స్పృశించడంలేదని అనుకోబడుతూవున్న దశలో "ఇహపరాలు" అనే ఈ నవల వెలువడి, కాల్పనిక వచన సాహిత్యంలో తాత్విక దృక్పథానికి పునరుజ్జీవనం కలిగించింది. దీని రచయిత తన ముందు మాటలో "ఇందులో కొన్ని విషయాలపై చర్చలు ఉన్నాయి. ఇందులోని చర్చలు కొన్ని దృక్పథాలూ, సమాజంలోని ఒక పరిస్థితీ సూచించడానికి మాత్రమే ప్రవేశపెట్టబడ్డాయి" అన్నాడు. ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త జాన్‌డ్యూయీ రచించిన "రికన్‌స్ట్రక్షన్ ఇన్ ఫిలాసఫీ" అనే గ్రంథం తన మనస్సుపై చిరస్థాయి అయిన ముద్ర వేసిందని చెప్పుకున్నాడు. అంటే ఒక దృక్పథం రచయిత కుందని తెలుసుకొని, అతనికి ప్రేరణ కలుగజేసిన డ్యూయీని గూర్చి మొదట కొంత ముచ్చటించుకోవడం అవసరం. జాన్ డ్యూయీ ఈనాడు అమెరికాలో సజీవులైవున్న గొప్ప తత్వవేత్తలలో అగ్రగణ్యుడు. వాస్తవిక తత్వ శాస్త్రజ్ఞుడు. ప్రెగ్మాటిస్టు. ప్రెగ్మాటిజం ప్రకృతికి అతీతంగా ఉండే శక్తిని దేన్నీ అంగీకరించదు. అన్ని సమస్యలను శాస్త్రజ్ఞానంతో పరిష్కరించుకోవాలంటుంది. శాస్త్రజ్ఞానంతో మానవుల్ని వేధిస్తున్న వివిధ సమస్యలకు పరిష్కారమార్గం సూచించడం తన లక్ష్యమని డ్యూయీ చెప్పుకున్నాడు. ఈ ప్రపంచాన్ని గురించి తనకున్న నమ్మకాలకూ, నిత్య జీవితంలో అనుక్షణం మనల్ని నడిపే విలువలకూ ప్రయోజనాలకూ ముందు సమన్వయం కుదరాలి. లేకపోతే దేనిదారి దానిదేఅయి, జీవితం గందరగోళంఅయి, సంఘర్షణల మధ్య బ్రతుకే విచ్ఛిన్నమవుతుందని అతని అభిప్రాయం. పరస్పర గౌరవ సహకారాల వల్లా తమ అనుభవాలను పోల్చి చూసుకొని సమన్వయించుకోవడంవల్లా మానవజాతి సక్రమంగా జీవించగలుగుతుందని ఆయన విశ్వాసం. ఇహలోక జీవితంకంటె పరలోక జీవితం గొప్పదనే భావాన్ని రూపుమాపాలని డ్యూయీ అన్నాడు. సత్యానికంటె మీమాంసకూ, అన్వేషణకూ, నిరూపణకూ ఆయన హెచ్చు ప్రాధాన్య మిచ్చాడు.

జాన్‌డ్యూయీ ప్రబోధాన్నీ, ఆయన ఇచ్చిన ప్రాధాన్యాన్నీ ఈ నవలా రచయిత ప్రాతిపదికగా చేసుకొని నేటి మన సమాజంలోని పరిస్థితిని సూచించడానికీ, కొన్ని విశ్వాసాలను తర్కంతో చర్చించి విమర్శించడానికీ, సామాన్యంగా జనం పవిత్రమైనవని భావించే సంప్రదాయాలనూ, సంస్కారాలనూ పరీక్షకు నిలబెట్టి అవి నిజంగా అలాంటివా? అన్న సంశయం కలిగించడానికీ ఈ రచన చేశాడు. ఈ నవలలో మూడు పాత్రలు ప్రధానమైనవి. వాటి దృక్పథాలే మీమాంసకు ప్రాతిపదిక. కథ చెప్పే పాత్ర గిరిధర్ అనే యువకుడు. తక్కిన పాత్ర లందరితోనూ వ్యవహరించి వారినిగూర్చి మనకు తెలియజెప్పే వ్యక్తి ఇతనే. అంటే మొత్తం కథలో ఇతనూ ఒక ముఖ్య పాత్రే నన్నమాట. ఇతను పెళ్ళికాని యువకుడు. పట్టభద్రుడు. నిరుద్యోగి. పేద కుటుంబానికి చెందినవాడు. తాను మధ్యతరగతికి చెందిన వాడినని చెప్పుకుంటాడు. గీతకు వ్యాఖ్యానం వ్రాస్తూవున్న సీతాపతిగారివద్ద వ్రాయసగాడుగా కుదురుకొని ఉద్యోగి అవుతాడు. ఇతను వేదాంతికాదు. కాని భగవంతుడంటే నమ్మకముంది. సామాన్యునికి సహజమైన బలహీనతలు ఇతనికీ ఉన్నాయి. అబద్ధం చెబుతాడు అవసరార్థంగా. తా నెప్పుడో చూచిన అందమైన అమ్మాయిని జ్ఞాపకం తెచ్చుకొని నెమరు వేసుకుంటాడు. తాను పూర్వకాలపు మనిషినని అనిపించుకోవడం ఇష్టంలేదు. కాని హిందూ నామధేయం క్రైస్తవ నామధేయంగా మారిపోవడం నచ్చదు. ఇతనికీ మూఢ విశ్వాసాలు లేకపోలేదు. ముగ్గురు కలిసి ఒక పనికి పోవడం మంచిది కాదన్నాడు ఒకచోట. కొంత లౌకికం తెలిసినవాడు. అవకాశం చిక్కేసరికి సీతాపతిగారి అమ్మాయి సుశీలతో వ్యభిచరిస్తాడు. మళ్ళీ లోపల అంతరాత్మ బాధిస్తూ ఉంటుంది. తాను పాపం చేస్తున్నానని తెలుసు. కాని మనస్సును అదుపులో పెట్టుకోవడం అతనికి చేతకాదు. రాత్రి వచ్చిందంటే ఉద్రేకం, కోరిక ఇతనిలో విజృంభిస్తాయి. మళ్ళీ తన కర్మలకు తాను బాధ్యుడు కానప్పుడు తన చేతిలోలేనిదానికి తానెందుకు ఆందోళన పడాలి. అని తన్ను సమర్థించుకొంటాడు. అలా అని తాను చేసే పాపాన్ని నిశ్చింతగా చేయలేడు. పిరికితనంతో సుశీలనుంచి తప్పుకు తిరుగుతాడు. కర్తవ్యం, కోరికలమధ్య అంతస్సంఘర్షణలో నలిగాడు. అతనిలో మంచిదీ చెడ్డదీ రెండు వ్యక్తిత్వా లున్నాయనీ, నేటి యువలోకానికి అత నొక మచ్చుతునక అనీ నవలా రచయిత చెప్పదలచుకుంటే అది నేటితరం సిగ్గుపడవలసిన కారణమేగాని సంతోషకటికాదు. చివరకు సుశీల అతన్ని కలసిరానివాడుగా అప్రయోజకుడుగా భావించి త్యజిస్తుంది. అందుకు ఉక్రోషపడతాడు. ఇక రెండవ ముఖ్యపాత్ర సుశీల చాలా అసాధారణమైంది. బుద్ధి, కుతూహలము, ఉత్సాహము గల వ్యక్తి. రెండేళ్ళు కాపరం చేసిన తర్వాత ఈమె భర్త చనిపోతాడు. పాశ్చాత్య నవలలతో కాలక్షేపంచేస్తూ, రహస్యంగానైనా ఆనందించాలని కోరిక పెంచుకుంది. సమాజం తనకు ఆనందం లేకుండా చేసిందని ఆమె ఆరోపణ. గిరిధర్‌పై సమ్మోహనాస్త్రం ప్రయోగించి అతణ్ణి తన వశం చేసుకొంది. గిరిధర్‌ను క్రిందికి లాగడంలో ఆమె హెచ్చుగా చొరవ తీసుకుంది. అతను మొదటి అనుభవం తర్వాత రాత్రిళ్ళు ఆమె

దగ్గరకు వెళ్ళకూడదనీ, ఆమెకు దూరంగా ఉండాలనీ అనుకొంటే ఒకరాత్రి ఆమే అతని గదికివచ్చి అతన్ని తన గదికి తీసుకుపోతుంది. అతను ఉచితానుచితాల సంఘర్షణలో పడబోతావుంటే తన పైట జార్చి, జాకెట్ బొత్తాములు విడదీసి అతన్ని దగ్గరికి లాగుకుంది. "గిరిధర్ నీవు నాకు కావాలి. నాకు నీ వెంలో కావాలి." అని పాశ్చాత్యుల ఫేషన్‌లో అని అతన్ని పూర్తిగా దించింది. రోజులు గడిచేకొద్దీ ఆమె వాంఛ, ఉద్రేకం పెరిగిపొయ్యాయి. 'ముందు నేను కోరేది ఇయ్యి' అంటూ అతన్ని క్రిందికిలాగి ఉపక్రమించమంటుంది. గిరిధర్ పెళ్ళి చేసుకుందామంటే నిరాకరించింది. పెళ్ళెందుకు అంది. ఆమెకు కావలసింది జీవితంనుంచి ఎంత వీలైతే అంత ఆనందం పొందడం. తాను ఆనందం ఇస్తుందిట. పొందుతుందిట. మానవత్వం అంటేనే బలహీనత అనీ, పాతివ్రత్యంకన్న మానవత్వం గొప్పదనీ వాదిస్తుంది. అంతేకాదు కామేచ్ఛ బాగా తక్కువగా ఉండేవాళ్ళు జన్మతః వచ్చిన ఒక లక్షణాన్ని పెద్దగా సుగుణంగా వర్ణించి మహాత్ములుగా చెలామణి అవుతారంటుంది. ఇది చదివినప్పుడు బహుశా తార కాబోలు "లోకములోన కొంద రబలల్ సతులన్ దనియింపలేక......తాటాకులలోన వ్రాసిరి పరాంగన గూడిన పాపమంచు" అన్న పద్యం జ్ఞాపక మొస్తుంది. సరే ఇదంతా తన వ్యక్తిగతం, తన వరకే సంబంధించింది అని వూరుకుంటే పోవును. సుశీల అలా వూరుకోదు. సమాజాన్ని ఆడిపోసుకుంటూ ఒక థీరీ చెబుతుంది. "వెనుకటి కాలపు చండ సమాజం కాదిప్పటిది. దాని కీళ్ళు సడలిపొయ్యాయి. సమాజం పేరిట మాట్లాడడానికి సంఘటితమైన వర్గం ఏదీ లే దిప్పుడు:' అని బుకాయిస్తుంది. నేటి సమాజంలో మధ్య యుగాలలో వచ్చిన కొన్ని కట్టుబాట్లు సడలిపోతే పోవచ్చేమోగాని, ఒక స్త్రీ తాను పెళ్ళి చేసుకోనంటూ అంది వచ్చిన యువకుడితో నల్లా తన వాంఛలు తీర్చుకుంటానంటే భారతీయ సమాజమేకాదు, ప్రపంచంలో ఏ సమాజమైనా ఆ స్త్రీని హీనంగా చూస్తుంది. సమాజ భద్రతకే ఆవిడ ముప్పుగా పరిగణించబడవచ్చు. హాలీవుడ్‌లో తరచు భర్తలను మార్చుకొనే సినీతారలు సైతం ఏదో దేశానికి వెళ్ళి పెళ్ళంటూ చేసుకొంటున్నారు కాని సుశీలలా వ్యభిచారంతో ఆనందిస్తామని అనడంలేదు. చివరకి గిరిధర్‌వల్ల తనకు ప్రయోజనంలేదని గ్రహించిన తర్వాత సుశీల మరొక "మిత్రుణ్ణి" చేపట్టుతుంది. ముసలితనం, మృత్యువు అంటే ఆమెకు భయంలేదు. ఆమెకు కావలసింది వర్తమానంలో ఆనందం. ఇలాంటివాళ్ళు ఎందరో చివరకు కుక్క చావు చచ్చారు. ఈ పాత్ర విషయంలో డ్యూయీ చెప్పిన Will is Parmount అన్న సిద్ధాంతం రచయిత నొక్కి చెప్పాడు. ఈమెకు ఆదర్శప్రాయుడు ఈమె అన్న సుందరరావు భార్యా పిల్లలు కలవాడు. ఇతను కళాపిపాసి. జీవితాన్ని అనుభవించాలంటాడు. భారతనారి భర్తపై హక్కు ఉన్నట్లు వ్యవహరించడం తన కోర్కెలను కట్టిపెట్టడం, ఇతనికి అసంతృప్తి కలిగించాయి. సౌందర్యం, వినోదం, ఆనందంకోరే భర్త మరొక చోటికి పోయాడంటే ఆశ్చర్యమేమిటని అతని ప్రశ్న. అతనికి కావలసినవి అతని ఇంట్లో లభించవట. భార్య సమక్షంలో అతని హృదయం ఉద్వేగంతో ఉప్పొంగదట. వాత్స్యాయనుడూ, ఉమర్‌ఖయాం అతనికి గురువులు! అతను స్త్రీలోలుడు, మద్యప్రియుడు, లైంగికానుభవంలో వైవిధ్య పిపాసను సమర్థిస్తాడు. పాప భావనను దరికి రానీయకండి అంటాడు. స్త్రీ పురుషు లిద్దరు లైంగిక సంబంధం ద్వారా తమ స్నేహాన్ని పరిపూర్ణం చేసుకో దలిస్తే సమాజానికేమి నిమిత్తమని అతని ప్రశ్న. మానవులు నిజంగా ఆవశ్యకత ఉన్నప్పుడే లైంగిక క్రియకు పూనుకుంటారని ఇతనివాదం. ఇది జంతువుల విషయంలో నిజమేమో కాని మానవుల విషయంలోకాదు. అవసరం తీర్చేందుకు భార్య ఉన్నా, పరస్త్రీతో పోవాలన్న వాంఛ ఉంటుంది. అదే దుర్బుద్ధి. నీతి బాహ్యమైనది. దుర్బుద్ధిని అదుపులో పెట్టుకొన్నవాడే ఉత్తముడు. ఈ విషయంలో వర్గాల ప్రసక్తే లేదు. రచయిత చెప్పిన మధ్యతరగతి నైతిక దృక్పథమనేది ఇక్కడ పొసగదు. ఏవర్గంవారైనా వ్యభిచారం చేయవచ్చు. లేదా నీతితో ఉండవచ్చు. Free Love అనే దాన్ని సమర్థిస్తే మానవ సమాజం మళ్ళీ ఆటవిక దశకే పోతుంది. కట్టుబాట్లులేని సమాజం సమాజంకాదు. అది వన్య మృగాల సమూహం. ఏమైనా సుందరరావు యోగ్యుడైన తండ్రికాదు, భర్తకాదు. వ్యసనాలవల్ల, ఆరోగ్యంచెడి, తన నిర్లక్ష్యంవల్ల తన చిన్న కుమారుడు చనిపోయాడని తెలుసుకొనేసరికి తన వేదాంతం నేలకూలిపోయిందని చివరకు అంగీకరించాడు. మృత్యువుకు తల ఒగ్గాడు.

మానవ సంబంధాల విషయంలో దృక్పథాల విషయంలో సిద్ధాంతాల విషయంలో ఎంతో చర్చగల ఈ నవల ముగింపు "ఇంతకీ ఈ జీవితమేమిటి? ఏమిటి దీని ప్రయోజనం? ఆ ప్రయోజనం ఇహలోకంలో ఉందా? పరలోకంలో ఉందా?" అని రచయిత తనకు తానే వేసుకొన్న ప్రశ్నలతో జరుగుతుంది. నీవూ లేవు. నేనూ లేను, అంతా గ్రుడ్డి నమ్మకమే అన్న ఉమర్‌ఖయాం రుబాయత్ అతనికి స్ఫురిస్తుంది. చివరకు మిథ్యావాదం తేలింది. ఇది డ్యూయీ వాస్తవిక తాత్త్విక దృక్పథానికి అనుగుణంగా ఉందా? ఇహలోక జీవితంకంటె పరలోక జీవితం గొప్పదనే భావాన్ని రూపుమాపాలని డ్యూయీ అన్నాడేకాని మానవ జీవితాన్ని గందరగోళం చేయడం అతని ఉద్దేశంకాదు. అతన్ని అలా అపార్థం చేసుకొనే వీలుందని గ్రహించబట్టేనేమో బెర్ట్రండ్ రస్సెల్ డ్యూయీ ముఖ్య సిద్ధాంతాన్ని విమర్శిస్తూ "Any new doctrine in practice is bound to be subject to some extravagence and eXcess" అన్నాడు. ఈ నవలలో పాత్రలకు అదే జరిగింది.

ఇక ఈ నవల రచన విషయం. కథా వస్తువు, ప్లాటు, ట్రీట్‌మెంటు, టెక్నికాలిటీస్‌వంటివి ప్రధానం కాకపోవడం చేతా, ఇది చర్చా నవల కావడంవల్లా కథ ఒక కట్టడంవలె లేదు. పందిరిలాఉంది. గీతా వ్యాఖ్యానాలు, ఉమర్‌ఖయాం రుబాయీలు కొన్నిచోట్ల అధికమై పాఠకునికి విసుగు కూడా

కలుగవచ్చు. అది అంటే ఇష్టమున్నవారికి రుచించవచ్చు. అది వినా తక్కిన కథా గమనం ఆసక్తి కలిగించేదిగా ఉంది అయితే పెద్ద అధ్యాయాలవారీ Narration పద్ధతిగాక Chronicle వలె డైరీ టెక్నిక్ అనుసరించివుంటే మరింత ఉత్సుకత కలిగించేదిగా ఉండేదేమో. ఎందుచేతనంటే గిరిధర్ సీతాపతిగారి ఇంటికి వచ్చేదాకా మామూలు మనిషి. సీతాపతిగారి ఇంట్లోనే అతనికి కొత్త అనుభవాలు కలిగాయి. వాటిని పరిభాషలో చెప్పాలంటే భ్రష్టుడయ్యాడు. (పాపం అతని తప్పేమీలేదు. మరీయు పెద్దవాడవుతున్నాడు. కాని కథ అర్థం తిరిగింది) మళ్ళీ అక్కడి ఉద్యోగం మానుకొని ఇంటికివచ్చి తల్లిదండ్రులు చూచిన పిల్లను పెళ్ళాడి సుమారు జీవితానికి ఉపక్రమించడంతో అతను తిరిగి పూర్వపు మామూలు గిరిధర్ అయ్యాడు. ఈ మధ్యకాలం పెద్దదికాదు. పెం రోజులకు డైరీ మాత్రమే కనుక డైరీ పద్ధతి అవలంబించివుంటే రచనకు మరింత పుష్టి చేకూరేది. కొన్నిచోట్ల వాక్యాలు ఇంగ్లీషులో పుట్టింది తెలుగులో వ్రాసినట్లుగా ఉన్నాయి. ఉదాహరణకు "నా అహానికి కొంత తృప్తి కలిగింది" "అయన్ని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది" వంటివి. ఇందుకు కారణం ఈ నవల ఆదిలో ఇంగ్లీషులో వ్రాయబడటమే అనుకొంటాను. ఇంగ్లీష రచన ప్రచురితమైతే దేశంలోనూ, విదేశాలలోనూ తెలుగు రచయితల Way of writting తెలిసి వస్తుంది. అది బాగుంటుందని ఆశిస్తాము.

దృక్పథం రీత్యా ఇందులో చెప్పదగ్గ కొత్త అంశమేమీ లేకున్నా, దృక్పథాల అంతస్సంఘర్షణను చూపడానికి అల్లిన కథ అల్లిక, ప్రవేశపెట్టబడ్డ పాత్రలు, పేర్కొన్న వర్ణనలు, రచనా వైదుష్యం మన నవలా సాహిత్యంలో ఈ నవల కొంత స్థానాన్ని చేకూర్చుతాయి అనడంలో సందేహమేమీలేదు.

—వాణీ కుమారి.

ఏకోత్తరశతి

రవీంద్రుని 101 ఖండ కావ్యములకు : శ్రీ త్రిపురారి భట్ల వీరరాఘవస్వామిగారి తెలుగుసేత. దక్షిణసాహిత్య అకాడమి వారి ప్రచురణ : డెమ్మీలో 402 పుటలు : వెల : 6—50.

రవీంద్రుని రచనల్ని ఇంగ్లీషు భాషలో అనువాద (వచన) వచనంలో చదివేము వాటికి. సంస్కృత పద బాహుళ్యమైన శైలిలో ఛందస్సులలో రచించినారాయన బెంగాలీ మూలము. ఇంగ్లీషు అనువాదాలు కవిత్వ వస్తు సౌందర్యాన్ని శిల్పసంపదనూ తెచ్చినా కవిత్వ రచనా సౌందర్యాన్ని తీసుకు రాలేకపోయినవని అనుకొనుచుంటాను. భారతీయ భాషల లోనికి అనువదించడములో సంస్కృత పదాల ప్రయోగము తోనూ, ఠాగూరు ఎక్కువగా వాడిన రూపకాలంకార వాల సౌందర్యముతోనూ మూల కావ్య సౌందర్యం భారతీయ తర భాషలో కొంత ఎక్కువగా రావడానికి వీలు.

త్రిపురారిభట్లవారు ఈ అనుకరణములో వాటిలోని సంస్కృత పదముల కొన్ని శిల్ప సమ్మతముగా ఉపయోగించారూ, కొన్నిటికి సమాన పదాలు ప్రయోగించారూ, బంగాలీ భాషా యాస్ట్లీ అన్వయము కూర్పు యథాతథంగా కాకుండా తెలుగు జాతీయానికి అనువదించారు. అయితే మూలములోని వ్యాకరణ్యంలోకి తీసుకొనక, తెలుగు ద్విపద సీసవంటి ఛందో రీతుల వాడేరు. మూలములో, ఈ గ్రంథములో ఇచ్చిన మూల ఖండ కావ్య పఠించవలసిన పాదములో మాత్రము సమాన సంఖ్యలో రావడం. పాడుతూ పాడినప్పుడు ఏమో వెంకటపూలలో ("జన గణమన....." లో దశాక్షరగతి వస్తే వస్తుంది.) పాదాంత్య ప్రాస బాగా కనబడుతోంది. బంగాలీలోని స్త్రీల్లో ఛందో రచనలు తెలుగు గణ ఛందస్సులలో తీర్చి నప్పుడు తెలుగువారికి పరిచితమైన గతి వచ్చినప్పుడు వినుటే గాని వినాలని అంతే ప్రమాణములో నిబద్ధమై కాదా అవుతుంది. ఇది ఎంతవరకూ కోరదగినది అని?

ఛందస్సులో ఇమిడ్చకుండ వచనానువాద భావ ప్రవాహ వశంగా అందులోని సంస్కృత పదాలూ, ఉపమాలలో అ అలంకార సంప్రదాయమూ, అంత్యప్రాస నిలుపుతూ రచిస్తే, ఠాగూరు కవిత్వము అందజాలినంతగా అందుతేనేమోననిపిస్తుంది. త్రిపురారిభట్ల వారి నవ్య గ్రాంథిక భాష, తెలుగు ఛందస్సులూ అవ్వి రెండు భాషలను బహువిధంగా గమనించినది. వాటి బరువు ఈ రచనలో పాఠ మాధుర్యమే ఉన్నది. ఈ విధము పాఠము రచనలో సంయమనమును కనపరుస్తుంది విలువే. అయితే అంతమాత్రాన మూల రచన సౌందర్యము తగ్గి కనపడుతుందని అనుకున్నాను. ఠాగూరు రచనల ననువదించడము ఆషామాషిపని. అటువంటి మూల రచనా సౌందర్య సంపాదనే నాడు! త్రిపురారిభట్లవారి పూనిక బలము గోచరిస్తూనే ఉన్నది అంటూ.

హేమమాలి

(పద్యకావ్యము. కాళిదాసు మేఘసందేశ గాథా పూర్వ వృత్తాంతము. కవి : దాసంటి గోపాలకృష్ణమూర్తిగారు. ప్రకాశకులు : విజయభారతి ప్రచురణలు, రాజమండ్రి. వెల : 2 రూపాయలు.)

కావ్యసౌందర్యము విశాలంగా చూస్తే రెండు విధాలుగా కనబడుతుంది. చెప్పే పద్ధతిలోని సౌందర్యము,—కవి చాతుర్య సౌందర్యము—ఒకటి, చెప్పే వస్తువు సౌందర్యమూ రెండూను. ప్రబంధకవులు చాలామట్టుకు మొదటి సౌందర్యానికే పెద్దపీట వేశారు. ఈ కావ్య మంతటా ఆ రకపు సౌందర్యమే కనిపిస్తుంది. ఇది సంస్కృతపద బంధుర సుందరము. వర్ణన పదా భావ ప్రౌఢము. కవిచాతుర్య విస్మిత శ్లోక్యముఖాలాయి పద మాలికా దోలా మనోహరము. తెలుగు వృత్తాలలోనూ, పద్యాల లోనూ ఇమిడ్చబడ్డ సంస్కృత కావ్యమా అనిపిస్తుంది. అన్ని యూరు కూడా "అమరంపార్శ్వ లవాల మీ యదం మాయం శైవ దోషంబుగా నవ రూపించు మదాంధులైతిరి" అంటూ గీర్వాణ సంప్రదాయాల్ని కాపాడుతున్నాయి. వసిన్నా భావ

మంజులము మాత్రమే కాక నవభావ శిల్ప మంజులమైతే ఏరీతిగా నుండునో చూడ నభిలాష కలుగుతున్నది.

విష్ణువర్ధనుడు

చారిత్రక కథా కావ్యము, కర్త : కీర్తిశేషులు చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు. చిలకమర్తి పబ్లిషింగ్ హౌస్, కాకినాడ—1 వారి ప్రచురణ. వెల : 1—25 న. పై.

ఇది ప్రసిద్ధమైన మాధవవర్మ జన్మగాథ. కటకేశ్వరుని బారినుండి మాధవవర్మ తెగువవలన రక్షింపబడిన చాళుక్య రాణి చిత్రగాథ. చిలకమర్తివారి ప్రవాహశీలి గ్రాంథిక వచనములో క్రౌను సైజు 91 పుటలున్నది. పాఠశాలల బాలురకు ఉపపఠనోపయోగము సమకూర్చగలదు.

నారేఖలు

లయగంధి వచన గేయాలు. రచయిత : 'వెన్నం'. శ్రీ వాణీ పబ్లికేషన్స్, విజయవాడ వారి ప్రచురణ.

సూర్యుడికీ, పగటి పుష్పాలకూ కవి వూహలతో సంభాషణ, చంద్రుడికీ రాత్రి పుష్పాలకూ సంభాషణ ప్రత్యూషము అనే గేయనాటిక. 'విద్యుద్రేఖ', 'నిశాకుటిలో నిర్బంధితనై చీకటి సెలయేటి శ్రుతులు మీటుతూ ఎదురుచూస్తున్నాను వెలుగుకై బారుగా చాపిత బాహువులను' అంటూ వాడిగా తగులుతుంది. 'నేనే సెలయేరునైతే ఎండిన ఎడారిపొళ్ల స్రవించెద' నన్న వూహ గొప్పది. 'నేనే కాలాన్ని అయితే ఉదయసంధ్యలోనే ఆగిపోదును, నేనే కన్యనైతే ఉన్మాద కవికి ప్రాణేశ్వరి నయ్యెద' నన్న వూహలు మధురములు. 'నిన్న నాలో ఎగసెను నిరాశల వహ్నులు, నేడు నాలో మొలచెను ఆశల చివురు కొనలు' అన్న వాక్యము ఆత్మాశ్రయమే కాని చక్కగా ప్రపంచితము. 'ఇది నా అభియోగము, ఇది నా అభినివేశము తెలపాలని ఉంది నాకు తెలుసుకోవాలని లేదా ? అన్న వాలు దివికి ఎక్కి దిగి వస్తున్నది. 'కళ కోసం కాకపోతే నా బ్రతుకు నిజం కాదే' అన్న ఆశ్చర్యము చాలా శక్తివంతమైన వాదము.

అయితే, వీరి వూహలు "గిరులు తమ వీనులు మూసికొన్నవి, నరుల ప్రాంతము తెలిసికొనకున్నవి" అనీ "సౌఖ్యం తెలియని నాకు లోకానికి మననంకాను, లోకం గమకం కాదు. జనం శూన్యంగా తోచు" అనీ, "మాటల బూటకాలు నేర్పని నేను తీయని బూతులు నేర్పితినీవు" అనీ వూహల అంచు దాటిపోతున్నది. అయితే, "పసిపిల్లల దస్తూరీతో పసి హృదయాలను ఖేదంతో నింపాలని నా తలంపు కాదు" అంటున్నారు. వచన గేయాలో ఆత్మాశ్రయ సంప్రదాయము వీరి రచనలో వింతరంగు తీసుకున్నది. ఆ రీతి వర్ణ ఆ లేఖనమును ఆహ్వానిద్దాము వీరినుండి.

చెల్లమాంబ

కీ. శే. పెమ్మరాజు లక్ష్మీపతిగారి గేయ కావ్యము. పద్మా పబ్లికేషన్సు, ఏలూరు.

ఆధూరివారి యాడుపడుచు, చెంగల్వలవారి కోడలు, తిమ్మయ్యగారిభార్య అయిన చెల్లమ్మగారు 112 సంవత్సరాల క్రితము చేసిన సహగమన గాథ. ఇది, జంపె వరుసల రచన. చావు 'యోగనిద్ర', స్త్రీ మంటలలో బలవంతముగా కాలిపోవడము 'సహగమనమూ' అన్న రోజుల గాథ ఇది. కామమ్మ కథను జ్ఞాపకానికి తెస్తుంది.

గేయ రచన వింత నడక నలవర్చినది. లక్ష్మీపతిగారి వాణి శక్తివంతమైనది. 'మందార పూలలో కుందనపు బొమ్మ వలె, నెత్రతామర కొలన నీదు హంసియు వోలె, శివుని చిప్పల కంట జెన్నారు పావనలె, మెఱయుచుండెను—చెల్లమాంబా.

నీతిముక్తావళి

రచయిత : ఎస్. పానయ్యచౌదరి బి. ఏ., ప్రచురణ : మల్లేపల్లి, హైదరాబాదు. వెల : రూపాయి. వేమన్నవలె ఆటవెలది పద్యాలతో నీతులుచెప్పే యత్న మిది. ఆతని జాతీయమూ రచనాపాటవమూ పట్టుకోడము అసాధ్యమైనది. శ్రీ చౌదరిగారు 'సజ్జనుండు దుష్టసాంగత్య మొనరింప, దొడ్డగుణము లెల్ల జెడ్డయగును, పాలు విషముకావె ? పాము నోటంబడి, విశ్వవిమతనామ వినురరామ !' వంటి పద్యాలలో వేమన్నను సమీపించారు.

తెలుగుబిడ్డ

ఆటవెలదుల శతకము, ముళ్లపూడి సచ్చిదానందమూర్తి గారి రచనా, ప్రచురణ కూడాను. మోమిన్‌పేట, హైదరాబాదు జిల్లా. వెల : 75 న. పై.

తిన్నని అన్వయముతో సాపుగా నడిచింది రచన. 'మనో వికాసంకోసం విశ్రాంతికోసం ఆటవెలది నాశ్రయించాన'న్న కవిగారు "శివుని నెత్తికెక్కి చిందులాడెను గంగ, పార్వతమ్మ యెడద భగ్గుమనగ, వెండి నవ్వు నవ్వి వెక్కిరిస్తుందిరా తెలివికలిగి మెలగు తెలుగుబిడ్డ' అన్న పద్యం యెడ విజయము.

—శ్రీపాద గోపాలకృష్ణమూర్తి.

నాస్తికత్వం

త్రైమాసిక పత్రిక, నాస్తిక సంఘ పత్రిక సంపాదక వర్గం వెంపో అధ్యక్షుడు. సరవాశివాగం. ప్రతి 1.00 పైసా చందా రు. 3.00 ప్రాప్తిస్థానం ఖిర్మాజీపేట వరంగల్లు.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1
Editor : S. Sambhu Prasad.